# ఆనందనిలయము

విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు



ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# ఆనందనిలయము

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి
అధ్యాత్మ సంకీర్తనలకు సీసపద్యానుసరణము)

రచన

విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2009

**ANANDANILAYAMU**

(Adaptation of Tallapaka Pedatirumalacharya's Adhyatma Sankirtanas into Telugu *'sisam'* Verses)

by

**Vidwan Mudivarti Kondamacharyulu**

T.T.D. Religious Publications Series No: 797
© All Rights Reserved

T.T.D.First Edition: 2009

Copies : 1,000

*Published by*

**Sri. K.V. Ramanachary, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P.* at**

Chief Editor's Office, TTD, Tirupati.

***Printed at***

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముున్నుడి

అఖిల జగన్నియామకు డైన శ్రీవేంకటేశ్వర స్వామి వారి వైభవాన్ని, ప్రభావాన్ని కీర్తిస్తూ అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు అనే విభాగంతో 32 వేల సంకీర్తనలు క్రీ.శ. పదిహేనవ శతాబ్దికి చెందిన తాళ్ళపాక అన్నమాచార్యులవారు రచించారు. పదకవితా పితామహుడని ఖ్యాతివహించిన ఆ తొట్టతొలి వాగ్గేయకారుని పాటలన్నీ ఆ శ్రీనివాసుని మూర్తి వలె అతృప్త్యమృతస్వరూపాలే.

అదే శైలిలో అన్నమాచార్యుల చిన్న భార్య అక్కలమ్మ కుమారుడైన పెదతిరుమలాచార్యులు తన తండ్రిగారైన అన్నమాచార్యులు శ్రీనివాస సాయుజ్యం చెందిన నాటి నుండి జనకుని ఆదేశానుసారం శ్రీ వేంకటేశ్వరునకు అంకితంగా రమారమి 500 అధ్యాత్మ సంకీర్తనలు, అంతే సంఖ్యలో శృంగార సంకీర్తనలు రచించాడు.

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు వేదప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కిక కేసరి, శరణాగత వజ్ర పంజర – ఇత్యాది బిరుదావళులు గలవారు. క్రీ.శ. 1468 నుండి 1552 దాకా వెలుగొందిన వాగ్గేయకారులు వారు. ఈయన ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనలతో పాటు శృంగార దండకం, చక్రవాళ మంజరి, శృంగారవృత్త శతకం, వేంకటేశోదాహరణం, నీతి సీస శతకం, సుదర్శన రగడ, రేఫ అకారనిర్ణయం, భగవద్గీత తెనుగు వచనం, వైరాగ్య వచన మాలికా గీతాలు అని చెప్పబడే శ్రీవేంకటేశ్వర వచనాలు విరచించాడు. ఈ పరమైకాంతిక భక్తుడు శ్రీనివాస స్వామి కైంకర్యమునకుగా అనేక గ్రామాలను శాసన పూర్వకంగా సమర్పించాడు. భగవద్రామానుజ మత సిద్ధాంతమందు తన తండ్రి అన్నమాచార్యులవారి వలె పరిపూర్ణానుభవం గల మహనీయుడు పెదతిరుమలాచార్యులవారు. ఇట్టి మహా పురుషుని అధ్యాత్మ సంకీర్తనల్లో

అధ్యాత్మ సంకీర్తనల్లో రెండు వంద లెన్ను కొని, వాటిని సీసపద్యాలలోనికి మలచి తాత్పర్యం సమకూర్చిన విద్వత్కవి పుంగవులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యుల వారు "ఆనందనిలయం" అనే పేరుతో ఒక ప్రబంధాన్ని 1989లో ప్రచురించారు. దేశీయుల ఆదరాభిమానాలకు పాత్రమైన ఆ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం స్వీయ ప్రచురణగా స్వీకరించి పునర్ముద్రిస్తున్నది. శ్రీ వేంకటేశ్వర వైభవాన్ని ప్రకాశింప జేసే ఈ రచన పాఠకుల మన్నన పొందగలదని మా ప్రగాఢ విశ్వాసం.

(కె.వి.రమణాచారి)
కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

కళాప్రపూర్ణ
డాక్టరు మరుపూరు కోదండరామరెడ్డిగారు
అపర్ణ : నెల్లూరు.

# మధురకవితాతపస్వి ముదివర్తి కొండమాచార్యుల కవితా శిల్ప వైభవము

## ప్రవేశిక

ఒక ఎల్లాపి (ఎల్లమీద ఆపిదోచే) మంగని, అంటరానికడజాతి తిరుప్పాణిని ఆళ్వారులుచేసిన వైష్ణవం పుట్టించిన మానవతాదుగ్ధ పూర్ణహృదయుడు-

పెన్న, పంబలేరు నీరుద్రావి పెరిగిన సహృదయత, ఉపాధ్యాయవృత్తి, సుందరకవితాశిల్పము త్రివేణులై సంగమించిన సరసమధురవచస్కుడు-

ముదిమది ఒక కొండవాగువలె పారించిన ముప్పదైదుపుస్తకముల రచనా వైదుష్యము పెంచిన పేరుకలిమితామరలు, అవి త్రావించిన నలుసులు లేని తీపి చెలిమితేనెకు ఆలవాలమైనవాడు-

ముప్పయిఏండ్లు చదువులలో మర్మమెల్ల విప్పిచెప్పి, విద్యార్థిబృందాన్ని భావిజీవితతేజోమయప్రాంగణమున నిలిపిన ఆదర్శఉపాధ్యాయుడు-

జున్నువంటి జానుతెనుగుమాండలికాలతో, చారుగంభీరసంస్కృత శయ్యతో కవితావధూటిని నలంకరించి రసికుల అలరింపజేసిన కవితాశిల్ప పారగుడు -

ప్రాయపుప్రొద్దువ్రాలిన మునిమాపున, పదకవితాపితామహులు తాళ్ళపాకవారి కవితాస్రవంతిలో మునుకలిడే అదృష్టానికి నోచుకొని

దైవాయత్త చిత్తుడై తిరుమలేశుని సేవిస్తూ, వారి పుస్తకప్రచురణశాఖలో పనిచేస్తున్నభాగ్యశాలి–

కవికి, కంసాలికి సీసం తేలిక అన్నమాటను గేలిచేస్తూ అన్నమయ్య కీర్తనలకు మెఱుగులుదిద్ది ఆణిముత్యాలవంటి సీసపద్యాలను భాషామహాదేవి కిరీటానికి సంతనపరచిన శిల్పకారుడు –

ప్రముఖవిద్యావేత్తలు, కవులు, రాజకీయవాదులు, మిత్రులు, కళాభిమానులు గావించిన అసంఖ్యాకసమ్మానాలకు, పత్రికలపొగడ్తలకు పొంగని వినమ్రుడు–

తనగ్రంథాలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథాలైనా, ఎన్నోగ్రంథాలు సమీక్షించి, ఆయాపుస్తకాలకు పీఠికలు వ్రాసినా, ప్రూఫులుదిద్ది అచ్చుదయ్యాలను పారదోలినా తొణకని కర్మయోగి –

మనసెంతమెత్తనో మాటంతకమ్మనై వికసించిన కవితాసుమాల దండ లల్లి సహృదయుల నలంకరించే మిత్రుడు –

ఈ ముదివర్తి కొండమాచార్యులు.

ఇది కొండను అద్దంలో చూపిన విహంగదృష్టి, ఇక వివరం.

## జన్మాదికములు : వంశగౌరవము

ఈ వంశంవారి అభిజనం నెల్లూరుజిల్లా కోవూరుతాలూకా ముదివర్తి గ్రామం. రాఘవాచార్యులు ఆయనకుమారులు రంగాచార్యులు చుట్టుప్రక్కల గ్రామాలలో గుణగౌరవంచేత మాన్యపరుపబడినారు. నెల్లూరుమండలగ్రామాల– ముఖ్యంగా తూర్పునాటిపల్లెల సంస్కృతి సంస్కారం ఏమిటంటే–అన్ని వర్ణాల వారు మమేకంగా కలసిమెలసి వావివరుసలతో పిలుచుకొంటూ గ్రామవ్యవస్థను ఘనతపరచడమే ! ముఖ్యంగా బ్రాహ్మణులు పురోహితులుగా, పండితులుగా, గురువులుగా గౌరవింపబడుతారు. కాలగతికాలుష్యమంటకుండా ఈ సంప్రదాయం

ఈనాటికీ సాగుచున్నది. ఇది నెల్లూరిసీమ ప్రత్యేకత. రంగాచార్యులు ముదివర్తిగ్రామం విడిచి గుంటూరుజిల్లా ఎనమదల, అందుండి కృష్ణాజిల్లా నందిగామతాలూకా మాగల్లు చేరినారు. వారి తనయులలో మూడవవారు రామకృష్ణమాచార్యులే మన కొండమాచార్యుల పితృపాదులు. సంచార ప్రియులైన రామకృష్ణులకు పసితనము మిసమిసలాడేవయస్సులో మైలవరం తాలూకా కుంటముక్కలగ్రామంలో కొండమాచార్యులు 2-9-1922లో "విద్యాధారాత్ ధనమ్" అనే యోగప్రాబల్యంతో జన్మించినారు. మూడునెలలే ఆ ఊరిగంగ మన కొండమయ్యకు ప్రాప్తి. తండ్రి రామకృష్ణమా చార్యులు వైకుంఠవాసి అయినారు. తల్లి లక్ష్మీనరసమ్మ ఆ పసికందును పొత్తిళ్ళలో పెట్టుకొనిపోయి ఒంగోలుతాలూకా చిలకపాడుగ్రామంలో జనకుడు చిలకపాటి రామానుజాచార్యులవారి చల్లటిపంచచేరినారు. చిలకపాడు విద్యావినయసంపన్న మైన వైష్ణవగ్రామం. కొండమాచార్యులు మాతా మహులయింటనే పెరిగి విద్యాబుద్ధులు గడించుకొని 1940లో 18 ఏండ్ల ఎలప్రాయంలో మరల తన తాతలస్వస్థానం సింహపురిమండలంలో అడుగుపెట్టి గూడూరులో ఒకశుభ లగ్నంలో స్థిరపడినారు. ఆ ఆవాసం అన్నిటా కలసివచ్చినది.

## గూ డూ రు వా స ం.

## విద్యాసంపాదన : ఉద్యోగములు.

కొండమాచార్యుల జీవితతరువు గూడూరులో పెరిగిపెద్దదై పూచికాచి భవ్యతను గాంచినది. ఇంగ్లీషు ఆనాటిఇంటర్. సెకండరీగ్రేడ్ ట్రెయినింగుపొంది నారు. విద్వాన్ ద్వితీయశ్రేణిలో నెగ్గినారు. నాయుడుపేట వాస్తవ్యులు ఉప్పల నరసింహశర్మగారిని శుశ్రూషించి సాహిత్యసంపదను పెంపొందించుకున్నారు. నిర్వచన అధ్యాత్మరామాయణ మహాకావ్యాన్ని వ్రాసిన కవితల్లజులు ఈ ఉప్పలవారు.

బిల్హణీయకావ్యకర్త చిత్రకవిసింగరాచార్యులకు ఏడవతరమువారైన చిత్ర కవి శ్రీనివాసవరదాచార్యుల పుత్రిక సౌభాగ్యవతి ఇందిరమ్మను పెండ్లాడి

గూడూరి లోనే కాలు నిలద్రొక్కుకొన్నారు. కొండమాచార్యులకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్ళు.

1944లో గూడూరునందే ఒక హయ్యర్ ఎలిమెంటరీపాఠశాలలో ఉపాధ్యాయుడుగా జీవనయానం ప్రారంభించినారు. 1950లో కవికులచకోర చంద్రులు శ్రీతిక్కవరపు రామిరెడ్డిగారి వాక్సహాయంతో జిల్లాబోర్డువారి గూడూరు హైస్కూలులో తెనుగుపండితుడుగా ఉపాధ్యాయవృత్తిని స్థిరపరచుకొన్నారు. 28 ఏండ్లు "మంచిఅయ్యవారు" అనిపించుకొని 1978లో పదవీవిరమణ చేసినారు.

1980లో తిరుమలతిరుపతిదేవస్థానంవారి పుస్తకప్రచురణశాఖలో చేరి ముద్రణ కార్యక్రమమును చూస్తున్నారు. ఇప్పటికి 150 పుస్తకాలను పరిష్కరించి ప్రూఫులుదిద్ది ముద్రణకళకు మురువుచూపి సాహిత్యకోశాన్ని పెంచుకొంటున్నారు.

## పెద్దలపరిచయము : రంజకత్వము.

ఆచార్యులవారు మాటనాణ్యంవల్ల ప్రతిరంగంలో పెద్దలను గౌరవించి సముల నాదరించి పిన్నల ప్రియమారజూచి టెక్కులు చూపకుండా కలుపుగోలు తనంతో అందరికీ ప్రీతిపాత్రులైనారు. గూడూరుపుర ప్రముఖులపరిచయం వీరికి ఒక పెద్ద స్నేహనిధి. అయినా ముఖప్రీతి మాటలతో కాకాపట్టడం నేర్చుకోలేదు. నెల్లూరుమండలనాయకులు చాలా మందితో చనవుగల చెలిమిగలిగి యుండినారు. పెద్దకవులపొరపాట్లు ఎత్తి చూపే ఆత్మవిశ్వాసం కలిగి ఉండినారు. తన రచనలపట్ల సరసమిత్రులు చేసినసూచనలు ఆర్ద్రమనస్సుతో స్వీకరిస్తారు.

## స న్మా నా లు

ఈయన సరకు దెలిసిన సాహిత్యాభిమానులు. పలుచోట్ల అభినందన సభలు, సన్మానాలు గావించినారు, ఇందు పొగడ్త పూబంతులకు కొరతలేదు. నెల్లూరులో కవికోకిల దువ్వూరు రామిరెడ్డివారసుడుగా

గుర్తింపబడినారు. ఆ కోకిల తియ్యటి పాటకు మురిసిపోయి ఆయన ఆశీస్సులు పొందినారు. నెల్లూరులో అప్పుడుకొత్తగా నెలకొల్పబడిన "కవికోకిల సాహిత్యపరిషత్తు" యాజమాన్యాన వీరికి సన్మానం జరిగింది. ఇది పుట్టుకవి వై. వి. రమణారెడ్డి (మునిసిపల్ కమీషనరు) పెత్తనం క్రింద జరిగినది. సాహిత్యపోషకులు తిక్కవరపు రామిరెడ్డిగారు సభను అధ్యక్షించినారు.

సింహపురిలో తిక్కనజయంతిసన్మానములు పండితులప్రతిష్ఠా పతాకాలు. 1950లో ఈ గౌరవం కొండమాచార్యులకు లభించినది. 'అసలు' ఊతపదంగా గలిగిన నిడుదవోలు వేంకటరావుగారు అధ్యక్షులు.

## వన్నె కెక్కిన మధురకవి.

నెల్లూరుమండలములో సాహిత్యపీఠ మధిష్ఠించిన అధునికులలో వివిధ వర్గ సాహిత్యరసికులచే మాన్యపరుపబడి ముదివర్తివారు "తన పెరటిచెట్టుగూడ మందుకు పనికి వస్తుంది" అని ఒక సాహిత్యసత్యాన్ని నిలబెట్టినారు.

వివిధభిన్నవిషయములపై రాశి వాసిగల గుణదీపికలైన బహుళరచనలు చేసి పరపు, లోతుగల పాండిత్యాన్ని, వన్నె వాసిగల కవిత్వాన్ని సృష్టించినారు. వీరి కవితావిహంగం వర్ణశబలత గలది. భిన్నవిషయవిశిష్టతగల ఈయన కావ్యాలను కొన్నిటిని నూతనదృష్టితో పరిశీలిస్తున్నా.

## ధర్మదీక్ష : బౌద్ధకథాకావ్యం.

ఇప్పుడు ఆచార్యులవారి కవితాసుమం విప్పారినది. ఇది మొదలు సువాసనల గుబాళించే మధురాక్షరమాలలు అల్లినారు. చవు లూరించే జాను తెనుగుమాండలికాలు ఇందు మేలుబంతులు. బౌద్ధమతవిషయాన్ని తమప్రథమ రచనకు వస్తువుగా ఎన్నుకోవడంలో ఈ విశిష్టాద్వైతి సామరస్య సమన్వయప్రీతి కనబడుతున్నది. ఈ గ్రంథావిష్కరణ నెల్లూరు ఆంధ్రసభలో

జరిగినది. అధ్యక్షత వహించిన దుర్భా సుబ్రహ్మణ్యశర్మ ఈ యువకవిని వీపుదట్టి ప్రోత్సహించినారు. (1946).

'వీరమనీడు' అను వీరగాథను మోడులు చిగురింప వ్రాసినారు. 1950లో నెల్లూరుపురమందిరంలో నవ్యసాహితీమార్గదర్శి తల్లావఝుల శివశంకరస్వామి అధ్యక్షతన ప్రవర్తిల్లిన సభలో ఈ కావ్యగానం జరిగినది. ఆచార్యులనోట పద్యాలు విని శాస్త్రి మెప్పులు గురిపించినారు.

## నారాయణమ్మ.

ఇది గూడూరుపంటరెడ్డిపేరంటాలు నారాయణమ్మ ఆత్మార్పణగాథా కావ్యం. వీరత్యాగము, విషాదము జమిటిన పురి ఎక్కినవి. ఇంతకుముందు కవికోకిల దువ్వూరు రామిరెడ్డి కులగౌరవం నిలుపను ఆత్మబలిదానం గావించిన ఇంకొక గూడూరుపంటరెడ్డివీరాంగన పవిత్రచరిత్రను 'నలజారమ్మ అగ్నిప్రవేశము' అని త్యాగమహిమ, కులగౌరనముల వర్ణిస్తూ కన్నుల నీరునిండే కరుణరసకావ్యమును వ్రాసి ఉండినారు. నారాయణమ్మ లేతకాపు (కాటంరెడ్డి శాఖ-స్మార్తము). నలజారమ్మ ముదురుకాపు (పెరమారెడ్డితెగ-వైష్ణవం). కవికోకిల ఈ శాఖవారు. ఇప్పుడు ఈ రెడ్లశాఖలన్నీ వడ్లవంగడాలవలె కలిసిపోతున్నవి.

ఆ విజ్ఞానఖని సర్. కట్టమంచి రామలింగారెడ్డి తమవిద్యార్థిదశలో వ్రాసి బహుమతివడసిన "ముసలమ్మ మరణము" అనే మరొక రెడ్డికుల పుణ్యాం గనా త్యాగమయగాథ వీటికి పురోగామియై ఉన్నది. బుక్కరాయ సముద్రం చెరువు కట్ట ఒకరాత్రి గాలివానలో గండిపడి తెగి, నీరు ఊరిపై బడి ముంచివేయనున్న విపత్సమయంలో ముసలమ్మ ఆ గండిలో రాత్రంతా కూర్చుండి కొంగర్లుపోయిన అంగాలతో కట్టను కాపాడి స్వర్గవాసిని అయినది. కట్టమంచివారి ఈ కన్నెకబ్బము ఆయన సాహిత్యజీవితానికి వేగుజుక్క .

## సతివిషయవివాదం.

బలవంతపుసహగమనాన్ని రాజారామమోహనరాయ్ నిషేధించినారే గాని ఒక మహిమోన్నత ఆదర్శంతో భర్తతోపాటు ప్రాణత్యాగంచేసిన పుణ్యాంగనల ఆదర్శం గర్హణీయం కాజాలదు. మృషాస్వాతంత్ర్యయోధులైన నేటిరాజకీయవాదులు చేసే కాకిగోల అర్థం లేనిది. 'సతి' ని పొగడరాదని శాసనం చేసినారు. అట్లయితే పార్వతీదేవిగావించిన ఆత్మత్యాగం నింద్యమా? ఆ మహాదేవిని మనం ఆరాధించ రాదా? రాజపుత్ర వీరనారీమణులు దేశగౌరవరక్షణకు, ప్రతిష్ఠకు, స్వకీయశీల సంరక్షణకు గావించిన జోహార్ (అగ్నిప్రవేశము)ను కీర్తించరాదా? వాసవి (కన్యకాపరమేశ్వరి) తెలుగు ఆడపడుచుల మానం కాపాడను చేసిన అగ్ని ప్రవేశం సంగతి ఎత్తరాదా? అమెదేవాలయాలు ఏమికావాలి? ఇది ఆ తేజోనిధుల కించ పరచడమేగదా! లౌకికవాదం వెర్రితలలు వేస్తున్నది.

నారాయణమ్మకావ్యం మొదట 1965లో అచ్చైనది. ఎంతగానో పాఠ కోత్తముల మన్నన లందుకొన్నది. అయ్యవారుగా బోధకతాశక్తిలోని మెలకువ లన్నింటిని ఒంటబట్టించుకొనిన ఆచార్యులు వ్రాసిన ఈ నారాయణమ్మ వివిధ విశ్వవిద్యాలయాలలో పాఠ్యగ్రంథమైనది. ఆరుముద్రణలు ఇప్పటికి పొందినది. ఒక వంటకం బాగోగులు దానిని తిన్నవారి అపేక్షే ప్రకటిస్తుందిగదా! ఇట్టి గుణ గౌరవంవల్లనే వీరి ధర్మదీక్ష, అమరసందేశము, వీరమనీడు, నారాయణమ్మ ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా, మైసూరు, బెంగుళూరు విశ్వవిద్యాలయాలలో ఉన్నత కక్ష్యలకు పాఠ్యగ్రంథాలైనవి. ఇంతకంటే ఈ కవికి వేరే యోగ్యతాపత్రాలు కావలెనా? ఇట్టి విలువలనుబట్టే ఆచార్యులవారికీర్తి పండువెన్నె లైనది.

## పూర్ణాహుతి.

ఒకబావినీటికై ప్రాణా లర్పించిన వైశ్యదంపతులచరిత్ర యిది. వీరానికీ, త్యాగానికీ ఏ రాజస్థానంఎడారులకో ఎగబ్రాకకుండా స్థానికచరిత్రాంశాలను కావ్య వస్తువు చేయడం ముదివర్తి వారి

మదిముదిమికి తార్కాణం. స్థానికాభి మానం వీరికి ఆజన్మసిద్ధగుణం. నారాయణమ్మపుస్తకం తర్వాత ఇది నెల్లూరు నెఱజాణలైన ఆత్మ బలిదాతల ఆఖ్యానం. దుఃఖాలతీవ్రత ఆచార్యులవారికి బాగా నచ్చిన ట్లున్నది. ఇంకొక విశేషం. వివిధమతసిద్ధాంతాలను సంప్రదాయాలను వివిధవర్ణాల కథలను కావ్యవస్తువులుగా ఎన్నుకోవడం వీరి ఉదారభావవికాసం అనాలి. ఇదేగదా భగవద్గీతామహిమోపేత సర్వజనీనసూత్రం.

## యామాలశెట్టిబావి.

నెల్లూరు దుర్గామిట్ట (దర్గామిట్టకాదు) లో నేటి తిరుమల తిరుపతి దేవస్థానం వారి కల్యాణమండపం ఎదుట ఈ యామాలశెట్టిబావి, సత్రం ఉన్నవి. ఈ బావినీళ్ల త్రాగబట్టే నెల్లూరువారు నెఱజాణ లైనారని జనవాక్యం. మహాలయ అమావాస్యనాడు పౌరులు ఈ కూపందగ్గరకుపోయి బెల్లం బావిలో వేసి అర్చించు కొనేవారు. ఇప్పుడు ఈ ఆచారం సన్నగిలు తున్నట్లున్నది.

## అవచితిప్పయ్యశెట్టి.

కొండవీటిరెడ్లరాజ్యంలో ప్రఖ్యాతిగాంచిన నెల్లూరు వైశ్యకులావతంసుడు ఈ తిప్పయ్య. శ్రీనాథకవిసార్వభౌమునితో చిన్ననాట కలిసి చదువుకొన్న బాల్య మిత్రుడు. కొండవీటిప్రభువు వేమారెడ్డి సుగంధభాండాగారాధిపతి. విదేశముల నుండి ఈ రాజులకు గుఱ్ఱాలు దిగుమతిచేసేవాడు. ఈ సింహపురీయుడే శ్రీనాథుని 'హరవిలాసం' అనే రసవత్తర కావ్యానికి కృతిభర్త. ఈ యశస్విపౌత్రుడే వేమాల శెట్టి (యామాల). ఈ బావిని త్రవ్వేటప్పుడు గట్టిచట్టులో ఎంతలోతు తెగినా నెమ్మె కనబడలేదు. త్రవ్వే ఉప్పరులు విసుగెత్తినారు. కాని ఈశ్వరారాధకుడైన వేమయ్య పట్టు వదలక అర్ధరాత్రి శివుని శూలంవంటి గడ్డపార తీసుకొని నూతిలోకి దిగి త్రవ్వనారంభించినాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. భక్త్యావేశంతో, దైవార్పణంగా తలను గునపంతో కొట్టుకొన్నాడు. బయటకు చిందిన

నెత్తురుతో గూడ, బావిలో నీటిజెలలు పైకెగసి బావిని నింపినవి. వేమయ్య జలసమాధి పొందినాడు. తెల్లవారగనే ఈ సంగతి విని వేమయ్యభార్య వేమమ్మ భర్త పాదతలాన తలవాల్చి పెనిమిటితోగూడ కైలాసం చేరినది. ఈ దంపతుల పవిత్రప్రేమను ఈ కవి ప్రసన్నశైలిలో సరసమధురకావ్యంగా వ్రాసినారు. కథననైపుణి దృశ్యాలను కండ్లకు గట్టినట్టు చేస్తున్నది.

## కూనలమ్మ.

ఇది ఒకవైష్ణవకుటుంబగాథ. ఇందు ఒకపిల్లి దానికూన పాత్రలుగా సమాదరింపబడ్డాయి. అంటే తెంగలశాఖవారి మార్జాలకిశోరన్యాయము; అదే భరన్యాసము, ప్రపత్తి, శరణాగతి. ఈ దేశిచ్ఛందోమయకావ్యం అప్పటమైన కమ్మటి తెనుగుసోన.

## సిద్ధాంతవ్యాసం(థీసిస్)

ఎంతపెద్దవారినైనా సమకాలికులు మెచ్చరన్న అపవాదాన్ని అనృతపరచి నారు ముదివర్తివారు. చల్లాహరిశ్చంద్రారెడ్డి (చిత్తూరుజిల్లా రేణిగుంట ప్రాంతం వారు) "ముదివర్తి కొండమాచార్యులరచనలు - ఒక పరిశీలన" అన్న అంశం క్రింద సిద్ధాంతవ్యాసం వ్రాసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా (పి.హెచ్.డి.,) పొందినారు. తనకు డాక్టరేట్ లేకపోయినా ఇతరులకు బిరుద మిప్పించే రచనలు గావించి ఉన్నారు కొండమాచార్యులు. తాము కాచిన కాయలను ఆ చెట్లు తింటున్నవా?

కొండమయ్య గతరచనావైభవం ఇక చాలు. తాళ్లపాకమహా వాగ్గేయకారుల మహనీయభక్తి కీర్తనలను సీసపద్యాలలో ఇమిడ్చిన రచనా ప్రాగల్భ్యమును గూర్చి ప్రస్తావించుకొందాం. ఇది పూర్వజన్మసుకృత పరిపాకమైన భవ్యావేశము.

## తాళ్లపాకవారిపదకవితాసామ్రాజ్యము.

## అన్నమాచార్యులు.

తాళ్లపాక కడపజిల్లా రాజంపేటతాలూకాలో ఒక చిన్నపల్లె, ఈ భక్త గాయకుల గానముఖరితమై, వారి పాదస్పర్శచేత పవిత్రమైన ఈనేల నేడు సాంస్కృతిక విద్యాకేంద్రమై అలరారుతున్నది. ఇక్కడ నిర్మింపబడుతున్న స్మారక మందిరాలు ఆంధ్రగానసాహిత్యాలకు వేదికలు.

అన్నమాచార్యులు 15వ శతాబ్ది ప్రారంభంలో వెలసినవారు. ఇది ఆంధ్ర సాహిత్య వికాసంలో కీర్తిమంతమైన ఘట్టము. ఇప్పుడే పోతనకవితామృతం ప్రవహించినది. శ్రీనాథకవిసార్వభౌముని ఉభయభాషా ప్రౌఢరచనాకీర్తిపతాక రెపరెపలాడినది. కర్ణాటకమహాభక్త గాయకుడు పురందరదాసు వెలసిన యుగం.

తిక్కన తెనుగునకు వేదాంతభాషాగౌరవం కల్పించినారు. పాల్కురికి సోమనాథునివంటి శివకవులు దేశిచ్ఛందాలపుష్పాలను తెలుగుచదువులతల్లికి సమర్పించినారు. ఈ పునరుజ్జీవనకాలంలో, అన్నమయ్య భక్తి శృంగార పదకవితను తెనుగుదనంతో అలరించినారు.

## అన్నమాచార్యరచనలు.

అన్నమయ్యసాహిత్యదీక్ష సృష్టించిన పదవాఙ్మయము పరిమాణంలో, గుణంలో హిమాలయసదృశము. ఆ అపూర్వ మేధాసంపన్నుడు 32 వేలకీర్తనలు వ్రాసి పాడినాడు. ఇంకొక అపూర్వవిశేషం-వీటినన్నిటిని రాగిరేకులపై చెక్కించుట. అల్పపండితులు, అపండితులు పిచ్చిగీతలు గీకకుండా అరికట్టినారు.

ఇట్టి తామ్రపత్రలేఖనమే 1336 హిందూధర్మపునరుజ్జీవనకాలంలో జరిగి నది. విద్యారణ్యస్వాములవారు హరిహరబుక్కరాయసోదరులను విజయనగర సింహపీఠమున కూర్చుండబెట్టి, హిందూరాజ్యం స్థాపించి,

తమ తమ్ములు సాయణాచార్యులచేత వేదాలకు భాష్యాలు వ్రాయించి రాగిరేకులపై చెక్కించినారు. దీనితో వేదవాఙ్మయం అందరి అందుబాటు లోనికి వచ్చినది.

## రేకులు బయట బడినవి.

ఈ అన్నమయ్యరేకులు తిరుమలవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీభాష్య కారులసన్నిధిముందు ఒకరాతిగదిలో నిక్షిప్తం చేయబడినవి. ఇట్లా వీటికి రక్షణ దొరకినా, వెలుగును చూడలేకపోయినవి. ఆలయ పాలనాధికారిగా శ్రీ చెలికాని అన్నారావు ఉన్న కాలంలో, ఆంధ్రులభాగ్యం బయటపడినట్లు ఇవి బయటపడినవి. తర్వాత వీటిని వేటూరి ప్రభాకరశాస్త్రి పరిశోధించినారు. తర్వాత రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ విషయపరిశోధన గావించి కొన్నిపాటలను స్వరపరచినారు. ఈ అధ్యాత్మశృంగార కీర్తనలను గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి పరిష్కరణతో తిరుమల తిరుపతి దేవస్థానంవారు అనేకసంపుటాలుగా ప్రచురిస్తున్నారు. ఇది ఎనలేని సంగీతసాహిత్యసేవ. గానకోకిల ఎం. ఎస్. సుబ్బలక్ష్మిచేత కొన్ని పాటలు పాడించి ప్రచారం చేస్తున్నారు.

## అన్నమాచార్యులవంశం.

'అచట బుట్టిన చిగురుకొమ్మైన చేవ' అన్నట్లు ఈ వంశంలో అందరూ వాగ్గేయకారులే; మహారచయితలే. అన్నమాచార్యులతోపాటు ఆయనరెండవ కుమారుడు పెదతిరుమలాచార్యులు, ఈయన పెద్ద కుమారుడు చినతిరుమలా చార్యులు అధ్యాత్మశృంగారసంకీర్తనలు వ్రాసినారు. ఈ వైష్ణవత్రయం భగవద్రా మానుజాచార్యుల విశిష్టాద్వైతమును ఆంధ్రదేశంలో బంగారుసింగపుగద్దె నెక్కించినారు. పెదతిరుమలాచార్యుల నాల్గవకొడుకు చిన్నన్న (చినతిరువేంగళ నాథుడు) తమ వంశకీర్తికి మూలపురుషుడైన అన్నమయ్య జీవితచరిత్రను ద్విపదకావ్యంగా నిబంధించినారు. ఇట్లా అన్నమయ్యమొదలు ఐదుతరాలవరకు తాళ్లపాక

కవులు రచనలుచేసి ఆంధ్రసరస్వతికి అమూల్యమైన ఉడుగరలు అర్పించు కొన్నారు. అయినప్పటికి "తన గీతి నరవజాతిని గాయకులనుగా దిద్దిన" యశస్సు సంగీతకళానిధి, అంతర్ముఖుడైన భక్తుడు, కవితల్లజుడు సద్గురు త్యాగరాజునకే దక్కినది!

అన్నమాచార్యులు పచ్చిశృంగారంగా బహుళములైన పదాలు వ్రాయడం రక్తులను విరక్తులుగా చేయనే అని అనుకొన్నా శృంగారం మొరటుగా నున్నది. పదాల నుడికారము, పేశలతామాధుర్యము, పదగుంఫనసౌందర్యము అన్నమయ్య కవితలో తక్కువ అని కొందరు అనేమాట. నడక, కొన్నిమాటలలో సొంపు లేదంటారు. అయినా అన్నయమ్యకవితారసం కుత్తుకబంటిగా త్రావిత్రేచిన ముదివర్తి వారిమదింపు మదికి ఎక్కించుకొందాం.

## అన్నమయ్యకవి.

అన్నమాచార్యులపాటలు సీసాలలో ఇముడుతాయి అని గ్రహించిన తొలి వ్యక్తి ముదివర్తివారే. కాబట్టే వారిఅభిప్రాయం ఉదాహరిస్తున్నా.

"తిక్కన పాల్కురికిసోమనాథులతర్వాత అంతటిభావావేశం కల కవి అన్నమయ్య ఒక్కడే అని నా నమ్మకం. ఆయనభావాలు మాటలు ఆయనపేరు చెప్పకుండా ప్రబంధకవులు వాడుకొన్నారు. జాతీయములు, నుడికారములు, సామెతలు అన్నమయ్యలో కుప్పతెప్పలు. పొత్తపినాటి తెలుగుబాసతరితీపులు జుర్రదలచినవారికి అన్నమయ్య సాహిత్యమే శరణ్యము."

"రామానుజమతమే మతమని చాటినవాడు అన్నమయ్య. ఆయన విశిష్టా ద్వైతసిద్ధాంతమును విరివిగా ప్రచారమునకు తెచ్చాడు. స్థిరమూర్తి అయిన వేంకటే శ్వరవిగ్రహముచుట్టు గూడు అల్లినాడు, అనిదంపూర్వము, అసామాన్యము అయిన ఉజ్జ్వలభావన అతనిది. నాలాయిరదివ్యప్రబంధములు అతడు చూచినాడనుటకు ఆయన సాహిత్యములో సాక్ష్యాధారము లున్నవి."

"అద్వైతమును ఖండించినాడు. శరణాగతితత్త్వమును సింగపురాన నిలిపినాడు. శరణాగతియే శరణోపాయమని లోకమునకు ఎలుగెత్తి చాటినాడు. కులాభిమానమును, కులద్వేషమును నిరసించినాడు."

## కొండమాచార్యుల భవ్యకవితావేశము.
## అన్నమయ్య పదాలకు సీసాలు.

ఉద్యోగపు ఇసుకడొంకలలో తిరుగాడుతున్న ముదివర్తివారిమనసు 1986లో మరలా రచనోద్యోగానికి ఉన్ముఖమైనది.

"శిల్పమంత్రౌషధముల మేలుసేత కాలకీలితము" అన్నాడుగదా కవిత్వ కళానిధి తిక్కనసోమయాజి!

పై కుబికిన ఈ కవితావేశం, అన్నమాచార్యులపదాలను సీస పద్యాలలో ఇమడ్చాలి అనేవాంఛను కార్యరూపంలో పెట్టినది.

## సీసా లెందుకు ?

ఈ సీసపద్యప్రక్రియ ఎందుకు? అనే సంశయాత్ములు లేకపోలేదు. ఒకే గ్రంథాన్ని వివిధరూపాలలో రూపొందించడం ఒకవిశేషమన్న సంగతి వీరు మరచినట్లున్నది? భారతం మొదటిపద్యరూపానికి గద్యం, ద్విపద, కీర్తనలు పుట్టి మూలానికి మెరు గెక్కించినవిగదా! వ్రాసేవారి, చదివేవారి వ్యక్తిగత అభిరుచులే దీనికి కారణం. ఈ భిన్నరూపాలు భిన్నరుచులవారికి మూలగ్రంథసమగ్రరూపాన్ని ప్రకటిస్తవి.

కాబట్టి ముదివర్తివారిపని సర్వరసికజనామోదమే. సీసం అప్పటమైన తెనుగు ఛందం. తిక్కన శ్రీనాథులు దీనిని కళాపూర్ణంగా, ఒక ఆబోతుఎద్దువలె గంభీరంగా నడిపించినారు. ఇంకా, తిక్కన ఒకవచనంవలె నడిపించినారు. ఆచార్యులు తమ కవిత్వపరుసవేది (స్పర్శవేధి) పసరుతో సీసాలను అపరంజి తునుకలుగా మార్చినారు.

ఈ ఎత్తుగడలో ఆచార్యులు ఇప్పటికి తాళ్లపాక అన్నమాచార్యుల పదాలను క్రిందిపద్యగుచ్ఛాలుగా మార్చినారు.

1. అమృతసారము-అన్నమయ్య ఆధ్యాత్మసంకీర్తనలు - 300 పద్యాలు.
2. బ్రహ్మగాంధర్వము " "
3. అన్నమయ్యవిన్నపాలు " "

## ఆనందనిలయం.

ఈ నూతనగ్రంథం పెదతిరుమలాచార్యుల ఆధ్యాత్మికసంకీర్తనలకు సీస పద్యరూపం. తాళ్లపాక పెదతిరుమలాచార్యులు క్రీ.శ. 1468 నుండి 1552 దాకా వెలుగొందిన వాగ్గేయకారుడు. ఈయన అధ్యాత్మసంకీర్తనలు, శృంగార సంకీర్తనలు, శృంగారదండకం, చక్రవాళమంజరి, శృంగారవృత్త శతకం, శ్రీవేంక టేశోదాహరణం, నీతిసీసశతకం, సుదర్శనరగడ, భగవద్గీత (వచనం), వైరాగ్య వచనమాలికాగీతాలు అనబడే శ్రీవేంకటేశ్వరవచనములు రచించాడు.

## ఇక కాస్త అనుశీలనం.

ఆనందనిలయం శబ్దబ్రహ్మోపాసకుడైన భక్తునిమనస్సుకు నిజంగా ఆనందనిలయమే. ప్రతిపద్యానికి ఉపక్రమణిక, క్రింద భావవివరణము చక్కగా ఇచ్చినారు. పరిశోధనకు వీలుగా ప్రతిపద్యమూలకీర్తనసంఖ్య, రాగిరేకుసంఖ్య, సంపుట సంఖ్య ఇవ్వడం చాలా ఉపయోగకారి; పాఠకునిపని సులువుచేసినారు.

వ్యాజనిందాస్తుతులతో నీతులతో పుస్తకం ఎక్కడబడితే అక్కడ గులాబి తోటవలె గుబాళిస్తున్నది. మూలవిధేయంగా సాగినప్పటికీ ఒకస్వతంత్రరచనవలె చదువరిని ములుగర్రతో పొడవకుండా ముందుకు నడిపిస్తుంది.

## మచ్చున కొకపద్యం.

ఆఁకొన్నవానికి నన్నమం దున్నట్లు
హరిమీఁద నేఁకట యదరవలదె ?
విటకానిచూపులు వెలఁదిపై నున్నట్లు
మరుగురుపైఁ దమి పెరుగవలదె ?
పసిబిడ్డనికి చంటిపాలపై నున్నట్లు
గోవిందుపై నాస కొఱలవలదె ?
వెస బాటసారికి విడిదిపై నున్నట్లు
విష్ణుపైఁ దహతహ వెలయవలదె ?

ధనికి నిధిమీఁద నున్నట్లు ఫణిశయాను
పదయుగళిమీఁద దృక్కులు పాఱవలదె?
పరమసుజ్ఞానులకును ప్రపన్నులకును
మనసు మంగాంబమగనిపై మరలవలదె ?

[పద్యం-109]

"నిను సునీతిసుతుఁడు" (ప. 44), "కోరి పెండ్లాడిన దేరూపుదైనను" (45), "చేసితపమ్ము వసిష్ఠుఁ డయ్యెద నన్న" (91), "పుడమి దొంగకు చింత" (100)' "భవపాశబంధముల్ పటుకునఁ దెగునటే (101)" "పటుభగవన్నామ పారిజాతము గల్గ" (124) వంటిపద్యాలు కాసులపురుషోత్తమకవిని, బమ్మెరపోతనా మాత్యుని జ్ఞప్తికి దెస్తాయి.

కళ్లు (ముద్దలు), తతి (ఋతుకాలం), అడియరి, డింగరీడు (సేవకుడు), పైఁడిపూదె (బంగారుపూస), పెట్టనితరువు (సహజ నిర్బంధము), వదరు (సొర కాయబుఱ్ఱ), అడబాల (వంటలక్క), గమికాఁడు (సేనాధిపతి), అమరకాడు (పాళియగాడు), మోరత్రోపులవంటి అపూర్వపదాలకు గ్రంథమంతా కాణాచిగా ఉన్నది.

వాచవిగా కొన్నినుడికారాలు, ఉపమానాలు ఎత్తివ్రాస్తున్నా. జిలేబిచుట్టను ఏ భాగంలో కొరికితిన్నా తీపేగదా !

**తెనుగుదనపుతీపి : నుడికారపుసొంపు.**

**"ముక్కున నున్నది ముంగోపము"** [53 పద్యం]

**"కోర్కి నావులఁగాచి గొల్లఁడవై యుండి**
**నేడు చూడఁగ రాచవాఁడ వయితి (80)"** – అధిక్షేపణ

**"భూమీశ్వరత్వమ్ము భువనేశ్వరత్వమ్ము**
**సామజవరద ! నీ శరణ మెపుడు"** (81)

ఏనుగును రక్షించినవాఁడు కాబట్టే శరణుజొచ్చడం.

**"శిరసుండ మోకాల సేసవెట్టినయట్లు"** (113)

సామెత.

**"అన్నిచోటులఁగూడ హరిపదమ్మలెగదా"** (120)

భగవంతుని సర్వోపగతత్వం.

**"కనుమూసి తెఱచిన కలిమిలేములు –"** (161)

**"కొసరుచు నేదేని కోరుమనస్సు"** – (164)

–మాయ.

**"వెలిదుక్కి దునకుండ విత్తుట"** (169)

ఇసుకపాతఱ ద్రవ్వుట – సామెత.

**"నీదుదాసుల పంచనీడ నుండినఁజాలు"** (180) అన్న పద్యంలో ఉపమాన పరంపర కూర్చబడింది.

**"ఊరిపసులమేపి యొప్పించి యిండ్లకుఁ**
**జివర జంగిలికాఁడు చింతవదలు"**
**"బూరెలువండిన పొలఁతి చేతులుచూపి**
**యింటివారల కిచ్చి యెలమినేగు"** (196)

–కర్తృత్వ అహంకారము వదలుట.

"మోవకయ గోపురమ్మును మోయుప్రతిమ
వంటివాఁడ-**(22)**"-దంభవృత్తి నిరసనము.

కేవలభక్తి, శరణాగతి శ్రీవైష్ణవమున మూలసిద్ధాంతాలు, వీటిని వర్ణించే పద్యాలు ఎన్నో సొబగుగ నున్నవి. అందు కొన్ని.

**"పెనువార్ధి దాఁటి మెప్పించ మారుతి గాను**
**చవుల మెప్పించంగ శబరిగామ** (9)"
**తల్లివై రక్షింతు తండ్రివై పోషింతు**
**విల్లాలివై మోహ మిత్తు నాకు**
**... ... దేవుఁడై పూజగొందువు** (49)"

**"ఊహసేయఁగ సకలోపాయములు శేష**
**శిఖరి శేఖరవిభుఁ జేరువఱకె** (104)"

"సప్తగిరిసార్వభౌముఁడన్ స్పర్శవేధి...
**ధన్యులనుజేయ భక్త్యమృతంబు వొడమె** (124)"

**"అంధకారమువాపు నరుణోదయము గ్రుడ్ల**
**గూబలకుం గూర్చు గ్రుడ్డితనము** (145)"

**"ఉడుగనిమాయ యీ యొకదేహమునకెగా**
**వెట్టిసంసారంబు గట్టికొనుట**
**మెసవెడు పట్టెడు మెదుకులకేగదా**
**వాణిజ్యకృషి ధేనుపాలనములు** (151)"

-భిన్నఫలము.

**"చక్కనిమాటల సన్నుతింప నెఱుంగ**
**న న్నెట్లుగాతువో నమ్మినాఁడ** (181)"

-శరణాగతిలో దైన్యం.

శాంతి ఆత్మోన్నతికి ముఖ్యగుణము. దానిని పొందే సాధన క్రమముల 200 పద్యంలో వర్ణించి చివరకు-

**"భారమిడియుంట మంగేశుపయిని శాంతి**
**హరి భజించి గుణాతీతుఁ డగుట శాంతి"**

అని చరమోపదేశం చేస్తున్నాడు.

భగవద్గీతలో వైష్ణవులు చరమశ్లోకం అనే (18 : 66) "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" లోని మహిమోపేత ఉపదేశ మును జ్ఞప్తికి దెస్తున్నాడు.

**"శాంతము లేక సౌఖ్యము లేదు.**
**దాంతునికైన వేదాంతున కైన"** అని త్యాగరాజు చాటుతున్నాడు గదా ! విని, ఆచరించి తరిస్తాం !

మురిసి వ్రాసిన వ్రాతను గుణపక్షపాతులు మన్నించగలరు.

నెల్లూరు,
22-9-89

మరుపూరు కోదండరామరెడ్డి

ఉభయవేదాంత ప్రవర్తకులు
'ప్రవచనశిరోమణి'
**శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులుగారు**

షీలానగర్,
విశాఖపట్టణం - 12

# మంగళతోరణము.

శ్రీ వేంకటేశచరణశరణాగతులైన శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులకుమారుడు శ్రీమాన్ పెదతిరుమలాచార్యులవారు. వారు గానముచేసిన సంకీర్త సములలో రెండువందలు ఆధ్యాత్మికసంకీర్తనలను సీసపద్యములుగా నిబంధించి 'ఆనంద నిలయము' అనుపేర అందించినారు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యుల వారు. వీరింతకుముందు శ్రీమాన్ అన్నమాచార్యులవారి అధ్యాత్మసంకీర్తనలనుండి మూడేసి వందలను "అమృతసారము", "బ్రహ్మగాంధర్వము", "అన్నమయ్య విన్నపాలు" అను పేర్ల సీసపద్యకృతులుగా వెలయించినారు. వీరు మహాకవులు, భావుకులు. ప్రసాదమాధుర్యములు వీరికవితకు సహజగుణములు. న న్నను గ్రహించి నాచే ఆనందనిలయమును అనుభవింపజేసినారు. ఆ అనుభూతిచే నా మనసు ఆనందనిలయమైనది. ఆ విషయమును కొద్దిగా ఇట విన్నవింతును.

ద్రావిడమున ఆళ్వార్లు గానముచేసిన ప్రబంధమును ద్రావిడవేదము అందురు. భగవదనుగ్రహాలబ్ధ దివ్యజ్ఞానసంపన్నులై వారు ఉపనిషద్రహస్యములను ద్రావిడమున లోకమున కందించినారు. వానిని "తమిళర్ ఇశైకారర్ పత్తర్ పరవుమ్ ఆయిరమ్" -భాషాకోవిదులు, గానవిశారదులు, భక్తులుకూడ ఆదరించిన వేయి పాశురములు" అనినారు. అట్లే శ్రీవేంకటేశదివ్యానుగ్రహముచే శ్రీమాన్ అన్నమాచార్యులవారు, పెదతిరుమలాచార్యులవారు అధ్యాత్మశృంగారసంకీర్తన ములను పాడిరి. ఇవి తెలుగున వేదముగా పరిగణింపదగినవి. ఇందలిభాష, గానము, భక్తి సమపాళముగ సాగినవి. కాని సంకీర్తనము లగుటచే గాయకులకే చెందినవై భాషాకోవిదులకు, భక్తులకు అంతగా ఉపయోగపడలేదు. ఆ లోపమును తీర్చుటకు శ్రీమాన్

కొండ[illegible]ర్యులవారు గేయమును పాఠ్యముగ మార్చి వాని భాషాప్రౌఢిని, భ[illegible]మును ఈ ఆనందనిలయమున ప్రకాశింపజేసినారు.

ఉపనిషత్ సిద్ధాంతమున 'ద్రష్టవ్యః' అని భగవద్దర్శనమునకే ప్రాధాన్య మీయబడినది. అట్టిదర్శనము ప్రత్యక్షముగ అర్చామూర్తియందే సాధ్యము. కనుక అదియే ఉపాస్యము. దానికి సాధనము శరణాగతియే. దానికి మూలము లక్ష్మీపురుష కారము, ఆచార్యసమాశ్రయణము. ఇట్టిప్రపన్న ధర్మమును తాము అనుసరించి ఈ రహస్యాన్ని లోకానికి అందించుటకై శ్రీతిరుమలాచార్యులవారు ఆవిష్కరించినవి ఈ గేయములు.

ఆనందనిలయమున ప్రవేశించి అందలివిశేషములను అనుభవింతము రండు. ప్రవేశించగనే స్వామిదివ్యమంగళవిగ్రహసందర్శన మగును. శ్రీచరణములు మొదలు దివ్యమకుటమువరకు దర్శనమిచ్చును. "అమలభక్తి కొలువుండీ మ్రొక్కుండీ ఏడుకొండలప్ప" అనినారు ఆచార్యుల వారు.

ఆళ్వారులు, వారి తిరువాయిమొళిప్రారంభమున ఇదేమాట చెప్పినారు. దివ్యమంగళవిగ్రహమునే దర్శించినారు. కాని వీరు దర్శించినది వేంకటాధీశుని. ఇందు ఉపాస్యము, ఉపాయము నిర్దేశింపబడినవి. దీనిచే లభించుఫలము చిట్ట చివరిపద్యమున నిర్దేశించిరి. అది శాంతి. శాంతి అన నేమి? "భారమిడియుంట మంగేశు పైని శాంతి. హరి భజించి గుణాతీతుఁ డగుట శాంతి" అని వివరించిరి. ఉపక్రమోపసంహారములలో ఈ అందమును దర్శించిన, ఉపనిషద్రహస్యము మనకు స్పష్టమగును. ఈ శాంతిని పొందుటకు భగవానునితో సంబంధమును గుర్తించుటయే కర్తవ్యము. ఈ విషయమును 49వ పద్యమున 'తల్లివై రక్షింతు, తండ్రివై పోషింతు, గురుఁడవైబోధింతు, దొరవయి యేలెదు' అని వివరించినారు. ఆ సంబంధజ్ఞానముకలుగగానే "వడి నేను గైకొన్న వ్రత మెట్టిదనఁగ నీ సొమ్ము నేనని శరణమ్ముఁజొరుటె (57)" అని భగవానునియందలి స్వామిత్వమును తనయందలి స్వత్వమును గుర్తించి శరణొందుటయే వ్రతమని నిరూపించినారు. భరన్యాసము, శరణాగతి, ప్రపత్తి అనుపేర్లతో

వ్యవహరింపబడు ఉపాయము తప్ప వేరొక ఉపాయములేదు. దానిని విన్నవించుటయే సంకీర్తనము. భగవద్గుణములను గానముచేయుటయే పరమధర్మము అని వివరించినారు.

**"ఏ యుపాయ మెఱుఁగ నిదె విన్నపము నీకు**
**నీదుసేవకుఁడ మన్నింపఁ గదవె**

**ఏను నినుఁ బాడువాఁడ మంగేశ ! నీదు**
**ధర్మమున నుండువాఁడ (70)"** అని సంకీర్తనప్రాధాన్యమును వివరించినారు.

ఆళ్వార్లు తమ మనసునే చందనముగా, తమ శరీరమునే మాలగా స్వామి కర్పించినారు, శ్రీతిరుమలాచార్యులవారు–

**"దేవుఁడా ! నామేను తిరుమలనగరమ్ము**
**భావింపఁ జిత్తమ్మె పసిఁడిమేడ**

పరమాత్మ ! నామది బహురత్నపర్యంక (72)" మని తమ శరీరమును భగవద్వాసభూమిగా మలచుకొనినారు.

భగవానునకు మనమేమి అతిశయమును కలిగించగలము అని ఆలోచించి ఒక అందమైన భావమును ఆవిష్కరించినారు.

**"నీచుఁడ నగు నేనే లేనిచో నీగుణములు ఎక్కడ ప్రసరించు నయ్యా !"**

కావున నీకు నే నెంతో ఉపకారముచేసినాను అనినారు.

**"భూమి నీచుఁడ నేను బుట్టఁగా మీదయ**
**పాటి నాపై, నీకు వన్నెదెచ్చె;**
**నేఁ బుణ్యుఁ డైనచో నీకృప యేటికిఁ**
**గొఱగాక యొకమూలఁ గూరుచుండు"** (78) అనినారు.

భగవత్కృప నిర్హేతుకముగా ప్రసరించును, దీనికి మనముచేయు కర్మజ్ఞాన భక్తివైరాగ్యములు హేతువులు కావు.

**"చిననిమ్మపం డొండు క్షితిపున కిడిగాదె
యెనలేనిభూముల కేలి కగుట (85)"** అనినారు.

మానవుడు పడయవలసిన పరమపురుషార్థము దాస్యమే. "శౌరి దాస్యమ్మున కివేవి సాటికావు. (91)" అని ఇతరఫలములను అధః కరించినారు. అయోగ్యుడైనను అయోగ్యతను తొలగించుకొన నవసరములేదు. శరణాగతుడైన నాడు పరిశుద్ధుడే యగును- అను రహస్యమును-

**"పరుసమున కినుమైనను పైఁడి యయిన
సరియె; శ్రీహరిగొల్చుట గుఱుతుగాదె! (90)"** అనినారు.

చక్రాంకితముగాని జీవితము వ్యర్థము.

**"సప్తగిరినాథుచక్రలాంఛనుల కెందు
మంతు కెక్కినయట్టి సోమపులు పురుదె?"** (107)

అని చక్రాంకణవైభవమును ప్రకాశింపజేసినారు.
భగవద్భక్తిగల దాసులకు జాతిఉత్కర్ష, అపకర్ష హేతువు గాదు.

**"శౌరిదాసులకును జాతియేల (108)"** అనినారు.

శ్రీవేంకటేశుడే పరతత్త్వమని స్థాపించుచు -

"తప్పుడుచదువుల తార్కికాధములార ! వేంకటగిరిదైవతమ్ము వంటి దైవతమ్మును గొనితేరఁ దరమె మీకు ? (127)" అనినారు.

గురుకటాక్షముచే లభించిన మంత్రమును క్షుద్రప్రయోజనములకు విని యోగించరాదని -

"శ్రీహరిమంత్రమ్ము చెనటిభోగములకు సెలవుగావించుట పులిని వేటాడ గాఁబోయి పూరేడును బట్టితెచ్చి ప్రమోద పడుట (123)" అని హేళనచేసినారు.

నారాయణతత్త్వము నెఱిగినవారు సర్వత్ర సమభావము కల్గియుందురని–

**"నానాత్మలందున నారాయణుండెగా**
**హీనాధికములు మఱిందు నేవి ? (120)"**

అని వివరించినారు. శ్రీవైష్ణవలక్షణములను ఇట్లు పేర్కొనినారు.

"పాపమ్ము గనుఁగొన్న భయముసెందవలయు – ఆచార్యుఁడే గతి యని యుండవలయును; వాంఛలు పోవలె వైష్ణవునకు, వలయు వినయ స్వభావమ్ము వైష్ణవునకు (138)". ఇట్టి శ్రీవైష్ణవతత్త్వసామ్రాజ్యమూర్ధాభిషిక్తులు పెదతిరుమలాచార్యులవారు; మా కొండమాచార్యులవారు కూడ.

శ్రీమాన్ కొండమాచార్యులవారు ఈ సంకీర్తనలలోని పరమ రహస్యాన్ని పద్యరూపంగా అందించి మహోపకారం చేసినారు. ఈ ప్రబంధము ప్రపన్నజన కల్పకము; భాగవతధర్మసముచ్చయము; ముముక్షుజనోపాస్యము. దీనికి విపుల మగు వ్యాఖ్యనుకూడ శ్రీమాన్ కొండమాచార్యులవారు సంతరించి అందించిన మహోపకారమగును. వీరిజన్మ సార్థకము. శ్రీమాన్ కొండమాచార్యులవారికి శ్రీనివాసుడు సర్వాభ్యుదయములను ప్రసాదించి వారిచే ఇట్టి కావ్యములను పలికించి లోకమును అనుగ్రహించవలసినదిగా విన్నవించుకొనుచున్నాను.

విశాఖపట్నం,
24-9-1989

ఇట్లు
భాగవతదాసుడు
**శ్రీ. అప్పలాచార్యులు**

**భూతపూర్వమంత్రివర్యులు, ముఖ్యమంత్రులు, రాజ్యపాలకులు,**

## ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ అధ్యక్షులు
## మహారచయిత

**డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారు.**

## ఆ మో ద ము.

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి సంకీర్తనలు నెమ్మది నెమ్మదిగ ఎక్కువ ప్రచారము పొందుచున్నవి. ఇటీవలిదశాబ్దములలో, తిరుమల తిరుపతి దేవస్థానమువారు ప్రత్యేకముగ సంస్థ నెలకొల్పి సంకీర్తనల స్వరబద్ధము చేయించి శిష్యులకు పాఠములు చెప్పించి, కచ్చేరీలలో పాడుటకు, సంగీత విద్యాలయము లలో నేర్పించుటకు, రేడియో, దూరదర్శన్ ప్రసారము కావించుటకు విరివిగా యత్నములు జరుపుచున్నారు. నృత్యమునకును వినియోగించుచున్నారు.

శ్రీ అన్నమాచార్యులకుమారులు పెదతిరుమలాచార్యులవారి సంకీర్తనము లును ప్రచారమును పొందుచున్నవి. తండ్రి, తనయుడు రచించినవి సంకీర్తన ములు - గేయములు, రాగతాళయుక్తముగ పాడతగినవి. త్యాగయ్య, క్షేత్రయ్య కృతులవలె స్వరకల్పనతో పాడతగినవి.

శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు పండితులు, కవులు, చిన్నతనము నుండి పద్యములకు అలవాటుపడినచెవులు వారివి. చదువుటకును నోరు అభ్యస్త మైనది. చదువరులకు గేయములు ఇంపుగా

ఉండవని వారిఅభిమతము. శ్రవణ యోగ్యములేగాని పఠనయోగ్యములు కావని వారితలంపు. ఇంతమంచిభాష, భావములు గేయములలో బంధింప బడి రసహీనము లైనవే యని వారివిచారము. రూపాంతరము కావించి గేయములకు సీసపద్యాలరెక్కలను తొడిగి ఎగురవేశారు. ఇవి అంబర విహారము చేయగలవని విశ్వాసము.

ఇదియొక నూతనప్రక్రియ. గద్యమును పద్యములుగా మార్చుట మనకు విదితమే. అట్లనే పద్యమును గద్యములోనికి మార్చుట అటనట చూచుచున్నాము.

గేయమును సీసపద్యముగ మార్చుట క్రొత్త విధానము. చీరలధరించే బాలికలకు కూడా, పైజమాల తొడుగుటవంటిది. పాతవారు క్రొత్తగ కాన్పించెదరు రసజ్ఞులకు, పాత పాతగా నుండుటకంటె, క్రొత్తగా కాన్పించడము మంచిదేకదా !

తాళ్లపాకవారి ఆధ్యాత్మికకీర్తనలనే వీరు ఎన్నుకొనిరి. వారిశృంగార కీర్తనలజోలికి పోలేదు. సీసపద్యమునే గై కొనిరి; ఇతరవృత్తములలోనికి జొర వడలేదు.

అన్నమాచార్యులకీర్తనలను ముందే ప్రచురించిన కొండమాచార్యులు ప్రస్తుతము రచించిన పెదతిరుమలాచార్యులవారి 200 కీర్తనలు వెనుకటితీరులో ఒయ్యారాల ఒలికించుచు, నవ్యహావభావములతో చదువరుల సరసన చేరుచున్నవి.

రసహృదయులు సరసనచేరినవారికి ఉచితమర్యాదల నొసగి ఆదరించెదరుగాక !

ఇది క్రొత్తప్రయోగము. పాఠకులు దీనిని ప్రోత్సహించి ఆహ్వానించెదరని నమ్ముచున్నాను. సాహసముతోకూడిన వారియత్నము క్రొత్త వసంతమును తెచ్చుగాత!

శాంతినికేతనము, నెల్లూరు
22-10-1989

**బెజవాడ గోపాలరెడ్డి.**

## ఉభయభాషాకవీంద్రులు

## మహావిద్వాంసులు, మహావక్తలు

### శ్రీ యల్లంరాజు శ్రీనివాసరావుగారు, M.A.,

కొండంతదేవుడికి కొండంతపూజ చేయలేముగదా ! ఆనందనిలయం నిజముగా ఆనందనిలయమే. అందులో మీరు చెక్కిన పద్యశిల్పాలు అనల్పమైన సౌందర్యాన్ని ఒలుకుతున్నాయి.

"యాదవభామినీ యౌవనవనములోఁ
జరియించు గంధగజంబ వీవు-" (63)

"మచ్చిత్త మనియెడి మదపుటేనుఁగ యిదె
సంసార మనియెడి సరసిఁజొచ్చి-" (67)

"శిరసుండ మోఁకాల సేసవెట్టినయట్లు
పరమధర్మము మాని వ్యర్థుఁ డయితి-" (113)

ఇలాంటివి కుప్పతెప్పలు. మరి శతకకవులపద్యరచనలో నిర్మాణంలో ఎన్ని మార్మికమైన పోకడ లున్నవో చాలావరకు అఱకడబెట్టి తెచ్చి పద్యరచనలో దించారు మీరు. ఇన్ని పద్యపుష్పాలతో కొండమయ్య నర్చించిన కవి కొండమయ్య నేమని కొండాడగలను? "వేంకటేశకథాదివ్యసుధాస్వాదేవ తుష్యతు భవా నితి శ్రీనివాస చరణదాసః".

ప్రొద్దుటూరు,
17-9-1989.

శ్రీనివాసః.

సుప్రసిద్ధరచయితలు, రావుల రామాయణ కర్త

## డాక్టరు రావుల సూర్యనారాయణమూర్తిగారు,

ఎం.ఏ., డి.లిట్.,

సౌరసంబంధశాఖాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు.

**తిరుపతి,**
**5-10-1989.**

అర్వాచీనాంధ్రసాహితీవిహాయసంలో ధ్రువతారగా వెలుగొందుతున్న శ్రీ ముదివర్తి కొండమాచార్యులవారు రచించిన "ఆనంద నిలయము" అనే గ్రంథాన్ని చదివే అదృష్టం కలిగినందుకు ఎంతో ఆనందిస్తున్నాను.

వివిధప్రక్రియలలో విశిష్టమూ, విలక్షణమూ అయిన రచనలు సాగిస్తూ లబ్ధప్రతిష్ఠులైన శ్రీ ఆచార్యులవారు ఉద్యోగ విరమణానంతరం తిరుమల తిరుపతి దేవస్థానంవారి పుస్తకప్రచురణల విభాగంలో ప్రవేశించి, అనేక గ్రంథాలను నిర్దుష్టంగా పరిష్కరించి వెలువరించడంలో స్తవనీయమూ, మహనీయమూ అయిన కృషి సాగిస్తున్నారు.

నిరంతరసాహితీతపస్వి, నిస్స్వార్థనిరహంకారసేవాపరాయణులూ అయిన శ్రీ కొండమాచార్యులవారు తీరికసమయాలలో అన్నమాచార్య సాహిత్యాన్ని అధ్యయనంచేసి, అంతటితో తృప్తిపడకుండా పదకవితా పితామహులు ఆంధ్రభాషా జగత్తుకు ప్రసాదించిన అధ్యాత్మ సంకీర్తనలలోని సారస్యాన్నీ, సౌందర్యాన్నీ పాఠకులకు పద్యరూపంలో అందజేసే ఆశయంతో ఇంతవరకూ సుమారు తొమ్మిది వందలసంకీర్తనలను సరళసుందరాలైన సీసపద్యాలుగా మలచారు.

అమృతసారం, బ్రహ్మగాంధర్వం, అన్నమయ్యవిన్నపాలు అనే శీర్షికలతో ప్రచురింపబడ్డ మూడుగ్రంథాలు ఆంధ్రప్రజల ఆదరాభిమానాలు

అపారంగా చూరగొన్నాయి. ఆ ప్రోత్సాహప్రోద్బలాలతో శ్రీ ఆచార్యులవారు తీర్చిదిద్దిన మరో మహత్తరప్రబంధం "ఆనందనిలయం."

అన్నమాచార్యులతనయుడు పెదతిరుమలాచార్యుల అధ్యాత్మసంకీర్తనలకు మూల విధేయంగా ముదివర్తివారు రూపొందించిన ఈ గ్రంథాన్ని కూడా ఆంధ్ర పాఠకమహాశయులు సహృదయంతో స్వీకరిస్తారనడంలో సందేహం లేదు.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు తమ ధార్మికగ్రంథాలప్రచురణ కార్యక్రమంలో భాగంగా అన్నమాచార్యులసంకీర్తనల సంపుటాలను-ఆధ్యాత్మిక శృంగారవిభాగాలుగా మొత్తం 31 ఈనాటివరకూ ప్రకటించారు. మిగిలిన నాలుగు శృంగారసంకీర్తనల సంపుటాలనూ ప్రచురించడంతో అన్నమాచార్యసమగ్రపద సాహిత్యం పాఠకలోకానికి అందజేసినట్లవుతుంది. అద్యతనభావిలో ఈ కార్య క్రమం పూర్తికాగలదని అందరివిశ్వాసం.

శ్రీ ముదివర్తి కొండమాచార్యులవారు మరింత ఉత్సాహంతో ఇతోధిక సాహిత్యసేవ సాగించడానికి అనువుగా వారికి ఆయురారోగ్య భోగభాగ్యాలు కలగ జేయవలసిందిగా కలియుగప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిని వేడు కుంటున్నాను.

తిరుపతి,

**- రావుల సూర్యనారాయణమూర్తి.**

5-10-1989.

# అంకితము

తే. అమృతకలశాతపత్ర వజ్రాంకుశ ధ్వ
జాబ్జ కల్పక శంఖచక్రాంకితమ్ము
సకలశుభదాయి వృషగిరిసార్వభౌము
నంఘ్రిపంకేరుహద్వయి నాశ్రయింతు.

తే. సర్వభూమండలమ్ము సాచలకులమ్ము
నేకపాదమ్ముతోఁ గొల్చి యెసక మెసఁగు
శ్రీమహావిష్ణుచరణరాజీవయుగళిఁ
బరమభక్తి నజస్రంబు ప్రస్తుతింతు.

ఆ. వేదశిరములందు నాదు మూర్ధమునందు
నెసఁగు నెద్ది కోర్కు లొసఁగు నెద్ది
కులధనమ్ము మాకు కులదైవతము వేంక
టేశుపాదయుగము నెపుడు గొలుతు.

తే. చిత్ర చిదచిద్విభాగ విశిష్ట విశ్వ
మతని యయుత శతాంశ కలాంశ కాంశ
మం దెసఁగు; నా ముకుందు పద్మాయతాక్షు
పరమసత్త్వాశ్రయున్ రమాపతి భజింతు.

తే. బ్రహ్మహత్యాఘముం బాపి భర్గు నెవఁడు
కాచె; నెవ్వనిపాదోదకము శివుండు
తల ధరించి పవిత్రుఁడై వెలసె; నతని
పరమపురుషు వృషాద్రిమందిరు నమింతు.

ఆ. ఎవనినాభినుండి యీ విశ్వ ముదయించు
నెవనిగర్భమందు నిమిడియుండు
నెవఁడు దీనిఁ బ్రోచు నెవనియం దిది డిందు
వాని శేషశైలవాసు నెంతు.

ఆ. పుండరీకములను బోలు కన్నులవాని
వెడఁద యెడఁద లచ్చి వెలయువాని
మంచిమనసువాని మాట లూఁకొనువాని
వేంకటాద్రివిభుని వేడ్కఁ దలఁతు. 7

తే. ఎవని మహిమాబ్ధిశీకరాణువును గొలువ
కమలజభవాదులకును శక్యమ్ము గాదొ ?
ఆ శ్రియఃపతి మహిమల నభినుతింపఁ
దలఁచుచుంటి నే నెంత ? నా తెలివి యెంత ? 8

క. కులగిరులె మహార్ణవమునఁ
దల మొల గనరాక యణఁగి తలముంజేరన్
తలపోయఁగ నణుమాత్రుఁడఁ
బలుకఁగలనె నిన్నుగూర్చి పద్మదళాక్షా ! 9

తే. స్వామి ! నీకృప లేకున్న జగము లెట్లు
పొడమును ? ప్రవృత్తిచందంబు నుడువనేల ?
సర్వజీవులకు నిసర్గసఖుఁడవైన
నీకు శ్రితవత్సలత్వంబు నిజగుణంబు. 10

తే. వైదికుఁడు సమ్మతింపనివాఁ డెవండు
నీదు స్వామిత్వమున్ ? నీరజోదరుండు
శర్వ శతమఖముఖు లహిశైలనాథ !
నీ మహామహిమాంబుధి నీటిబొట్లు. 11

తే. శీలరూపచరిత్రలచే ప్రకృష్ట
సత్త్వగుణముచే ప్రబలశాస్త్రములచేత
దైవ పరమార్థవిదుల మతాలచేత
నాసురప్రకృతులు శౌరి నరయ లేరు. 12

తే. దేశకాలాపరిచ్ఛిన్న దివ్యమహిమ
హరికి సముఁ, డధికుండు లేఁ డను నిజంబు
గుణమయి తదీయమాయ దాఁటిన మహాత్ము
లెందు తదనన్యభావులే యెఱుఁగఁ గలరు.

ఆ. ధర్మనిష్ఠలేదు; తావక పదభక్తి
లే; దకించనుండ; లేదు నాకు
వేఱుగతియు; నాత్మ వేదినిగాను నీ
చరణసరసిజములె శరణ మగుత !

తే. నేను పలుమారు సల్పని నింద్యమైన
కర్మములు లోకమున లేవు కలుషమతిని;
తద్విపాకావసరమున దండఁజేరి
యగతికుఁడ నేడ్చుచుంటి నన్నరయు మయ్య !

క. చిరకాలమునకు భవసా
గరనిర్మగ్నునకు నొడ్డుకైవడి నాకున్
దొరకితివి; నేఁడు నీకును
పరమకృపారససమర్హ పాత్రము దొరకెన్.

తే. పూర్వ మనుభవింపనిది, మున్ముందు ననుభ
వింపవలసిన యార్తి సహింపఁ గలను;
సహజ మది నాకు; శరణన్నజనులఁ ద్రోపు
సేయు టిది నీకుఁ దగినట్టి చేఁతగా

తే. పావన భవత్పదాంబుజద్వంద్వ స
పరమభక్తి సుధాబ్ధిశీకర ముదీర్ణ
భవదవానల కీలికాపటలి నార్పి
క్షణములో పరనిర్వృతి సంతరెంచు.

ఉ. స్వాంతము పొంగ కన్గవకుఁ బండువుగాఁగ ప్రభూ! విలానవి
క్రాంత పరావరాలయము, బ్రహ్మముఖామర పూజితంబు దు
ర్దాంతదురంతదుఃఖములఁ గ్రన్నన మాన్పుచు భక్తపాళికిన్
సంతస మిచ్చు నీ చరణసారసమున్ దరిసించు టెన్నఁడో ! 19

సీ. వికచాతసీసూన విమలచ్ఛవుల నీను
తనువున పీతవస్త్రంబు దాల్చి
జ్యాకిణ కర్కశాజాను విలంబి బా
హులు నాలుగింటితోఁ బొలుపుమీఱి 20
మణికిరీటాంగద మకరకుండలహార
కాంచికా కటకాది కాంతి మించి
శంఖ చక్ర గదాసి శార్ఙ్గమ్ములన్ తుల
సీవనమాలికఁ జెలువు మెఱసి

తే. నిత్యయౌవన లావణ్య నిరుపమాన
పరమసౌందర్య మహిత రూపమ్ముతోడ
శ్రితుల రక్షింప వేంకట శిఖరినున్న
యిందిరాజీవితేశు ని న్నెపుడు గందు ? 21

సీ. నీ బాహుమధ్య మే నెలఁతకు భవన; మే
వెలఁదిపుట్టిల్లు నీ ప్రియగృహంబు;
యదపాంగసంశ్రయం బఖిలప్రపంచ; మే
చెలికొఱ కంభోధి చిలుకఁబడియె;
సేతునిర్మాణ మే నాతికై జరిగె; నే
యతివ నీ శుద్ధి రూపాదులందు
ఆ రమారమణితో నల వికుంఠమునందు
శేషతల్పమున వసించు నిన్ను

తే. నిత్యసూరిసంసేవ్యుని నీరజాక్షు
శ్రితజనైకజీవితుని లక్ష్మికిని లక్ష్మి
యైనవాని మత్సేవల హర్షమందఁ
జేయుభాగ్య మదెప్పుడో శ్రీనివాస ! 22

చ. ధ్వజమయి వాహనమ్మయి వితానమునై మఱి యాసనమ్మునై
వ్యజనమునై సఖుండునయి బంటయి వేదమయుండు తార్క్ష్యుఁడా
ద్విజకులనాథుఁ డే ఘనుని వేడుక మ్రోల వసించి కొల్చు నా
త్రిజగదభీష్టదాయకు హరిన్ నిను భక్తి భజించు టెప్పుడో! 23

సీ. శ్రీవత్సలాంఛనాంచిత పీనవక్షుండు
వికసితాంబుజ చారు వీక్షణుండు
విభ్రమభ్రూలతా విలసనుండు నిమగ్న
నాభి సమున్నతనాసికుండు
మృదుకపోలతలుండు వదనశోభాజిత
పూర్ణామృతాంశుబింబుఁడు శుచిస్మి
తుండు కేసరిమధ్యముండు లలాటప
ర్యంతవిలంబి నీలాలకుండు

తే. కల్పశాఖాభుజుఁడు కంబుకంధరుండు
భక్తజనపారిజాత మాపత్సఖుండు
వాసుదేవుండు శేషాద్రివల్లభుండు
కనులముం దెప్పుడును నిల్చి కాచుఁగాత ! 24

తే. పితవు మాతవు సుతుఁడవు ప్రియసఖుఁడవు
గురుఁడవున్ గతి వీవె లోకులకు; నీదు
పరిజనుండ భృత్యుండ ప్రపత్తిపరుఁడ
నను భరింపక తప్పదు నాథ! నీకు. 25

చ. మనమున నీదుచింత యణుమాత్రము లేదుగదా! రజస్తమో
గుణకలితుండ; వెండియు నకుంఠిత భక్తునిపోల్కి నీ విధ
మ్మున నొక ఛద్మసంస్తవనమున్ విరచించెద; దీని నూతఁగాఁ
గొని సకలజ్ఞ ! యీ ఖలుని కుత్సితబుద్ధిని చక్కదిద్దుమా ! 26

చ. ప్రణతుఁ డటంచు దుష్కలుషవాయసరాక్షను సత్కృపామతిన్
మనిచితి; మూఁడుజన్మముల మాటికి నీయెడఁ బెక్కుతప్పులన్
బనివడి సల్పినట్టి శిశుపాలున కిచ్చితి ముక్తి; నీ క్షమా
గుణమునకెం దనర్హమగు ఘోరమహాఘ మదేమొ తెల్పుమా? 27

తే. ఆత్మవంతులు త్వచ్చరణారవింద
పరమభక్తిసంయుతులు ప్రపన్నులైన
నాదు పితరులఁ గనుఁగొని నాదు వృత్త
మెడఁద నెంచక రక్షింపుమీ యుపేంద్ర ! 28

తే. అపరిహార్య మనాది దురంతమైన
పాపమున కాస్పదుఁడ నరపశువ నయ్యు
దేవదేవ ! దయాసింధు ! దీనబంధు !
నీ గుణము లెంచి విడిచితి నిండుభయము. 29

తే. దేవ ! యవివేకజలదాంధదిఙ్ముఖంబు
దుఃఖరసవర్షి సంసారదుర్దినంబు
నందు మార్గస్ఖలితుఁడైన మందు నన్నుఁ
గరుణ వెరిసెడు కందోయి నరయు మయ్య ! 30

తే. స్థిరముగా నాకు నీకున్న శేషశేషి
భావ మెటు తెల్పినాఁడవొ పరఁగ నట్లె
భవ దనన్యభోగ్యమ్ము సద్భక్తి నాకు
శేషభూభృన్మణీ ! దయసేయు మయ్య ! 31

తే. [illegible]కర్మాగ్రగణ్యులై యెప్పు విధి శి
వాదులకుఁ గూడ ధ్యానగమ్యంబు గాని
నీనుదాస్యంబు వాంఛింతు నిర్భయుండ
నశుచి నవినీతుఁడ నలజ్జుఁ డయ్య! నేను 32

తే. భుక్తి ముక్తుల నెవరు నీభువనమోహ
నాకృతివిలోకనాశఁ దృణీకరింతు;
రెవరివిరహంబు దుస్సహం బవునొ నీకు
నా మహాత్ములకొలువు నా కబ్బుఁగాత ! 33

చ. భువిలో తావకదాస్యవృత్తికి బహిర్భూతంబులౌ మేను, ప్రా
ణవితానంబు, సుఖంబు, నాత్మ మఱి యన్యంబైన దారాదికం
బివి నాకేటికి నీకుఁ గానివి ? క్షణం బీపాడుసంబంధ మో
రువఁజాలన్; శతధా వినాశ మవుతన్ రుద్రేంద్రసంపూజితా! 34

చ. స్మరవివశుండ క్షుద్రుఁడ నృశంసుఁడఁ జంచలబుద్ధి వంచనా
పరుఁడ ననూయతో నుడుకువాఁడఁ గృతఘ్నుఁడ గర్వి పాపి నే
నరణి నపారదుఃఖభయసాగరముం దరియించి నీ పదాం
బురుహసపర్య సల్పుదును ? పుణ్యవృషాచల శేఖర ప్రభూ ! 35

తే. అన్నమాచార్యతనుజాతుఁడైన పెద్ద
తిరుమలాచార్యపదముల తీపి దొలఁకు
పద్యసుమముల నీ పాదపద్మపూజ
సలిపితి ననుగ్రహింపు మంజనగిరీశ ! 36

# ఆనందనిలయము

అవ: శ్రీపతిని సేవించి ఆతనిరూపు చిత్తములో నిలుపు కొనుడను చున్నాడు.

సీ. గంగపుట్టినయిల్లు, గౌతమసతిశాప
హరణ మంఘ్రిద్వయ మ్మదిగొ! యెదుట
ఊర్వశికిన్ జననోర్వి, భూకాంతకు
నధివసించెడుపీఁట లవిగొ తొడలు
అలరంగఁ గమలమ్ము నందే పితామహుఁ
గలిగించిన సునాభి బిలము నదిగొ!
అలమేలుమంగకు నటు కౌస్తుభమునకు
నునికియౌ సొమ్ములయురము నదిగొ!

గీ. శంఖచక్రమ్ము లమరు హస్తమ్ము లవిగొ !
మకరపత్రాలవే శిరోమకుట మదిగొ !
అవిగొ ! శశిసూర్యనేత్రమ్ము లమలభక్తి
గొలువుఁడీ మ్రొక్కుఁడీ యేడుకొండలప్ప. 1

శ్రీనివాసుని దివ్యచరణములే గంగానదికి పుట్టినిల్లు. గౌతమముని ధర్మపత్ని అహల్యకు శాపవిమోచనం కలిగించినవికూడా ఆ శ్రీపాదములే. ఆ దేవదేవుని ఊరువులే ఊర్వశికి జన్మస్థానం. భూదేవి కుదురుగా కూర్చుండు టకు ఆ తొడలే నెలవు. ఆ పరమపురుషుని నాభిబిలమునందే కమల ముద్భ వించెను. ఆ కమలమే బ్రహ్మకు పుట్టినచోటు అయింది. సొమ్ములతో కూడిన ఆ పురుషోత్తముని వక్షఃస్థలమే అలమేల్మంగకు లక్ష్మీవిభ్రమ దర్పణమైన కౌస్తుభమణికిని మనికిపట్టైనది. ఆ యేడుకొండలవాని కరములందే శంఖ చక్రములు ప్రకాశిస్తున్నవి. ఆయన మకరకుండలాలతో, శిరమునందు ధరించిన కిరీటముతో చెలువొందుతున్నాడు. ఆ దేవునికి సూర్యచంద్రులే నేత్రములైనారు. అట్టి దివ్యమంగళ విగ్రహుణ్ణి నిర్మలమైన భక్తితో సేవించండి. ఆయనకు ప్రణమిల్లండి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| సేవించుఁడీ మ్రొక్కుఁడీ | 70 | 405 | 15 | 272 |

అవ: సమస్త వేద ప్రతిపాద్య మైన సర్వోత్తమ దేవత, అభీష్టవరప్రదాత అయిన వేంకటాచలపతిని అభివర్ణించుచున్నాడు.

సీ. **సిరికి మగఁడు, క్షీరసింధున కల్లుండు,**
**సయిదోడు హరురాణి శైలసుతకు;**
**కమలసంభవునకుఁ గన్న తండ్రి యితండు,**
**పరమేశ్వరునకును బావ యితఁడు;**
**అమరవల్లభునకు ననుజన్ముఁ డీతండు**
**విరికల్వ తేనికి మఱఁది యితఁడు;**
**కులసతి యదితికి కూర్మిపుత్త్రుఁ డితండు**
**తాత యీతఁడు దేవదానవులకు;**

గీ. **ప్రాణికోటుల కెల్లను బంధు వితఁడు**
**వాణికిని మామగారగు వావి నితఁడు**
**వరదుఁ డీతండు వేంకటపతి యితండు**
**తలఁచిచూచినచో పరతత్త్వ మితఁడు.** 2

శ్రీవేంకటాచలపతి శ్రీదేవికి ప్రాణవల్లభుడు. పాలకడలికి అల్లుడు. పరమేశ్వరుని పత్నియగు పార్వతికి సహోదరుడు; ఇతడే పద్మోద్భవు డైన బ్రహ్మకు తండ్రి. పరమేశ్వరునకు బావ యగుచున్నాడు. దేవేంద్రునకు తోబుట్టువు; కలువల చెలికాడైన చంద్రునికి మఱదియు ఇతడే. ఇల్లాలగు అదితికి ముద్దుల కొమరు డీతడే. ఇతడే సురాసురులకు తాత. (కశ్యపాది ప్రజాపతులను సృష్టించిన బ్రహ్మ కీతడు జనకుడు. దేవదానవులు కశ్యపుని సంతాన మగుటచే శ్రీమహావిష్ణువు వారికి తాత యగుచున్నాడు.) సమస్త జీవకోటికి అనిమిత్తోపకారి యైన చుట్టము ఈతడే. ఈ దేవుడే వరుసలో సరస్వతికి మామ యగుచున్నాడు. వరప్రదాయకు డైన ఈ వేంకటేశ్వరుడే భావించి చూడగా ఉపనిషత్ప్రతిపాదిత మైన పరతత్త్వ మగుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తలఁచిచూడ | 41 | 234 | 15 | 156 |

అవ: భ్రమకు లోనుగావించి జీవుల చిత్తములను ఆకర్షించు శ్రీనివాసుని బాలగోపాల లీలా విలాసములను వర్ణించుచున్నాడు.

సీ. విరియఁబూచిన పొన్నతరువు పోటిగ నిల్చి
పిల్లనగ్రోలూఁదు పిల్లగాఁడు
తనదు రాగములకుఁ దాఁ జొక్కి వ్రేపల్లెఁ
గనుచుఁ గన్బొమలార్చు గడుసువాఁడు
కాలిపైఁ గాల్వేసి కడిమి మువ్వంకల
నొఱగి యుంగ్రాల్‌సూపు నొఱపుకాఁడు
నీలవర్ణమువాఁడు నెమలిచుంగులపాగ
తూలాడఁ దలయూచు దొడ్డవాఁడు

గీ. పీతవసనంబు సొమ్ములు పెక్కుదాల్చి
చేతులన్ శంఖచక్రాలు చెలువుమీఱ
నేఁడు శేషాద్రిబంగరుమేడలోన
నుల్లములు దక్కగొంచును నున్నవాఁడు. 3

అది వ్రేపల్లె. ఒక పున్నాగ వృక్షము విరబూచి విలసిల్లుచున్నది. ఆ చెట్టు నానుకొని నిలబడి గోపాలబాలకుడు పిల్లనగ్రోవి నూదుచున్నాఁడు. తన రాగాలకు తానే పరవశించుచున్నాడు. వ్రేపల్లె వైపు కనుగొనుచు కనుబొమ్మ లాడించుచున్నాడు. ఎడమకాలిపై కుడికాలుమెలపి త్రిభంగిగా నిలిచి వ్రేళ్ళకు తొడిగిన ఉంగరములు చూపుచున్నాడు. నీలపురంగు మేనితో, శిరమున శిఖిపింఛము తూగాడగా తల యూచుచున్నాడు. పచ్చని పట్టుపుట్టము ధరించి యున్నాడు. పెక్కు నగలు తాల్చియున్నాడు. కరము లందలి శంఖచక్రములతో చెలు వొందుచున్నాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడు శేషాద్రిపై ఆనందనిలయ విమానంలో భక్తుల చిత్తములను అపహరించుచు ఒప్పు లొలుకుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పనిలేదు పాటలేదు | 32 | 179 | 15 | 119 |

అవ: శ్రీవేంకటేశ్వరుడే మేటిదైవమని ఆయన అవతార లీలలను అభివర్ణించు చున్నాడు.

సీ. ఇంద్రాదిదివిజులయెదుట గోవర్ధన
మెత్తె; దైత్యులగెల్చి యొత్తె సంకు;
మెత్తె స్వర్ణకశిపు మెదడు చందనముగా;
మొత్తె మల్లురనెల్ల మొగతిరుగఁగ;
పట్టెచక్రము నురవడి కాలనేమిపై;
మెట్టె కాళింగునిమెడలు చిదుక ;
పెనుసాగరము దాఁటఁబెట్టె దాడిని; గొట్టె
ప్రల్లదు పౌండ్రకవాసుదేవు;

గీ. తోయములు సొచ్చి సోమకుఁ ద్రుంచినాఁడు
దంచినాఁడు జరాసంధుదండిపౌఁజు;
లిందిరంగూడి నిజదాసు లిచ్చ మెచ్చ
మించినాఁడు శేషాద్రిపై మేటివేల్పు. 4

గోకులంలో బాలుడై యున్ననాడే ఈ స్వామి ఇంద్రాది దేవతల యెదుట గోవర్ధనగిరిని వ్రేలితో నెత్తినాడు. రక్కసులను పరిమార్చి విజయశంఖము పూరించి నాడు. హిరణ్యకశిపుని చెండాడి అతని మెదడును చందనముగా ఒడలికి పూసి కొన్నాడు. చాణూర ముష్టికాదులైన మల్లురను పరాజితుల గావించి సంహరించి నాడు. చక్రధారియై కాలనేమిని కాలునిపురి కంపినాడు. కాళియుని మెడలు చితుకునట్లు తాండవ మాడినాడు. విశాలమైన సముద్రము దాటి పోవునట్లు మహాసంరంభముతో లంకపై దాడిచేసినాడు. దుండగీడగు పౌండ్రక వాసుదేవుని తరుమ గొట్టి నాడు. (లేదా రామావతారములో సముద్రముదాటగా లంకపై దాడిచేసినాడు.) సాగరములో మీనరూపుడై ప్రవేశించి సోమకాసురుని చంపినాడు. జరాసంధుని విస్తృత సైన్యమును నేలగూల్చినాడు. నేడు లక్ష్మీసమేతుడై వేంకటగిరి శిఖరముపై విలసిల్లుచు దాసులు కోరినవరములు ప్రసాదించుచు సర్వోత్కృష్టుడై విరాజిల్లుతున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మిన్ను నేల మోచె నదె | 37 | 208 | 15 | 139 |

అవ: క్షీరసాగర మథన వృత్తాంత వ్యాజముతో దేవతాంతరముల కంటె శ్రీనివాసుని ఆధిక్యమును కొనియాడుచున్నాడు.

సీ. **మోవఁజాలక సురల్ మూలుగ మందరగిరి**
**మోచితెచ్చినదొర మురహరుండె**
**వేవేగ జలధిలో వేయఁ గ్రుంగినకొండ**
**కమఠమై యెత్తిన ఘనుఁడు శౌరి**
**తనబంటు వాసుకి తరిత్రాడు గావించి**
**ఆధారమై నిల్చినతఁడె చక్రి**
**దనుజులు దేవతల్ త్రచ్చి త్రచ్చి యలయ**
**వెనుక నంతయుఁ ద్రచ్చు విష్ణు వితఁడె**
**హరుఁ గంచముగఁజేసి గరళమ్ము గబళించి**
**నీలవర్ణుండైన నేత యితఁడె;**
**తనయిచ్చ నమృతమ్ము ననిమిషులకు నెల్లఁ**
**బంచిపెట్టిన కృపాపరుఁ డితండె;**

గీ. **నెమకి కౌస్తుభరత్నమ్ము కమలఁ గొన్న**
**వాఁ డితఁడె వేంకటాచలవాసుఁ డితఁడె**
**నితనియాజ్ఞఁ బ్రవర్తిల్లు నెల్లజగము;**
**లెవ్వరివశంబు మంగేశు నితనిఁ బొగడ ?** **5**

పూర్వము దేవదానవులు అమృతము కొఱకై పాలవెల్లి మథించిరి. అప్పుడు దేవతలు మందరాద్రిని మోవలేక మూలుగుచుండగా శ్రీమహావిష్ణువు ఆ పర్వతమును మోసితెచ్చి సాగరమున బెట్టెను. పెట్టినదే తడవుగా అది సముద్రములోనికి క్రుంగినది. అంతట కూర్మరూపుడై ఆ దేవుడే కొండనెత్తి నిలబెట్టెను. తన దాసుడగు వాసుకిని కవ్వపుత్రాడు గావించెను. తాను పర్వతమునకు కుదురై యుండెను. సురాసురులు తమ శక్తికొలది పాలకడలి చిలికిచిలికి అలసిపోయిరి. తుదకు ఆ పరమ పురుషుడే అమృతోద్భవ పర్యంతము అబ్ధిని చిలికెను. అందు కాలకూటవిషము ఉప్పతిల్లినది. శివుని పాత్రముగా చేసికొని కేశవుడే ఆ గరళమును కబళించి నీలవర్ణు డాయెను. పిమ్మట మోహినీ రూపముతో వేల్పులందరికీ తనకు తోచినట్లు అమృతమును పంచి పెట్టిన కృపాపరు డీతడే. తదుపరి క్షీరవారాశిలో పొడమిన కౌస్తుభమును, కమలాదేవిని గ్రహించిన వాడు కూడా ఈ దేవుడే. లోకమంతయు ఈతని ఆజ్ఞచే ప్రవర్తిల్లుచున్నది. అలమేలు మంగాపతి యగు ఇతనిని కొనియాడ నెవరితరము?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| లేరా దేవతలూ | 42 | 237 | 15 | 158 |

అవ: ఎందరో దేవతలు, ఎందరో లావరు లున్నా అందరి కంటె శ్రీనివాసుడే ఘనుడని తనివోక నుతించుచున్నాడు.

**సీ. దుర్వాసుఁ దఖిమంగ దురుసుగఁ జక్రంబు**
**కింకరుచేఁ బ్రతికించె నెవఁడు;**
**బాణాసురునిఁ జెండి భంగపడన్ వీడి**
**భస్మాసురు నడంచెఁ బ్రథితుఁ డెవఁడు;**
**బాణమై త్రిపురముల్ భస్మమ్ము గావించి**
**ప్రాణుల నే కృపాపరుఁడు గాచె;**
**నీశ్వరుఁ బూజించ నెంచు నర్జుననకుఁ**
**బాదమ్ము సాచె నే పావనుండు**

**గీ. ఎవని మహిమ మార్కండేయుఁ డెంచి పరమ**
**దైవతమ్మని వాదించి పట్టి కొలిచె;**
**హరుని శిరమెక్కె నెవ్వని యంఘ్రితోయ**
**మతని భజియింతు నారాయణాద్రి నాథు.** 6

భక్తుడగు అంబరీషుని పరిరక్షించుటకై విష్ణుమూర్తి దుర్వాసునిపై సుదర్శన చక్రము ప్రయోగించెను. పిమ్మట ఆ భక్తుని చేతనే శరణాగతుడైన ఆ మునికి రక్షణ కల్పించెను. సంగ్రామములో బలిచక్రవర్తి కొడుకైన బాణాసురుని వేయి బాహువులు ఖండించి భంగపరచి అతనిని ప్రాణములతో వదలిపెట్టెను. అట్లే భస్మాసురుని బుగ్గిచేసినవాడు ఆ దేవుడే. బాణరూపుడై పురములు మూడింటిని దగ్ధమొనర్చి దయామయుడగు ఆ పరమాత్ముడు ప్రాణులను కాపాడెను. అర్జును డొక సారి ఈశ్వరుని పూజించ వాంఛింపగా పావనచరితుడగు ఆ దేవుడు తన పాదము సాచి పూజించు మనెను.

మార్కండేయుడు ఆ దేవోత్తముని మహిమను భావించి అతడే మోక్షప్రదాత యగు పరమ దైవతమని వాదించి సేవించెను. ఆ దేవుని పాదమున జనించిన గంగ శివుని శిరమెక్కెను. అట్టి నారాయణగిరి నాథుడైన శ్రీవేంకటేశ్వరుని కొలిచెదను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| లేరా దేవతలూ | 42 | 237 | 15 | 158 |

అవ: సనకాది మునులు ఏ దేవుని సేవించి తరించిరో ఆ దేవుని వ్రతముగా కీర్తింతు ననుచున్నాడు.

సీ. **సనకాదిమౌను లే సర్వేశుఁ గొలిచిరి**
**యనిశమ్ము శుకుఁ డే మహాత్ముఁ దలఁచె**
**మును ధ్రువుం డే జగజ్జనకుని నుతియించె**
**నారదుం డెవని నోరారఁ బొగడె;**
**ఎలమి విభీషణుం డే దేవు శరణనె**
**తలఁచె గాంగేయుఁ డే దైవతమును**
**భక్తుఁడౌ ప్రహ్లాదు ప్రాణేశుఁ డెవ్వండు**
**పుడమి వసిష్ఠుఁ డే మూర్తిఁ దెలిసె**

గీ. **పుణ్యతముఁడైన వ్యాసుఁ డే పురుషుఁ జెప్పె**
**పాండుసుత మధ్యమునకు నెవ్వండు దిక్కు ?**
**ఎవఁడు మంగావిభుఁడొ వేంకటేశుఁ డెవఁడొ**
**యతనిఁ బాడెద నదియ నా వ్రతము సతము.** **7**

సనకుడు, సనందనుడు మున్నగు మునీంద్రులు ఆ సర్వేశ్వరునే సేవించిరి. శుకయోగి ఎల్లవేళల ఆ మహానుభావునే తలచుచుండెను. పూర్వము ధ్రువుడు ఆ జగత్పితనే వినుతించెను. నారద మునీంద్రుడు నోరార ఆయననే కీర్తించుచున్నాడు. విభీషణుడు ప్రీతితో ఆ దేవునే శరణు జొచ్చెను. భీష్ముడు ఆ దైవమునే స్మరించెను. భక్తుడైన ప్రహ్లాదునకు ఆ దేవుడే ప్రాణనాథుడు. వసిష్ఠ మునీంద్రుడు ఆ దేవుని దివ్యమూర్తినే గుర్తెఱింగెను.

పుణ్యమూర్తి యైన వ్యాసమౌని ఆ పరమపురుషుని మహిమనే వేయి విధముల విస్తరించి చెప్పెను; అర్జునునకు శరణ్య మైనవాడు ఆ దేవుడే. అలమేల్మంగా పతియగు ఆ శ్రీవేంకటేశ్వరుని నేను కొనియాడెదను. ఇదియే నా నిత్య నియమము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అతనిఁ బాడెదను | 70 | 404 | 15 | 272 |

అవ: ఇంతకాలము భగవత్సేవకు నోచుకొనక తన జీవితము వ్యర్థమైనదని వాపోవుచు కడకు శ్రీనివాసుని కృపచే కడతేరితి ననుచున్నాడు.

సీ. **ఆవుల బాలుండవై కాచుతతిని కా**
**తువుగాదె నే చిన్నిదూడనైన**
**విటుఁడవై వ్రేపల్లె విహరించునాఁడు కూ**
**డెదవుగా నే గొల్లసుదతినైన**
**రాయి అప్పయు నైన రామావతారంపు**
**వేళ నన్ బ్రోతుగా కాలుమోపి**
**వాలిసుగ్రీవులవద్ద క్రోఁతిగ నున్న**
**పనిగొని న న్నేలుకొనెదు గాదె**
**కమఠమీనాకృతుల్ గైకొన్న యదన నన్**
**సాకుదుగా జలజంతు వైన**

గీ. **అప్పు డేమయి యుంటినో యకట ! నీదు**
**లెంకనై యున్న కరుణఁ బాలింతుగాదె ?**
**యిప్పు డీ రీతి నేలితి వృషగిరీశ !**
**మోరత్రోపుల నిన్నాళ్ళు మోసపోతి.** 8

దేవా! నీ వా నాడు గోకులములో గోపబాలుడవై ఆవుల గాచితివి. ఆ సమయమున నే నొక చిన్నిదూడనై యుండినచో నన్ను కాపాడి యుందువు గదా! విటుడవై వ్రేపల్లెలో విహరించితివి. అత్తరి నేనొక గొల్లెతనై యుండినచో నన్ను కూడి యుందువుగదా! నీ రామావతార సమయమున నేనొక రాయిగనో, అప్పగనో ఉన్నచో నామీద కాలుమోపి నన్ను కృతార్థుని కావించి యుందువుగదా! (అహల్యా శాపవిమోచనము స్మరణీయము.) ఆ కాలముననే వాలి సుగ్రీవుల చెంత నేనొక వానరుడనై యున్నచో నాచేత పనులు చేయించుకొని అనుగ్రహించి యుందువు గదా! నీవు మత్స్యముగనో, కూర్మముగనో అవతరించిన వేళ నేను కూడా ఒక జలజంతువునై యుండినచో నన్ను సాకి యుందువు గదా! కాని ఆయా కాలములలో నే నేమై యుండినానో యెఱుగను. ఎపుడైన నీకు దాసుడనై యుండినచో నీవు దయతో అప్పుడే పాలించి యుందువు గదా! తుదకు ఈ కలిలో శ్రీవేంకటేశ్వరుడవై వెలసిన నిన్ను కొలుచు భాగ్యము నా కబ్బినది. నన్ను నేటికి పరిరక్షించితివి. ఇంతదనుక చేసిన దుష్కర్మముల వల్ల గల్గిన మోరత్రోపులతో వంచితుడ నైతిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అయ్యో యేమరినే | 1 | 6 | 15 | 4 |

అవ: ఇతర కైంకర్యములతో భగవంతుని మెప్పించు శక్తి తనకు చాలదని చెప్పుచు శరణాగతుడగు తన్ను రక్షింపు మనుచున్నాడు.

**సీ. పెనువార్ధిదాఁటి మెప్పింప మారుతి గాను;**
**చవుల మెప్పించంగ శబరి గాను;**
**జనకుఁడఁగాను సీతనొసంగి మెప్పించ;**
**రతుల మెప్పించ గొల్లెతను గాను;**
**నిను మోచి మెప్పింప వినతాసుతుఁడఁగాను;**
**పొగడి మెప్పించంగ భోగిగాను;**
**పాడి మెచ్చింప నవ్వల నారదుఁడఁ గాను;**
**ప్రాణాల మెప్పించఁ బక్షిగాను;**

**గీ. నేను నీ సేవకుండను; నీదు శరణుఁ**
**జొచ్చితిని; నిన్ను మెప్పించు చొప్పెఱుంగ**
**నెట్లు రక్షింతువో రామకృష్ణరూప !**
**పన్నగధరాధరావాస ! భవవినాశ !** **9**

స్వామీ! విశాల సాగరమును లంఘించి నిన్ను మెప్పించుటకు నేను వాయు పుత్రుడను గాను. పలుతెఱగులైన ఫలరసములతో మెప్పించుటకు నేను శబరిని గాను. సీతను వధువుగా సమర్పించి మెప్పించుటకు నేను జనక మహా రాజును గాను. కామసుఖములచే మెప్పించుటకు నేను గొల్లభామను గాను. వాహనమై నిన్ను మోసి మెప్పించుటకు నేను గరుత్మంతుడను గాను. స్తుతించి మెప్పించు టకు నేను ఆదిశేషుడను గాను. గానముతో మెప్పించుటకు నేను నారదమహర్షిని గాను. ప్రాణముల నొడ్డి మెప్పించుటకు నేను జటాయువును గాను. నేను కేవలము నీ సేవకుడను. నీకు శరణాగతుడను. నిన్ను మెప్పించు పద్ధతి తెలియని వాడను.

శ్రీరామకృష్ణావతారా! శేషశైలనివాసా! సంసారవినాశకా! నీవు నన్నెట్లు కాపాడెదవో గదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| రామరామ రామకృష్ణ | 4 | 26 | 15 | 17 |

4

అవ: భగవానుని సంకల్పము అప్రతిహతము– అత దేమనుకొన్న అదే జరిగితీరు ననుచున్నాడు.

సీ. **బ్రతుకుమంటివొ లేదొ బ్రతికె పరీక్షిత్తు;**
**నారాయణాస్త్రమ్ము నడుమ నాఁగె;**
**కమ్మన్నచో బాలు గావె సాగరములు;**
**హితవైన నీకగు నెట్టిపనులు;**
**బ్రహ్మమాయకు నీవు ప్రతిమాయ సేయవా ?**
**కమ్మన్న చీర లక్షయము గావె ?**
**కులగిరుల్ క్రుంగవే క్రుంగు మటన్న ? నీ**
**కేపని వలసిన నిట్టె యగును;**

గీ. **కర్మమని మమ్ము మాయలఁ గప్పెదీవు**
**కర్మధర్మమ్ము లివి భవత్కల్పితములు;**
**పట్టి నీవు దలంచిన పనులు జరుగు**
**నిట్టె నను దయ నేలుమీ వృషగిరీశ !** **10**

బ్రహ్మశిరోనామకాస్త్రముచే ప్రతిహతుడైన పరీక్షిత్తును దేవా ! నీవు బ్రతుకు మంటివి. అతడు బ్రతికెను. అట్లే భారతసంగ్రామమున మారులేనిదై విజృంభించు నారాయణాస్త్రమును నడుమనే ఆపితివి. నీ యానమేరకు సముద్రములే బండబారినవి. నీ కిష్టమైనచో ఎట్టి పనులైనను చేయుటకు నీవు సమర్థుడవు. బ్రహ్మదేవుడు పన్నిన మాయకు నీవు ప్రతిమాయ కల్పించి గోవత్సాదులను సృష్టించితివి. నిండు సభలో అవమానితయైన ద్రుపదపుత్రికి చీర లక్షయము కమ్మంటివి. నీ యాదేశమున కులపర్వతములే క్రుంగిపోయినవి. నీకు కాని పని యేమున్నది ? నీవు సమస్త జీవకోటికి కర్మములు కల్పించి వారిని మాయతో కప్పినావు. ఈ కర్మధర్మము లన్నియు నీవు కల్పించినవే గదా ! నీ సంకల్పము నిరుపహతముగా కొనసాగును. శ్రీవేంకటేశ్వరా ! నన్ను దయతో పాలింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కర్మమంటామాకు | 2 | 8 | 15 | 6 |

అప: జీవుడు సర్వశక్తి సంపన్ను డైన దేవుని కొలిచియే తరింపవలె నను చున్నాడు.

**సీ. మ్రొక్కిన దీక్షను మొదలి తప్పు లటంచు**
**మ్రొక్కుదు నీపాదములకు భక్తి;**
**చెప్పినఁ బాయును జేసిన యఘమంచుఁ**
**జెప్పుదు నా దుష్టచేష్ట లెల్లఁ;**
**జిక్కినవారిపైఁ జెలఁగు సత్కృప యంచుఁ**
**జిక్కుదు నిట్లు నీ చేతి కేను**
**ఎప్పుడు చనవరి యెంగిలి దినఁగ చి**
**ప్పిలు ప్రసాదమని భావింతు నేను**

**గీ. చేరి పతిని భజింప రక్షించు నంచుఁ**
**గోరి నీ ముద్రలు ధరించి కొలుచుచుందు;**
**నీవె ఘనుఁడవు; నేనెంత ? నీచు నన్నుఁ**
**గాచు టెన్నిక నీకు మంగాకళత్ర !** **11**

దేవా! నీవు అందరి మ్రొక్కులు అందుకొన దగిన వాడవు. నీకు మ్రొక్కిన వారి పాపము లన్నియు పటాపంచలగును. కాన నీ చరణములకు భక్తితో ప్రణమిల్లుదును.

చేసిన పాపము చెప్పికొన్నచో తీరును కనుక నా దుష్కృత్యము లన్నియు నీ ముందుంచు కొనుచున్నాను. నీ కధీనుడైన వానిపై నీ దయ ప్రసరించును గాన నేను నీకు స్వాధీనుడనైతిని. చనవు గలవాడు స్వామి యెంగిలి తిన్నచో అతని అనుగ్రహమునకు పాత్రుడగును. కావున నేను నీ ప్రసాదముపై బ్రదుకు చున్నాను. తన్ను భజించు సేవకుని యజమానుడు రక్షించును. కాన నేను నీ శంఖ చక్ర ముద్రలు ఒడల దాల్చి నిన్ను కొలుచుచున్నాను. మంగాపతీ! నీవు ఘనుడవు; నే నల్పుడను. నన్ను రక్షించుటే నీ ఘనతకు నిదర్శనము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీవే ఘనుఁడవు | 1 | 2 | 15 | 2 |

అవ: జీవులు దేవునివారు. దేవు దందఅకు అంతర్యామి. కాన జీవులను గాచుట దేవుని కర్తవ్య మనుచున్నాడు.

సీ. **ధర విభీషణుఁడు మీ తలివంకవాఁడె ? జ**
**నకు వంకవాఁడె ఘంటాశ్రవుండు ?**
**ఆలి పార్శ్వమువాఁడె యల ధ్రువుం ? డవ్వారి**
**నాదరించితి శరణన్నమాత్ర;**
**మున్నిటి శబరి నీ మునిమన్మరాలటే ?**
**మఱి యుద్ధవుఁడు మేనమామ యేమి ?**
**ఉడుత నీకుఁ దలంప విడరానిచుట్టమా ?**
**కడఁక వీరల నెల్లఁ గాచినావు;**

ఆ. **కూతురా యహల్య? కొమరుఁడా యక్రూరుఁ ?**
**దఖిలవరము లందినట్టివారు**
**నీకు తాతలయ్య? నే మన్యులమటయ్య ?**
**యేలుకొందుగాక యిట్లె మమ్ము.** **12**

స్వామీ! విభీషణుని రక్షించితివి. అతడు నీ తల్లివంకవాడు కాడుగదా! ఘంటా కర్ణుని కాపాడితివి. అతడు నీ తండ్రివంక వాడు కాడుగదా! ధ్రువుని అనుగ్రహించితివి. అతడు నీ భార్య తట్టువాడు కాడుగదా! శరణన్న మాత్రమున వారినెల్ల ఆదరించితివి. శబరిని దయ చూచితివి. ఆ బోయత నీ మునిమనుమ రాలు కాదుగదా! ఉద్ధవుని ఉద్ధరించితివి. అతడు నీకు మేనమామ కాడుగదా! ఉడుతను కడతేర్చితివి. అది నీకు పాయరాని చుట్టము కాదుగదా! వీరి నందరినీ పూనికతో రక్షించినావు. అహల్య నీకు కూతురు కాదుగదా ! అక్రూరుడు నీకు కొమరుడు కాడుగదా ! నీచే వరములు వడసిన వారెల్లరూ నీకు తాతలా యేమి? మేము మాత్రము నీకు కానివారమా? వారిని కాచినట్లే మమ్మును కాపాడువుఁ.

"సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః" అన్నట్లు భగవంతుని దృష్టిలో అందరు సమానులే. శరణన్న వారినెల్ల అతడు కరుణించు నని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నేము నీ కన్యులమా | 3 | 19 | 15 | 13 |

అవ: అల్పుడు, శరణాగతుడు అగు తన్ను రక్షింపవలసినవాడు ఏలికయగు శ్రీనివాసుడే యనుచున్నాడు.

సీ. పసు లే మెఱుంగును ? పట్టి మేపునువేసి
 దెసలఁ బనులొసేయ దిద్దుకొంద్రు;
వసుధ న న్నటువంటివానిని దెచ్చి మీ
 సేవకు మెదిపి రక్షించుకొనవె
బిడ్డ లేమీయగాఁ బ్రేమతోఁ గడుపారఁ
 జన్నిచ్చి పెంచును కన్నతల్లి ?
ఎడ్డె నీ కెందుకు నేఁ గొఱగాకున్న
 జ్ఞాన మొసంగి నన్ గావఁ గదవె !

గీ. ఎంతవారు బానిస ? లొరు లెవ్వ రేని
తడవిన వహించుకొని యడ్డుపడఁగ వత్తు;
నేను నీ దాసుఁడను వేంకటేశ ! నీవు
పూన్కిమెయివచ్చి ననుఁ గృపఁ బ్రోవరాదె ! 13

తిర్యగ్జంతువు లైన పశువులు విజ్ఞత గలవి కావు. యజమానులు వాటిని పట్టి కట్టి మేపువేసి తమ పనులలో ఉపయోగపడునట్లు చేసికొందురు. నేనును పసరము వంటి వాడనే. జ్ఞాన విజ్ఞానము లెఱుంగను. దేవా! అట్టి నన్ను మీ సేవకు వినియోగపడునట్లు తీర్చిదిద్దుకొనుము. పసిబిడ్డలు అన్నివిధములా అశక్తులు. వారేమియు ఈయలేరు. అయినను కన్నతల్లి వారిని చేరదీసి బుజ్జగించి కడుపార చన్ను గుడిపి పెంచుచున్నది. నేనును ఆ పసిబిడ్డవలె ఎందుకూ కొర గాని వాడనే. అయినను నాకు ఒకింత జ్ఞాన మొసగి కాపాడుము. బానిస లన్ని విధములా అధములే. వారికి ఇతరుల వల్ల చిక్కులు తటస్థించినచో యజమానులు వారి పక్షము వహించి సంరక్షించెదరు. శ్రీవేంకటేశ్వరా! అధముడ నైననూ నేను నీ దాసుడను. నాకై పూనుకొని వచ్చి నన్ను (ఇంద్రియాదుల బారినుండి తప్పించి) కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏలినవారికిఁ బోదు | 6 | 33 | 15 | 22 |

అవ: అవ్యాజ కరుణామయుడు, సహజ వాత్సల్యైక జలధియగు శ్రీవేంకటేశ్వ
రుని తన్ను కాపాడుమని వేడుచున్నాడు.

సీ. ఎవ్వరు సెప్పగా నిల యపాండవ మను
పలుకును వఱదలోఁ గలిపినావు ?
ఏ రీతి వేఁడ లంకారాజ్య మిచ్చితి
విమతానుజునకు విభీషణునకు ?
రమ్మని యెవరు కోరఁగ వచ్చి మునిపత్ని
శాపమ్ము పదధూళిఁ బాపినావు ?
దొమ్మికయ్యమ్ములోఁ దూఱి గాంగేయుపై
నెవరిప్రార్థనఁ జక్ర మెత్తినావు ?

గీ. ఎవరు బోధింప సంకుతో నిట్టి చెక్కు
లంటి బాలున కిడితి వెత్తైన పదవి;
మీరు గావించు పనులకు మిష గలుగదు
నీసహజవత్సలత్వంబు నెఱపు మయ్య ! 14

స్వామీ! తొల్లి అశ్వత్థామ అపాండవ మగుగాక ! అని ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రమును వ్యర్థము గావించితివి. అట్లు చేయుమని నిన్నెవ్వరూ కోరలేదుగదా! వైరితమ్ముడగు విభీషణుని లంకకు రాజుగా అభిషేకించితివి. అతడు తనకా పదవి నిమ్మని నిన్ను వేడ లేదు గదా! అహల్యా శాపమును పద ధూళితో పరిహరించితివి. అట్లు సల్పుమని నిన్నెవ్వరూ అర్థించ లేదుగదా! పార్థుని గాచుటకు ఘోరమగు సంకుల సమరములో అవక్ర విక్రముడగు భీష్ముని మీదికి చక్రముతో నురికితివి. అతడు నిన్నందుకు ప్రార్థింప లేదుగదా! జ్ఞాన దాయక మగు శంఖముతో చెక్కిలి స్పృశించి ధ్రువుని సమున్నత స్థానములో నిల్పితివి. ఇట్లొనర్పుమని అర్థించిన వారెవ్వరూ లేరుగదా! దేవా ! నీవు నిర్వ్యాజ కరుణామయుడవు. ఏ హేతువు లేకుండగనే ఎవరి నెట్లు కాపాడ వలెనో వారినట్లు కాపాడెదవు. అట్టి నీవు నీ సహజ వాత్సల్యము నాపై ప్రసరింప జేయుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మీరు సేసేపనులకు | 6 | 34 | 15 | 23 |

అవ: కర్తవ్యము విస్మరించి, అకార్యములలో జొచ్చుచున్న తన్ను మంచిదారికి మరలింపు మని భగవంతుని ప్రార్థించుచున్నాడు.

సీ. మఱవ నాహారంబు; మఱవ సంసార సౌ
ఖ్యమ్ము; నింద్రియపుభోగమ్ము మఱవ;
మఱచెద జ్ఞానమ్ము; మఱచెద గురువును,
తత్త్వరహస్యమ్ము, దైవతమును;
విడువను పాపంబు; విడువను పుణ్యంబు
విడువ దుర్గుణములు; విడువ నాస;
విడుతు షట్కర్మముల్; విడుతు వైరాగ్యంబు;
విడుతు న్సాచారమ్ము; విడుతు నియతి;

గీ. తగిలెదను లంపటమ్ములఁ; దగిలెద బహు
బంధములఁ గాని నిర్వాణపథముఁ దగుల;
నేమిమాయయొ నరజన్మ మెత్తి యేమి ?
శ్రీశ ! నిను నమ్మినాఁడ నీ చిత్త మింక. **15**

శ్రీవేంకటేశ్వరా! నేను ఆహారమును విస్మరింపను. సంసారసుఖమును మఱవను. ఇంద్రియభోగమును విసర్జింపను. కాని జ్ఞానమును, గురువును, తత్త్వ రహస్యమును, దైవతమును మఱచెదను. పాపపుణ్యములను విడువను. దుర్గుణములను త్యజింపను. ఆశను వీడను. షట్కర్మలు (యజనము, యాజనము, అధ్యయనము, అధ్యాపనము, దానము, ప్రతిగ్రహము) విడుతును. వైరాగ్యమును, సదాచారమును, నియమములను వదలుదును. లంపటములలో తగుల్కొందును. పెక్కు బంధములలో చిక్కువడుదును. కాని నిర్వాణమార్గము ననుసరింపను. శ్రేష్ఠమైన నరజన్మ మెత్తియు కార్యాకార్యము లెఱుంగలే కున్నాను. ఇది ఎట్టి మాయాప్రభావమో ! అయినను నిన్ను నమ్ముకొని యున్నాను. ఇక నీ చిత్తము; నా భాగ్యము.

| సంకీర్తన. | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎక్కడి మానుషజన్మం | 7 | 38 | 15 | 25 |

అవ: [illegible]ప్తికై ప్రయత్నింపక మాయానిబద్ధులైన జీవులను బ్రోచు [illegible]ము శ్రీవేంకటేశ్వరునివే [illegible]నుచున్నాడు.

సీ. తల్లిచంక శిశువు తమిఁ జన్నుద్రావుచుఁ
ద న్నెత్తుకొనఁగోరు తండ్రి నొల్లఁ ;
డటువలె నీమాయ నాస్వదించెదు మేము
చేరఁజాలము మిమ్ము సేవఁ జేసి;
రెక్కలమఱుఁగున నక్కియుండెడు పక్కి
యెక్కదు మేడల నెదుటనున్న ;
జన్మమెత్తిన ప్రపంచపుజీవులము మేము
కోరంగఁ బోము వైకుంఠపురము

ఆ. నీటనుండు కప్ప నీటనుండునె గాని
పవ్వళింపఁ జనదు పాన్పుమీఁద;
పటుతర భవపాశ బద్ధజీవుల మయ్య !
బుద్ధిఁ జెప్పి మమ్ముఁ బ్రోవుమయ్య ! 16

శ్రీనివాసా ! తల్లిచంక నెక్కిన పసిబిడ్డడు మిక్కిలి ఆసక్తితో స్తన్యము గ్రోలుచుండును. అప్పు డతడు తన్నెత్తుకొనగోరు తండ్రివద్దకు పోడు. అట్లే మేము నీ మాయను చవిచూచుచుంటిమి. సేవతో మిమ్ము చేరలే కుంటిమి.

రెక్కలమాటున దాగిన పక్షిపిల్ల ఎట్టయెదుటనే ఎత్తైన మేడ లున్నను వాటి నెక్కుటకు వెళ్లదు.

అట్లే ఈ ప్రపంచములో జన్మమెత్తిన జీవులము మేము. మేము నీ నెలవగు వైకుంఠధామమును వాంఛింపలేము. నీటిలోని కప్ప నీటనే పడియుండు నుగాని ఏనాటికిని మెత్తని పాన్పుపై శయనింపబోదు. దృఢమైన సంసారపాశము లచే బద్ధులమైన జీవులము మేము. ముక్తిపథము చేరజాలకున్నాము. దేవా! ఇట్టి మాకు బుద్ధిగఱపి మమ్ము కాపాడును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇదివో మా యజ్ఞాన | 6 | 35 | 15 | 23 |

అవ: కర్మధర్మమార్గములకన్న శరణాగతియే మిన్న యనుచున్నాడు.

**సీ. కర్మాచరణఁగాని కలుగ వీవనఁ గరి**
**కర్మ మే మొనరింపఁ గాచినావు ?**
**స్థిరతపమ్మునఁ గాని సిద్ధింప వన నజా**
**మిళుఁ డెట్టితపములు సలిపినాఁడు ?**
**వేదపఠనఁ గాని వెదక రాదన నినున్,**
**వేదవేత్తయె నీచవిధి గుహుండు ?**
**మతనిష్ఠఁ గాని నిన్ మతి కనరాదన్న**
**నే మతస్థుఁడు పిశాచేశ్వరుండు ?**

**గీ. నిన్ను వర్ణాశ్రమాచార నియతిఁ గాని**
**పడయ రాదన వాల్మీకివర్ణ మేది ?**
**పరమపూరుష ! తావక పరికరంబు**
**నీ శరణుఁ జొచ్చి నిను మెచ్చి నిత్యు లైరి.** **17**

పరమపురుషా ! కర్మము లొనరించిననే నీవు సాక్షాత్కరింతు వనుట సరిగాదు. నాడు మూఢయోని జన్మించిన గజేంద్రుడు ఏ కర్మ మాచరింపగా వానిని కాపాడితివి ? తీవ్రమైన తపశ్చర్యచేతనే నీవు సిద్ధింతు వనుటయు చెల్లనిమాట. దురాచారపరుడైన అజామిళుడు ఎట్టితపము సల్పి నీ యనుగ్రహము పడసినాడు? వేదాధ్యయనముచేత మాత్రమే నిన్ను వెదకవచ్చు ననుటయు కల్ల. ఉత్తమవిధు లెఱుంగని గుహుడు ఏ వేదము పఠించి నీ కరుణ చూఱగొనినాడు? మతనిష్ఠచేత మాత్రమే నిన్ను కనుగొనవచ్చు ననుటయు నిక్కము గాదు. పిశాచపతియైన ఘంటాకర్ణుడు ఏ మతము నాశ్రయించి నీ దయకు పాత్రుడైనాడు ? వర్ణాశ్రమ నియమములచే మాత్రమే నిన్ను బడయవచ్చుననుటయు సత్యదూరమే. వాల్మీకి ఏ వర్ణనియమము పాటించి నిన్ను కనుగొన జాలినాడు ? గజేంద్రాదు లందరు కేవలము నీకు శరణాగతులై నిన్ను మెప్పించి ముక్తు లైరి.

కావున శరణాగతియే ఎల్లవిధముల పరమధర్మమని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| శరణాగతి నే యెంచఁగ | 7 | 31 | 15 | 21 |

అవ: ప్రతికూలురైనవారినిగూడ పరిరక్షించుటలో పేరెన్నికగన్న భగవానుడు అనుకూలురను అనుగ్రహించుటలో వింతలేదనుచున్నాడు.

సీ. తిట్టు చైద్యున కిచ్చితివి దివ్యపదము నిన్
భూషించు వారికి మోక్ష మీవె ?
బండి రొప్పించిన పార్థునిఁ గాచితి
కావకుందుదువె కింకరుల నీవు ?
తన్నిన భృగుమౌని మన్ననఁ గంటి పూ
జించువారల నాదరించ వటవె ?
కరుణించితివి నిన్నుఁ గఱచిన కాళియుఁ
గొలుచువారలఁ గృపఁ దలఁప వటవె ?

ఆ. అమ్ము మొనకుఁ జిక్కినట్టి యంబుధిమొఱ
నాలకించినాఁడ; వాశ్రితాళి
విన్నపములు వినవె ? వేంకటేశ ! ప్రపన్న
జనుల పాలనంబు సలుప వటవె ?. 18

శ్రీవేంకటేశ్వరా! నిన్ను దూషించిన శిశుపాలునకు నీవు దివ్యపదము ననుగ్రహించితివి. ఇక నిన్ను భూషించువారికి ముక్తి నిత్తు వనుటలో సందేహ మేల ? రథమునకు సారథి గావించి నిన్ను శ్రమపెట్టిన అర్జునునే పరిరక్షించితివి. మఱి నీకు కైంకర్య మొనర్చు దాసులను నీవు కాపాడ కుందువా? నీ శాంతగుణ మును పరీక్షింప నెంచి ని న్నెదపై తన్నిన భృగుమహర్షిని మన్ననతో జూచితివి. అట్టి తరి నిన్ను పూజించువారల నాదరింప కుందువా ? నిన్ను బంధించి కాటువేసి కష్టపెట్టిన కాళియఫణిని కాచి బ్రోచితివి. అట్టిచో నీ సేవాపరులను కృపజూడ కుందువా ? లంకకు పయనించుటకై తెరు వొసగని సముద్రునిపై శరము సంధించితివి. అతడు కుయ్యో మొఱ్ఱో యనగా కాపాడితివి. మఱి సదా నిన్నే ఆశ్రయించిన దాసుల విన్నపములను విని మన్నింప కుందువా ? నీవు శరణాగతులను సంరక్షించుటలో సిద్ధహస్తుడవు గదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అతిసులభుడవు నీవని | 17 | 95 | 15 | 63 |

అవ: భగవత్సేవావిముఖులకు తిప్పలు తప్ప వనుచున్నాడు.

సీ. **తొలి నిన్నుఁ గొలువని ద్రోహమ్మునవె గదా**
**పెక్కుయోనులఁ బ్రభవింపవలసె**
**వరనామ ముచ్చరింపని ద్రోహముననెగా**
**దురిత సంసారాబ్ధిఁ దోఁగ వలసె**
**భక్తి నెన్నఁడు నుతింపని ద్రోహముననెగా**
**విషయబద్ధుండనై వేగ వలసె**
**అలరి పూజింపని యా ద్రోహముననెగా**
**చెనఁటి కర్మపువలఁ జిక్క వలసె**

గీ. **ఆత్మ నమ్మనియట్టి ద్రోహమునఁ గాదె**
**చెలఁగుమాయకు వశుఁడఁ గావలసివచ్చె**
**సర్వవిధముల ద్రోహినై యుర్వి నీకు**
**వేంకటాద్రీశ ! యిటు మొఱ వెట్టవలసె.** **19**

వేంకటాద్రినాథా ! నిన్ను పూర్వము సేవింప నైతిని. అది ద్రోహమై నన్ను చుట్టుకొన్నది. అందుచే నానాయోనుల జన్మింపవలసినవాడనయితిని. శుభప్రదమైన నీ నామమును కీర్తింపని ద్రోహముచేతనే పాపపంకిలమైన సంసార సముద్రములో పడవలసినవాడ నైతిని. భక్తితో నిన్నెప్పుడు స్తుతింప నైతిని. ఆ ద్రోహముచేతనే ఇంద్రియములచే బంధింపబడి బాధపడవలసినవాడ నైతిని. సంతోషముతో నిన్నర్చింపని ద్రోహముచేతనే తుచ్ఛమైన కర్మజాలములో చిక్కు పడవలసినవాడ నైతిని. హృదయములో నిన్ను విశ్వసింపని ద్రోహమునకు ఫలముగా చెలరేగు మాయకు అధీనుడ కావలసి వచ్చినది. ఈ రీతిని పలుతెఱగుల నీ యెడల ద్రోహ మాచరించి ఈ జన్మములో ఇప్పుడు నీ కిట్లు మొఱపెట్టుకోవలసి వచ్చినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ముంద రికేది తెరువు | 18 | 99 | 15 | 66 |

అవ: శరణాగతుడైన భక్తుడు మాత్రమే ద్వంద్వాతీతుడై మాయను జయించు ననుచున్నాడు.

సీ. **కలిమి యొక్కనికిని కడు లేమి యొకనికి**
**నిందఱు జీవులే- యేలవచ్చె ?**
**బలవంతుఁ డొక్కండు బలహీనుఁ డొక్కండు**
**మొలపించి భ్రమ మీరు ముంతు రేల ?**
**ఒకచోట రాజస మ్మొకట బంటుతనమ్ము**
**తనువులు దాల్చినంతటనె గలుగు;**
**పక పక నవ్వులు భయములు వేర్వేఱ**
**సకలజీవులమీఁదఁ జల్లుటేల ?**

గీ. **బళిబళీ ! దేవుఁడా ! బాపుబాపు మాయ !**
**మీ ప్రభావమ్మునకు మట్టు మేర లేదు;**
**శరణనినమాత్రమున సప్త శైలనాథ !**
**మాయ దొలగంగఁ బాపముల్ మట్టుపడును.** **20**

ఓ ఏడుకొండలరాయడా ! ఒకడు సంపన్నుడు. మరొకడు శుష్కదరిద్రుడు. ఇరువురు జీవులే. ఈ భేద మెందుకు వచ్చినది ? ఒకడు బలవంతుడు. వేఱొకడు దుర్బలుడు. ఈ తారతమ్యము గల్గించి ఎందుకు వీరిని భ్రాంతికి గుఱిగావించు చున్నావు ? ఒకడు ఏలిక. ఇంకొకడు వానికి బంటు. ఉభయులు శరీరధారులే. ఈ వైషమ్యము శరీరధారణతోడనే వచ్చుచున్నది కాబోలు! ఒకచో కిలకిలనవ్వులు. ఇంకొకచో భయభ్రాంతులు. జీవులలో ఇట్టి వ్యత్యాస మేలకల్గించితివి ? ఆశ్చర్య మాశ్చర్యము! అవురా! ఏమి నీమాయ! దేవా! నీ మహిమ కంతులేదు. అట్లయ్యును నిన్ను శరణుజొచ్చినమాత్రమున దుస్తరమైన నీ మాయ తొలగును. పాపములు పంచబంగాళ మగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| బళిబళి దేవుఁడా | 33 | 130 | 15 | 86 |

అవ: అకించను డగు తన్ను పరమాత్ముడే దయదలపవలె ననుచున్నాడు.

సీ. నెరసు లెంచఁగఁ బూన నీ కెదురా నేను ?
కరుణించి యొకరీతిఁ గాతుగాక
ఒరగంట బంగార మొరతురుగాని పెం
కొరసిన నందేమి గరిమగలదు ?
మనసు శోధింపంగ మంచివాఁడనె నేను ?
ఘనుఁడ వీవే నన్నుఁ గాతుగాక
పనికి వజ్రము సానఁబట్టిన మించెక్కు
పిడుక రాచిన పిప్పిపిప్పి గాదె ?

గీ. మ్రొక్కుగాఁ బ్రోతు వన్నచో మొదల నేను
జ్ఞానినా ? స్వామి ! నన్నెట్లొ గాతుగాక
యద్దముం దోమినన్ నీడ నరయవచ్చు
మోముఁ గననౌనె మూఁకుడు దోమిన్నైన ? **21**

స్వామీ! నాలోని దొసగులు ఎంతులల కెన్నెదవు ? నేను నీకు ప్రతికూలు డనా ? దయతో న న్నెట్లైన కాపాడుదువుగాక! ఒరపిడిరాయితో బంగారము నొరసి పరీక్షింతురుగాని పెంకు నొరసి పరీక్షించిన ఫలమేమి? నా చిత్తమును శోధింప నెంచితివా అన్ని అవగుణములకు ఆకరమైనవాడను. నేను మంచివాడ నెట్లగుదును ? నీవు ఘనుడవు. పెద్దమనసుతో నన్ను కాపాడుము. వజ్రమును సానబట్టినచో తళు కెక్కును. పిడుకను రాచినచో పిప్పి యగునుగదా? నిన్ను మ్రొక్కినవారినే నీవు ప్రోతు వన్నచో నేను జ్ఞానినైనగదా నీకు మ్రొక్కగలను? కాని న న్నెట్లయిన నీవే సంరక్షింప వలెను. అద్దమును శుభ్రపరచిన అందు ముఖమును చూచుకొనవచ్చును. మూకుడు నెంత శుభ్రపరచినను అందు ముఖమును చూచుకొనలేముగదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అచ్చముగా శ్రీహరింక | 29 | 167 | 15 | 111 |

అవ: హీనమానవుఁడగు తన్ను రక్షించుభారము భగవంతునిదే యనుచున్నాడు.

సీ. **మొదల నాశక్తి నిమ్ములఁ బరీక్షించి యా**
**వలఁ బ్రోతుగాకని తలఁతు వేని**
**స్వామి! అజాగళస్తనమ నశక్తుండ**
**నదియ నాకంటె మేలని వచింతు;**
**బాగుగా నాస్వరూపస్వభావమ్ముల**
**నెఱిఁగి కాచెద నంచు నెంచి తేని**
**కప్పచిప్పందునఁ గల వెండి యెంతయో**
**నాలోనఁ గల గుణజాల మంత;**

గీ. **సేవచేయంగఁ జేయంగఁ జిత్తగించి**
**పిదప నేలెద నంచు భావింతు వేని**
**మోవకయ గోపురమ్మును మోయు ప్రతిమ**
**వంటివాఁడ స్వాతంత్ర్యమ్ము వట్టిదయ్య !** **22**

దేవా! ముందుగా నాశక్తిని పరీక్షించి ఆ తరువాతనే నన్ను రక్షింపవలె నని తలంచుచుంటివా ? అట్లైనచో నేను మేకమెడచన్ను వంటివాడను. శక్తి హీనుడను. నాకంటె అజాగళస్తనమే ఎంతో మేలందును. నాస్వరూపమును స్వభావమును చక్కగా గ్రహించి ఆ పిమ్మటనే నన్ను కాపాడ నెంతువా ? అట్లైనచో ముత్తెపుచిప్పలో ఎంత వెండిగలదో నాలో అంతసుగుణసంపద గలదు. నేను నిన్ను సేవింపగా సేవింపగా నా సేవల నంగీకరించి ఆ పిదపనే నన్ను బ్రోవ నెంతువా? అట్లైనచో భారమును మోయకయే గోపురమును మోయుచున్నట్లు చెక్కబడిన శిల్పప్రతిమను బోలినవాడను.

నేను స్వతంత్రుడను గాను. కావున నీవే నన్ను కరుణింపవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీవే ననుఁ గరుణింతువు | 36 | 202 | 15 | 135 |

అవ: ఆత్మవిమర్శచేసికొనక పరులదొసగుల నెన్నరా దనుచున్నాడు.

సీ. **ఎంచ నాగుణములు మంచివై నపుడెగా**
**యెదిరినేరమ్ముల నెన్నఁ దగుదు;**
**చెలఁగి నే పాపముల్ చేయకున్నపుడెగా**
**చీయని పరుల దూషింపఁ దగుదు;**
**నా నడవడి లెస్సయైనప్పుడేగదా**
**యొరులకు బుద్ధులు గఱపఁ దగుదు;**
**వెన్నాడి యితరుల వేఁడనప్పుడుగదా**
**కడవారికి విరక్తి నుడువఁ దగుదు;**

గీ. **కామినులసంగమమ్ము నే కాదనిగద**
**వ్యసనపరులను నింద సల్పంగఁదగుదు;**
**నా బ్రదుకునెంచి లోలోన నవ్వుకొంచు**
**సిగ్గుపడి నీదుమఱుఁగుజొచ్చితిని నేఁడు.** **23**

పరమాత్మా! నేను సద్గుణములు గలవాడ నైనప్పుడే పరులదోషములను పరీక్షింప దగుదును. నాలో నెట్టిపాపకృత్యములు లేనప్పుడే ఇతరులపాపములను దూషించుటకు అర్హుడనగుదును. నా ప్రవర్తన సరిగా నున్నప్పుడే అన్యులకు నీతులు గఱప యోగ్యుడ నగుదును. నేను ఒకరిని యాచింప కున్నప్పుడే తక్కినవారికి వైరాగ్యముగుఱించి బోధింప యుక్తుడ నగుదును. నేను కామినులతోడిపొత్తును బొత్తిగ పరిహరించినవాడ నైనప్పుడే వ్యసనములలో తగుల్కొనినవారిని నిందించుట కధికారి నగుదును.

నాబ్రదుకే తప్పులతడక యైనది. నా హైన్యమునకు నాలో నేనే నవ్వుకొనుచు సిగ్గుతో నేటికి నీ మరుగు జొచ్చితిని. నన్ను కడతేర్చవలసినవాడవు నీవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నన్ను నెంచుకొననయ్యా | 36 | 203 | 15 | 135 |

అవ: అభీష్టము లిచ్చుటలో వేంకటాద్రినిలయునకు సాటియగు వేల్పులు లేరనుచున్నాడు.

సీ. **హరి ! యచ్యుత ! యనంత ! పరమపూరుష ! కరి**
**వరద ! కృపానిధి ! మురవిరోధి !**
**ధర, యాకసము, బలితలయు మూఁడడుగుల**
**పరగఁ గైకొన్న ప్రబలుఁడ వీవు**
**మాధవా ! భూధవా ! మధుసూదనా ! కృష్ణ !**
**శ్రీధరా ! శ్రీపతీ ! శ్రీనివాస !**
**శోధించి జలధులు సొచ్చి విద్యలు దెచ్చి**
**యజున కొసంగిన యధికుఁ డీవు**

గీ. **కేశవ ! ముకుంద ! వామన ! వాసుదేవ !**
**రామ ! గోవింద ! చక్రధరా ! నృసింహ !**
**నీకు సరిలేరు వేంకటనిలయ ! యెందు**
**కామితఫలమ్ము లిచ్చెడు ఘనుఁడ వీవు.** **24**

శ్రీహరీ ! నాశములేనివాడా ? అంతములేనివాడా ! పురుషులలో శ్రేష్ఠుడా ! గజేంద్రునికి వరము లిచ్చినవాడా ! కరుణకు నిలయమైనవాడా ! మురాసురుని సంహరించినవాడా ! నీవు తొల్లి భూమి, ఆకాశము, బలిశిరస్సు- ఈ మూడింటిని మూడడుగులతో నాక్రమించిన త్రివిక్రముడవు. లక్ష్మీపతీ ! భూదేవికి నాథుడా ! మధువను రాక్షసుని సంహరించినవాడా ! శ్రీకృష్ణా ! లక్ష్మిని వక్షమున ధరించినవాడా ! శ్రియఃపతీ ! శ్రీనివాసా ! నీవు సోమకాసురుడు వేదములు హరించినప్పుడు సాగరములో ప్రవేశించి ఆ రక్కసుని ఉక్కడంచి వేదములు తెచ్చి బ్రహ్మ కిచ్చిన దొడ్డవాడవు. మంచి తలవెంద్రుకలు గలవాడా! మోక్షము ననుగ్రహించువాడా ! వామనరూపుడా ! వసుదేవుని కుమారుడా ! రామా ! గోవులకు ఆనంద మిచ్చువాడా ! చక్రము చేపట్టినవాడా ! నరసింహావతారా ! నీతో సమానులగు వేల్పు లెందును లేరు. భక్తులు కోరిన అభీప్సితము లిచ్చు మహాప్రభావసంపన్నుడవు నీవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీకు సరిలేరీ నిఖిల | 38 | 214 | 15 | 143 |

అవ: అధర్మపరునకు సద్గతి లేదందురు. కావున సర్వేశ్వరుని శరణుజొచ్చుటయే కర్తవ్య మనుచున్నాడు.

సీ. వరదూషకునకును పరమ నాస్తికునకు
నిర్దయునకు గతి నిందుసున్న
సరవిఁ గ్రూరునకును సంశయాళువునకు
కలుషవర్తనునకు గతి హుళక్కి
నిష్ఠురభాషి కనృతవాది కింక బ్రా
హ్మణనిందకునకు నిహమ్ము లేదు
అన్యకాంతాలోలుఁడైన వానికి నసూ
యాపరునకును లేఁదంద్రు వేల్పు;

గీ. హింసకునకు నాచారవిహీనునకును
అర్థచోరునకును నహి యంద్రు లోక;
మీ నుడుల్ విని వెఱచి నే నిపుడె నిన్ను
శరణుఁ జొచ్చితి నేలవే తిరుమలేశ ! **25**

తిరుమలనాథా! ఇతరులను నిందించువానికి, దైవము లేదనువానికి, దయారహితునకు సద్గతి లేదు. క్రూరాచారునకు, సంశయాత్మునకు, పాపవర్తనునకు శ్రేయము లేదు. కఠినముగా మాట్లాడువానికి, అసత్యవాదికి, బ్రాహ్మణులను తిట్టువానికి ఇహము లేదు. పరస్త్రీలోలునకు, అసూయాపరునకు రక్షకమైన దైవము లేదు. హింసాపరునకు, ఆచారము లేనివానికి, ధనము దొంగిలించువానికి ఉత్తమలోకమే లేదని చెప్పుదురు. ఈ మాటలు వినగా నాకు భయము గల్గుచున్నది. కాన నే నిప్పుడే నిన్ను శరణు జొచ్చితిని. స్వామీ! నన్ను రక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇందులో నే నెవ్వఁడనో | 60 | 340 | 15 | 229 |

అవ: భగవద్ధర్మము అల్పమువలె తోచినను అనల్పఫల మొసగు ననుచున్నాడు.

**సీ. అరయ నీ పదతీర్థ మల్పమువలె నుండు**
**వరుసగఁ బాపముల్ వ్రక్కలించు;**
**ఒకమాటవలె నుండు నొగినీదు నామమ్ము**
**నరకబాధలనుండి సరగఁ గాచు;**
**మహి తులసీదళమాత్రము వలెనుండు**
**నిహపరాల్ నీపూజ యీయనోపు;**
**ఆందోళనమువలె నగుపించు నీ చింత**
**భవదీయకరుణకుఁ బాత్రుఁ జేయుఁ;**

**గీ. జేరి మ్రొక్కెడు మ్రొక్కులు చేష్ట లట్టు**
**లుండు భవవార్ధినుండి సముద్ధరించు;**
**కాసువలెనుండు నీ కిచ్చు కాన్క, కాని**
**యే వరమ్మైన నీనోపు వృషగిరీశ ! 26**

వృషభాద్రినాథా ! నీ పాదతీర్థము చాలస్వల్పముగ నున్నట్లే కనిపించును. కాని ఘోరాతిఘోరము లైన పాపములను సయితము రూపుమాపును. నీ నామము ఒక చిన్నమాటవలెనే తోచును. కాని అది నానానరకబాధలనుండి రక్షించును. నీ పూజ తులసీదళమాత్రముగనే తోచును. కాని అది ఐహికాముష్మికములైన సమస్తాభీష్టముల నొసంగ జాలును. నిన్ను గూర్చిన చింత చూచువారికి ఏదో ఆందోళనముగా తోచును. కాని అది నీ యనుగ్రహమునకు పాత్రము గావించును. నీకు చేయుప్రణామములు ఏవో చేష్టలవలె కనిపించును. కాని సంసారసాగరము నుండి ఉద్ధరించును. నీకు సమర్పించుకొను కానుక కాసువలె కనుపించును. కాని కోరినవరము లన్నింటిని అయ్యది ప్రసాదించును..

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| చూచే వారికి ధర్మము | 59 | 339 | 15 | 228 |

అవ: అహంకారము తొలగద్రోసుకొని భగవంతునకు శరణుజొచ్చినవాడే అతని యనుగ్రహమునకు పాత్రుడగు ననుచున్నాడు.

**సీ. దాసుండ ననఁ గొంత దయ దలంతువు గాని**
**వాదాడవా సరివాఁడ నన్న ?**
**మదినిల్పి కొలిచిన మన్నించెదవు గాని**
**వంతు లెంచుకొనిన వశ మగుదువె ?**
**ప్రస్తుతించినఁ గొంత రక్షించెదవు గాని**
**ప్రతిఘటించిన చలపట్ట వటవె ?**
**కైవసం బయ్యెదుగాక గతి యటన్న**
**నితరుల వేఁడిన నియ్యకొనెదె ?**

**ఆ. మ్రొక్కఁ గొంత నీవు మొగమోడుదువుగాక**
**మిడిసిపాటు గనిన మెత్తు వటవె ?**
**శరణటంచు నీదుమఱుఁగుఁజొచ్చిన నన్నుఁ**
**గావకుందువటవె కమలనయన ! 27**

పద్మాక్షా ! నీదాసుడనని నీకు వినమ్రుడైనవానిని నీవు కరుణతో చూచెదవు. కాని సరివాడనని పల్కినచో నీవు వాదుకురావా ? నిన్ను చిత్తములో చేర్చుకొని సేవించినచో మన్నించెదవు గాని నీతో వంతుకు వచ్చువానికి వశపడవు గదా! నిన్ను ప్రస్తుతించినవానిని పరిరక్షింతువుగాని ఎదురొడ్డి నిలిచినవాని అంతు చూడక మానెదవా ? నీవే గతి యన్నవానికి స్వాధీనుడ వయ్యెదవుగాని ఎవరినో యాచించుచు నిన్ను లెక్కపెట్టనివానిని నీ వంగీకరింపవుగదా ! నీకు మ్రొక్కిన వానిపై కొంత దాక్షిణ్యము చూపుదువుగాని గర్వముతో మిడిసిపడువానిని కనికరింపవుగదా ! ఈనాటికి నేను శరణని నీ మరుగుజొచ్చితిని. ఇక నన్ను కాపాడక నీ వెట్లుండ గలవు ? తప్పక కాపాడెదవని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇన్నాళ్ళు నా యహంకార | 61 | 348 | 15 | 234 |

అవ: జగత్పితయైన దేవుడే జీవులను కాపాడవలెగాని వారు తమ్ముదాము కాచుకోలే రనుచున్నాడు.

సీ. తనదుమాలిన్య మద్దము పాపుకొనునెట్లు
వీక్షించువాఁడె కావించుఁ గాక;
నాదోషములు మాన్ప నాకు శక్యంబటే
నాలోని నీవె పోఁద్రోలవలయు
వెఱ్ఱిమానఁగ మందు వెఱ్ఱివాఁడు గొనునె
మందిచ్చు వైద్యుండె మాన్పుఁగాక
బహుచంచలుండ నీపయి భక్తి సేతునే
మహిమమ్ముచే నీవె మరపవలయు

గీ. భూజము తనకుఁ దా నీరు పోసికొనునె ?
పెంచువాఁడె జలంబిడి పెంచుఁగాక
ఎట్లు పోషించుకొనఁగల నేను నన్ను ?
నీవ పుట్టించితివి సాక నీవె తగుదు. 28

స్వామీ ! అద్దము తనమీదనున్న మురికిని తాను పోగొట్టుకొనలేదు. ఆ యద్దమును చూచువాడే ఆ మురికిని తుడిచివేయవలెను. నాలోని దోషములు నేను తొలగించకొనజాలను. వాటిని తొలగించవలసినవాడవు నీవే. వెఱ్ఱివానికి బట్టిన వెఱ్ఱి మాన్పుటకు వైద్యుడే మం దొసంగవలెను. తనకు దానుగా వెఱ్ఱివా డెట్టి చికిత్సయు చేసికొనజాలడు. నేను మిక్కిలి చపలస్వభావుడను. నీపై నాకు భక్తి యెట్లు నిలుచును ? సర్వసమర్థుడవైన నీవే నీపై నాకు గుఱి యేర్పడునట్లు చేయవలెను. చెట్టు తనకు దానుగా నీరు పోసికొని తన్ను పోషించుకొనజాలదు. వృక్షమును నాటిన వాడే జలముపోసి దానిని పెంచవలెను.

దేవా ! నాజన్మమునకు హేతుభూతుడవు నీవే. నాపోషణభారము నీవే వహింపవలెను. నన్ను నే నెట్లు పోషించుకొనగలను ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| న్నవించే దే | | 347 | 15 | 233 |

అవ: మాయకు లోబడి కర్తవ్యము మఱచిన జీవుని కాపాడవలసినభారము భగవంతునిదే యనుచున్నాడు.

సీ. **అప్పిచ్చి వడ్డికై యహము లెంచునుగాని**
**కడచన్న జీవిత కాల మెంచఁ;**
**డెప్పు డింతులఁగూడి యింపులే తలపోయు**
**దేహమ్ము సమయుటఁ దెలియ లేఁడు;**
**తన వేఁటలాడు ప్రతాపమ్మె కనుఁగాని**
**వడిఁ జుట్టుకొనెడి పాపమ్ముఁ గనఁడు;**
**పెఱవారిసొమ్ముకై వేడుకపడుఁగాని**
**తిరిగి దిద్దవలయు టెఱుఁగఁ బోఁడు;**

గీ. **కర్త నన్నింటికను నహంకార మెఱుఁగు;**
**తన్నుఁ బ్రేరించు దైవమ్ముఁ దా నెఱుఁగఁడు;**
**జీవునజ్ఞాన మేమని చెప్పవచ్చుఁ?**
**బ్రోవ నీభారమే తండ్రి ! బుద్ధి యొసఁగి.** **29**

తండ్రీ! నీమాయ అమేయమైనది. దానికి లోబడిన జీవుడు కర్తవ్యము కాంచలే కున్నాడు. వడ్డికై అప్పిచ్చి దినములు లెక్కిడుచుండునుగాని పరమార్థము గనక వ్యర్థముగ చనిన తన జీవితకాలమును గూర్చి పరామర్శించుకొనడు. ఎల్ల వేళల రమణులతో తా ననుభవించిన భోగములనే నెమరునకు దెచ్చుకొను చుండునేగాని తన శరీరము కృశించి నశించిపోవుట ఏ మాత్రము గుర్తించడు. ఇతరులపై తన ప్రతాపమునే ప్రదర్శించును గాని తన్ను పెనవేసికొనుచున్న దురితములను చూడలేదు. పరులసొమ్ముకై గుటకలు వేయుచుండునేగాని ఏనాటికైనను వారిసొత్తు వారికి తిరిగి చెల్లించక తప్పదని తలంపడు. తానే అన్నింటికి కర్తనని అహంకరించునుగాని తనకు ప్రేరణనిచ్చు దైవ మొకటి గలదని తలపోయడు. ఇట్టి జీవుని అజ్ఞానము నేమని వర్ణింపగలము? వారికి బుద్ధిగఱపి రక్షింపవలసిన భారము నీదే స్వామీ!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| చెల్లఁబో యేమిచెప్పేది | 63 | 358 | 15 | 241 |

అవ: భగవంతునికి దాసుడై ఆయన యనుగ్రహమును పొందునంతవరకు జీవుడు దుఃఖములనుండి విముక్తుడు కాలే డనుచున్నాడు.

**సీ. తనపా టెఱుంగఁడు దైవమా ! జీవుండు**
**ఘనవివేక మొసంగి కావఁ గదవె**
**కలుగుకోరికలు ముందలపట్టి యీడ్వంగ**
**రోషమ్ము సివమెత్తి తొమ్ముద్రొక్క**
**బలిమితో లోభమ్ము బాధింప వగవండు**
**వలవంతఁ జిన్నవారలకు వగచు;**
**ఈషణత్రయము త న్నెప్పుడు దండించ**
**మన సేడకో పోయి మరగుచుండ**
**గాఢమోహతమస్సు కలచంగ వగవండు**
**మును చన్నవారికై మొనసి వగచు;**

**గీ. పట్టి యౌవనమదము తన్ బఱచ వగవఁ**
**డిట్టె వగవండు తా జన్మ మెత్తుటకును**
**నీదుబంటుగఁ జేకొని నిఖిలదుఃఖ**
**మణఁచినం గాని సుఖియింపఁ దయ్య ! దేహి. 30**

దేవా ! ఈ జీవుడు తన దుస్థితిని తాను గుర్తించలేదు. ఇతనికి తెలివి నొసంగి నీవే రక్షించవలెను. ఒకప్రక్క కోరికలు తలపట్టి త న్నీడ్చుచున్నను, రోషము ఆవహించి తన తొమ్ముద్రొక్కి బాధించుచున్నను, లోభము బలీయమై తన పై బడి పీడించుచున్నను, ఈ జీవు దందుకై చింతింపడు. గతించినవారికై కన్నీరు గార్చును. దారేషణ, ధనేషణ, పుత్రేషణ అను ఈషణత్రయము తన్ను దండించుచున్నను, మనసు తనచెప్పుచేతలలో నిలువక ఎక్కడకో పోయి తిరుగుచున్నను, సంసారవ్యామోహ మనెడి కారుచీకటి క్రమ్ముకొన్నను చింతింపడు. కాని యేనాడో ఒడలువిడిచి చనినవారికొఱకై దురపిల్లును. యౌవనమదము తన్ను వేధించుచున్నను వగవడు. దుఃఖకారణమైన జన్మము వచ్చినందులకు విచారింపడు. కాన నీవే పూనుకొని వీనిని నీబంటుగావించుకొని దుఃఖముల నన్నింటిని పోకార్చవలెను, అట్లు చేసినగాని ఈ శరీరధారికి సుఖములేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తనపా టెంచుకోఁడు | 65 | 374 | 15 | 251 |

అవ: సంసారరుచి మరగి నియమనిష్ఠలకు లోబడకున్నను శరణాగతుడైన తన్ను సంరక్షించుట భగవంతుని కర్తవ్య మనుచున్నాడు.

సీ. **గాఢవైరాగ్యమ్ము ఘనమైన జ్ఞానమ్ము**
**మాటలందే - నాదు మదినిలేదు;**
**దంభ దర్పాదిక తామసగుణముల**
**మాటునఁ దిరుగు దుర్మాని నేను;**
**నవనవవిధములౌ నానాసుకృతములఁ**
**జేయుటయే లేదు చెవుల వినుటె;**
**భవజలధులలోనఁ బడి పొరలి మునింగి**
**చవి మరగిన నిత్యచపలుఁ దేను;**

గీ. **కుండలినగేశ ! నీ సేవకుండ ననెడి**
**భావ మొక్కటియే తప్ప భక్తి యెఱుఁగ;**
**నే విధులఁ బడలేక నీకే శరణని**
**యంగనలతోడఁ గులికెడు డింగరీఁడ.** 31

శేషాద్రినాథా ! దృఢమైన వైరాగ్యము, ఘనమైన జ్ఞానము మాటలలోనే గాని నా మనసులో లేదు. నేను దురభిమానముతో దంభము, దర్పము మొదలైన తమఃప్రధానగుణములచాటున తిరుగుచున్న వాడను. క్రొంగ్రొత్తలైన సుకృత కర్మములగూర్చి పెద్దలు చెప్పగా వినుటయేగాని ఒక్కటియు చేసినవాడును గాను. సంసారసాగరములోబడి తలమునుకలుగా పొరలుచు అందలి చవి మరగిన చంచల స్వభావుడను. నాకు భక్తిమార్గము తెలియదు. కాని నీసేవకుడ నను భావము మాత్రము నిస్సంశయముగ నున్నది. ఏ నియమనిష్ఠలు అనుసరింపలేక అంగనా వ్యామోహమునుండి దూరముకాజాల కున్నాను. నిన్ను శరణుజొచ్చిన సేవకుడను నేను. నా రక్షణభారము నీదే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎట్టు రక్షించేవో కాని | 39 | 222 | 15 | 148 |

అవ: నేను పెక్కుఅపరాధములు చేయుచున్నను భగవంతునికి కింకరుడుగాన నన్ను దయగనుట అతనిధర్మ మనుచున్నాడు.

**సీ. మగనికే(ప్రొద్దు (ప్రేమపుటాలి నైనట్టు**
**లధిపునకును బంట నైనయట్లు**
**జనకునకును తనూజాతుండ నై నట్లు**
**లలి దేవుఁడా నీకు లంకె నైతి ;**
**ధరణిపాలకునకు నరిగాఁప నై నట్టు**
**లాచార్యునకు శిష్యుఁ డైనయట్లు**
**యజమానునకు దాసుఁ డైనట్లు శ్రీరమా**
**లలనాప్రియా ! నీకు లంకె నైతి;**

**గీ. పెంచుకొనునట్టివానికి పెంపుడుశిశు**
**వైన యట్టులు, పూజారినైన యట్లు**
**దేవతకు, నైతి నీవాఁడ తిరుమలేశ !**
**అందుకే తప్పు లెంచక యరయ వలయు.** **32**

దేవా ! మగనికి ప్రియమైన మగనాలియట్లును, ప్రభువునకు భృత్యుని యట్లును, తండ్రికి తనయునియట్లును, నీకు నేను అనుబంధపడియున్నాను. భూపాలునకు సామంతుని యట్లును, గురువునకు శిష్యునియట్లును, యజమానునకు సేవకుని యట్లును నేను పరమాత్ముడవైన నీకు తగులుపడియున్నాను.

లక్ష్మీనాథా ! ప్రేమతో పెంచుకొనువానికి పెంపుడుబిడ్డవలెను, దేవునకు పూజారివలెను, నేను నీవాడ నయితిని. అందుకే తిరుమలనాథా ! నా తప్పు లెంచక నన్ను దయజూడవలయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| వేవేలు తప్పులు | 63 | 362 | 15 | 243 |

అవ: నిజమనోరాజ్య మేలుచు దేవు నెన్నడు తలంపని జీవుని దేవుడే దయతో చూడవలె ననుచున్నాడు.

సీ. కడcగి యచ్చరల నాకర్షింపc దలcతును
ఘనదేవతాతతిc గనc దలంతు
బ్రహ్మాదిలోకముల్ పాలింపc దలcతును
నంతలో నిద్రింతు హరిc దలcపను;
అగుదు నీశ్వరుcడ నూహాపోహలన్ పుర
ప్రాకారముల నొక్కపరి సృజింతు
సకలభోగి నగుదు చవు లూరకే గొందు
నంతలో భిక్షాన కరుగుచుందు;
తలcచిన చోటికిc దరలిపోవc దలంతుc
గ్రన్నన బ్రదికింతుc జన్నవారి

గీ. అంతలోc బనికిc బిలువ నన్ని మఱతు
నేమి చెప్ప ? నా యుద్యోగ మెంతచోద్య;
మేలుచుందు మనోరాజ్య; మిందు నొకటి
కలుగ; దెన్నcడు నినుc గొల్వc; గావc గదవె ! 33

శ్రీవేంకటేశ్వరా! నామనోరాజ్యము చాల విశాలమైనది; విచిత్రమైనది. దానికి ఏలికను నేనే. అప్సరసల నాకర్షింపవలెనని నేను భావింతును. దొడ్డదేవతల చూడ నెంతును. బ్రహ్మాదిలోకములు పాలింప గోరుదును. అట్లు భావించుచునే సుషుప్తిలోనికి జొరబాఱుదును. కాని నిన్ను స్మరింపను.

ఊహాపోహలతో ప్రభుడనై పట్టణములను, ప్రాకారములను ఒక్కొక్క సారి సృజింతును. సకలభోగములను భోగింతును. ఆశలతో ఊరక ఉవ్విళ్లూరు చుందును. ఇంతలో క్షుత్పీడితుడనై బిచ్చమున కేగుదును.

అనుకొన్నచోటి కెల్ల పయనింప గోరుదును. చచ్చినవారిని సయితము బ్రది కించుచుందును. ఇట్లూహాలలో తేలియాడుచు నంతలో యజమానుడు పనికి హెచ్చరించగా నన్నియు మఱతును. ఈనామతిచాంచల్యము నేమని చెప్పగలను? నా ప్రయత్నము లెంత చోద్యములోగదా! నాతలంపులలో ఏ యొక్కటియు ఫలింపదు. అయినను సర్వమున కధినాథుడవైన నిన్ను సేవింప జాలను. ఇంతజడుడనైన నన్ను కాపాడవలసినవాడవు నీవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమి సేయుదును | 67 | 387 | 15 | 260 |

అవ: నీవు సర్వోన్నతుడవు. నేను అధమాధముడను. అయినను నీ సంకీర్తన పరుడను గాన నన్ను రక్షింపు మనుచున్నాడు.

సీ. నిరతి ని న్నెఱుఁగను నీవు న న్నెఱుఁగుదు
ధర యాచకుఁడ నేను దాత వీవు
వరుస నీచుఁడ నేను వైకుంఠపతి వీవు
నారాయణుఁడ వీవు నరుఁడ నేను
అలసుండ నేను నీవన సర్వశక్తివి
ధీరుఁడవీ వతిదీనుఁ డేను
.కఠినచిత్తుఁడ నేను కారుణ్యమూర్తి వీ
వేను దాసుండ నీ వేలికవును

గీ. జననశీలుండ మతి నేను జనకుఁ డీవు
నేను కర్మిని వేదాంతనిధివి నీవు
నేను సంకీర్తనపరుండ నీవు వేంక
టాద్రివిభుఁడవు కరుణ న న్నరయు మయ్య! **34**

స్వామీ ! నీ స్వరూపము నే నెఱుగను. నీవు నన్ను చక్కగా నెఱుంగుదువు. నీవు మహాదాతవు. నేను యాచకుడను. నీవు వైకుంఠాధిపతివి. నేను పరమ నీచుడను. నీవు నారాయణుడవు. నేను నరుడను. నీవు సర్వశక్తి సంపన్నుడవు. నేను అలసుడను. నీవు ధీరుడవు. నేను దీనుడను. నీవు కారుణ్యమూర్తివి. నేను కఠినహృదయుడను. నీవు ప్రభుడవు. నేను సేవకుడను. నీవు తండ్రివి. నేను బిడ్డను. నీవు వేదాంతఖనివి. నేను కర్మిష్ఠిని. నీవు వేంకటాద్రీశ్వరుడవు. నేను నీ సంకీర్తనతో కాలము గడపువాడను. నన్ను కరుణతో సంరక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీయంతవాఁడనా | 54 | 300 | 15 | 208 |

అవ: నానారూపములతోను, వివిధనామములతోను విలసిల్లు వేంకటేశ్వరుడే భక్త జనపరిపాలకు డనుచున్నాడు.

సీ. **నావాఁడవే యని భావింతు నే నట్లె**
**యందఱివాఁడవై యుందు వీవు;**
**బహుశిరమ్ములతోడ బహురూపధరుఁడవై**
**యీవు భాసిల్లుట యిందుకొఱక ?**
**నీపేరు నానాల్క నెలకొన్నయట్టులే**
**యందఱినోళ్ళలో నాడుచుందు;**
**పలువర్ణములతోడఁ బరఁగు పెక్కగు పేరు**
**లీవు ధరించుట యిందుకొఱక ?**

గీ. **ఏలికవు నీవు నాకని యెంచుకొందు**
**నిట్లె యిందఱ నే ప్రొద్దు నేలెద వఁట**
**నీ వనంతావతారముల్ నియతి గొనుట**
**భక్త పరిపాలనమునకా ? ఫణిగిరీశ !** **35**

శేషశైలనాథా ! నీవు సర్వవ్యాపివి. సర్వశక్తి సంపన్నుడవు. నిన్ను నేను నావాడవే యని భావింతును. కాని నీ వందరివాడవు. అందుకే సహస్రశీర్షుడవై సహస్రరూపములతో నొప్పారుచున్నావు. నేను నీ నామమును పేర్కొన్నట్లే ఎల్ల వారును నీ నామము కీర్తించుచున్నారు. అందుకే కాబోలు నీవు నానావర్ణములతో చెలువారు వివిధనామములను ధరించి యున్నావు. నా కొక్కనికే నీవు ప్రభుడ వని భావింతును. కాని న న్నేలినట్లే నీ వందరి నేలుచున్నావు. నీ వనంతములగు నవతారములు దాల్చితివి. అవి యన్నియు భక్తజనపరిపాలనమునకేకదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| భక్తవత్సలుఁడవుగా | 75 | 429 | 15 | 288 |

అవ: మహామహిమసంపన్నుడగు భగవంతుని పలురీతుల గొలుచుచు శరణాగతుడనై కడతేరితి ననుచున్నాడు.

సీ. **మనసున ని న్నెంచి మాటలఁ గొసరుదు**
**మ్రొక్కుదు వినయాన నొక్కొకపరి**
**ఘనభక్తిమై బయల్ కౌఁగిట నలముదు**
**తనియక వేడ్కతో నినుఁ బొగడుదు**
**జగతి ని న్వెదకుచు సారెకు నవ్వుదు**
**పరఁగ నీ నామముల్ పాడుచుందు**
**పూజించి నినుఁ బ్రియమ్మునఁ జొక్కుదును వెఱ**
**గందుదు శ్రుతుల ని న్నాలకించి**

గీ. **నీ మహిమగాంచి కోరుదు నీదుదాస్య;**
**మడిగెదను నిన్ను గూర్చి దాసాళిఁ జూచి**
**యంతరంగానఁ బొడసూపి తహినగేశ !**
**శరణుఁజొచ్చి నే బ్రదికితి సంతసమున.** **36**

శేషాచలేశ్వరా ! నా మనోవీథిలో నిన్ను నిలుపుకొని పెక్కుమాటలతో నిన్ను ఒక్కొక్కసారి కొనియాడుదును. అతివినయముతో ఒక్కొక్క పర్యాయము నీకు మ్రొక్కుచుందును. మిక్కిలి భక్తితో ఒక్కొక్కతడవ శూన్యమునే కౌగిలించుకొను చుందును. తనివిదీరక ఉత్కంఠతో ఒక్కొక్కసారి నిన్ను నుతించుచు ప్రొద్దులుపుచ్చు చుందును. నిన్ను అన్వేషించుచు మాటిమాటికి నవ్వుచుందును. నీ నామములే గానమొనర్చుచుందును. నిన్నర్చించుచు ప్రీతితో నానందించుచుందును. వేదములలో నిన్నుగూర్చి విని ఆశ్చర్యచకితుడ నగుచుందును. నీ మహిమను గుర్తించి నీకు దాస్య మొనర్ప నభిలషింతును. భాగవతులను జూచి నిన్ను గూర్చి ప్రశ్నించుచుందును. దేవా ! దయతో నా యంతరంగమున ప్రత్యక్షమైతివి. నేను నీశరణు జొచ్చితిని. కాన సంతోషముతో కడతేరితిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఈ యీా యీా యీా | 75 | 431 | 15 | 290 |

అవ: నేను నీ దగ్గరిచుట్టమును కాను. కేవలము నీచేతిలోని బొమ్మను. కాన నన్ను కాపాడు మనుచున్నాడు.

**సీ. ఆత్మజుండగు బ్రహ్మయంతటివాఁడనా ?**
**సాటియౌదునె మామ సాగరునకు ?**
**చలువతేఁడు మఱంది శశికి నీ డౌదునే ?**
**తోఁబుట్టు వింద్రుతో తులయగుదునె ?**
**జనకుండు కశ్యపమునికి జోడౌదునే ?**
**అనుజుండు సౌమిత్రి కెనయగుదునె ?**
**బావ ధర్మజునంతవాఁడనా ? మీ తాత**
**గాంగేయునకు నాకుఁ గలదె పోల్కి ?**

**గీ. అల్లుఁ డభిమన్యునకు దొర యగుదు నటవె ?**
**మనుమఁ డనిరుద్ధుతోడ సామ్యమ్మె నాకు ?**
**పట్టియాడింప నాడెడి ప్రతిమ నేను**
**నీదుబంటను దిక్కెందు నీవె నాకు.** 37

దేవా ! చతుర్ముఖబ్రహ్మ నీ కుమారుడు. సముద్రుడు నీ మామ. చంద్రుడు నీ మఱది. ఇంద్రుడు నీ సోదరుడు. కశ్యపప్రజాపతి నీ తండ్రి. లక్ష్మణుడు నీ తమ్ముడు. ధర్మరాజు నీ బావ. భీష్ముడు నీ తాత. అభిమన్యుడు నీ మేనల్లుడు. అనిరుద్ధుడు నీ మనుమడు. వారెల్లరు సుప్రసిద్ధచరిత్రులు. వారితో నా కెట్టి పోలికయు లేదు. వారి నందరి నీ వనుగ్రహించితివి. మఱి నీ యనుగ్రహమును నేను పొందు టెట్లు ? నేను నీ వాడించిన ట్లాడెడు బొమ్మను మాత్రమే. కేవలము పరతంత్రుడను; భవదధీనుడను; నీ సేవకుడను. నాకు వేఱు దిక్కు లేదు. సర్వేశ్వరా ! నీవే నాకు దిక్కు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కొసరి నీతోఁ బెనఁగి | 75 | 432 | 15 | 290 |

అవ: సర్వవిధముల నపరాధియగు తన్ను కృపామయుడైన సర్వేశ్వరుడే సంరక్షింపవలె ననుచున్నాడు.

సీ. దిట్టనై కావించు దిమ్మరిపనులకు
చాలునా యీ నరకాలు నాకు ?
పుట్టుకలన్ వ్రాయఁ బోయినఁ జాలునా
అన్నితోఁపుల తాటియాకు గములు ?
సలిపెడి నా యనాచారపుటెంగిలిఁ
గడుగంగఁ జాలునా కడలినీళ్ళు ?
కడగి నే నాడెడు కల్లల నెంచిన
మోవఁగఁ జాలునా భూమి నన్ను ?

గీ. మదిఁ దలంచు ద్రోహములకు మ్రాఁకులెల్లఁ
జాలునా కొఱ్ఱులుగఁ జేయ ? సాంద్రకరుణ
దిక్కు మఱి లే రటంచును దెలిసి నన్నుఁ
గాచితివి గాక నాలోనఁ గలదె గుణము ? 38

స్వామీ ! ధర్మాధర్మములు పరిశీలింపక ధార్ష్ట్యముతో అకృత్యముల కొడిగట్టితిని. అందుకు తగినట్లు నన్ను శిక్షించుటకు ఈ నరకములు చాలవు. నే నెన్నిజన్మము లెత్తితినో అవి యన్నియు వ్రాయబూనిన ఈ ప్రపంచమందలి తాటితోపులలోని ఆకు లన్నియును చాలవు. నాదురాచార మనెడి మాలిన్యమును కడుగుటకు సముద్రజల మంతయు చాలదు. నా నోట వచ్చు కల్లరిమాటలకు మితి లేదు. వాటిని పరిగణనకు తీసికొన్నచో ఈ భూమి నన్ను మోయజాలదు. నా చిత్తములో నెన్నో ద్రోహపుతలంపులు పొడసూపుచుండును. అందుకు తగిన దండనము విధించుటకు లోకమునగల చెట్ల నన్నింటిని నఱకి కొఱ్ఱులుగా చేసినను చాలవు. నేను గుణహీనుడను. నాకు మఱి దిక్కులే రన్నది నీకు తెలియనిది గాదు. అయినను కరుణించి నన్ను నీవు కాపాడితివి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కరుణించి నీవు గాఁగా | 1 | 3 | 15 | 2 |

అవ: సంచితపాపరాశిని పుణ్యకర్మానుష్ఠానముచే ఒక్కజన్మలో పరిహరింప శక్యముకాదుగాన హరిని శరణుజొత్తు ననుచున్నాడు.

సీ. **జన్మజన్మములందు సలిపిన పాపమ్ము**
**లీయొక్కజన్మమం దీఁగఁ గలనె ?**
**యిపు డనుష్ఠింపఁబోయినఁ గర్మ, మాఱునే**
**నీరుచి చ్చొక ముంతనీళ్లతోడ ?**
**కవిలెలోనున్న రౌరవముఖ్యనరకమ్ము**
**లుత్తరింపఁ గలనె యొక్కమేన ?**
**తక్కక నిపుడు నే తపము సల్పెదనన్న**
**బుఱ్ఱకాయ నడంగఁబోనె కడలి ?**

గీ. **బలువయి యనాదిగా వేళ్లుపాఱియున్న**
**భవము పెకలింతునే పుణ్యలవముచేతఁ**
**జెలఁగు పెనుగాలికిని చింపిచేఁట లడ్డె**
**హరిహరీ ! శరణంచు నీ మఱుఁగుఁ జొత్తు.** **39**

శ్రీహరీ ! అనేకజన్మములందు నేను గావించిన పాపములు కొండలై పెరిగినవి. ఈ యొక్క జన్మములో వాటికి ప్రతిక్రియ సల్పగలశక్తి నాకు లేదు. ఇప్పుడు నేను గావించిన ఒకింతపుణ్యకర్మముచే పూర్వపాపము లడుగంటవు. ముంతనీటితో బడబానలము చల్లారదుగదా ! పాపఫలమైన కుంభీపాకరౌరవాది-బహువిధ నరకములు అనుభవమునకు వచ్చుటకు సిద్ధముగా నున్నవి. ఈ ఒక్కశరీరము సాధనముగా నేజేయు సత్కర్మలు ఆ నరకములను దూరీకరింప గలవా? మానక ఇపుడు నేను తప మొనర్చి పాపఫలమును పరిహరింతు నన్నచో అదియు సాధ్యముగాదు. సముద్రజలము ఒకసొరకాయబుఱ్ఱలో ఇముడదుగదా! అనాది నుండి గట్టిగ నాటు కొనియున్న పాపరూపమైన సంసారవృక్షము కూకటివేళ్లతో పెల్లగించుటకు నేటి ఒకింతపుణ్యము సమర్థ మగునా? ఝంఝామారుతమును చింపిచేట లడ్డు కొనగలవా ? కావున పైయుపాయము లేవియు అక్కఱకు రావు. నన్ను రక్షింపజాలవు. కనుక నారాయణా! నీ మఱుగుజొచ్చి వాటిబారినుండి తప్పించుకొందును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇన్నియుపాయము లింక | 2 | 10 | 15 | 7 |

అవ: భగవద్దాసులతోడి సహవాసము, వారిసేవ ప్రసాదింపు మని పరమాత్మను వేడుకొనుచున్నాడు.

సీ. సామీప్య సారూప్య సాయుజ్య సాలోక్య
మ్ముల నిమ్మనుచు వేడఁబోవ నిన్ను ;
భువియందొ దివియందొ పోరి రసాతలమందొ
దాసులతో సహవాస మిమ్ము ;
కాయసిద్ధి నడుగ కర్మఫల మడుగ
న మ్మెయి దేవపట్టమ్ము లడుగ
నీయెడ నేఁడైన నింకొక్కనాఁడైన
నీసేవకులసేవ నెమ్మి నిమ్ము ;

గీ. దేవుఁడవు మాకు నీ వని తెలిపె గురుఁడు
వైష్ణవులె గతి యెల్ల యవస్థలందు
స్వామి ! మా భారమెల్ల నీ పయిని వేసి
బ్రతుకుచుంటిమి పరమపావనుల మగుచు. 40

స్వామీ ! నేను నిన్ను సామీప్యమునో, సారూప్యమునో, సాయుజ్యమునో సాలోక్యమునో ఇమ్మని అడుగుటలేదు. భూలోకముననో, స్వర్లోకముననో లేక పాతాళలోకముననో ఎక్కడో ఒకచోట నీ దాసులైనవారితోడి సహవాసమునే నాకు ప్రసాదింపుము. నాకు కాయసిద్ధి అక్కఱలేదు. కర్మఫలము ని న్నడుగుటలేదు. దేవతల అధికారముగూడ ని న్నొసగు మని అర్థింపను. ఇప్పుడుగాని మరెప్పుడుగాని నీ సేవకులసేవనే నా కనుగ్రహింపుము. మాగురువు నీవే దేవుడవని తెల్పియున్నాడు. వైష్ణవులే సర్వకాలసర్వావస్థలయందు మాకు పరమగతి యని విశ్వసించియున్నాము. మా బరువంతయు నీపైని వేసినాము. నిశ్చింతగా పరమపవిత్రులమై నీ కైంకర్యములో బ్రదుకుచున్నాము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇచ్చితివి తొల్లే నాకు | 3 | 15 | 15 | 10 |

అవ: శక్తియుక్తులులేని శరణాగతభక్తుడగు తన్ను కాపాడుమని దేవుని వేడుకొను చున్నాడు.

సీ. శక్తి నాకున్న నీ సరస దేవుఁడఁ గానె
యుక్తిగల్గిన నేల యొడలు మోతు ?
యుక్తిశక్తులయందు నొకటియు లేక నీ
భక్తుఁడనైతిఁ గాపాడు మయ్య ?
బహుపుణ్యుఁడైన నే బ్రహ్మపదవిఁ గొందు
సంసారి నగుదునే జ్ఞానినైన ?
విహితపుణ్యజ్ఞాన విరహితుఁడను గాన
శరణు వేఁడితిఁ గృప నరయు మయ్య !

గీ. నీవు చేసిన ప్రతిమను; నీ వెఱుఁగని
నేర్పు నాకేది ? నాలోన నీవు వెలసి
బుద్ధి నొసఁగంగ వేంకటభూధరేంద్ర !
యేను నీవాఁడ నంటి; న న్నేలు మయ్య ! **41**

శ్రీవేంకటాచలేంద్రా ! నాలో నెట్టిశక్తియు లేదు. ఉన్నచో నీతో సమానుడగు దేవుడనై యుండనా ? నాలో ఏ యుక్తియు లేదు. ఉన్నచో నే నేల జన్మించి ఈ బొందిని మోయుదును ? శక్తియుక్తులలో ఏదియు లేదు. కావుననే నీకు భక్తుడనైనాను. నన్ను కాపాడుము. నేను గొప్పపుణ్యాత్ముడనై యున్నచో బ్రహ్మపదవి నధిష్ఠించియుందును. జ్ఞానవంతుడనై యుండినచో సంసారమును మెడజుట్టుకొని యుండను. పుణ్యజ్ఞానము లెవ్వియు లేవుగనుక నిన్ను శరణు జొచ్చితిని. నన్ను దయ జూడుము. దేవా! నేను నీవు కల్పించిన ప్రతిమను మాత్రమే. నాలో నెట్టి సామర్థ్యము లేదు. అంతర్యామివైన నీవు నాకు బుద్ధినొసగితివి గాన నేను నీ దాసుడ నంటిని. నన్నేలుకొనుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| సర్వేశ్వరుఁడవు స్వతంత్రుఁడవు | 4 | 21 | 15 | 14 |

అవ: స్వప్రయత్నము మాని సర్వాత్మనా భగవంతునిపై భారమువేసి బ్రతికి యుండుటే శ్రేయ మనుచున్నాడు.

**సీ. శరణన వెఱపగు సామజమ్మును బలె**
**పరువెత్తి వచ్చి కాపాడె దనుచ**
**హరి కృష్ణ యన వెఱపగు కుంతికోడలి**
**కిచ్చినట్లుగ వర మ్మిత్తు వనుచ**
**మ్రొక్కంగ వెఱపగు పుట్టమ్ము లిడి గొల్ల**
**కొమ్మలం బలె పయికొందు వనుచ**
**నమ్మంగ వెఱపగు నెమ్మి కౌంతేయులం**
**బలె తోడునీడవై పాయ వనుచ**

**గీ. ఆరగింపు మనన్ వెఱపగును శబరి**
**యెంగిలికి బలె నేఁకారె దెప్పు దనుచ**
**నెట్టనుట కేని వెఱతు; నీ యిచ్చ యెట్లొ**
**కావు మట్టులు న న్నాలఁ గాచినట్లు.** **42**

శ్రీవేంకటేశ్వరా! పూర్వము శరణాగతుడైన గజేంద్రుని కాపాడుటకు నీవు పరుగెత్తివచ్చినట్లు నన్ను కాపాడుటకుగూడ ఎక్కడ పరుగెత్తి వచ్చెదవో యని నిన్ను శరణుజొచ్చుటకు నాకు భయ మగుచున్నది. తొల్లి నీ నామ ముచ్చరించిన ద్రౌపదికి అక్షయవరము లిచ్చినట్లు అనర్హుడనైన నా కెక్కడ అన్నివరము లిత్తువో యని నీ నామ ముచ్చరించుటకుగూడ నాకు వెఱపగుచున్నది. పూర్వము చేతులెత్తి మ్రొక్కిన గొల్లెతలకు చీరలిచ్చి వారిని పైకొన్నట్లు న న్నెక్కడ పై కొందువో యని నీకు మ్రొక్కుటకుగూడ నాకు భీతి గల్గుచున్నది. మునుపు నీపై విశ్వాసముంచిన కుంతీసుతులకు తోడునీడవై వెన్నంటి యుండినట్లు నన్నెక్కడ వెన్నంటి యుందువో యని నిన్ను విశ్వసించుటకు గూడ నాకు భయమగుచున్నది. శబరియిచ్చిన యెంగిలిపండ్లను ముట్టినట్లు నా యెంగిలికూడ ఎక్కడ ముట్టెదవో యని నీకు ఆరగింపుచేయుటకు గూడ నాకు జం కొదవు చున్నది. కావున నాప్రయత్నముతో నిన్ను నే నేవిధముగా ప్రార్థింపలేను. కొలువజాలను. ఇట్లగుటచే ఏ మనుటకును నాకు ధైర్యము చాలదు. ఏమియు ననని గోవులను అప్పుడు కాచినట్లు పశుతుల్యుడనైన న న్నిప్పుడు నీయిచ్చవచ్చినట్లు సంరక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| భ రము నీపై వేసి | 4 | 25 | 15 | 17 |

అవ: తనలోనిదోషములు పరిగణింపక తన్ను రక్షించుట శ్రీనివాసుని కర్తవ్య మనుచున్నాడు.

సీ. శరణుఁ జొచ్చినవాఁడు సర్వాపరాధియై
యున్న నాతనితప్పు నెన్నఁ దగదు ;
సరి ప్రాఁతవాఁ డెంత సలిగలఁ బొరలిన
నందుకే కొంచియ మలుగఁ దగదు ;
పంచఁజేరినవాఁడు పనికిరాకున్నను
వంచనతో వాని వదలఁ దగదు;
కోరి మ్రొక్కెడువాఁడు గుణహీనుఁడైన చా
లించుమీ యని యదలించఁ దగదు

గీ. విమలుఁడగు బంటు మందెమేళమున నున్న
భావమున నించుకయు నెగ్గుపట్టఁ దగదు;
ఇన్ని విధములవాఁడ నే నిందిరేశ !
తొదరి ప్రోవక మిన్నక దూఱఁ దగదు. **43**

లక్ష్మీశ్వరా ! శరణాగతుడైనవాడు సమస్తాపరాధములు కావించిన వాడైనను ఆతనియపరాధములను పరిశీలింపరాదు. బహుకాలమునుండి తనకు సన్నిహితుడైన వాడు ఎంతచనవరియై మెలంగినను వానిపట్ల కినుక వహింపరాదు. ఆశ్రయించిన వాడు ఎంత కొఱమాలినవాడైనను వంచనతో వానిని వదలుట యుక్తముగాదు. తనకు ప్రణమిల్లువాడు ఎంత గుణహీను డయినను నీ మ్రొక్కులిక చాలు నని అతనిని ఆదలించరాదు. నిర్మలహృదయుడైన భృత్యుడు కొంతఅలసతతో ప్రవర్తించినను ఆతనిపట్ల ఎగ్గు దలంపరాదు. దేవా ! నేను నీకు శరణాగతుడను; సన్నిహితుడను; నీపంచజేరినవాడను. నీకు మ్రొక్కులిడు సేవకుడను. కావున నన్ను అపరాధియని, చనవరియని, పనికిరానివాడని, గుణహీనుడని, అలసుడని తూలనాడక కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నాకా వుపాయములు | 65 | 370 | 15 | 249 |

అవ: గోరంతభక్తి చూపిన భక్తులకు భగవంతుడు కొండంతవరములు క్రుమ్మరించు ననుచున్నాడు.

సీ. **నిను సునీతిసుతుండు వినుతించు టదియెంత ?**
**కట్టఁబెట్టిన ధ్రువపట్ట మెంత ?**
**హత్తి పిలువవచ్చు నక్రూరుపనియెంత ?**
**సొగసి నీ రూపమ్ముఁ జూపు టెంత ?**
**ఒగి నంబరీషుని యుపవాస మదియెంత ?**
**యలరి రక్షగఁ జక్ర మంపుటెంత ?**
**గుట్టుగ గోపికల్ కూడుట యదియెంత ?**
**యిహపరమ్ములను నీ విచ్చు టెంత ?**

గీ. **ఎంచఁగ గుహుండు రేవు దాఁటించు టెంత ?**
**సులభుఁడవునై కృపాదృష్టిఁ జూచుటెంత ?**
**పరసలకు నీయెడం గల భక్తి యెంత ?**
**వలసినట్టులు నీ విడు వరము లెంత ?.** **44**

ప్రభూ ! బాలుడైన ధ్రువుడు నిన్నేమి గొప్పగా వినుతించినాడు ? నీవు సర్వోత్తమమైన ధ్రువపట్ట మతనికి కట్టబెట్టితివిగదా ! అక్రూరుడు చేసినపనియెల్ల నిన్ను ప్రీతితో బిలువవచ్చుటయే గదా. అతనికి యమునలో నీ విశ్వరూపమును సందర్శింప జేసితివి. అంబరీషు డొకరోజు ఉపవాస ముండెను. అతనికిగల్గిన ఆపదఁ బాపుటకు నీ సుదర్శన చక్రమునే రక్షగా నంపితివి. గోపికలు నీతో కలసి మెలసియుండిరి. ఆ మాత్రమునకే నీవు వారి కిహపరసౌఖ్యము లెల్ల ప్రసాదించితివి. నాడు గుహుడు తన తెప్పచే నిన్ను గంగరేవు దాటించెను. ఆ పాటికే నీవు ఆతనిపట్ల సులభతముడవై అతనిని కృపతో నేలితివి. అనుదినము నీ చెంతకు వచ్చు యాత్రికబృందములు నీ యెడ నెరపు భక్తిపరిమాణ మెంత? కాని నీవు వారికి కొండంత వరములు గుప్పుచున్నావు

దేవా ! నీ వదాన్యతకు అవధులు లేవుగదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కోరి నీ యీవికి | 48 | 271 | 15 | 183 |

అవ: తానెంత నీచుడైనను అంతర్యామియైన భగవంతునకు తన్నుగావక తప్ప దనుచున్నాడు.

సీ. కోరి పెండ్లాడిన దేరూపుదైనను
పెనిమిటికిని దాని విడువ నగునె ?
కాసుకుఁ గొఱగాని కడుపేదబంటైన
నెంచి యన్యున కొప్పగించనగునె ?
తనవాకిలింగాచు శునకమ్మునకు నైన
నోగిరమ్మును పెట్టకుండ నగునె ?
ఆత్మజాతుం డెంత యంకెకు రాకున్నఁ
బ్రేమఁ జేకొనక కోపింప నగునె ?

గీ. పెంచినశుకంబు తిట్టిన పేరుపెట్టి
హత్తి ముద్దాడుటయగాక మొత్త నగునె ?
నీదుదాసుల నేరమి నెక్కొనినను
కొండలప్ప ! మన్నింపక యుండ నగునె ? **45**

ఏడుకొండలవాడా ! వరించి ధర్మబద్ధముగ పెండ్లాడినసతి రూపవతి యైనను కాకున్నను ఆమెను వదలి పెట్టుట మగనికి న్యాయము కాదు. తనవద్ద పనిచేయు భృత్యుడు ఎందుకు పనికిరానివాడైనను వానిని ఇతరుల కొప్పగించుట యజమానునకు ధర్మము కాదు. తన గుమ్మమువద్ద కనిపెట్టుకొన్నది కుక్కయే యైనను దానికి పట్టెడుకూడు పెట్టకుండుట గృహస్థునకు నీతి కాదుగదా! కన్నకొడుకు చెప్పినమాట వినకున్నను అతనిపై ప్రేమవీడి కోపించుట తండ్రికి తగవుకాదుగదా ! తన్ను పేరుపెట్టి తిట్టినను పెంచినచిలుకను ముద్దాడవలెనే గాని మొట్టరాదుగదా !

స్వామీ ! నీ సేవకులలో అపరాధము గల్గినను నీవు మన్నింపకుండుట భావ్యము గాదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నే నెంత నీచుడనైనా | 49 | 274 | 15 | 185 |

అవ: శ్రీమన్నారాయణుడు తన్ను గొలిచినవారిని తనంతవారిని గావించు ననుచున్నాడు.

సీ. భూపతిఁ జేరిన భూమి యిచ్చునె గాని
నున్నతపదమీయ నోపలేఁడు
ఇంద్రు నారాధింప నిచ్చు స్వర్గమె గాని
యెపుడుఁ జెడనిభోగ మీయలేఁడు
కఱకంఠుఁ గొల్చిన కైలాస మిడుఁగాని
కదు ధ్రువపట్టమ్ముఁ గట్టలేఁడు
చతురాస్యు సేవింప సత్యలోకమెగాని
విరజానదిని దాఁట వేయ లేఁడు

గీ. అన్నియెడల మాయాశక్తి నాశ్రయించ
నిను భజింపక తెరువు గాన్పించ నీదు;
కనులయెదుట నీ కే శరణనిన వేంక
టేశ ! నీ యీవు లెవ్వార లీయ లేరు. 46

శ్రీశా ! ఒకభూమీశ్వరుని సేవించినచో అతడు కొంతభూమి నొసగగలడే గాని అంతకంటె ఉన్నతపదవి నొసగలేడు. దేవేంద్రుని గొల్చినచో అతడు స్వర్గములో స్థాన మిచ్చునేగాని శాశ్వతభోగము ప్రసాదింపలేడు. శివుని భజించినచో కైలాసమున నివాస మిదగలడేగాని అంతకంటె సమున్నతమగు ధ్రువపట్టము కట్టబెట్టలేడు. చతుర్ముఖబ్రహ్మను సంసేవించినచో అతడు సత్యలోకములో స్థానము కల్పింప గలడు గాని విరజానదిని దాటించలేడు. సకలావస్థలయందును నీమాయాశక్తి నాశ్రయించినను చివరకు నిన్ను సేవింపక అది మార్గమును చూడనీయదు. కాన నీశరణాగతియే ఉపాయమని తేలినది.

ప్రభూ! నీ శరణాగతులకు నీ విచ్చెడి వరములు మరెవ్వ రీయజాలరు.
"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మా మేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరన్తి తే ॥"
అను గీతావాక్య మిట స్మరణీయము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నినుఁ గొలిచితేఁ జాలు | 51 | 292 | 15 | 197 |

అవ: యజ్ఞనారాయణనామకుడైన శ్రీనివాసుడే యజ్ఞకర్త లందఱకు ఆరాధ నీయు డనుచున్నాడు.

**సీ. సర్వేశ్వరా! సర్వశబ్దవాచ్యుఁడ వీవె**
**క్రతుభోక్త వీవె సత్క్రతువు నీవె**
**వెస వరుణునిగూర్చి వేలుతు రాహుతుల్**
**వసుధలోపలి విప్రవర్యు లెల్ల**
**వరుణుఁ డెవ్వరిఁ గూర్చి వాలాయముగ వేల్చు**
**నిచ్చ లే మంత్రమ్ము లుచ్చరించు ?**
**క్రతువు లింద్రునిఁగూర్చి కావింతు రెందైన**
**పొందుగ భూసుర పుంగవులును**
**క్రతువు లెవ్వనిఁగూర్చి కావించు నింద్రుండు**
**క్రమ మొప్ప నెట్టిమంత్రములు నొడువు ?**

**గీ. బాడబు లొనర్తు యజ్ఞముల్ బ్రహ్మగూర్చి**
**యతఁ డెవరిఁ గూర్చి యజ్ఞమ్ము లాచరించు ?**
**యజ్ఞనారాయణుండను నాహ్వయమ్ము**
**చెల్లె నీకుఁ దొల్లిఁటినుండి శ్రీనివాస ! 47**

సర్వేశ్వరా ! నీవు సర్వుడు అనుశబ్దముచే వ్యవహరింపబడుచున్నావు. అంతేకాదు; సర్వశబ్దములు నిన్నే పేర్కొనుచున్నవి. ఆదికాలమునుండికూడ యజ్ఞ ఫలములు భుజించువాడవు నీవే.

ఇలపై విప్రులు వరుణుని గూర్చి యాగము లొనర్చి ఆహుతు లిచ్చుచున్నారు. కాని ఆ వరుణుడు తా నెవరినిగూర్చి యజ్ఞములు చేయుచున్నాడు? ఏ మంత్రములు పఠించుచున్నాడు? బ్రాహ్మణశ్రేష్ఠులు ఇంద్రునిగూర్చి యజ్ఞములు సల్పుచున్నారు. కాని ఆ యింద్రుడు ఎవని నుద్దేశించి యజ్ఞములు సల్పుచున్నాడు? యజ్ఞసమయమున ఏ మంత్రము లుచ్చరించుచున్నాడు? ద్విజులు బ్రహ్మనుగూర్చి క్రతువు లాచరింతురు. ఆ బ్రహ్మ ఎవరినిగూర్చి క్రతువు లాచరించును?

స్వామీ! నీపేరే యజ్ఞనారాయణుడు. ఎల్లవారలు చేయు యజ్ఞములు నీకు చెందవలసినవే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| సర్వశబ్దవాచ్యుఁడవు | 55 | 314 | 15 | 211 |

అవ: లక్ష్మీవల్లభుడగు శ్రీవేంకటేశ్వరుని నమ్మినవారికి ఎట్టి వరములకు కొఱంతలే దనుచున్నాడు.

సీ. నీవు శ్రీవరుండవు నిన్ను నమ్మినవారి
కిహపరసుఖముల నిచ్చు టేమియరుదు ?
శునక మొక్కటి ధర్మజునివెంట నంటంగఁ
దనపుణ్యగతి నిచ్చె దాని కంద్రు;
మతి యేకలవ్యుండు మంటిబొమ్మఁ గొలువ
నెనలేని విలువిద్య నిచ్చె నంద్రు;
శరధికి విప్రుఁ డక్షతలు నిత్య మిడంగ
సరిలేని రత్న మొసంగె నంద్రు;
అహికి నొక్కండు పంచాంగంబు సెప్పిన
మణినిచ్చి దారిద్ర్య మణఁచె నంద్రు;

గీ. గువ్వ యొక్కటి శిబిమఱుగుం జొరంగ
కాచెనందురు తన మేనికండ లిచ్చి;
యిట్టులె విభీషణాదు లీవే గతియని
శరణు వేఁడఁ బ్రోచితి వంద్రు తిరుమలేశ ! 48

తిరుమలేశ్వరా ! నీవు లక్ష్మీనాథుడవు. నిన్ను నమ్మి కొల్చినవారికి ఇహపరసుఖములు నీవు ప్రసాదించుటలో ఆశ్చర్య మేమియు లేదు. పూర్వ మొక కుక్క ధర్మరాజువెంట నరిగినది. దాని కతడు తన పుణ్యఫలమైన స్వర్గమునే యిచ్చెనని చెప్పుదురు. ఏకలవ్యుడు మట్టితో గురువుబొమ్మను గావించి సేవించెను. ఆ బొమ్మయే అతనిని విలువిద్యలో సాటిలేనిమేటి గావించె నని చెప్పుదురు. ఒక బ్రాహ్మణుడు అనుదినము అంబుధికి అక్షతలు సమర్పించుచుండెను. అతనికి ఆ రత్నాకరుడు అనర్ఘములైన రత్నము లొసంగెనని చెప్పుదురు. ఒక డొక పామునకు పంచాంగము చెప్పెను. అందు కాపాము అతనికి విలువైన మణినిచ్చి అతని పేదతికమును బాపెనని చెప్పుచున్నారు. ఒకపావురము శిబిచక్రవర్తిని శరణుజొచ్చినది. దాని కతడు తన శరీరమాంసము కోసియిచ్చెనని అనుచున్నారు. అట్లే విభీషణుడు మొదలైనవారు కూడ నీవే గతి యని శరణాగతులు కాగా వారిని కాపాడితివని చెప్పుదురు. దేవా ! నీ ప్రభావము నేమని వర్ణింపగలము ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీవు లక్ష్మీపతివి | 58 | 329 | 15 | 221 |

అవ: విశ్వమంతయు వేంకటేశ్వరమహిమమయ మనుచున్నాడు.

సీ. **తల్లివై రక్షింతు తండ్రివై పోషింతు**
**విల్లాలివై మోహ మిత్తు నాకు;**
ఒడలయి పెరుగుదు వొగి పురాకృత మౌదు
**విల్లు ముంగిలి యౌచు నింపుగూర్తు;**
గురుఁడవై బోధింతు కొడుకవై యీడేర్తు
వరుదౌ నిధానంబ వగుదు వీవె;
చొరవయి యేలెదు దూతవై పనిసేతు
విరవైన సిరు లిత్తు వేమి కరుణ!

గీ. దేవుఁడై పూజగొందువు దిక్కు ప్రాణ
మగుదు వీవె; కామించిన ట్లగుదు వీవె;
నీ వె చిత్తమ్ము లోపల నిండియుండి
పరమపద మిత్తు వేమి నీ పరమమహిమ ? **49**

శ్రీవేంకటేశ్వరా ! నీవు తల్లివై నన్ను కాపాడుచున్నావు. తండ్రివై పోషించు చున్నావు. పత్నివై నాలో ప్రేమను గల్గించుచున్నావు. శరీరమై పెరుగు చున్నావు. పురాకృతకర్మవై అనుభవమునకు వచ్చుచున్నావు. ఇల్లై, ప్రాంగణమై ముదము ఘటించుచున్నావు. అయ్యవారివై చదువులు గఱపుచున్నావు. కొడుకువై కడతేర్చు చున్నావు. అపురూపమైన నిధివై యున్నావు. ప్రభుడవై నన్ను పాలించుచున్నావు. బంటువై నాకు పనులు చేయుచున్నావు. స్థిరమైనసంపద లిచ్చు చున్నావు. ఎంత దయగలవాడవో ! దేవుడవై నాచే పూజింపబడుచున్నావు. నాకు దిక్కు, నాప్రాణము నీవే. నే నెట్లు భావింతునో అట్లే సాక్షాత్కరించుచున్నావు. నాచిత్తములో నీవు నిండియున్నావు. మహోన్నతమైన వైకుంఠమునే అనుగ్రహించుచున్నావు. నీ మహిమ యెంతటిదయ్యా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| వేరొక్కరూ లేరు | 25 | 142 | 15 | 94 |

అవ: తనకై చేసికొనవలసిన దేమియు లేకున్నను భగవానుడు భక్తులకొఱకే అన్ని పాట్లు పడుచున్నా డనుచున్నాడు.

సీ. **ఆలుబిడ్డలకెగా యఖిలసంసారులు**
**సాగించునట్టి సంసారయాత్ర;**
**ఇతవుగా జగము లీ వేలెడు విధమెల్ల**
**కొలుచు నీ దాసుల కొఱకె సుమ్ము;**
**రాజ్యమ్ము లేలుట రాజులు పదపడి**
**బానిసలకు మఱి బంట్లకుఁ గద**
**శ్రీదేవి భూదేవి చెట్టపట్టుట నీవు**
**నమ్మిన దాసవర్గమ్ము కొఱకె**

గీ. **కైదువు ధరించి పురుషుండు కాచుటెల్ల**
**కేవలము తనవారు సుఖించుకొఱకె**
**నీవు చక్రమ్ముపట్టుట నీదుదాసు**
**లవని వెలయుటకే వేంకటాద్రిదేవ !** **50**

వేంకటస్వామీ ! గృహస్థులు సాగించు సంసారయాత్ర తమ ఆలుబిడ్డల కొఱకేగదా ! అట్లే నీవును ఈ జగములను పరిపాలించుట నిన్ను సేవించు నీదాసుల కొఱకే. రాజులు రాజ్యము లేలుట త మ్మాశ్రయించిన భృత్యులను సాకుటకేగదా, అట్లే నీవు శ్రీదేవిని భూదేవిని పెండ్లాడుట నిన్ను నమ్మిన సేవకుల క్షేమముకొఱకే. ఒకడు ఆయుధము చేబూని కావలిగాయుట తనవారి సౌఖ్యము కొఱకే. అట్లే నీవును సుదర్శనాయుధము చేబూనుట నీభక్తజనులు సుఖముగా మన గల్గుటకే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీకేమిటికే గడమ | 33 | 183 | 15 | 122 |

అవ: భగవద్భక్తులకు అశుభము లెల్లతొలగి శుభములు సమకూడు ననుచున్నాడు.

సీ. **అచ్చుగ నీ నామ ముచ్చరించుచు సర్వ**
**పాపవిముక్తులౌ పావనులకుఁ**
**గాలదోషము లేవి ? కర్మదోషము లేవి ?**
**జగమున శకునదోషమ్ము లేవి ?**
**నీ పాదదాసులై నిరయమ్ము తరియించి**
**వైరముల్ దాఁటిన వైష్ణవులకు**
**మంత్రలోపమ్ములు మఱి క్రియాలోపమ్ము**
**లాచారలోపమ్ము లరయ నేవి ?**

గీ. **మించి మీసేవ భవములు ద్రెంచినట్టి**
**ధన్యశరణాగతులకు దుస్తరము లైన**
**మాయ లేవి? వేంకటనాథ! మానరాని**
**బాధ లేవి? చొప్పడని శుభమ్ము లేవి ?** 51

శ్రీవేంకటేశ్వరా ! నీ నామోచ్చారణ గావించుచు పాపరహితులైన పావన చరిత్రులకు కాలదోషము లంటవు. కర్మదోషము లంటవు. శకునదోషము లంటవు.

నీ దాస్య మొనర్చి నరకబాధలు తరించి వైరభావములు గడచిన శ్రీవైష్ణవులకు మంత్రలోపములు, క్రియాలోపములు, ఆచారలోపములు లేవు. అట్లే నిన్ను సేవించి భవబాధల బాపుకొన్న ధన్యాత్ము లైన ప్రపన్నులకు దాటరాని మాయలు లేవు. తొలగ ద్రోయరాని కష్టములు గూడ లేవు. అందరాని మంగళములు సైతము లేనే లేవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నెమ్మది నిన్నే గొలిచి | 16 | 89 | 15 | 59 |

అవ: దైవమా ! నిన్ను నమ్ముకొని నాయిచ్చవచ్చినట్లు ప్రవర్తించితిని. ఏమి చేసినను నీదే భార మనుచున్నాడు.

**సీ. నీ దాసదాసుండ నే నను సలిగతో**
**వృజినమ్ముల కొకింత వెఱవ నైతి;**
**నీదుమఱుఁగుసొచ్చి నిగుడు గర్వమ్ముచే**
**నేమమ్ము లన్ని మానితిని నేను;**
**తనువుపై నీముద్ర దాల్చిన చనవునఁ**
**బాటిగ వేల్పులపంపు సేయ;**
**నాల్కపై నుండె నీ నామమన్ బీరాన**
**గంగఁ గల్పితి నిత్యకర్మములను**

**గీ. ఉల్లమున నెల్లపుడు హత్తి యుంటి వనుచు**
**నుత్తమోపాయముల నెల్ల నొల్ల నైతి;**
**ఏలికవు నీవ యని నమ్మి యితరచింత**
**మఱచితిని; ఆజ్ఞఁ బెట్టుము తిరుమలేశ !** 52

స్వామీ ! నీ దాసులకు దాసుడనన్న చనవుతో ఎన్నో పాపకృత్యము లొనర్చితిని. నీ మఱుగున నున్నానన్న పెనుగర్వముతో నియమములు విడిచి విచ్చలవిడిగా తిరిగితిని. నీ ముద్రలు శరీరముపై ధరించితినన్న చనవుతో అన్యదేవతల ఆజ్ఞలు సరకుగొననైతిని. నీ నామము నా నాల్కపై నటించుచున్న దన్న బీరముతో నిత్యకర్మములను గంగలో గల్పితిని. అంతర్యామివై నా హృదయమున నెలకొనియున్నా వన్న విశ్వాసముతో శాస్త్రోక్తములైన ఉత్తమోపాయములను శీలించనైతిని. నీవే నాకు ప్రభుడవని నమ్మి ఇతరచింతలెల్ల విస్మరించితిని. దైవమా ! నాతప్పుల కేమి శిక్ష విధింతువో నీ చిత్తము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏ యాజ్ఞ అయినఁ బెట్టు | 5 | 30 | 15 | 20 |

అవ: ప్రాణులు సహజముగ పాపములవైపే మ్రొగ్గుదురు. పుణ్యమువంకకు పోరు. వారిని దైవమే కాపాడవలె ననుచున్నాడు.

సీ. **ముక్కున నున్నది మూంగోప మియ్యది**
**యెక్కుడుశాంత మ్మి కెందుఁ గలదొ ?**
**చిక్కని యాసలు చేతిలో నున్నవి**
**గ్రక్కున విరతిని గనము గాని**
**కన్నుల నున్నది కామాంధకారమ్ము**
**పొందైన విజ్ఞాన మెందుఁ గలదొ ?**
**ఉన్నది నాలుక నూరక దైన్యమ్ము**
**ఘనమైన ధైర్యమ్ము కనము గాని**

గీ. **తనువునం దనాచారముల్ తాండవించు**
**నివల సద్ధర్మ మన్నది యెందుఁ గలదొ ?**
**పాప మెప్పుడు చేరువ ప్రాణితతికి ;**
**వృషగిరీశ్వర ! భవము నీ దేర్చవయ్య !** **53**

వృషాద్రినాథా ! ఇదిగో నాకు కోపము ముక్కుమీదనే యున్నది. శాంతము దరిదాపులలో నెచ్చటను లేదు. ఆశలెల్ల చేతిలోనే యున్నవి. వైరాగ్యము పొలకువయే కాన్పించుటలేదు. కామాంధకారము కన్నులలో గ్రమ్మినది. విజ్ఞాన మెందుపోయినదో తెలియదు. దైన్యము నాలుకపై నిలిచియున్నది. ధైర్యము నిలువనీడ లేని దైనది. అనాచారములు శరీరమం దంతట నలమినవి. ధర్మ మెందేగినదో తోపదు. ప్రాణులకు పాపమే సన్నిహిత మైనది. పుణ్యము జాడ కాన్పించుట లేదు.

దేవా ! నీ వే పూనుకొని ఈ జీవులను భవబంధమునుండి విడిపించి పరిరక్షింపవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పాపము చేరువ | 9 | 50 | 15 | 33 |

అవ: ఎల్లవేళల బంటై దేవుని వెన్నంటియున్న తన్ను గాచుట ఆతని కర్తవ్య మనుచున్నాడు.

సీ. ప్రాఁతబంటను క్రొత్త బంట నాఁడును నేఁడు
నివల జీతమ్మిచ్చి యేలుకొనవె
ఇరువదినల్వుర కిట్టె నే గమికాఁడ
నరిది దేహపుటూరి యమర గాఁడ
నల్ల తెల్లనిజల్లి నుల్లసిల్లెడు వాఁడ
కాముగరిడి కత్తి సామువాఁడ
పడఁతులచూడ్కుల పగటి దివ్వెలవాఁడ
నార్వురతోఁ బీకులాడువాఁడ

గీ. ఎక్కి దిగినట్టివాఁడ నేడేడుజగము
లీద సంసారవారాశి నీదువాఁడ;
వెదకితిని నీ వొకండవె విభుఁడ వనుచు
నేలుకొను మయ్య ! వేంకటాద్రీశ ! నన్ను. 54

వేంకటస్వామీ! నాటికిని నేటికిని నేను నీకు కింకరుడనే. నాకు తగిన వేతన మిచ్చి న న్నేలుకొనుము. నేను ఇర్వదినల్వురకు నాయకుడను. దేహ మనెడి సీమకు పాళియగాడను. నెరసి నెరయని తలవెంద్రుకలుగల్గి ప్రౌఢ నిర్భరవయః పరిపాకములో నున్నవాడను. మన్మథు డనెడు గరిడియందు కత్తి సాములో ఆరితేరిన వాడను. ఇంతుల చూపులనెడి పగటిదివ్వటీలతో ప్రకాశించు వాడను. ఆరుమందితో ఏకకాలములో పెనగులాడుతున్నవాడను. పదునాలుగు లోకము లెక్కి దిగిన శూరుడను. సంసార మనెడి సాగరములో ఈదులాడువాడను. నాకు తగిన విభు డెవ్వడా యని వెదకితిని. అట్టిదొర నీవే యని నిర్ణయించి కొంటిని. దేవా ! న న్నేలుకొనుము.

పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచప్రాణములు, పంచవిషయములు (శబ్దస్పర్శరూపరసగంధములు) మనో బుద్ధి చిత్తాహంకారములు అనునవి ఇరువదినాల్గుతత్త్వములు.

కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు - షడ్వర్గము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కొత్త బంట పాఁత బంట | 7 | 39 | 15 | 26 |

అవ: నన్ను నేనే రక్షించుకొను శక్తియుక్తులు నాకు లేవు. దీనుడనైన నన్ను రక్షించుభారము నీదే యని భగవంతుని వేడుకొనుచున్నాడు.

సీ. **పురుషోత్తమా! బుద్ధిగఱపికావుము నీవె**
**శిరమెత్తుకొని నవ్వ సిగ్గునాకు;**
**పంచేంద్రియములతో వఱలు దేహము మోచి**
**యే జితేంద్రియుఁడ నే యోజ నగుదు ?**
**పలుకోర్కు లనియెడి వలలోఁ దగుల్కొని**
**యింతలో ముక్తుండ నెట్టు లగుదు ?**
**పూర్వకర్మములఁ బుట్టుక గని యెల్ల**
**వారిలో జ్ఞాని నె ట్టంగి నగుదు ?**
**మాయసంసారమ్ము మరగిన వాఁడనై**
**పొరి విరక్తుండ నే కరణి నగుదు ?**

గీ. **పాపపుణ్యాల లోకుల పంక్తి నుండి**
**పరఁగ నీ భక్తివాఁడ నే పగిది నగుదు ?**
**కృపను రక్షించి నీవె సత్కీర్తి గొనుము**
**పన్నగాచలనాథ ! యీ పాటివాఁడ.** 55

పరమపురుషా ! నాకు బుద్ధిగఱపి నన్ను నీవే రక్షింపుము. నేను అస్వతంత్రుడను. దీనుడను. పదిమందిలో తలయెత్తుకొని తిరుగలేని లజ్జాకరమైన స్థితిలో నే నున్నాను. ఐ దింద్రియములతో కూడిన శరీరము నేను మోయుచున్నాను. మఱి నేను ఇంద్రియవిజేత నెట్లు కాగలను? లెక్కకు మిక్కుటమగు కోర్కు లనెడి వలలో తగుల్కొని యున్నాను. వాటినుండి నే నెట్లు విడుదల పొందగలను? పురాకృతకర్మప్రభావమున ఇప్పు డీ జన్మము నెత్తియున్నాను. ఇక నే నెట్లు జ్ఞానిని కాగలను? మాయామయమైన సంసారరుచి మరగియున్నాను. ఇక నాకు వైరాగ్యమెట్లు కల్గును? సుకృతదుష్కృతముల నాచరించుచు తత్ఫలముల ననుభవించు జనులవరుసలో నే నొకడను. నీకు భక్తుడ నెట్లు కాగలను? శేషాచలేశ్వరా? ఇంత దీనస్థితిలో నున్న నన్ను దయతో రక్షించి నీవు పేరుప్రఖ్యాతులు గడించుకొనుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పురుషోత్తమ నీవే బుద్ధిచ్చి | 6 | 37 | 15 | 25 |

అవ: గోపబాలుడయి క్రీడించిన భగవానుని దివ్యప్రభావమును కీర్తించు చున్నాడు.

సీ. నిగమాంతవిదు లెల్ల నీవు పసులఁ గావ
వెగటుగా నాఁడెందు వెదకినారొ ?
జగతి గొల్లెతలను దగిలిన నిన్ను యో
గులు ధ్యాన మేక్రియఁ జలిపినారొ ?
పాలు దొంగిల నీవు పరమగురుల్ నీ మ
హిమ లే మనుచు వచియించినారొ ?
పాఱాడ నీవు వ్రేపల్లెలో సుర లెట్టు
లతిముతి నీ వెంటఁ దిరిగినారొ ?

గీ. కూడి నీవు గోపాలురతోడ నాఁడ
మునులు ని న్నెట్లు పొగడిరో ? ఘనవృషాద్రి
నెసఁగు శ్రీవేంకటేశ ! నీ వెదుట నుండ
దాసు లెటు మెచ్చెదరొ ? యద్భుతంబు గలుగు ? 56

శ్రీవేంకటేశ్వరా ! నీవు వ్రేపల్లెలో గోవులు గాచుచుంటివి. వేదాంత వేత్తలు ని న్నెక్క డెక్కడ వెదకినారో ? నీవు వ్రజసుందరులతో విహరించు చుంటివి. అట్టి నిన్ను యోగు లెట్లు ధ్యానించిరో ? నీవు గొల్ల పల్లెలో పాలు దొంగిలించు చుంటివి. అట్టి నీ ప్రభావమును గురువర్యు లేమని కీర్తించిరో ? నీవు గోకులములో విచ్చలవిడిగా విహరించితివి. అట్టినిన్ను ఇంద్రాదిదేవత లెట్లనుసరించిరో ? నీవు గోపబాలురతో గూడి యాటలాడితివి. మునీంద్రులు ని న్నెట్లు శ్లాఘించిరో? వృషగిరిపై నున్న శ్రీనివాసా ! నీవు కన్నులయెదుట కనబడుచుండ నీ దాసులు ని న్నెట్లు కొనియాడుదురో ? ఇంతయు నూహించినచో పరమాశ్చర్యము కల్గుచున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అందుకే వెఱఁగయ్యాని | 5 | 36 | 15 | 24 |

అవ: తనకున్నది భగవదర్పణము కావించుటయే తన యారాధనావిధాన మను చున్నాడు.

సీ. ధరణీధరా ! నాదు తప మెట్టిది యనంగ
 నీకు మీఁదెత్తుటే నిండుమనసు ;
పరఁగ నాకుంగల భక్తి యెట్టిదియన
 నాయాత్మ నీ కర్పణ మ్మనుటయె;
సొరిది నీపై నాదుస్తుతి యెట్టిదన్న నా
 నుడులు నీ కప్పన మ్మిడిఁతి ననుటె
వడి నేను గైకొన్న వ్రత మెట్టిదనఁగ నీ
 సొమ్ము నే నని శరణమ్ముఁ జొరుటె

గీ. శీల మెట్టిది యన శేషశిఖరినిలయ !
వాసిగా నీదు దాసానుదాసుఁ డనుటె
ఏను పూజించువిధము మఱెట్టిది యన
మురియుచును నీ పదాలకు మ్రొక్కుటింతె. 57

భూదేవి నుద్ధరించిన శ్రీవేంకటేశ్వరా ! నాచిత్తమును నీ కర్పించుటయే నేను నిన్నుగూర్చి సలుపునట్టి తపము. నా యాత్మను నీకు సమర్పించుటయే నీయెడ నాకుగల భక్తి. నా మాటలెల్ల నీ కర్పించుచున్నా ననుటయే నిన్ను నేను స్తుతించు విధానము. నేను నీవాడను అని నిన్ను శరణుజొచ్చుటయే నేను పూనిన వ్రతము.

శేషాద్రినిలయా ! నేను నీదాసానుదాసుడ ననుటయే నా శీలము. మోదముతో నీ పాదములకు నమస్కరించుటయే నేను నిన్ను పూజించుపద్ధతి. ఇంతకంటె నే నేమియు చేయజాలను .

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మఱి నేనేమి సేయఁగలను | 71 | 407 | 15 | 274 |

అవ: జీవరక్షణము దేవుని కొక లీలామాత్రమే. జీవుడు దానితోనే కడతేఱగల డనుచున్నాడు.

సీ. నీవు న న్మన్నించ నీ మహిమమునకు
లోటు వాటిలునె ? యీ లోభ మేల ?
క్షీరాంబునిధినుండి చిన్ని తుంపురు చేత
విదిలించ నొదవెడు వెలితి యెంత ?
వెడకర్మములు సల్పు జడుఁ దౌదుఁ బ్రోచిన
గొడవ వచ్చునె నీకుఁ ? గొంక నేల ?
గడుసుచోరుఁడు కొండ గవిలోన దాఁగిన
నెడమిచ్చు కొండకు నేమి చెట్ట ?

గీ. కరుణ నామీఁద వేంకటగిరినివాస !
చిందరాదయ్య ! సందియ మ్మంద నేల ?
అఱిగిపోవునె కిరణమ్ము లందఱిపయి
భానుఁ డెండలు గాచిన మానకుండ. 58

'శేషశైలవాసా! నీ వనంతమహిముడవు. నన్ను రక్షించుటచేత నీ మహిమమున కెట్టి లోటు వాటిల్లదు. మఱి నీకీ లోభ మెందులకు ? క్షీరసాగరము నుండి ఒక్కచుక్కను విదిలించినచో ఆ పాలవెల్లికి కలుగు వెలితి లేదుగదా !

నేను వెట్టిపనులుచేయు వెంగలిని. అయినను నన్ను కాపాడినంత మాత్రమున నీకు ఏ విధమైన సంకటము రాదు. మఱెందుకు జంకుచుంటివి? ఒకగజదొంగ కొండగుహలో నక్కినచో అతనికి తా వొసంగిన ఆ కొండకు కలుగు నష్ట మేమి ?

ప్రభూ ! నామీద కృపారసము చిలుకరాదా ! ఎందులకు సంశయిం తువు? సూర్యుడు అందఱిమీదను నిరంతరము కిరణప్రసారము చేయుచున్నాడు. అంతమాత్రమున అతనికిరణము లఱిగిపోవునా ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| 'నేనై తే నీ దేరుదు | 4 | 22 | 15 | 15 |

అవ: భగవానునిదొరతనములో ప్రపన్నులకు ఏ విధమైన లోటు కలుగ కుండుటయేగాక వారు మహోన్నతస్థితిని ప్రాపింతు రనుచున్నాడు.

సీ. వెంటఁబడును సుంత వెఱచిన భూతమ్ము
లభయం బొసంగెద వరసి నీవు;
భక్తి చేసిన క్రిందుపఱచెద రింతులు
నీయంతవానిని జేయు దీవు;
పనులుసేయింతురు బంట్లచే నేలికల్
తమభార మీవె యొౌదల వహింతు;
సాగిలఁబడువారిఁ జౌకసేయుదు రొరుల్
ఘనులఁ జేయుదు వీవు కంటులేక ;

ఆ. వినయపరులఁ గన్న వేసరుదురు దొర
లాదరించుచుందు వనిశ మీవు;
నిన్ను నమ్మిన యెడ నీ దాసకోటుల
నెపుడుఁ బ్రోతు వీవు వృషగిరీశ ! 59

వేంకటాచలనాథా! ఇంచుకభయపడినచో భూతములు పైబడును. కాని నీయందు భయభక్తులు గలవారికి అన్నిప్రొద్దుల నీ వభయ మిత్తువు. అనుస రించినవారిని అంగనలు చులుకనగా జూతురు. కాని నిన్ననుసరించువారిని నీవు నీయంతవారిని చేయుదువు. ప్రభువులు భృత్యులచే వివిధకర్మములు చేయించుకొందురు. కాని నీవు నీభృత్యులభారము నంతయు ఔదల వహింతువు. సాష్టాంగప్రణామము లొనర్చువారలను ఇతరులు హీనముగా జూతురు. కాని నీకు మ్రొక్కినవారిని నీవు కడుదొడ్డవారిని జేయుదువు. వినయవంతులైన వారిని గని యజమానులు ఈసడించుకొందురు. కాని నీవు వినీతులను నిత్య మాదరింతువు. ప్రభూ ! నిన్ను నమ్మిన నీ దాసవర్గమును నీ వెల్ల వేళల చల్లగా జూతువు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| సులభమున నున్నది | 54 | 307 | 15 | 207 |

అవ: మాయాప్రభావముచే జీవులు దైవమార్గమునకు దవ్వగుచున్నారు. దైవమే వారిని మాయనుండి తప్పించవలె ననుచున్నాడు.

**సీ. మోపు మోయనెగాని ములుగఁ బ్రొద్దేలేదు**
**శ్రీపతి ! మాపాట్లు చిత్తగింపు;**
**మన సెంతయో గద్దు మాయలఁ జింతింపఁ**
**జొనుప విరక్తికిఁ జోటు లేదు;**
**తను వెంతయోగద్దు దప్పికి నాఁకటి;**
**కింతజ్ఞానమ్మున కెడము లేదు;**
**నాలు కెంతయొ గద్దు నాటిసుద్దులు సెప్ప**
**గోవింద యనుటకుఁ దావు లేదు;**
**కాల మెంతయొ గద్దు కర్మముల్ పచరింప**
**వేళము కీర్తింప వేళలేదు**

**గీ. బలిమి యెంతేని గద్దు పాపము లొనర్ప**
**చలమునం బుణ్యము లొనర్ప శక్తి లేదు;**
**మంగ చెలువుఁడ ! కరుణ నీమాయ నీవె**
**తెలియఁ బఱచినప్పుడెగాని తెగువ లేదు.** **60**

లక్ష్మీపతీ! మాబాధల నేమని చెప్పగలము ? ఇదిగో చిత్తగింపుము. బరువులు మోయుటకేగాని మూల్గుటకుగూడ మాకు సమయము లేకున్నది. కల్లరివిషయముల నాలోచించుటకు మాకు చాలినంతమన సున్నది. వైరాగ్యమున కన్ననో ఆ చిత్తమున ఒకింత తావులేదు. ఆకలిదప్పులకు, వాటిని తీర్చుకొనుటకు మాకు కావలసినంత శరీర మున్నది. కాని అందులో విజ్ఞానమున కిసుమంత చోటులేదు. వెనుకటి సుద్దులు వల్లెవేయుటకు వలసినంతనాలుక గలదు. కాని ఓపికతో ఒక్కసారి గోవిందా యనుటకు మాత్రము దానికి తీరికలేదు. లేనిపోని కర్మలుచేయుటకు ఎంతోకాలము గలదు. కాని నిన్ను కీర్తించుటకు మాత్రము ఒకక్షణమేని తీరుబడి లేదు. పాపకృత్యము లొనర్చుటకు ఎంతో బలము గలదు. కాని రవంతపుణ్యము సల్పుటకు శక్తి మృగ్యము.

మంగేశ్వరా ! ఇంతయు నీ మాయ. నీవై దయదలచి ఈ మాయనుండి తప్పించుకొనుమార్గ ముపదేశించినగాని మాకు తెంపు లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మోపు మోయనే కాని | 35 | 199 | 15 | 133 |

అవ: సర్వధా పరతంత్రులైన జీవులను సర్వస్వతంత్రుడైన సర్వేశ్వరుడే కరుణింప వలె ననుచున్నాడు.

సీ. కడలేని యాయువు గల్గినఁగద నీదు
సృష్టి నొక్కొకటి వీక్షింపవచ్చు ;
కాళ్ళెన్నొ కల్గినఁగద నీదుమూర్తికి
లలిఁ బ్రదక్షిణములు సలుప వచ్చు;
కరములు వేవేలు గలిగినఁగద నిన్ను
చిత్త మారంగఁ బూజింప వచ్చు;
నాల్క లెన్నియొ కల్గినంగద నీసుగు
ణాళి సారెకుఁ గొనియాడవచ్చు;

గీ. ఏను పరతంత్రుఁడ; స్వతంత్రుఁ డీవు; మఱి య
నంతుఁ డీ వణుమాత్రుండ నయ్య ! నేను
తారతమ్యం బెఱిఁగి నాకుఁ దగిన శక్తి
నిచ్చి సేవలు గైకొమ్ము వృషగిరీశ ! 61

దేవా ! నీసృష్టి విచిత్రము; అనంతము; ఇందలివిశేషము లెల్ల నొక్కొక్క టిగా పరికింపవలె నన్నచో అనంతమైన ఆయుష్యము కావలసియున్నది. నీవు విశ్వమూర్తివై విలసిల్లు దేవుడవు. నీ మూర్తికి ప్రదక్షిణములు సల్పవలె నన్నచో ఈ రెండుకాళ్లు చాలవు. ఎన్నోకాళ్ళు కావలెను. అట్లే నిన్ను మనసార పూజింప వలె నన్నచో ఈ రెండుచేతులు చాలవు. ఎన్నో చేతులు కావలెను. నీ వనంత కల్యాణగుణనిలయుడవు. నీ గుణములను కొనియాడవలె నన్నచో ఈ యొక్క నాలుక చాలదు. ఎన్నో నాల్కలు కావలెను. నేనా పరతంత్రుడను. నీవో స్వతంత్రు డవు. మఱియు నీ వనంతుడవు. నేను అణుస్వరూపుడను.

శ్రీనివాసా ! ఈ భేదమును గుర్తెఱింగి నాకు తగిన సామర్థ్యమును ప్రసాదింపుము. నాసేవలు చిత్తగింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పరతంత్రులు జీవులు | 55 | 312 | 15 | 210 |

అవ: భగవన్మహిమ వర్ణనాతీత మనుచున్నాడు.

సీ. **అసురసంతతికి భయంకరుండవు దేవ**
**గణమున కానందకరుఁడ వెపుడు**
**పరమమౌనులకు తపఃఫలదుండవు**
**పలుకంగ వశమె నీ భవ్యమహిమ ?**
**అఖిలవేదమ్ముల కాధారమవు నీవు**
**పరఁగ జీవుల కెల్లఁ బ్రాణపతివి**
**వరయోగులకుఁ బరబ్రహ్మభూతుండవు**
**తిరముగ నీ మూర్తిఁ దెలియఁ దరమె ?**

గీ. **సర్వవిధబాంధవుండవు జగములకును**
**కమలసంభవునకు నివాసమవు నీవు**
**వైష్ణవులకు శ్రీవేంకటవల్లభుఁడవు**
**తలఁప శక్యంబె నీ యద్భుతంపుకథలు ?** **62**

ప్రభూ! నీవు రాక్షసగణమునకు భీతిగొల్పువాడవు. దేవతానీకమునకు సంతోషదాయకుడవు. పరమమునీంద్రులకు తపఃఫల మొసంగువాడవు. లోకోత్తర మైన నీ ప్రభావము ఇట్టిదని చెప్ప శక్యముగాదు.

సమస్త వేదములకు ఆధారభూతుడవు నీవే. జీవు లందఱకు నీ వే ప్రాణేశ్వరుడవు. యోగివర్యులకు పరబ్రహ్మమైనవాడవు నీవే. నీ మూర్తి ఇద మిత్థమని గట్టిగా చెప్పుటకు వీలుగానిది.

లోకములకు సకలవిధముల చుట్టము నీవే. బ్రహ్మకు నెలవైనవాడవు నీవే. నీవు శ్రీవైష్ణవులకు శ్రీవేంకటనాథుడవు. ఆశ్చర్యావహములైన నీకథలు భావింప తరముగా కున్నవి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అనంత మద్భుత మాశ్చర్యం బిది | 54 | 308 | 15 | 207 |

అవ: యదుకులోద్భవుని శృంగారలీలలను వర్ణించుచున్నాడు.

సీ. యాదవభామినీ యౌవనవనములోఁ
జరియించు గంధగజంబ నీవు;
సత్యభామామనోజలజ సౌరభ్యమ్ము
మరగిన మత్తబంభరమ వీవు;
ప్రణయిని రుక్మిణీ బాహుపంజరములో
రహిఁ గుల్కు రాజకీరంబ వీవు
సతులు పదార్వేల జంటకన్గల్వల
కింపైన యిందుబింబంబ వీవు;

ఆ. కొలనిలోని చెలుల గుబ్బచన్గొండల
వ్రాలినట్టి జలధరంబ వీవు;
సిరి నురమున మోచి శ్రీవేంకటాద్రిపై
వరము లిచ్చు కల్పతరువ వీవు. 63

శ్రీవేంకటేశ్వరా ! నీవు గోపకామినుల యౌవన మనెడి వనమునందు స్వేచ్ఛగా విహరించు గజరాజువు. సత్యభామయొక్క చిత్తమనెడి పద్మమునందలి సువాసన ఆఘ్రాణించుట కలవాటుపడిన గండుతుమ్మెదవు. ప్రణయమూర్తియగు రుక్మిణీదేవియొక్క భుజమనెడి పంజరములో విలసిల్లు రాచిలుకవు. పదునాల్గు వేల రాచకన్నియల నేత్రయుగళము లనెడి కుముదములకు ఇంపుగొలుపు చందమామవు నీవు. మడుగులోని మగువల కుచదుర్గములపై వ్రాలిన మేఘుడవు నీవు. లక్ష్మీ దేవిని వక్షస్థలమున నుంచుకొని వేంకటాచలముపై నెలకొని భక్తులకు అభీష్టవరములు ప్రసాదించు కల్పవృక్షము నీవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మేలుకో శృంగారరాయ | 38 | 215 | 15 | 143 |

అవ: భగవంతునకు సంతృప్తి కల్గునట్లు తా నేమియు సమర్పింపలేదు గాన
దయునకు తన్నే సమర్పించుకొనుచున్నా ననుచున్నాడు.

సీ. నీకొఱకయి యుందు నిత్రుపాసం బన్న
నందేమి లాభంబు గందు వీవు ?
జట్టిగా నినుఁగూర్చి సన్న్యసించెద నన్న
దాన నీ కేమి సంతసము గలుగు ?
చరణతీర్థంబగు చదలేట నానిన
జనియించునే సుంత తనివి నీకు ?
వనములో ఘోరతపమ్ము సల్పెద నన్న
ఫలమేమి నీకు సంప్రాప్త మగును ?

గీ. గడ్డముం బెంచెదను నిన్నుఁ గన్న దాఁక
ననిన నొఱగెదు సుఖము కాసంత గలదె ?
నీ కె సెలవని నెపమిడఁబోక యూర
కేను నీవాఁడ నైతిని శ్రీనివాస ! 64

వృషాద్రిపతీ ! నీ కొఱకు నేను శుష్కోపవాసము లుండెద నన్నచో అందువల్ల నీకేమిప్రయోజనము ? నిన్ను గూర్చి సన్న్యసింతు నన్నచో అందువల్ల నీకు ఏమి యానందము కల్గును ? నీపాదతీర్థమగు ఆకాశగంగలో స్నానముచేతు నన్నచో అందువల్ల నీకు ఇసుమంతైన తృప్తి జనించునా ? అడవిలో తీవ్రతప మాచరింతు నన్నచో అందువల్ల నీకు గల్గు మేలేమి ? నీవు సాక్షాత్కరించువఱకు గడ్డము పెంచెద నన్నచో అందువల్ల నీకుగల్గు సుఖము రవంతయు లేదుగదా!

కాన నివియన్నియు నీకు సమర్పణము అని చెప్పుటవల్ల నీకు లాభమేమియు లేదు. కనుక నన్ను సర్వాత్మనా నీకు సమర్పించుకొని నీవాడ నైతిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీకే సెలవని | 63 | 363 | 15 | 244 |

అవ: భగవంతుని వినుతించుట తనకు శక్యముగాని పనియైనను కొనియాడక మాన ననుచున్నాడు.

సీ. త్రిదశులనోళ్ళు ముప్పదిమూఁడుకోటులు
కుండలిజిహ్వలు రెండువేలు
అగణితానంతముల్ నిగమశబ్దంబులు
నిను నుతింపఁగ లేవు నే నిఁ కెంత ?
అష్టాదశపురాణశిష్టవాక్యంబులు
సనకాదిమునివచస్సంచయంబు
వ్యాసవాల్మీకుల భాసురోపమలును
నిను నుతింపఁగ లేవు నే నిఁ కెంత ?

గీ. సప్తకోటిమంత్రార్థముల్ సరవి నేఁబ
దాఱువర్ణాలగుణితమ్ము లహినగేశ !
నిను నుతింపఁగఁ జాలవు నే నిఁ కెంత ?
ఐనఁ బొగడెదఁ గృపతోడ నాలకింపు. 65

శేషశైలాధీశా ! ముప్పదిమూడుకోట్ల నోళ్లతో దేవతలు, రెండువేల జిహ్వలతో ఆదిశేషుడు, అనంతములై లెక్కకు మిక్కుటమైన వేదశబ్దములు నిన్ను కొనియాడనేరకున్నవి. మఱి నేనా నిన్ను స్తుతించువాడను ?

పదునెనిమిదిపురాణములలోని సద్వచనములు, సనకుడు మున్నుగాగల మునుల యొక్క వాక్యసముదాయములు, వ్యాసుడు, వాల్మీకి ఊహించిన ఉజ్జ్వలములైన ఉపమలు, నిన్ను స్తోత్ర మొనర్పలేకపోయినవి. ఇక నేనెంత ? ఏడుకోట్లమంత్రముల యర్థములు, ఏబది యాఱువర్ణముల కలయికలు, నిన్ను మెచ్చలేక పోయినవి. నే నెంతవాడను ? అయినను శక్తికొలఁది నిన్ను పొగడక మానను. దయతో నా వినుతు లాలకింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఐనాఁగాని నే నోపినంత | 61 | 349 | 15 | 235 |

అవ: అజ్ఞుడగు తన్ను గాపాడుట దేవుని కర్తవ్య మనుచున్నాడు.

సీ. నావలె నీవు నానాభోగలోలుండ
వా ? బుద్ధియెఱుఁగనివాఁడ వేమి ?
భావించ జీవుండఁ బ్రకృతి యిట్లైన లో
వెలుఁగు దేవుండవు తెలుప వలదె ?
చంచలమతివె ? సంసారబద్ధుండవా ?
యెంచ నావలె నీ వకించనుఁడవ ?
మార్గ మెఱుంగని మందుఁడ నైతిఁబో
మంచినెచ్చెలి వెచ్చరించ వలదె ?

ఆ. హీనగుణుఁడ వేమి? యేమఱువాఁడవా ?
పామరుఁడవ ? నూతఁబడెడు బిడ్డఁ
బట్టవలదె ? మాకు చుట్టంబవు గదయ్య !
కరుణ మూర్ఖజనునిఁ గాచ వలదె ? **66**

దేవా! నేను వివిధభోగాసక్తుడను. బుద్ధిలేనివాడను. నావలె నీవు భోగలోలువుడవు కాదుగదా ? బుద్ధిహీనుడవు కాదుగదా? నేను జీవుడను. ప్రకృతికి లోబడిన వాడను. కావున నజ్ఞతతో ప్రవర్తించుట నాకు సహజము. నీవు నాలో వెలుగు దేవుడవు. నేను తరించు మార్గము తెలుపవలదా? నీవు నావలె చలపచిత్తుడవు కాదుగదా? సంసారములో బంధింపబడి లేవుగదా! ఏమియు లేనివాడవు కాదుగదా?

నేను త్రోవతెలియని వాడను. నీవు నాకు మంచిమిత్రుడవై యుండియు నన్నపమార్గమున బడకుండ హెచ్చరించవలదా ? నీ వేమి గుణహీనుడవా ? ఏమఱుపాటు గలవాడవా ? అజ్ఞుడవా ? అన్నియు తెలిసినవాడవై యుండియు బావిలో బడెడు బిడ్డను పట్టుకొనవలదా ? నీవు మాకు పోరానిచుట్టమవు గదా? మూర్ఖుడనైన నన్ను దయతో రక్షించుట నీ కర్తవ్యము గాదా ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అనాథుల రక్షించేది | 64 | 366 | 15 | 246 |

అవ: కర్మబంధములో జిక్కిన తన్ను రక్షింపుమని శ్రీనివాసుని వేడుకొను చున్నాడు.

సీ. **మచ్చిత్త మనియెడి మత్త వారణమిది**
**సంసార మనియెడి సరసిc జొచ్చి**
**అకట ! రాజద్వారమకరిచేతను జిక్కె**
**రక్షింపcగదె కరిరాజవరద !**
**ప్రాణపంచక మను భ్రాత లేవురు గూడి**
**తనువను కాంత నుద్వాహ మాడి**
**దుస్సంగ మను ఘోరదుర్గమాటవులందుc**
**జరియింత్రు పాండవవరద ! బ్రోవు**

గీ. **సరగc గామ్యకర్మంబను శాప మొంది**
**జడమతిని దేహి నిట్లు పాషాణ మయితి;**
**త్వచ్చరణధూళి మోపి కాపాడు మయ్య !**
**అంజనగిరీంద్రవాస ! అహల్యవరద !** **67**

అంజనాద్రివాసా ! శ్రీనివాసా ! నా మనస్సనెడి మదపుటేనుగు సంసార మనెడి మడుగులో ప్రవేశించినది. అచ్చట రాజద్వార మనెడి మొసలిచేత చిక్కు పడినది. గజేంద్రవరదా ! నన్ను రక్షింప రావయ్యా !

ప్రాణాపాన వ్యానోదాన సమానము లనెడి ఐదుగురు సోదరులు కూడి కొని నా శరీర మనెడి కాంతను పెండ్లాడిరి. దుర్జనసాంగత్య మనెడి ఘోరారణ్య ములందు నిరంతరము చరించుచున్నారు. పంచపాండవులకు వరమొసంగిన వాడా! నన్ను కాపాడు మయ్యా !

నేను జడబుద్ధిని. దేహధారిని. కామ్యకర్మమనెడి శాపమునకు గుఱియైతిని. ఫలితముగా బండబాఱిపోయితిని. అహల్యను రక్షించినవాడా ! నీ పాదధూళి మోపి నన్ను కడతేర్చుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అనాథులc గాచుట | 34 | 193 | 15 | 129 |

అవ: కొలిచెడివారికి కొంగుబంగారమై శ్రీనివాసు డున్నా డనుచున్నాడు.

సీ. **పిలిచిన నాల్క పైఁ బెనఁగొని యున్నావు**
**తలఁచిన మదిలోన దక్కియుందు;**
**వెలమిఁ జూచినఁ గన్ను లెదుటనే యున్నావు**
**కొలుచువారల బైసికొలఁది నీవు;**
**చేరి పూజించినఁ జేతిలో నున్నాఁడ**
**వారగించు మన కళ్ళందు కొందు;**
**నేర్పుతో మ్రొక్కిన నీవు చేకొందువు**
**కొలుచువారలబైసికొలఁది నీవు;**

గీ. **సత్తుగఁ బఠింప నున్నావు చదువులందు;**
**ఒత్తి నిన్నుఁ గొండాడిన నొద్దనుందు;**
**హత్తి సేవించు నరుల భాగ్యంబుకొలఁది**
**నీవు గలవయ్య ! శేషాద్రినిత్యవాస !** **68**

శేషాచలనివాసా ! నిన్ను పిలిచినజాలు. ఆ పిలిచెడు నాలుకతోనే నీవు పెనవేసికొనియున్నావు. నిన్ను తలపోసిన జాలు. ఆ తలపోయుచిత్తమునందే నెలకొనియున్నావు. నిన్ను ప్రీతితో జూచిన జాలు. ఆ చూచెడిచూడ్కుల యెదుటనే నిలిచియున్నావు. నిన్ను సేవించువారి భాగ్యముకొలది నీవు సన్నిధిచేసియుందువు.

నిన్ను అర్చించిన జాలు. అర్చించెడివారి హస్తములకే అధీనుడవై యున్నావు. నీకు నైవేద్యము పెట్టి ఆరగింపుమన్న చాలు. ఆ నైవేద్యపుముద్దలను ఆత్రముతో అందుకొందువు. నీకు మ్రొక్కిన చాలు. ఆ మ్రొక్కెడివారిని నీవు చేరదీయుదువు. నీ సేవాపరుల సేవాభాగ్యముకొలది నీవు వారి ననుగ్రహించుచున్నావు. సమస్తవిద్యలసారమై నీవు విరాజిల్లుచున్నావు. మనసార నిన్ను నుతించినచో చాలు. ఆ నుతించువారి చెంతనే నీవు నివసింతువు. కాన సేవించు వారి అదృష్టము ననుసరించి నీవు అందుపాటులో నుందువు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇంతకంటె మఱి నీవు | 70 | 401 | 15 | 270 |

అవ: పరమాత్ముడు భక్తి కొలదివాడనుచున్నాడు.

సీ. విన్నవించెడివారి విన్నపమ్ములు విందు
సన్నుతించెడివారి సార మెంతు;
కనులఁ జూచెడివారిఁ గడఁగి నీవును జూతు
వూర కుండెడివారి కుందు వటులె;
కొలిచినవారల కొలువు లీడేర్తువు
తలఁచినవారల దండ నుందు;
వలసినవారికి వరము లొసంగుదు
తెలియనివారల తెరువు సనవు;

గీ. శరణుఁజొచ్చిన వారల సరవిఁ గాతు
సరగ నీ వారలకు నెల్ల చనవు నిత్తు;
వెవ్వ రేపాటివారలో యావు నంతె
శ్రితులఁ జేకొని కరుణ రక్షింతు వెపుడు. 69

శ్రీవేంకటేశ్వరా ! నీవు విన్నపములుసేయువారి విన్నపములు వినుచుందువు. నిన్ను సన్నుతించెడివారి భక్తిభావ మేపాటిదో పరిశీలింతువు. నిన్ను కన్నుల గనువారిని నీవును కనుచుందువు. నిన్ను గూర్చి పట్టించుకొనక ఊరకుండు వారి విషయమున నీవును అట్లే యుందువు. నిన్ను సేవించువారిసేవలకు ఫలములు చేకూర్తువు. భావించినభక్తుల పంచనే యుందువు. అర్థించినవారికి అర్థములు చేకూరునట్లు వరము లిత్తువు. నిన్నుగూర్చి ఏమియు తెలియనివారివిషయమున నీవును తెలియనివానివలెనే యుండి వారిని పరామర్శింపవు. శరణాగతులను సంరక్షింతువు. నీదాసుల మనువారి కెల్ల అభిగమ్యుడవై యుందువు. ఎవ రెట్టి వారో వారిపట్ల నీవును అట్టివాడవై యుందువు. ఆశ్రితుల నెల్లవేళల దయతో గాపాడు చుందువు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏపాటి వారికి | 69 | 397 | 15 | 267 |

అవ: సంకీర్తనమార్గముతప్ప తనకు మార్గాంతరములు తెలియ వనుచున్నాడు.

సీ. ఏ యుపాయ మెఱుంగ నిదె విన్నపము నీకు
నీదుసేవకుఁడ మన్నింపఁ గదవె
తమ తపోమహిమఁ గొందఱు దొడ్డవారైనఁ
జదివి కొందఱు ప్రపూజ్యత వహింత్రు;
పుణ్యమ్మునన్ స్వర్గమును గొంద ఱేలఁ గొం
దఱు గాంత్రు ఘనత సత్యము వచించి;
దానముల్ చేసి కొందఱు దివ్యు లౌదురు
వ్రతములఁ గొందఱు బ్రదుకుచుంద్రు;

గీ. ధన్యు లౌదురు గొంద ఱాత్మను దలంచి
కాయసిద్ధిచే నిత్యులుగాఁగఁ గొంద
ఱేను నినుఁ బాఁడువాఁడ మంగేశ! నీదు
ధర్మమున నుండువాఁడ నే ధర్మ మెఱుఁగ. 70

మంగాపతీ! నేను నీ సేవకుడను. నీకిట్లు విన్నవించుకొనుచున్నాను. నన్ను మన్నింపుము. నాకు ఏ విధమైన యుపాయము తెలియదు. కొందఱు తపః ప్రభావముతో పెద్దవా రగుదురు. కొందఱు వేదాదివిద్యలలో నిపుణులై పూజింప బడుదురు. కొందఱు సుకృతవశమున స్వర్గమును జూఱగొందురు. కొందఱు సత్యము పలికి ఘను లగుదురు. కొందఱు దానములచే దివ్యత్వము గాంతురు. కొందఱు వ్రతము లాచరించి భవ్యజీవను లగుదురు. కొందఱు ఆత్మనిష్ఠులై ధన్యత గాంతురు. మఱికొందఱు కాయసిద్ధి సాధించి నిత్యత గాంతురు. నాకు నిన్ను పాడుట దప్ప ఉపాయాంతరము తెలియదు. సంకీర్తనమునే సాధనముగా గొని భాగవతధర్మమున నున్నాను. ఇతరధర్మము లెవ్వియు నే నెఱుంగను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏ వుపాయము నెఱుఁగ | 68 | 392 | 15 | 264 |

అవ: ఎట్లయిన దాసుడగు తన్ను గావక భగవంతునకు తప్పదనుచున్నాడు.

సీ. **వేడుక దేవుల విన్నపాల్ వినిగాని**
**యీడులేని బిరుదు లెంచిగాని**
**పాడెదు నామప్రభావమ్మునం గాని**
**కాదన కీ దాసుఁ గావ వలెను**
**నమ్మి నిన్ గొల్చిన నాగురుఁ గనికాని**
**సుడిఁబెట్టు దైన్యమ్ము చూచికాని**
**రంజిల్లు నీ యుదారత్వమ్మునం గాని**
**సేవకు నన్ను రక్షించ వలెను**

గీ. **మన కనాదియౌ సంబంధమునను గాని**
**పరఁగ నేలికవైన నెపానఁ గాని**
**తప్పు లెన్నక సప్తభూధరనివాస !**
**ఈవు ప్రత్యక్షమై లెంక నేల వలెను.** **71**

ఏడుకొండలవాడా ! నీ దేవేరులు కృపతో నన్నుగుఱించి చేయు విన్నపములు ఆలకించిగాని, సాటిలేని ఆర్తత్రాణపరాయణాదులగు నీ బిరుదము లెంచుకొనిగాని నన్ను గాపాడుము. నేను గావించు నీ నామసంకీర్తనముయొక్క మహిమచేనైనను దాసుడనగు నన్ను వైముఖ్యము వహింపక సంరక్షింపవలెను. విశ్వసించి నిన్ను సేవించిన నా ఆచార్యుని జూచిగాని, నన్ను భ్రమలకు గుఱిసేయు నా దీనత్వమును పరిశీలించిగాని లోకప్రసిద్ధమైన నీ ఔదార్యముచేగాని సేవకుడైన నన్ను బ్రోవుము.

నీవు దేవుడవు. నేను జీవుడను. మన యిరువురి సంబంధము అనాదియైనది. ఈ సంబంధమును బట్టిగాని, సర్వనియామకుడవైన నీవు నాకు విభుడవు. ఆ వ్యాజముచే నాలోని యపరాధములు పరిగణింపక ప్రత్యక్షమై నన్ను నీవు కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మానరాదు నేఁ దప్పులు | 67 | 386 | 15 | 260 |

అవ: అంతర్యామియైన భగవంతుడు తనకు నెలవైన జీవునిలో ఎట్టి దొసగులు ప్రవేశింపనీయరా దనుచున్నాడు.

**సీ. దేవుఁడా ! నా మేను తిరుమల నగరమ్ము**
**భావింపఁ జిత్తమ్మె పసిఁడి మేడ**
**అరయ విజ్ఞానాదు లగణితసేవకు**
**లితరచింతలు చొరనీయ వలదు;**
**పరమాత్మ ! నా మది బహురత్న పర్యంక**
**మాత్మయే కడు మెత్తనైన పఱుపు;**
**సుజ్ఞానదీపమ్ము చొప్పదు; భోగమే**
**యానంద మిట మాయ నలమ వలదు;**

**గీ. నారదాదులపాటలే నాదు నిడుద**
**యూర్పులు; వినోదపాత్ర మదుజ్జ్వలంపు**
**భక్తి; వైకుంఠమే భవద్వాసభూమి**
**శుద్ధ; మిం దెట్టి నెరసులు చొరఁగ నీకు.** **72**

దేవా ! నా శరీరమే తిరుమలపట్టణము. అందలి నా చిత్తమే స్వర్ణమయమైన ఆనందనిలయము. అందలి విజ్ఞానాదిగుణములే నీ సేవకులు. కావున నీకు నెలవైన నాచిత్తములో నీకు సంబంధపడని చింతలకు ప్రవేశము కల్పింప వలదు.

పరమాత్ముడా ! నా చిత్తమే వివిధరత్నమయమైన తల్పము. నా ఆత్మయే మిక్కిలి మృదువగు పానుపు. అచ్చట సుజ్ఞాన మనెడి దీపము వెలుగొందుచున్నది. అచ్చట నీ మాయను క్రమ్మ వలదు. నాదీర్ఘములైన ఉచ్ఛ్వాసనిశ్వాసములే నీకు నారదాదులసంకీర్తనములు. ప్రకటమైన నా భక్తియే నీకు వినోదముగూర్చు పాత్రవిశేషము. నీ వెందు నివసింతువో అదే వైకుంఠము. అది పరిశుద్ధముగా నుండవలెను. అందు దోషములు ప్రవేశింపరాదు. కావున నాలో ఎట్టి యపరాధములకు తావు గల్పింపకుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీ వున్నచోటే వైకుంఠము | 71 | 406 | 15 | 273 |

అవ: భగవానునితో తనకు ప్రత్యక్షసంబంధము లేకపోయినను అతని కృపకు పాత్రు డగుటచే తన కెట్టి లోటు వాటిల్ల దనుచున్నాడు.

సీ. **కతలలో నినుఁ జెప్పఁగా వింటయే గాని**
**యెట్టివాఁడవొ చూచి యెఱుఁగ లేదు;**
**గతివయి కలవనఁగా వెదకుదుఁ గాని**
**చెంది నీ మూర్తి దర్శించ లేదు;**
**గంగ నీ తీర్థ మనంగ మున్గుటె గాని**
**మోము నీయడుగుల మోప లేదు;**
**నిగమమ్ము నీ మాటనఁగఁ జదువుటె గాని**
**వేడ్క మాటాడంగ వినుటె లేదు;**

గీ. **ఉన్నది వికుంఠ మనఁ గోరుచుంట గాని**
**వృషభగిరిమీఁదవలె లేదు విహరణమ్ము;**
**నీ తలంపేమొ హరి ! యిద్ది నాతలంపు**
**కలిగె నీ కృప నా కింకఁ గడమ లేదు.** **73**

శ్రీహరీ! నిన్ను గూర్చి అనేకులు అనేకవిధముల కథలలో చెప్పుట వింటిని. కాని నీ వెట్టివాడవో ప్రత్యక్షముగ చూడ నయితిని. నీవు సర్వత్ర పొంద దగినవాడవై యున్నావని పెద్దలు చెప్పగా అన్వేషించుచున్నాను గాని నీ దివ్యమూర్తిని కన్నులార కనుగొన్నది లేదు. నీ పాదమునుండి ప్రభవించిన తీర్థమే గంగ యనగా అందులో మున్గితినిగాని నా ముఖము నీ పాదములపై మోపలేదు. వేదవచనము లెల్ల నీ పలుకులే యని చెప్పగా ఆ వేదములు చదువుటయేగాని నీవు భాషించుచుండగా విననైతిని.

నీ వున్నతావే వైకుంఠ మనగా ఆ స్థానమును కోరుచున్నాను గాని ఈ వృషభాద్రిమీద తిరిగినట్లు ఆ వైకుంఠమున తిరుగ నైతిని. నీ భావ మెట్టిదో నాకు తెలియదు. నా భావము మాత్ర మిట్టిది. ఎట్లయినను నీ దయ నాపై ప్రసరించినది గాన నా కింక కొదవ లేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఈశ్వరా నా భావ మిది | 69 | 398 | 15 | 268 |

అవ: అశక్తుడు దీనుడు నగు తాను కష్టకాలమున కమలాపతినే ఆశ్రయింతు నను చున్నాడు.

సీ. **నేరమి వచ్చిన నీ మొగమే చూతుఁ;**
**బైకొని పరిహరింపంగ నోప;**
**నారాయణా ! యందుఁ దీఱని పాపాలఁ**
**గొనకొని విడిపించుకొన నెఱుంగఁ;**
**బరులు కోపించిన భావించెదను నిన్నె;**
**శక్తిఁ దప్పించుకోఁజాల నేను;**
**మతి ముప్పుగలుగ నీ శరణమ్ము సొచ్చెద**
**నొరులకుఁ జెప్పికోనొల్ల నేను;**

గీ. **చింతలన్ నీవు గలవని యెంతుఁగాని**
**దృఢముగా నాదుబుద్ధిని ద్రిప్ప లేను;**
**అందులకె చూపు నాపయి నమితకరుణ**
**యేమిచెప్పెద నా దైన్య మిందిరేశ !** **74**

లక్ష్మీశ్వరా ! ఏదేని అపరాధము నన్ను అలముకొన్నప్పుడు నీవైపే చూతునుగాని, నాయంతటనేను దానిని ప్రయత్నముతో పరిహరించుకొనజాలను. ఎడతెగని దుష్కృతములు న న్నంటినప్పుడు నారాయణా యని నీకే మొఱలిడుదు గాని నాకై నేను విడిపించుకొనజాలను. ఇతరులు నాపై కోపము చూపినపుడు నిన్నే భావనలో నిల్పెదనుగాని నాసామర్థ్యముతో తప్పించుకొనలేను. విపత్తు గలిగినప్పుడు నీకు శరణాగతుడ నగుదుగాని ఇతరులకు చెప్పుకొనుట కిష్టపడను. చింతలు పైకొన్నప్పుడు నీవే దిక్కయి యున్నావని భావింతునుగాని నాబుద్ధిని దిటవుగావించుకొని ఆచింతలను మరలించుకొనలేను. ఈ విధముగా నా దైన్యము నేమని విన్నవించుకొందును ? ఎట్టివంతలు గల్గినను, రక్షణకై నిన్నే నమ్మియున్నా నుగాన నాపై అపారకృపజూపి కాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అందుకే నాపై | 69 | 396 | 15 | 626 |

అవ: తన ప్రయత్నములేకయే భగవంతుడు తన్ను కాపాడుచున్నా డనుచున్నాడు.

**సీ. మక్కువ నీతోడ మాటాడి యెఱుఁగను**
**చొక్కపు నీరూపు చూప వీవు ;**
**నీవుండు నెలవును నిజముగాఁ దెలియను**
**నీవె నామదియందు నిల్చినావు ;**
**నీయవతారాల నే కూడిమాడ నీ**
**వేతతి సేవ చేయించుకొనవు ;**
**నేర్చి యేనాఁడైన నిన్ను నేఁ దలఁప నీ**
**వురక నాపైఁ గృప నుంచినావు ;**

**గీ. ఎన్నఁడేనియు నిన్ను నే నెనసి కొలువ ;**
**నిన్ను దేవర యనుచు నే నెమక లేదు;**
**పన్నుగా మంగపతివైన పరమపురుష !**
**తిన్నగా నుద్ధరించితి నన్ను నీవె.** **75**

పురుషోత్తమా ! ఏనాడును నీతో ప్రేమగా నేను భాషించి యెఱుగను. నీవును ముగ్ధమోహనమైన నీ స్వరూపము నాకు చూప వైతివి. నీ వెందున్నావో నిక్కముగా నే నెఱుంగను. అయినను నీయంతట నీవే వచ్చి నా చిత్తమున నెల కొంటివి. వివిధములైన నీయవతారములతో నేను కలసిమెలసి వర్తించి యెఱుంగను. నీవును నాచే ఏ విధమైన కైంకర్యము చేయించుకొనవైతివి. ఒక నాడైనను నేర్పుతో నిన్ను నా తలపున నిలుపనైతిని. నీ వే నిర్హేతుకముగ నాపై దయజూపితివి. ఏనాడును నిన్ను నేను కొలిచి యెఱుంగను. దేవుడ వని నిన్ను నే నన్వేషింప నైతిని. ఓ మంగాపతీ ! నన్ను నీవే చక్కగ కాపాడితివి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇంత సేసినవాఁడవు | 69 | 395 | 15 | 266 |

అవ: భగవానుని మహిమలే భక్తులను కాపాడగల వనుచున్నాడు.

**సీ. నీ నామమే చాలు నిఖిలాఘములు మాన్ప ;**
**కష్టముల్ మాపఁ జక్రమ్మె చాలు ;**
**అరులఁ దూటాడ నీ స్మరణమే చాలు ; నీ**
**పరమభక్తియె చాలు పర మొసంగ ;**
**నీ కథలే చాలుఁ బోకార్ప దుర్గుణాల్ ;**
**చాలు ముద్రలు కర్మచయము దీర్ప ;**
**దుఃఖ మ్ముడుపఁ బాదతోయమె చాలు; నీ**
**కైంకర్యమే చాలు కాచిబ్రోవ ;**

**గీ. చాలు శరణాగతియె నిత్యసౌఖ్య మీయఁ ;**
**జింతలెల్లను బాప నీ సేవ చాలు;**
**నిన్ను వేసరించఁగ నేల ? నీదుమహిమ**
**చాలు-నన్నింటి కభయహస్తమ్మె చాలు.** **76**

శ్రీవేంకటేశ్వరా ! నా సకలదురితములు పోకార్చుటకు నీ నామ మొకటే సమర్థమై యున్నది. ఎల్లకష్టములు రూపుమాపుటకు నీ చక్రమే చాలి యున్నది. శాత్రవుల నుఱుమాడుటకు నీ చింతనమే శక్తిగల్గియున్నది. మోక్ష మిచ్చుటకు నీయెడగల భక్తియు, దుర్గుణములు దూరీకరించుటకు నీ కథలు చేవగలిగి యున్నవి. కర్మసంచయమును నిర్మూలించుటకు నీ ముద్రలే దక్షములై యున్నవి. దుఃఖము తొలగించుటకు నీ పాదతీర్థమే తగియున్నది. మమ్ము కాచి రక్షించుటకు నీ దాసత్వమే నిపుణమై యున్నది. నీ శరణాగతియే శాశ్వతసౌఖ్యప్రద మగుచున్నది.

చింతలు దీర్చుటకు నీ సేవయే పర్యాప్తమై యున్నది. ఇట్లుండఁగా నిన్ను విసిగించు టెందులకు ? నీ మహిమలే అన్నివిధముల మాకు రక్షకములై నిలిచి యున్నవి. నీ అభయహస్తమే మా కన్నింటికి అండగా నున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నిన్ను వేసరించ నేల | 69 | 394 | 15 | 265 |

అవ: పరమబాంధవుడైన వేంకటరమణుడే సకలసంకటములందును తన్ను పాయక కాపాడినా డనుచున్నాడు.

సీ. దురితమ్ము లొనరించి దుఃఖ మొందెడునాఁడు
దుర్మార్గు ననురోసి తొలఁగ వైతి;
నరకమ్ముఁ జొరునాఁడు నా కంతరాత్మవై
పరుఁడు వీఁ డేలని పాయ వైతి;
జననిగర్భమునందు సంకటపడునాఁడు
వెనుబలమ్మయి నన్ను విడువ వైతి;
వనుభవింపఁగఁ జేసి యందుకు లోనైతి
విం(ద్రియాధీనుండ నేను గాఁగ

గీ. ఎట్టు గోరెదనో యదియెల్ల నిచ్చి
యిచ్చలోన మెలంగితి వెంతగొప్ప
చుట్టమవు వేంకటేశ్వరా ! యిట్టి దాసు
నేలినాఁడ వేమని నుతియింతు నిన్ను. 77

వేంకటనాథా! పాపకార్యములు చేసి నేను దుఃఖముపొందుసమయమున దుర్మార్గుడనైన నన్ను ఈసడించుకొని నీవు తొలగిపో వైతివి. నేను నరకములో ప్రవేశించునాడుకూడ నాకంతరాత్మవై వెన్నంటి యుంటివేగాని వీడు పరుడు, వీనితో నా కేమిపని యని వదలినవాడవు కావైతివి. నేను మాతృగర్భములో కష్టపడుసమయమున నాకు అండయై యుంటివేగాని నన్ను విడువ వైతివి. నే నింద్రియముల కధీనుడనై యున్నప్పుడు నాచే ఇంద్రియార్థముల ననుభవింప జేయుచు అచ్చటను నాకు తోడుగనే యుంటివి. నేనేమి వాంఛించితినో అవియెల్ల సమకూర్చితివి. నా యిచ్చవచ్చినట్లు మెలగితివి. నీ వెంత పోరానిచుట్టమ వయ్యా! దాసుడనైన నన్ను కాపాడితివి. ఇట్టి ని న్నేమని పొగడగలను ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎంత పరమబంధుఁడవు | 5 | 29 | 15 | 19 |

అవ: అధముడైన తన్ను గాపాడుటయందే దేవుని గొప్పతనము ప్రకటిత మగు ననుచున్నాడు.

సీ. ఇది నీకు నుపకార; మింతగా చేసితి
కదిసి యీ మే లెంచి కావ వలదె ?
భూమి నీచుఁడ నేను బుట్టగా మీ దయ
పాఱె నాపై, నీకు వన్నె దెచ్చె ;
నేఁ బుణ్యుఁ డైనచో నీ కృప యేటికిఁ
గొఱగాక యొకమూలఁ గూరుచుండు;
కటిక పేదకు నాకు ఘనసంపదల నీయ
నెన్నిక గాంచె లక్ష్మీశ్వరత్వ ;
మిట్టులు శ్రీవేంకటేశ ! నీ దాసుల
కతమున నీ రాజగరిమ మీఱె;

గీ. నీదునామమ్ము దోసముల్ నేను సలుప
రొక్కముగ నన్ను రక్షించి రూఢి కెక్కె;
దెసల మావంటివారలు తెగువ సేయ
కున్న నీ నామమున కేమి యొఱపు గలదు ? 78

శ్రీవేంకటేశ్వరా ! నేను నీ కుపకారమే చేయుచున్నాను. నేను గావించిన మేలు గణించి నీవు నన్ను కాపాడవలదా? నీచుడనైన నేను ఈ భూమిపై జన్మించితిని. నీదయ నాపై ప్రసరించినది. నానీచత్వము పోగొట్టుటద్వారా నీకది కీర్తి కలిగించినది. నేను నీచుడను గాక పుణ్యాత్ముడనే అయినచో నీ కృపతో నాకు పనిలేదుగదా? అది యెందుకును పనికిరాక యొకమూల పడియుండ వలసినదేగదా? పరమదరిద్రుడనైన నాకు నీవు దొడ్డసిరుల నొసంగితివి. తద్వారా నా పేదతికము నిర్మూలించితివి. అందుచే లక్ష్మీశ్వరుడను నీ పేరు లోకమున సార్థకమై ప్రశస్తి వహించినది.

ఈ రీతిగా నీచులు, పేదలు నగు నీదాసులవలననే నీరాచతికము లోకమున మేర మీటినది. నే నెన్నో దొసగు లొనర్చితిని. ఐనను నీ నామము నన్ను కాపాడి సర్వదోషనివారక మని రాణ కెక్కినది. మాబోటివారు తెగించి దోషములే చేయకున్నచో నీ నామమున కేమి విలువ గలదు ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇది నీకు నుపకార | 6 | 32 | 15 | 20 |

అవ: భగవంతుడు తనదాసులను తనంతవారిని గావించు ననుచున్నాడు.

సీ. బ్రహ్మాదిదివిజవర్గముకంటె కడు మిన్న
నీ భక్తుఁడని చాట నిల్పినాఁడ
వున్నతపదమున పిన్న యౌ ధ్రువు; నిజ
దాసులు భూసురోత్తముల కంటె
ఘనులని తెల్పఁగాఁ గాదె దుర్వాసుచేఁ
బట్టించితివి రాచవానికాళ్ళు;
కర్మఠులగు ఋషిగణముకంటెను దాసుఁ
డెక్కుడంచని చెప్ప నిచ్చినావు
ముందటి యజపట్టమును గాడ్పుపట్టికి;
ధర్మాల వైష్ణవధర్మ మధిక
మని నిరూపించుట కసురుఁడై న బలికిఁ
జెడనిభోగమ్ము లిచ్చితివి పుడమి;

గీ. దాసుమాటయె సకలవేదములకంటె
నెక్కుడని చాటఁ బ్రహ్లాదు నెట్టయెదుట
నుట్టిపడితివి; నీదు భృత్యుండె సుఖుల
సుఖి యనుట కిచ్చితివి ముక్తి శుకున కెలమి;
అదన నిన్నంటువారి నీయంతవారిఁ
జేసెదవు నిక్కముగ శేషశిఖరివాస ! 79

శేషశైలనిలయా! బ్రహ్మమొదలైన దేవతానీకముకంటె నీభక్తుడే ఎంతో శ్రేష్ఠుడని చాటుటకే బాలుడైన ధ్రువుని మహోన్నతమైన ధ్రువపదమున నిల్పితివి. బ్రాహ్మణపుంగవులకంటె నీ దాసులే దొడ్డవారని తెల్పుటకే దుర్వాసుని క్షత్రియుడైన అంబరీషునిపదము లాశ్రయించునట్లు చేసితివి. వేదవిహితకర్మానుష్ఠాన పరులైన ఋషివర్గముకంటెను భాగవతుడే మేల్తరమువాడని చెప్పుటకే వాయుసుతుడగు ఆంజనేయునకు భవిష్యద్బ్రహ్మపట్టము నొసంగితివి. ధర్మములయందు వైష్ణవ ధర్మమే ఉత్తమమైనదని నిరూపించుటకు రక్కసుడైన బలిచక్రవర్తికి ఇలలో శాశ్వత భోగములను ప్రసాదించితివి.

నీ దాసునిమాటయే సమస్తవేదములకంటె మిక్కిలి ప్రమాణభూతమని ప్రకటించుటకే చక్రి సర్వోపగతుడన్న ప్రహ్లాదునినుడి సార్థకముచేయుచు అతని యెదుట ఆవిర్భవించితివి. సుఖవంతులలోనెల్ల సుఖవంతుడు నీ బంటే యని నిరూపించుటకే శుకయోగికి ప్రీతితో మోక్షము నిచ్చితివి. తగినరీతిలో నిన్నాశ్రయించువారిని శ్రీనివాసా ! నీవు నిజముగా నీయంతవారిని చేయుచున్నావు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇది యొక్కటి వివేకులకు | 41 | 231 | 15 | 154 |

అవ: అందరిపాలిటిదేవు డను శ్రీవేంకటేశ్వరునిలీలలు వర్ణనాతీతము లను చున్నాడు.

సీ. ఏలమి గొల్లెతలను నిన్నివాళులు పొంది
తొలcగి మధురలోన దొర వయితివి ;
కోర్కి నావులcగాచు గొల్లcడవై యుండి
నేcడు చూడcగ రాచవాcడ వయితి ;
వేడుక నింటింట వెన్నలు దొంగిలి
అడ ద్వారక సోమయాజి వయితి ;
తెగువమై రుక్మిణీదేవి నెత్తుక వచ్చి
యగ్రపూజకును మహార్హుc డయితి ;
గీ. రక్కసులకాcపురమ్ముల మొక్క చెఱిచి
పెక్కుధర్మాల నిలిపిన పెద్ద వయితి;
వేమి చెప్ప నీ సుద్దులు స్వామి ! చిక్కు
దీఱ నిందఱిపాలిటి దేవుc డయితి. 80

స్వామీ! ఎన్నోదినములు వ్రేపల్లెలో గొల్లపడతులతో కూడిమాడి యుండి అటనుండి మధుర కరిగి అక్కడ ప్రభుడ వైతివి.

గోకులములో గొల్లవాడవై గోవులు గాచుచుండిన నీవు నేడు రాచవాడ వయితివి. నందవ్రజములో ఇంటింట వెన్నముద్దలు దొంగిలించిన నీవు నేడు ద్వారక కధీశ్వరుడవై సోమయాగ మొనర్చితివి. తెంపుతో కుండిననగరమునుండి రుక్మిణీదేవి నెత్తుకొనివచ్చిననీవు ధర్మజు డొనర్చిన రాజసూయయాగములో అగ్ర పూజకు పాత్రుడ వయితివి.

రాక్షసులసంసారములు నిర్మూలించి ధర్మసంస్థాపనము గావించిన అవతార పురుషుడ వైతివి. నీ లీలల నేమని వర్ణింపగలము ? దాసులకడగండ్లను పోకార్చి అందరిపాలిటికి దేవుడవై నీవు శ్రీవేంకటాద్రిపై విరాజిల్లుచుంటివి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏల చెప్పని సుద్దు | 37 | 211 | 15 | 141 |

అవ: పరమాత్ముడు ఆశ్రితులపాలిటి మహాభాగ్యమై అనుభవమునకు వచ్చు నను చున్నాడు.

సీ. కామధేనువు మతి కల్పమహీజమ్ము
దామోదరా ! నీదు దర్శనమ్ము ;
భూమీశ్వరత్వమ్ము భువనేశ్వరత్వమ్ము
సామజవరద ! నీశరణ మెపుడు ;
పరుసవేదియు నింక పరమ మైశ్వర్యమ్ము
హరి ! నిన్నుఁ గొలిచెడి యనుభవమ్ము ;
నిరతభోగమ్ములు నిధినిధానమ్ములు
కమలాక్ష ! నీదు కైంకర్యవిధులు ;

ఆ. నిండుభోగములును నిత్యశోభనములు
కొండలయ్య ! నీదుగుణకథాళి ;
పట్టినట్టివారి భాగ్యమ్ము సర్వమ్ము
నిండియుండుతండ్రి ! నీదు కరుణ. 81

ఏడుకొండలరాయడా ! దామోదరా ! నీ సందర్శనమే మాకు కామధేనువు, కల్పవృక్షమునై సంకల్పితార్థముల నొసగుచున్నది.

గజరాజవరదా ! నీ శరణాగతియే రాజత్వమును, త్రిలోకాధిపత్యమునై రాజిల్లుచున్నది.

శ్రీహరీ ! నీ దాస్యానుభవమే మాకు పరుసవేదియు, మహైశ్వర్యమునై యొప్పుచున్నది.

పద్మాక్షా ! నీ సేవావిధానములే సంతతభోగములుగా పెన్నిధులుగా పెంపెసలారుచున్నవి. నీ కల్యాణగుణములను వర్ణించు కథలే మా పాలిటికి పూర్ణ భోగములు, నిత్యమంగళములునై నివ్వటిల్లుచున్నవి. నీవు ఆశ్రితులపాలిటికి పరమభాగ్యమవై యున్నావు. తండ్రీ ! నీదయ అంతట నిండియున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పట్టినవారల భాగ్య మిదే | 21 | 126 | 15 | 84 |

అవ: భగవన్నామజప మొనర్చు దాసులను భగవంతుడే కాపాడవలె ననుచున్నాడు.

సీ. **కేశవ ! గోవింద ! కృష్ణ ! నారాయణ !**
**వామన ! శ్రీధర ! వాసుదేవ !**
**ప్రద్యుమ్న ! అనిరుద్ధ ! పద్మనాభ ! జనార్ద**
**న ! హరి ! అధోక్షజ ! నారసింహ !**
**దామోదర ! పురుషోత్తమ ! హృషీ కేశ ! అ**
**చ్యుత ! త్రివిక్రమ ! మధుసూదన ! యని**
**విమలచిత్తమ్మున విష్ణు ! సంకర్షణ !**
**యని మాధవ ! ఉపేంద్ర ! యనుచ నిన్ను**

గీ. **ప్రణవపూర్వ నమోఽంతమై పరఁగు నట్టు**
**లిరువదియు నాల్గు పేరుల నే మనంత !**
**అంజనాద్రినివాస ! దశావతార !**
**ఉచ్చరింతుము గరుణ మ మ్మోమవయ్య !** **82**

కేశవ, నారాయణ, మాధవ, గోవింద, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహ, అచ్యుత, జనార్ధన, ఉపేంద్ర, హరి, శ్రీకృష్ణ అను నీ యిరువదినాల్గునామములను చతుర్థీవిభక్త్యంతములు గావించుకొని ఓంకార పూర్వకముగా, నమోఽంతముగా అనగా 'ఓం కేశవాయ నమః, ఓం నారాయణాయ నమః' అనురీతిలో ఉచ్చరింతుము, మమ్ము కరుణతో గాపాడుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మచ్చ కూర్మ వరాహ | 29 | 168 | 15 | 112 |

అవ: ఆశ్రయించనివారిదే తప్పుగాని, ఆశ్రితరక్షకుడైన భగవంతునిలో పరాకులే దనుచున్నాడు.

సీ. విశ్వమంతయు నీకు వీనులే విన వటే ?
మనవి సేయని యెడ్డెతనమె గాని
ఇన్నియు నీ కన్నులే యెందుఁగనిన నా
తలఁపుసూపని తప్పిదమ్ము గాని
పలుకవా నీ వేమి ? బహుశబ్దమయుఁడవు
పిలువనిదే నాదుకొలయ గాని
నిలువవా ముందర ? నిఖిలరూపుండవు
తెలిసి కన్గొనని సందియమె గాని

గీ. నీ మఱుఁగుఁ జొచ్చితి నన మన్నించ వేమి ?
మత్తు నెసకొల్పు నాదుకర్మమ్ము గాని
నిను మరగియుండనిదె నాదు నేరమయ్య !
నీకు పరిపూర్ణునకును పరాకు గలదె ? 83

స్వామీ! జగమంతయు నీకు చెవులే. ఇక్కడ నీవు వినని దే మున్నది ? నీకు మనవిచేసికొనని మూర్ఖత్వము మాలోనే యున్నది. నీవు సహస్రాక్షుడవు. ఎందుజూచినను నీ కన్నులే. మాభావమును నీదృష్టికి తేని తప్పిదము మాలోనే యున్నది. నీవు సర్వశబ్దమయుడవు. ఏ పేరుతో పిలిచినను పల్కుదువు. కాని నిన్ను పిలువనిదే మానేరము. నీవు బహురూపుడవు. ఎల్లెడల రూపుదాల్చి నిలిచియే యున్నావు. కాని నీస్వరూపము తెలిసికొనలేని సందేహమే మమ్ము పీడించుచున్నది. నీకడ జేరితి నన్నంతమాత్రమున నీవు మన్నింప కుందువా ? నాకర్మమే నాకు మత్తు గొలిపి నిన్నాశ్రయించకుండ చేసినది. నీమీద రతి లేకుండుటే నాదు దోషమైనది. నీవు సర్వవ్యాపివి; సర్వజ్ఞుడవు; నిత్యజాగరూకుడవుగదా నీవు!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పరిపూర్ణుఁడవు నీకు | 49 | 279 | 15 | 188 |

అవ: జీవులు తమకు దాముగా బాగుపడజాలరు. వారిని సృష్టించిన దేవుడే బాగు పఱచవలె నని చున్నాడు.

సీ. **బహువిధసస్యముల్ పండు నేటేటను**
**పండదు మన సొక్క పారి యైన**
**నిండు తటాకముల్ నెలకొన్న వానల**
**నిండ దొకప్పుడు బండనోరు**
**వికసించు విరులెల్ల వెసఁ దఱి వచ్చిన**
**విజ్ఞాన మించుక విరియ దెపుడు**
**ఒద్దికతోఁ గొండ లొకచోట నిలుచు వి**
**శ్వాసమ్ము లొకొట నిల్వంగఁ బోవు**

గీ. **వసపడుంగాని మదమత్తవనగజమ్ము**
**ఒకపిసరు గాదువశము వయోమదమ్ము**
**ఎంతకాలమ్మయిన నింతె; పొంతనుండి**
**యేలికవు మమ్ముఁ బ్రోవుమీ వృషగిరీశ !** **84**

వృషాద్రినాథా ! పెక్కుతెఱగులైన పైరుపచ్చలు ఏటేట పండుచున్నవి. కాని నామనసు ఒకపర్యాయమైనను పండదు. వానలుకురియగా మడుగులు నిండుచున్నవి. యాచకత్వమున కలవాటుపడిన నా నోరుమాత్రము ఎన్నడు నిండదు. ఋతుకాలము వచ్చినంతనే పూవులెల్ల పుష్పించుచున్నవి. కాని మా విజ్ఞానముమాత్రము ఎన్నడును వికసించుటలేదు. పెద్దపెద్ద కొండలే ఇటునటు కదలక ఒకచోట నిలిచియున్నవి. కాని మా విశ్వాసములుమాత్రము చలించక ఒకచోట నిలువవు. మదించిన అడవియేనుగు స్వాధీనమగునుగాని ప్రాయమనెడి మదము మాత్రము ఇసుమంతయు వశముగా కున్నది. ఎంతకాలమైనను ఇట్లే జరుగుచున్నది. నీవు మా కెల్లరకు పాలకుడవు. మాచెంతనే యుండి మమ్ము సంరక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎంతగాలమైనా | 46 | 259 | 15 | 175 |

అవ: స్వల్పమైన సేవలకే భగవంతుడు సర్వసంపదలను ప్రసాదించు నను చున్నాడు.

**సీ. చిననిమ్మపం డొండు క్షితిపున కిడి గాదె**
**యెన లేనిభూముల కేలి కగుట**
**తెలిముత్తెమంత పద్దెముఁ జెప్పికాదె స**
**ర్వార్థసమృద్ధిఁ జెన్నారుచుంట**
**గవ్వ వయిచి తూచికాదె వజ్రమ్మును**
**చివ్వన విలువలు చేసికొనుట**
**అవల జుట్టెడు తాటియాకువాసినిగదా**
**ప్రీతిమై ధనము నిప్పించుకొనుట**

**గీ. కసవుకట్టలు ముందిడిగాదె యాల**
**గుంపుచే పాల నిప్పించుకొనుట నాదు**
**సేవ లిట్టివి; దేవ ! నీ యీవు లట్టి**
**వేను మ్రొక్కిగదా నీకు నెలమి గంటి.** **85**

దయానిధీ ! శ్రీవేంకటేశ్వరా ! ఒక చిన్ననిమ్మపండు రాజులకు కానుకగా నిచ్చి వారినుండి గొప్పగొప్ప మాన్యములు గైకొని అనుభవింప గల్గుచున్నారు. ఒక మంచిముత్తెమంత చిన్నిపద్యముతో స్తుతించి కవులు భూపాలకులనుండి సకల విధసంపదలు చేకొనుచున్నారు. గవ్వతో తూచి అనర్ఘమైన వజ్రమును విలువ చేసికొనుచున్నారు. లొడితెడు తాటియాకు రక్షగా వేసియేగదా ఒరులనుండి వలసి నంతధన మిప్పించుకొనుచున్నారు. పిడికెడు గడ్డికట్టలు ముందువేసి గోవుల నుండి పాలు పిండుకొనుచున్నారు.

దేవా ! నీకు నే నొనర్చు కైంకర్యములు గూడ నిట్టివే. కాని నీవిచ్చు ఈవులుమాత్రము మహోన్నతములై యున్నవి. ఇంతకు నేను నీకు మ్రొక్కిగదా నీదయకు పాత్రుడనై ఇట్టి యానందము నందగల్గితిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇట్టే నా సేవలును | 50 | 282 | 15 | 190 |

అవ: అహోబిలక్షేత్రములో సకలభోగములతో విలసిల్లు నృసింహమూర్తిని వర్ణించుచున్నాడు.

**సీ. భవనాశనీఝరి భామినీమణి నీకు**
**నివల నెదురుకొండ లీపెచనులు**
**సరినుండు పృథుగుహ చానకౌఁగిలి నీకు**
**నవధరింపఁ గదయ్య ! ఔబలేశ !**
**తెఱవకంఠము నీడదిరుగని మేరువు**
**నిత్యవర్షమ్ములు నెలఁతచెమట**
**వాడని శృంగారవన మామెజవ్వన**
**మాడుకోఁ జెల్లె నీ కౌబలేశ !**

**గీ. అతివపొందు యోగానంద; మబలమనము**
**కడఁగి కూర్చుండు నిద్దంపుగద్దెరాయి;**
**నారినునుమోవి తేనెల యారగింపు**
**అవధరింపుము తిరుమల యౌబలేశ !** **86**

శ్రీవేంకటేశ్వరునకు అభిన్నుడవైన అహోబిలనారసింహా ! అవధరింపుము. అహోబిలమందలి భవనాశని యను సెలయేటే నీకు భార్యారత్నము. ఈ యెదుట కన్పించుకొండలే ఆమెవక్షోజములు. ఆ చెంతనేయున్న విశాలమైనగుహయే ఆమె నీకిచ్చు కౌఁగిలింత. నరకంఠీరవా ! చిత్తగింపుము. నీడదిరుగనిమేరువే ఆమె కంఠము. మేరువు చలచ్ఛాయము. ఏలన దానిచుట్టు సూర్యుడు తిరుగుచుండును. అహోబిలముకూడ మేరు వే. దీనినీడమాత్రము తిరుగదు-అనగా అచలచ్ఛాయము. అచటి ఎడతెగనివానలే ఆమెచెమటలు. అచటి వాడిపోని ప్రమదవనమే ఆమె జవ్వనము. అది నీకు క్రీడాస్థలమై యొప్పారినది.

వేంకటనృసింహా ! ఆమెతోడిసంయోగమే నీకు యోగానందము. ఆమె చిత్తమే నీవు కూర్చుండు శిలాపీఠము. ఆమె మృదులాధరమే నీకు మకరంద నైవేద్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇందే కలిగె నీకు | 40 | 228 | 15 | 152 |

అవ: అంతటికి మూలమైన హరిమాటనే నమ్మవలెగాని అన్యచింతలతో పనిలే దనుచున్నాడు.

సీ. ఇదియె కామనిధాన మిది మూలధనము మా
        కిదియ నమ్ముటగాక యితర మేల ?
నలి "న మే భక్తః ప్రణశ్యతి" యనుమాట
        సర్వభూతములందు సముఁడ వైన
నీ వానతీయంగ నీ దాసకోటికి
        నూరక యితరవిచార మేల ?
మతి "శరణం వ్రజ, మా మేక" మనుమాట
        నిఖిలదిక్కులయందు నీవు చాట
నేఁడు నీ బంట్లమై నెలవేఱుటయగాక
        గహనకర్మమ్ముల గాసియేల ?

గీ. ఎవరు నిత్యాభియుక్తులై యేక బుద్ధి
పర్యుపాసింతురో నన్ను వారిసేమ
మౌదల వహింతు నంచు నీ వభయ మిడఁగఁ
గాసుసేయని లోకంపుగాథ లేల ? **87**

శ్రీవేంకటేశ్వరా! నీమాటయే మాకు కోరికలనెల్ల నొసగెడు నిధియై యున్నది. ఇదే మాకు మూలధనము. నేను దీనినే నమ్మవలెగాని ఇతరచింతలు పెట్టుకొనరాదు.

నీవు "న మే భక్తః ప్రణశ్యతి-నాభక్తుడు నశించడు" అని గీతలలో చాటితివి. సర్వప్రాణిజాలమునందు సమభావముగల నీవు అట్లు చెప్పియుండగా నీ దాసులకు అనవసరముగ ఇతరచింతలతో పనియేల? అంతేకాదు. చరమశ్లోక ములో "మా మేకం శరణం వ్రజ" నన్నొక్కనినే శరణొందుము అని సకల దిక్కులందు ప్రకటించితివి. నీమాట ననుసరించి నీకు శరణాగతులమై మేము కడ తేఱవలెనేగాని చిక్కులు పెట్టు కర్మములతో బాధపడు టెందులకు ? "యోగ క్షేమం వహా మ్యహమ్"- ఎవరు అన్యచింతలేనివారై న న్నొక్కనినే సేవింతురో అట్టి నిత్యాభియుక్తులైన భక్తుల యోగక్షేమములను నేను శిరసావహింతును" అని నీవు అభయమిచ్చి యున్నావు. ఈ విధముగ నీవు కరుణించియుండగా నిరుపయోగమైన లౌకికగాథలు మా కెందుకు ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇదియే కామవిధాన | 8 | 45 | 15 | 30 |

అవ: అపమార్గములో బడిన తనకు గురుడు కరుణించిచూపిన హరియే శరణ మనుచున్నాడు.

సీ. పంచేంద్రియపు రాచపైరు మేయుటఁ జేసి
పాపపుణ్యము లను బందెఁ బడితి;
ఊది సంసారంపుటోదమ్ముపై నేగి
కూలి మొఱ్ఱో యంచుఁ గూయు చుంటి;
ఆసలగాలాల నటుమ్రింగి మాయవం
టింటికుందేలనై యుంటి నిట్లు;
స్వాంతమ్మనెడు బొక్కసముదోచి కామాదు
లనెడు తలారుల కగ్గమైతి;

గీ. అంగనామోహ మనియెడు నడవిఁ జొచ్చి
తప్పితిని జ్ఞానమార్గ; మంతట గురుండు
వేంకటేశ్వరు నెఱిఁగించె; వెఱవకు మని
యభయ మిడ నిందిరాపతి, శుభము గంటి. 88

లక్ష్మీశ్వరా ! నేను పంచేంద్రియములకు చెందిన విషయసుఖము లనెడి మేలి పంటను మేయుటవలన పాపపుణ్యము లనెడు బందెలదొడ్డిపా లయితిని. సంసార మనెడు పెనుగుంతపై నడచి అందులో కూలి కుయ్యో మొఱ్ఱో యని యఱచుచుంటిని. ఆశలనెడి గాలములను మ్రింగి మాయయొక్క వంటింటికుందేలి నయితిని. హృదయమనెడి భండారమును దోచి కామక్రోధాదు లనెడు తలవరులకు వశ మయితిని. స్త్రీవ్యామోహ మనెడి అరణ్యములో ప్రవేశించి జ్ఞానమార్గమునకు దూరమయితిని. అందుపై మా గురుడు మాకు శ్రీవేంకటేశ్వరస్వామిని రక్షకుడుగా జూపెను. ఆ దేవుడు నాకు వెఱవకు మని అభయ మిచ్చెను. నేను మిక్కుటమగు శుభముల నందితిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వరు నన్నుద్ధరించే రింతట | 9 | 58 | 15 | 39 |

అవ: అన్నివిధముల నధముడైన తన్ను శరణన్నమాత్రాన ఆ వేంకటేశ్వరు డెట్లు రక్షించినాడో యని ఆశ్చర్యపడుచున్నాడు.

సీ. పరసతి పరధన హరణమ్ములకు రోయఁ
పెద్దలలో నెట్లు పెంపుగనుట ?
హరిసేవ గురుసేవ యవియుఁ జేయుట లేదు
శాస్త్రమ్ము లింకేవి చదువవలెనొ ?
పాపమ్ము కోపమ్ము పంతమ్ము మానను
విజ్ఞాని నని విఱ్ఱవీఁగి యేమి ?
పట్టదు సన్మార్గ; మెట్టు నా మతిలోనఁ
దలపోయఁగల నీదుతత్త్వ మేను ?

గీ. మోహదాహమ్ము లుడుగవు; ముందు వెనుక
లెఱుఁగను విరక్తుఁ డనుట నా కెట్లు చెల్లు ?
నిట్టి నను వేంకటేశ్వరుం డట్టిగాచె
సాహసించి యెట్లంటినో శరణ మనుచు. 89

నేను పరస్త్రీలు, పరధనాపహరణము అను నపరాధములకు రోయనైతిని. ఇక పెద్దవారిలో నెట్లు మన్నన గాంచగలను? హరిని గురుని సేవించి యెఱుగను. ఇక నెన్ని శాస్త్రములు చదివి ఏమిప్రయోజనము? పాపము, కోపము, చలము మానిన వాడను గాను. ఇక నేను విజ్ఞాని నని విఱ్ఱవీగి లాభమేమి? నాకు సన్మార్గము రుచింపదు. ఇక నే నెట్లు భగవంతుడవైన నీయొక్కతత్త్వమును చింతింప గలను? మోహదాహములు నన్ను వీడవు. ముందువెనుకలు నే నెఱుగను. ఇక నేను విరక్తుడ నెట్లు కాగలను ? ఇట్టి నన్ను ఆ శ్రీవేంకటేశ్వరుండు రక్షించెనుగాక! నేను ఆ స్వామిని నాసహజదుస్స్వభావమును మాని ఎట్లు శరణజొచ్చితినో విచిత్రముగ నున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇట్టివాని నన్ను | 32 | 177 | 15 | 118 |

అప: శరణాగతుల తప్పొప్పులు సరిచేయుటకు శ్రీహరియే కల డనుచున్నాడు.

సీ. ఎవఁడు పుణ్యుండుగాఁ ? డెవఁడు పాతకి కాఁడు ?
తొల్లిటిజన్మము లెల్లఁ దలఁప;
నేరు పెయ్యది ? మఱి నేర మెయ్యది ? జీవి
కచ్యుతునకు శరణనుటె గుఱుతు;
పుట్టని కులమేది ? బొక్కని తిండియే ?
దిట్టె యీ జీవుల నెంచిచూడ;
నిందు కొంచియ మేది ? యిందు దొడ్డయు నేది ?
యందిందు హరిదాసుఁ డగుటె గుఱుతు;

గీ. ఎఱిఁగి చేయుట మానుట యెఱుఁగకుండఁ
గలదె ? తప్పొప్పులకు భువి గలఁడు శౌరి;
పరుసమున కినుమైనను పైఁడి యయిన
సరియె; శ్రీహరిగొల్చుట గుఱుతు గాదె ? **90**

లోకములో జీవుల పూర్వపూర్వజన్మములను పరికించినచో నందఱును పుణ్యాత్ములుగానో పాపాత్ములుగానో తేలుదురు. పుణ్యపాపములకు ఎవ్వరును అతీతులుగా రనుట. ఇందులో ఏది నేర్పు ? ఏది నేరమి ? ఇది నిర్ణయించుటకూడ కష్టమే. కావున ఈ మీమాంసకుపోక భగవంతునకు శరణాగతు డగుటయే జీవుని కర్తవ్యము. ఇంకను ఈ జీవులను పరిశీలించి చూచితిమా వారు జన్మించని కులము లేదు; తినని తిండియు లేదు. ఇందులో కొంచెమేది ? గొప్ప యేది? కావున ఈ విషయమై విచారింపక హరికి దాసు డగుటయే మనుజుని కర్తవ్యము. తెలిసి చేయుట, తెలియకమానుట అనునవి లేవు. శరణుజొచ్చినవారి తప్పొప్పులను ఆ శ్రీవేంకటేశ్వరుడే సరిచూచుకొనగలడు. పరుసవేదికి ఇనుమైనను బంగార మైనను ఒకటియేగదా ! కాన శ్రీహరిసేవయే జీవితలక్ష్యము కావలయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అప్పుడే కృతార్థుడు | 9 | 54 | 15 | 36 |

అవ: జపతపోవ్రతాదు లొనర్చిపడయు సద్గతికంటె హరికి శరణనుటయే మహత్తర శోభాకర మనుచున్నాడు.

సీ. చేసి తపమ్ము వసిష్ఠుఁ డయ్యెద నన్న
నతఁ డొక్కచుక్కయే యంబరమున;
మఘములు గావించి మఘవుఁ డయ్యెద నన్న
నీతఁడు నొక్కదిగీశ్వరుండె;
ఘనదానములు సల్పి కర్ణుఁ డయ్యెద నన్న
నొనర నాతఁడు భువి నొక్క రాజె;
అమరత్వ మందెద నన్న నయ్యదికూడ
మేరు వనెడి కొండమీఁదిబ్రతుకె;

గీ. శౌరి దాస్యమ్మున కివేవి సాటిరావు;
శుకుఁడు హరి గొల్చి యంతటి శోభ నొందె;
ని ట్లగుట నే యుపాయమ్ము లిచ్చగింప
కిందిరావిభుశరణని యెలమి గందు. 91

తపస్సుచేసి నేనును మఱియొక వసిష్ఠుడ నయ్యెద నన్నచో ఆ వసిష్ఠుడు ఆకాశములో ఒకనక్షత్రమాత్రుడే. యజ్ఞములు సలిపి నేను మఱొక దేవేంద్రుడ నయ్యెద నన్నచో ఆ యింద్రుడు గూడ ఒక తూర్పుదిక్కునకు పాలకుడై యున్నాడు. గొప్పగా దానములుచేసి ఇంకొక కర్ణుడ నయ్యెద నన్నచో ఆ కర్ణుడు గూడ ఈ భూమిలో ఒక రాజమాత్రుడే. పోనీ నాయనుష్ఠానబలముతో నేను దేవ తాత్వ మొంది స్వర్గమున కరిగెద నన్నచో ఆ స్వర్గనివాసముగూడ మేరువనబడెడు ఒక కొండమీదిబ్రతుకే. కావున పైజెప్పిన వేవియు భగవద్దాస్యమునకు సమానములు కావు. మున్ను శుకయోగీంద్రుడు శ్రీహరిని సేవించి అంతటి మహోన్నతస్థితి నొందెను. కాన ఇతరోపాయము లేవియు ఆశింపక నేను లక్ష్మీవిభునకు శరణాగతుడనై ఆనందము పొందెదను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| హరి నీ దాస్యమునకు | 7 | 40 | 15 | 27 |

అవ: భగవద్భావన లేనివానికే హేయమైన ఐహికప్రపంచము సుఖముగా తోచు ననుచున్నాడు.

సీ. ఏను బ్రహ్మానంద మెఱుఁగను గనుక పా
పపుభోగమే నాకు బ్రాతి యయ్యె;
వైకుంఠమును గన్నవాఁడఁ గాను గనుక
తీపు లీ భువి నాకుఁదిరము లయ్యె;
వనజాక్షుభక్తి చాలని వాఁడను గనుక
హేయకర్మమ్మె దొడ్డాయె నాకు;
జ్ఞానమ్ము నమ్మని జాల్మఁడను గనుక
మాయసంసృతి మనసాయె నాకు;

గీ. వాసుదేవుధ్యానము లేనివాఁడఁ గనుక
అన్యదేవత లిటు లరు దయిరి నాకు;
పుడమి పందులు సుక మందె పొందినట్టు
లక్కటా! మసి కస్తూరి యయ్యె నాకు. 92

నేను బ్రహ్మానంద మెట్టిదోయెఱుంగను. కావుననే దుష్కృతమయములైన భోగములే నాకు అపూర్వము లైనవి. నే నెన్నడును వైకుంఠమును జూచినవాడను గాను. అందుచేతనే ఐహికానుభవములే నాకు శాశ్వతసుఖములుగాగాన్పించు చున్నవి. నేను పద్మాక్షునిమీద భక్తి సల్పనివాడను. ఆ కారణముననే తుచ్ఛమైన కర్మము నాకు ఘనముగా నున్నది. నేను జ్ఞానమును విశ్వసించని పామరుడను. అందువలననే మాయసంసారముపై నాకు మనసైనది. నేను వసుదేవసుతుని ధ్యానించినవాడను గాను. కనుకనే ఇతరదేవతలు నాకు అబ్బుర మైరి. ఎరా ! పందులు హేయమందే సౌఖ్యము పొందినట్లు నేను నీచవిషయములందే రమించు చున్నాను. అకటా! నాపాలిటికి మసి కస్తూరిగా మారినది. అనగా మాలిన్యమే భోగ్యమైన దనుట.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| శునక సూకరాదులు | 7 | 41 | 15 | 27 |

అవ: క్రోధముయొక్క దుష్ఫలితములు వర్ణించుచున్నాడు.

సీ. **పరులు దిట్టిన తటి వాసు లెక్కించి నా**
**వెనుకనే వత్తుగా వెఱ్ఱికినుక !**
**ధనముకొఱకుఁగాను తగవులు పెట్టించి**
**ఘనుల నెఱుఁగనీవు గదవె కినుక !**
**తనివి నవ్వుచు వచ్చి తలమొల వీడఁగా**
**సివము నెత్తింతుగా చెట్టకినుక !**
**చదువులు చదివిన సరసపండితునైన**
**మొదలంటఁ జెఱుతుగా మొండికినుక !**

గీ. **బుద్ధులు వినంగ నీయక బూతు బందు**
**కెరలఁ జేసి పెద్దతికమ్ముఁ జెఱుతు కినుక !**
**అదె వృషాద్రీశ్వరుండు న న్నాదరించె**
**చెల్ల వింక నీ యాగడాల్ చెడుగు కినుక !** **93**

ఓసీ వెఱ్ఱికోపమా ! ఇతరులు నన్ను దూషించినప్పుడు వారిపై నాకు దురావేశము గల్పించి నావెనుకనే వచ్చుచుంటివిగదా ! ఓ కోపమా ! తుచ్ఛమైన ధనము కొఱకై లేనిపోని వివాదములు సృష్టించి మహనీయుల స్వరూపము అవగతము కానీకుండ నాకు అడ్డపడుచున్నావుగదా! ఓ దురాగ్రహమా ! నవ్వుచు వచ్చి నా చెంతజేరి నేను తలమొల వీడున ట్లుద్రేకముచెంది చిందులు ద్రొక్కునట్లు చేతువుగదా !

ఓమొండియలుకా! సకలవిద్యాపారంగతుడగు సరసవిద్వాంసునిగూడ సమూలముగ చెఱతువుగదా! పెద్దలుచెప్పు సదుపదేశములను విననీక బూతు మాటలను పలికించి నా పెద్దతికమును పాడుచేయుచున్నావు. కానిమ్ము. అదుగో శ్రీవేంకటేశ్వరుడు ! న న్నాదరించినాడు. ఓదుష్టమగు కోపమా ! ఇక నీ యాగడములు నావద్ద సాగవు. తొలగి పొమ్ము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| చాలుఁ జాలుఁ దొలఁగవో | 13 | 73 | 15 | 49 |

అవ: శరణాగతులను భగవంతు డనుగ్రహించువిధమును వివరించుచున్నాడు.

సీ. సీతావిరహ మోర్చి శ్రీరామచంద్రుండు
సహజు లక్ష్మణుఁ బాయఁజాలఁ డయ్యె
ఆత్మబంధులకంటె నండఁబాయక కొల్చు
కైంకర్యపరునికే గణుతి గలిగె
జనకుని వీడివచ్చిన దాశరథికి నా
సుగ్రీవుతోఁ గల్గె చుట్టఱికము
తల్లిదండ్రులకంటెఁ దగఁ గొల్చు నడియరి
యాంతరంగికుఁ డాయె నన్నిటికిని

గీ. భరతుమాట మీఱిన రఘువరుఁడు మీఱఁ
జాలఁ డయ్యెను గద విభీషణుని భక్తి ?
తల్లిదండ్రులకంటె సోదరులకంటె
నిష్టుఁ డయ్యెఁ బ్రపన్నుఁ డా యీశ్వరునకు. 94

శ్రీరామచంద్రుడు సీతయెడబాటు నైన సహించెనుగాని తన్ను వెన్నంటి వచ్చిన సోదరుడు లక్ష్మణుని విడువజాల డయ్యెను. ఆత్మబంధువులైనవారికంటె అండవాయక సేవించు కింకరునకే విలువ గల్గినది.

రాముడు తన తండ్రియగు దశరథునివదలి కానలకు వచ్చెను. అక్కడ అతనికి సుగ్రీవునితో సఖ్యము కుదిరినది. తల్లిదండ్రులకంటెను తన్ను కొలుచు దాసుడే రఘువీరునకు అంతరంగికు డాయెను.

సోదరుడైన భరతునిమాటనే తిరస్కరించెనుగాని రఘురాముడు విభీషణుని భక్తిని కాదనలేకపోయెను. ఆ పరమేశ్వరునకు జననీజనకులకంటెను, తోఁబుట్టువుల కంటెను తన్ను శరణుజొచ్చిన వాడే ప్రియతము డయ్యెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇప్పుడు నమ్మినవారి | 47 | 265 | 15 | 179 |

అవ: దోషభూయిష్ఠమైన ఈ లోకయాత్రలో హరిశరణాగతియొక్కటే సరియైన తెరు వనుచున్నాడు.

సీ. **అట్టె కోపింపక యాజ్ఞయు నడవదు**
**పట్టి శిక్షింపఁ బాపమ్ము హింస;**
**ఏమి యొల్లక సాగ దీ సంసరణయాత్ర**
**ముట్టబంధము - మోక్షమునకు దవ్వు;**
**ఒకరి రక్షింప వేఱొక్కరి కపకృతి**
**సకలమ్ము మానిన జన్మము వృథ;**
**చేత ధనము లేదు చేయంగ దానమ్ము**
**ధనకాంక్ష సుజ్ఞానమునకు వైరి;**

గీ. **తనువు పోషింప కున్నచోఁ దగులు నింద్రి**
**యమ్ములు విరక్తుఁ డైన లోకమ్ము మెచ్చ;**
**దాత్మ గెలిచెద నను మదం బహినగేశు**
**శరణు వేఁడక యుడుగ; దే తెరువు లేదు.** 95

ఈ లోకములో కోపముచూపనివారి యాదేశము చెల్లదు. కోపించి యెల్లవారిని శిక్షించినచో హింసారూపమైనపాప మంటుకొనును. ఏమియు నా కక్కర లేదు అని మడిగట్టుకొని కూర్చున్నచో ఈ సంసారయాత్ర నడవదు. దేనితోనైన బంధము కల్పించుకొన్నచో అది ముక్తికి విరోధి యగును. లోకమున ఒకరిని రక్షింప యత్నించినచో మఱొక్కరికి హాని జరిగి తీరును. ఏదియు నాకు పనిలేదని అంతయు వదలి కూర్చున్నచో తనజన్మమే వ్యర్థ మగును. దానము చేయుటకు ధనము లేదు; పోనీ సుకరముగా ధన మార్జింత మన్నచో ఆ ధనాశ సుజ్ఞానమునకు బద్ధశత్రువు. ఈ శరీరమును పోషింప కున్నచో ఇంద్రియములు వేధించును. విరాగి యైనచో లోకము మెచ్చదు. నేను ఆత్మవిజేత నగుదు నను గర్వము శ్రీవేంకటేశ్వరుని శరణువేడక తొలగదు. ఈ బంధమును విడిపించు కొనుటకు శరణాగతికంటె అన్యోపాయములేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమిటాఁ బోరాదు | 45 | 255 | 15 | 172 |

అవ: ఇతరకర్మము లెల్ల నిష్ఫలములు; శేషాద్రీశ్వరునిసేవ యొక్కటే ఫలవంత మనుచున్నాడు.

సీ. తొందితోఁ జేసిన పుణ్యసంచయ మెల్ల
గొందిఁజచ్చిన మీఁదఁ గుడిచెడి దఁట
కంది కుంది గడించు ఘనమైన సంపద
యాలుబిడ్డలవశ మయ్యెడి దఁట
బిరుదుశాస్త్రమ్మునఁ బెండ్లి యాడిన సతి
మఱుపుట్టువున వేఱుమానిసి యఁట
పెరిమ బహుగతులఁ బెంచుకొన్నశరీర
మరయంగఁ దనవెంట నరుగ దంట

గీ. చెలఁగి యిచ్చి యార్జించిన లలితకీర్తి
పిలుచునట్టి యా జన్మంపుపేరిది యఁట
ఫణిగిరీశ్వరు సేవించ వలదె ? యాత్మ
గలఁ దతం దని కొలిచినఁ గలుగు ఫలము. 96

ఈ శరీరముతో ఈ జన్మలో చేసిన సుకృతమంతయు మరణించినపిమ్మట మరు జన్మలో అనుభవమునకు వచ్చునట ! కష్టించి చెమటోడ్చి ఆర్జించిన దొడ్డ సంపద ఆలుబిడ్డలపా లగునట. శాస్త్రోక్తవిధానముతో పరిణయమాడినసతి వచ్చు జన్మలో వేఱెవ్వరో యట ! ప్రేమతో అనేకవిధముల పెంచుకొన్న దేహము తన వెంట రాదట ! దాన మొనర్చి గడించిన ఖ్యాతి తన్ను ఆహ్వానించు భవిష్యజ్జన్మమున ఫలప్రద మగునట !

కావున పైసుకృతముల కన్నింటికి కలుగుప్రయోజనము అప్పటప్పటికి అందుబాటులో లేదు.

కనుక శేషాద్రీశ్వరుని సేవించుటయే కర్తవ్యము. అత డాత్మలో నంతర్యామిగా నున్నాడని నమ్మి సేవించినచో తప్పక ఫలము అప్పుడే దక్కును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎక్కడి మాటలు | 53 | 302 | 15 | 203 |

అవ: తానొకపెద్దనని విఱ్ఱవీగక దామోదరుని నమ్మి ఆయన దయకు పాత్రుడగుటయే తగు ననుచున్నాడు.

సీ. దైవభారమ్మును తా వహింపఁగ నేల ?
మోవంగఁ జాలక మలుగ నేల ?
నేను నీవాఁడ లక్ష్మీనాథ ! యని సేవ
గావించు చుండంగఁ గాచు నతఁడె
ఏలి కెక్కెడు గద్దె నెక్క నేల ? పిఱుంద
నపరాధమునకు బిట్టడల నేల ?
ఆలుబిడ్డలవశ మ్మౌటకు హరిఁ జేరి
నియతి గొల్వఁగఁ గరుణించు నతఁడె

ఆ. అహినగేశుమాయ కడ్డాలు రానేల
త్రోవగనక యతని దూఱ నేల ?
వైష్ణవుం దగుటకు వనజాక్షు నమ్మి భా
వించు కొనఁగఁ గనికరించు నతఁడు. 97

దైవముపహించు భారము తనపై వేసికొను టెందుకు? అట్లు వేసికొని ఆ బరువు మోయలేక మూల్గు టెందులకు? లక్ష్మీశ్వరా ! నేను నీవాడను అని అతనిని సేవించినచో చాలు. ఆ దేవుడే అట్టివాని యోగక్షేమములు చూచును.

ప్రభు వధిష్ఠించు నాసనముపై తా నెందుకు కూర్చుంగవలెను ? పిమ్మట అట్లు కూర్చున్న అపరాధమునకు దండనము పడినప్పుడు పొగులు టెందులకు?

తాను భార్యాపుత్రులకువశమై వారు పెట్టుబాధల కగ్గముగాక హరి నాశ్రయించి నేమముతో సేవించినచో అతడే దయచూపగలడు.

శేషాచలేశ్వరునిమాయకు తానేల అడ్డపడవలెను ? ఆపై తెరువుగానక ఆ దేవుని నిందించు టెందులకు ? ఆ పద్మాక్షుని నమ్మి భావించుచుండినచో ఆ విష్ణుమూర్తియే కరుణించగలడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కాదని వేరే | 26 | 149 | 15 | 99 |

అవ: భగవత్సేవయే భక్తునిదుష్కృతము తొలగించి ధర్మాత్ముని గావించు నను చున్నాడు.

సీ. పుటము పెట్టిన పైఁడిపూదె యెత్తు దఱిగి
క్రక్కున వన్నియ కెక్కినట్లు
చిటుకున హరిభక్తిచేత మాలిన్యమ్ము
చనఁగ జీవాత్ముండు ఘనత గాంచు;
అరయఁ జిట్టెము గట్టినట్టి మాణిక్యమ్ము
సానఁబట్టిన దీప్తి నూనినట్లు
బోరన నాచార్యబోధచే శిష్యుండు
భువియందు సంతతపుణ్యుఁ డగును;

గీ. ధూళిగప్పిన యద్దమ్ము దోమినయెడ
విశ్వమెల్లఁ దెల్లముగఁ గాన్పించినట్లు
వృషగిరీశుఁ గొల్చుచుఁ గృతకృత్యుఁ డైన
బత్తుఁడు నిజమ్ముగా ధర్మచిత్తుఁ డగును. 98

బంగారుపూస పుటములో పెట్టినప్పుడు కొంతయెత్తు తఱిగి వెంటనే యుజ్జ్వల కాంతితో నొప్పారును. అట్లే జీవుడు హరిభక్తిగలవా డగుచో క్షణములో మాలిన్యమును గోల్పోయి దొడ్డతనమును పొందును. చిట్టెముగట్టిన రత్నము సానబట్టినచో మిక్కిలి ప్రకాశించును. అట్లే గురుబోధచే శిష్యుడు లోకమునందు చిరపుణ్యు డగును. దుమ్ముగప్పిన దర్పణమును తోమగా అందు ప్రపంచమంతయు విస్పష్టముగా గన్పించును. అట్లే శ్రీవేంకటేశ్వరుని సేవించుచు చరితార్థుడైన భక్తుడు నిక్కముగా ధర్మాత్ము డగును. కావున వృషాద్రినాథునిసేవయే కర్తవ్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| దృష్టాంత మిది దప్పదు | 57 | 327 | 15 | 220 |

అవ: భగవత్సేవయొకటే క్రిందుమీదులులేని ఇహపరసౌఖ్యములు సమకూర్చు ననుచున్నాడు.

సీ. **నరులె కొన్నాళ్ళకు సుర లయ్యెదరు; మఱి**
**సుర లయ్యెదరు మీఁద నరులుగాఁగ;**
**జలమయమై యుండు జగమెల్ల నొకవేళ**
**జగమె కాన్పించు నా జలమునందె;**
**మదగజం బొకయప్డు మశకమై జనియించు**
**మశకమే యేనుఁగై మరలఁ బుట్టుఁ;**
**గాలంపుగతిని చీఁకటి వెన్నెలం దోలు**
**వెన్నెల చీఁకట్ల వెడలఁగొట్టు;**

గీ. **బంట్లు దొర లయ్యెదరు మహాభాగ్యవశత;**
**బంటు లౌదురు దొర; లోడ బండిమీఁద**
**నోడపై బండిసాగు; నచ్యుతునిఁ గొలువ**
**పరము నిహ మను నవి యొక్కపగిది గలుగు.** **99**

మానవులే కొన్నాళ్లకు దేవత లయ్యెదరు. ఆ దేవతలే మరల మానవు లయ్యెదరు. ఒకసమయమున ప్రపంచ మంతయు జలమయమై యుండును. పిదప ఆ జలమునందే ప్రపంచ ముద్భవించును. మదపుటేనుగే ఒకకాలమున దోమయై జన్మించును. ఆ దోమయే మరల దొడ్డయేనుగై పుట్టును. కాలగతి ననుసరించి ఒకచో చీకటి వెన్నెలను వెడలగొట్టును. మరల ఆ వెన్నెల చీకట్లను పాఱద్రోలును. భాగ్యము ననుసరించి భృత్యులు రాజు లయ్యెదరు. ఆ దొరలే భాగ్యము వక్రించిన వేళ బంట్లగుదురు. పడవ బండిమీద ఒకప్పుడు పయనించును. ఆ బండియే మఱొకప్పుడు పడవపై పయనము సాగించును. ఈ విధముగా లోకవృత్త మంతయు క్రిందుమీదులుగా నున్నది. కాని నాశరహితుడైన శ్రీవేంకటేశ్వరుని కొలుచువారికి ఇహపరసుఖములలో ఎట్టి హెచ్చు తగ్గులు కలుగవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఓడలు బండ్లవచ్చు | 67 | 383 | 15 | 257 |

అవ: అంతర్యామియైన హరిని అన్యచింతవీడి సంతతము ధ్యానింపవలె నను చున్నాడు.

సీ. పుడమి దొంగకుచింత ప్రొద్దుమీఁదనె యుండు;
ముగుదపైనుండుఁ గాముకుని బుద్ధి;
సైరికునిమనస్సు చాలుపై నుండును;
జూదరితలఁ పాటమీఁద నుండు;
సరవి కోమటిదృష్టి సరకులపై నుండు;
పడుగుపై మతి సాలెవాని కుండు;
బెస్తకు గాలపుబెండుపై చూపుండు;
కన్ను లక్ష్యమున విల్కానికుండు;

గీ. ఆముకొని వేంకటేశ్వరుఁ డంతరాత్ముఁ
డై వెలయుచుండు పరమతత్త్వార్థ మెప్పు
డెచ్చరికమీఱ నూహించు చిట్టలున్నఁ
గాని తలఁ పలవడదు విజ్ఞానికేని. 100

ధరలో చోరునకు ఆలోచన ప్రొద్దెపుడు గ్రుంకునా యనియే యుండును. కాముకుడైనవానితలపు కామినిమీదనే యుండును. పొలముదున్ను రైతునకు చిత్తము నాగటిచాలుమీదనే యుండును. జూదగాని భావమంతయు జూదము మీదనే యుండును. కోమటిచూపు సరకులమీదనే యుండును. సాలెవానిబుద్ధి పడుగు పైననే ప్రసరించును. బెస్తవానిచూపు గాలపు బెండుమీదనే యుండును. ధానుష్కుని దృష్టి గుఱిమీదనే యుండును. జీవులకెల్లరకు శ్రీవేంకటేశ్వరుడు అంతర్యామియై యున్నాడు. కావున తత్త్వజ్ఞునిదృష్టి అంతరాత్ముడైన ఆ భగవంతుని మీదనే యుండవలెను. లేనిచో భావము భగవదేకనిష్ఠము కాజాలదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అప్పుడుగాని తలఁపు | 66 | 377 | 15 | 253 |

అవ: భగవంతు నాశ్రయింపక భవబంధము తొలగ దనుచున్నాడు.

సీ. భవపాశబంధముల్ పటుకునఁ దెగునటే
విష్ణుఁ గొలిచి విన్నవించకుండ
దుర్భరమ్ము లనాదిదురితముల్ వాయునే
శ్రీశుమంత్రజపమ్ము సేయకుండ
కామమ్ము క్రోధమ్ము గ్రక్కున వీడునే
మొఱపెట్టి శౌరికి మ్రొక్కకుండ
వెక్కసపుంగర్మవితతి దొలంగునే
శ్రీవైష్ణవమతమ్ము చెందకుండ

గీ. [illegible]గాఢమైన యజ్ఞానాంధకారపటలి
[illegible]గునే వేంకటేశ్వరు నెడఁద గనక
[illegible]గునే చంచలత్వంబు [illegible]ద్దవిడిని
[illegible] వలమేలుమంగమ్మ[illegible]దల లేక. 101

వెన్నుని సేవించి అతనికి తన మొఱలు వినిపించకున్నచో సంసారపాశ బంధములు తెగవు. లక్ష్మీశ్వరుని మంత్రజప మొనర్పకున్నచో భరింపరాని అనాదిపాపములు వాయవు. శౌరికి మొఱలిడి ప్రణమిల్ల కున్నచో కామక్రోధములు వీడవు. శ్రీవైష్ణవమతము స్వీకరింప కున్నచో కర్మసంచయము తెగటాఱదు. శ్రీవేంకటేశ్వరుని భావమున చూడకున్నచో దృఢ మగు అజ్ఞానమనెడు తమస్సమూహము విచ్చదు. అలమేల్మంగాదేవి ఆజ్ఞలేక చాంచల్యము సమయదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎంతబలిమి సేసినా | 68 | 388 | 15 | 261 |

అవ: కడతేఱుటకు హరిని శరణు జొచ్చుటతప్ప ఉపాయాంతరము లేదను చున్నాడు.

సీ. తన్నుఁ బ్రోవఁగ దైవతమ్మె నేరుచుఁగాక
మనుజుఁ డే మెఱుఁగు నున్మత్త బుద్ధి
పోరి నింద్రియముల పెంపుడుఁగుఱ్ఱ తా నిత్య
మందులోపలఁ బొరలాడుఁగాక
గుణబద్ధుఁ డై నట్టి కూళజీవుం డేమి
యెఱుఁగు? కాలము కర్మ మెఱుఁగుఁగాక
అలరి కామాదుల కరిగాఁపు తానయి
చెలఁగి వానికిఁ బనిసేయుఁగాక

గీ. గురుఁ డెఱుంగును బోధింపఁ గొలఁది యెఱిఁగి
హీనశక్తుండు తనుధారి యే మెఱుంగు ?
వృషగిరీశ్వరపరతంత్రుఁ డెంచఁ దాను
స్వామిశరణొంది కడతేఱవలయుఁ గాక ! 102

తన్ను రక్షించుటకు పరమాత్ముడే సమర్థు డగునుగాని మదోన్మత్తుడైన మఱొకమానవుడు ఎట్లు సమర్థు డగును? ఇంద్రియముల అదుపాజ్ఞలలో పెరిగిన శిశువగు తాను నిరంతరము ఆ యింద్రియార్థములలోనే పొరలాడును. కర్మమే కాలగతి ననుసరించి ఫలమిచ్చుట తెలియునుగాని త్రిగుణములచే బద్ధుడైన మూర్ఖజీవుడు ఏమితెలియును ? కామక్రోధాదులవశమై ఆ జీవుడు వాటికి దాస్యము సల్పుచుండును. జీవునిశక్తియుక్తులు గ్రహించి అనువగుకాలమున ఆతనికి తత్త్వము బోధించుటకు ఆచార్యుడే యెఱుంగును. శక్తిహీనుడగు శరీర ధారికి అది తెలియదు. జీవుడు వేంకటేశ్వరునకు అధీనుడు. కాన ఆ స్వామికే శరణాగతుడై సంసారముక్తుడు కావలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏటి వివేకము | 19 | 105 | 15 | 70 |

అవ: తిర్యగ్జాతితో సమానమైన ప్రవృత్తిగల మానవులను దేవుడే దయజూడ వలె ననుచున్నాడు.

సీ. **మాట లొక్కటెగాని మాకును బసులకు**
**నెంచ సమంబె పంచేంద్రియములు;**
**తిరుగు టొక్కటెగాని పోరి ఱాళ్ళకును మాకుఁ**
**దలఁపంగ భవబంధములు సమంబె;**
**దొడ్డదేహమెగాని దోమలకును మాకు**
**జానొందు జీవాత్మ సర్వసమమె;**
**చవు లెఱింగెడి విశేషమెగాని యెద్దైత**
**నంబెన్న జంతుసమంబె మాకు;**

గీ. **కడఁగి చదువుటెగాని చిల్కలకు మాకు**
**నక్షరమ్ములు సమమె; మే మాది దేవుఁ**
**గనుట యెన్నండు బుద్ధులఁ దనరుటెన్నఁ ;**
**దంజనాద్రీశుఁడే దయ నరయుఁ గాక !** **103**

మేము మానవులము. మాకు మాటలు వచ్చును. మాలోనివిశేష మదియే. పంచేంద్రియవ్యవహారములు పశువులకును మాకును తుల్యములే. మేము తిరుగ నేర్చినవారము. రాళ్ళు తిరుగలేవు. కాని ఆ రాళ్లకును మాకును జన్మబంధములు సమానములే. రాయిగూడ భావవికారములకు లోనగుచున్న దనుట. దోమలతో పోల్చికొన్నప్పుడు మాశరీరము చాలపెద్దది. కాని వాటియందును, మాయందును నెలకొన్న జీవాత్మ ఉభయసమానమే. మేము నానావిధములైన రుచు లెఱుంగ నేర్చితిమి. అదే మాయందలివిశేషము. కాని మూర్ఖత్వము జంతువులకును, మాకును ఒక్కటే. మేము దేనినైన చదువనేర్తుము. చిలుకలు చెప్పినమాటలనే అనువదింపగలవు. కాని మాకును వాటికిని అక్షరము లవియే.

ఈ విధముగ పశుపక్షిజాతులతో సమానమైన మేము ఆదిదేవుని ఎపుడు దర్శింపగలము ? మాబుద్ధులు తత్త్వజ్ఞానముతో ప్రకాశించు టెప్పుడు ? ఆ అంజనగిరినాథుడే మమ్ము కరుణతో కాపాడుగాక !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎన్నడు దేవుని | 8 | 48 | 15 | 32 |

అవ: వేదాధ్యయనాదు లన్నియు హరిసాక్షాత్కార మగువఱకే అవశ్యక మను చున్నాడు.

సీ. సరవితోఁ జదువుట సర్వ వేదమ్ములు
హరినామరుచి గన్న యంతవఱకె;
సిరులతో యజ్ఞముల్ చేయుట లెల్లను
హరిసేవనాపరుండైన వఱకె;
చలపట్టి తీర్థముల్ చరియించు టెల్లను
బహువిధకర్మముల్ పడెడు వఱకె;
ముని యయి తపములు మొనసి కావించుట
తలఁపులో హరిరూపు దగులు వఱకె;

ఆ. వేయువిధములైన విజ్ఞాన మెల్లను
ఘనతరహరిభక్తి గనెడు వఱకె;
ఊహసేయఁగ సకలోపాయములు శేష
శిఖరి శేఖరవిభుఁ జేరువఱకె. 104

సమస్త వేదములు క్రమముగా చదువుట భగవన్నామముయొక్క రుచి ఒంటబట్టువఱకే. సంపదలు వెచ్చించి యజ్ఞము లొనర్చుటంతయు హరిసేవకు డగు నంత వఱకే. పట్టుదలతో తీర్థయాత్రలు గావించుట కర్మములు తొలగు నంతవఱకే, మునివృత్తితో తప మాచరించుట భగవత్స్వరూపము చిత్తములో హత్తుకొనువఱకే. వేలకొలదివిజ్ఞానము లెల్లను హరిభక్తి యందుకొనునంతవఱకే. ఉపాయములెల్ల శేషాద్రినాథుడగు శ్రీవేంకటేశ్వరుని సన్నిధి చేరునంతవఱకే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అటమీఁద మరియేమి | 14 | 79 | 15 | 53 |

అప: భగవంతుని చేరువకు సరున కెందును శాంతిసౌఖ్యములు లే ను చున్నాడు.

సీ. పాపకర్మ మనస్సు పంచేంద్రియములకె
చూపించెఁ ; గృప యింత చూపదాయె ;
దీపనం బెసకొల్పు దేహంబు రుచులకె
తనమోము వాపించెఁ ; దనుప దాయె ;
సిగ్గులేనివయస్సు చెలుల యెంగిలిమోవి
కొగ్గించె ; దొరతన మ్మొసఁగ దాయె ;
నుగ్గైన యీ యాస నూర్వురఁ గొలిపించి
దర్పం బుడిపె ; దరిఁ జేర్ప దాయె ;

గీ. మాలుగలసినబ్రదుకు పెన్మాయగలపి
యేలొకో శాశ్వతసుఖంబు నీయ దాయె ;
నింతలో వేంకటేశ్వరుఁ డెంచికాచె
నెవరివాఁడు గాఁడాయె తా నిన్నినాళ్ళు. **105**

దుష్కృత్యముల కలవడిన చిత్తము పంచేంద్రియములను విషయానుభవమునకే పురికొల్పినదిగాని విషయవిరక్తి గూర్చుటలో జీవునిపై ఇసుమంతయు కృప జూపని దయ్యెను. భోగానుభవమునకు ప్రేరించు శరీరము పైపైరుచుల మీదనే నాకు తృష్ణగల్గించినదిగాని తృష్ణారహితమైన స్థితిని చేకూర్చి నిజమైన సంతృప్తిని కలిగింపని దయ్యెను. సిగ్గుమాలిన యౌవనము స్త్రీల యెంగిలిపెదవులకే నన్ను భ్రమింపజేసినదిగాని ఇంద్రియదాస్యములేని స్వతంత్రతను ప్రసాదింప దయ్యెను. పాడుతృష్ణ నాచె నూరుమందికి సేవలు చేయించి నా గర్వము నణచినదిగాని తృష్ణా సాగరతీరమును చేర్చని దయ్యెను. దిక్కుమాలిన బ్రతుకు నన్ను మాయ కధీనునిజేసి ఎందుకో శాశ్వతసుఖమునకు పాత్రుని గావింప దయ్యెను. ఇంతలో నాపూర్వపుణ్యము పండినది కాబోలు శ్రీవేంకటేశ్వరస్వామి నన్ను రక్షించినాడు. ఈ దేవుని చేరువకు ఇన్నిదినములు నే నెవరివాడను గాక చెడిపోయితిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కలకాల మెవ్వరికిఁగా | 9 | 51 | 15 | 34 |

అవ: వెన్నంటియున్న దేవుని గ్రహింపలేక జీవుడు ధనకనకాదులకు దాసుడై తల్లడిల్లుచున్నా డనుచున్నాడు.

సీ. వీసమ్ము గొనిరాఁడు వెనుక పుట్టిదునాఁడు
తారమ్ము గొనిపోఁడు తరలునాఁడు
మొనచూపి నడుమంత్రమునఁ దిరుగాడెడు
కనకమ్మునకు దేహి కాఛియుండు
ఒక్కఁడు నిలుపలేఁ డూడిపోయెడివాని
వారింపఁగాలేఁడు వచ్చువాని;
ఇందుకుగాఁ బరు లెల్ల రక్షకులంచు
బందుబందై కొంచెపడును ప్రాణి;

గీ. పనుల కిట్టులె వగవంగఁ బనియు లేదు
ఏకసరణిని సంసార మెపుడు సనదు
విడువనివిభుండు తిరుమల వెలుఁగుచుండఁ
దలఁపలే కిట్లు జీవుండు తల్లడిల్లు. 106

ఈ జీవుడు జన్మించునపుడు వీసమైనను తనవెంట గొనిరాడు. మరణించు నాడు కా సైనను తనవెంట గొనిపోడు. కాని మధ్యకాలమున తన్ను భ్రమింపజేయు కనకమునకై అతడు పడిగాపులు కాచుకొని యుండును. కాలము సంప్రాప్తమై తన్ను విడిచిపోవువాటిని ఎవడును పట్టి నిలుపలేడు. తమంతకు తాముగా వచ్చు వాటిని ఎవడును అడ్డుకొనలేడు. వాస్తవ మిట్లుండగా ఇతరు లెవ్వరో తన్ను రక్షింతు రని జీవుడు గుల్లగుల్లయై హైన్యము నందుచున్నాడు.

సుకృతదుష్కృతఫలములుగా వచ్చు సుఖదుఃఖములకై జీవుడు చింతింప నక్కఱలేదు. సంసార మెప్పుడు ఒకే తీరున నుండదు. చక్రపుటాకులవలె సుఖ దుఃఖములు సాగిపోవుచుండును. తన్ను విడువక అంతర్యామియై తనలోనే వెలయు చున్న శ్రీవేంకటేశ్వరుడు తిరుమలయందే సదా వెలుగుచున్నాడు. ఆ దేవుని స్మరింపలేక ఈ రీతిగా జీవుడు నానాయాతన లనుభవించుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నారాయణుని దివ్యనామము | 15 | 84 | 15 | 56 |

అవ: కర్మకన్న భక్తియే మిన్న యనుచున్నాడు.

సీ. **తపముచేసితి మంచు దర్పింపఁగా నేల**
**రావణాదులు సల్పరా తపమ్ము ?**
**హరినామకీర్తనపరులౌ ప్రపన్నులఁ**
**బోలుదు రే యజముఖ్యు లెల్ల ?**
**మహిఁ బుణ్యుల మటంచు మదియింపఁగా నేల**
**నహుషాదులకును బుణ్యమ్ము లేదె ?**
**సహజమ్ముగ ద్వయానుసంధానపరులైన**
**వైష్ణవులకు సాటివారె సురలు ?**

గీ. **స్వర్గ మందెద మనెడు రాజసము లేల ?**
**అందఁడా స్వర్గమును నరకాసురుండు ?**
**సప్తగిరినాథచక్రలాంఛనుల కెందు**
**మంతు కెక్కినయట్టి సోమపులు పురుడె ?** **107**

కర్మనిష్ఠులారా! మేము తప మాచరించుచున్నాము అని మీరేల గర్వింతురు? పూర్వము రావణుడు మున్నగువారు తప మాచరించినవారేగదా? బ్రహ్మాదులు సయితము భగవన్నామముకీర్తించుచు ఆ భగవంతునకు శరణాగతులైనవారితో ఈడువత్తురా ?

మేము పుణ్యాత్ములము అని మీరేల క్రొవ్వెదరు ? పూర్వము నహుషుడు మున్నగువారు కూడ పుణ్యకర్మములు చేసినవారేకదా !

ద్వయమంత్రము ననుసంధించు (శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయ నమః' అనునది ద్వయము) విష్ణుభక్తులతో దేవతలు సాటిరాగలరా ?

మేము స్వర్లోకమున కేగుదుము అన్న దర్పము మీ కెందులకు ? నరకాసురుడుగూడ స్వర్గమున కెక్కినవాడే గదా !

యజ్ఞానుష్ఠానుపరులై సోమపాన మొనర్చి ప్రసిద్ధిగన్నవారుకూడ ఏడుకొండలవాని చక్రపుగుర్తులు భుజముల ధరించిన శ్రీవైష్ణవులతో సమాను లగుదురా? కారని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కానని యజ్ఞానులాల | 25 | 141 | 15 | 94 |

అవ: భగవద్భక్తు లేజాతివా రైనను పూజ్యులే యనుచున్నాడు.

సీ. **జంగుపిల్లివలన జవ్వాది పుట్టదా ?**
**పుట్టదా గుల్లలో ముత్తియమ్ము ?**
**పుడమి నీఁగలవల్ల పుట్టదా తేనియ**
**బురదలో పుట్టదా సరసిజమ్ము ?**
**విషలతవల్ల నిర్విషమది పుట్టదా ?**
**పుట్టదా నునుపట్టు పురుగువలన ?**
**రాలలోఁ బుట్టదా రవ ? కాకముల వల్ల**
**పుట్టదా యశ్వత్థభూరుహమ్ము ?**

ఆ. **తపమె కారణమ్ము తలమేల కుల మేల ?**
**శౌరిదాసులకును జాతి యేల ?**
**అంజనాద్రివిభుని యంఘ్రులఁ గొలిచెడు**
**పుణ్యపురుష లెందుఁ బుట్టి రేమి ?** 108

అడవిపిల్లి నుండి జవ్వాది పుట్టుటలేదా ? ముత్యము గుల్లనుండి జనింపదా ? తేనె యీగలనుండి ఉద్భవింపదా ? పద్మము బురదలో పొడమదా? విషదోషము హరించు ఔషధము విషలతనుండి ప్రభవింపదా ? పురుగునుండి పట్టు పుట్టుట లేదా ? వజ్రము రాళ్లలో దొరకదా ? రావిచెట్టు కాకుల పెంటనుండి అంకురింపదా ?

కావున స్థలము, కులము ప్రధానములు కావు. తపస్సే గొప్పతనమునకు హేతు వగును. హరిదాసులకు జాతితో పనియేమి ? శేషాద్రీశ్వరుని పదముల నారాధించు పుణ్యాత్ములు ఏ జాతిలో జన్మించినను మాన్యులే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తలమేల కులమేల | 50 | 285 | 15 | 192 |

అవ: భగవద్భక్తి తైలధారవలె అవిచ్ఛిన్నముగా జాలువాఱవలె ననుచున్నాడు.

సీ. అఁకొన్నవానికి నన్నమం దున్నట్లు
హరిమీఁద నేఁకట యదరవలదె ?
విటకానిచూపులు వెలఁదిపై నున్నట్లు
మరుగురుపైఁ దమి పెరుఁగ వలదె ?
పసిబిడ్డనికి చంటిపాలపై నున్నట్లు
గోవిందుపైనాస కొాఅలవలదె ?
వెస బాటసారికి విడిదిపై నున్నట్లు
విష్ణుపైఁ దహదహ వెలయ వలదె ?

గీ. ధనికి నిధిమీఁదనున్నట్లు ఫణిశయాను
పదయుగళిమీఁద దృక్కులు పాఱవలదె ?
పరమసుజ్ఞానులకును ప్రపన్నులకును
మనసు మంగాంబమగనిపై మరల వలదె ? 109

ఆకలిగొన్నవానికి అన్నమునందే కాంక్షయుండును. అట్లే భక్తునకు పరమాత్మునిపై దృఢమగు నపేక్ష నెలకొనవలెను.

విటునిదృష్టియంతయు వెలయాలిమీదనే యుండును. ఆ చందముగనే దాసునిమమకారము మదనజనకునిమీదనే ఉండవలెను.

పసిబిడ్డ స్తన్యముమీదనే కోరిక గలిగి యుండును. అట్లే ప్రపన్నునిచిత్తము భగవంతునిమీదికి ప్రసరించవలెను.

బాటసారి లక్ష్య మంతయు గమ్యస్థానముమీదనే యుండును. అట్లే శ్రీవైష్ణవుని ఆసక్తి యంతయు వెన్నునిమీదనే వెలయవలెను.

ధనవంతుడు తననిధిమీదనే దృష్టి నిల్పును. అట్లే భక్తుని చూపంతయు శేషశాయిఅడుగుదోయి మీదనే యుండవలెను.

శ్రేష్ఠులైన జ్ఞానులకు ప్రపత్తి పరులైన భక్తులకు సదా పద్మావతీనాథుని మీదనే మనస్సు ఉండవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పరమజ్ఞానులకు | 8 | 46 | 15 | 31 |

అవ: ఆరాధనావిధానములు వేఱైనను ఆరాధ్యదైవ మొక్కడే యనుచున్నాడు.

సీ. పొడమినవారికిఁ బోయినవారికి
గడియ లొక్కటె వారిగతులె వేఱు ;
ఐడి పుణ్యములుసేయ పాపముల్ సేయంగ
కర్మమ్ములే వేఱు కాల మొకటె ;
కలహంసలు చరించె కాకులు దిరిగె సు
రపథ మొక్కటె విహారములె వేఱు ;
మిడిసి యెండలుగాయ మించి చీఁకటిరాయ
లోకపుబయ లొండె జోక వేఱు ;

గీ. అడుగుదీనుల, కేలెడు పుడమిమగల
కవని యొక్కటె బాగు లయ్యువియె వేఱు ;
కొందలప్పను భక్తితోఁ గొలువఁ దలఁప
నేరుపులె వేఱు గాని శరీర మొకటె. 110

లోకములో కొందఱు పుట్టుచున్నారు. మఱికొందఱు గిట్టుచున్నారు. కర్మములనుబట్టి వారిగతులు వేఱైనను ఈ రాకపోకలు జరుగుకాలమునందు మాత్రము భేదములేదు. కొందఱు పుణ్యము చేయుదురు. మఱికొందఱు పాపము లొనర్తురు. వారొనర్చు కర్మములు భిన్నములైనను ఆ పనులుచేయుసమయము మాత్ర మొక్కటే. కలహంసలును, కాకులును విహరించుచున్నవి. వాని విహారములు వేఱైనను విహారస్థలమైన వినువీథి ఒక్కటే. మండుటెండలు కాయు చున్నవి. కాఱుచీకట్లు క్రమ్ముకొనుచున్నవి. ఈ వెలుగునీడలవిలాసములు వేఱైనను అవి వ్యాపించు శూన్యస్థలమొక్కటే. కొందఱు దీనులై యాచించుచున్నారు. మఱికొందఱుధీరులై ప్రాభవము నెఱపుచున్నారు. 'ఈ యిరుతెగలవారి జీవన విధానములు వేఱుగా నున్నను వారి కాశ్రయమైన భూమి యొక్కటే. అట్లే శ్రీవేంకటాద్రినాథుని భక్తిభావముతో సేవించుటలోను, చింతించుటలోను ఆయా భక్తుల శక్తిసామర్థ్యములు భిన్నము లైనను వారికి సేవ్యమైన ఆ భగవానుని అప్రాకృతదివ్యమంగళవిగ్రహ మొక్కటే.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| దేవుఁ డొక్కఁడే | 59 | 334 | 15 | 225 |

ఆ.వె: సన్మార్గులతో దుర్మార్గులు సరిరా రనుచున్నాడు.

సీ. జనసమ్మతములగు పను లెల్ల నెరవేఱు

మహికి ద్వేఁగౌ పని మనికి గనునె ?

పురుషోత్తమున కగ్రపూజ చెల్లెను గాక

శిశుపాలుచలములు చెల్లినవియె ?

జనహితుఁడైన సజ్జనుఁడె వర్ధిలుఁగాక

కడతేఱునా గర్వి, కంటకుండు ?

ధర్మపుత్త్రుఁడె వసుంధర కెల్ల రాజాయె

రాజాయెనా ? ధృతరాష్ట్రుకొడుకు ?

గీ. కృతసుకృత మెప్పుడేని మేలిచ్చుఁ గాక

కలుషనిచయంబువలన సౌఖ్యంబు గలదె ?

గెలిచెఁ బ్రహ్లాదుఁ డహిగిరినిలయుఁ గొల్చి

కనకకశిపుఁడు గట్టెక్కఁ గల్గినాఁడె ? 111

ప్రజలకెల్ల ఇష్టములైన పనులే లోకమున తుదముట్ట నెఱవేఱును. జగతి కుద్వేగము గల్గించు పని కొనసాగదు. రాజసూయమున శ్రీకృష్ణున కగ్రపూజ చెల్లుబడియైనది. శిశుపాలుని అగడములు సాగలేదుగదా ! లోకమునకు హితవు గూర్చు సజ్జనుడే వృద్ధిపొందును. మదోన్మత్తుడైన లోకకంటకుడు కడతేఱజాలడు. ధర్మనందనుడే తుదకు ధరాస్థలికి పాలకు డయ్యెనుగాని దుర్యోధనుడు పాలకుడు కాగల్గెనా ?

కావున చేసినపుణ్యమే ఎప్పుడైనను శుభము లొడగూర్చును. పాపకార్యములవల్ల సౌఖ్యము లేదు. ప్రహ్లాదుడు శేషగిరీశ్వరుని సేవించి విజయ మందెను. ఆ దేవుని తిరస్కరించిన హిరణ్యకశిపుడు ఒడ్డుచేరలేదుగదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| విచారించుకొనే వారి | 52 | 294 | 15 | 198 |

అవ: మాయకు వశుడై పరితపించుజీవుని శ్రీహరియే కరుణతో కాపాడవలె నంటున్నాడు.

సీ. తనతండ్రితొడ నిద్రగనెడు బాలుండు కల
బెబ్బులింగని మొఱ పెట్టినట్లు
ఆధారమైయుండ హరి, మాయఁజిక్కి సం
సారబాధల దేహి సంతపించు ;
ప్రభుదండ నుండెడు బం టింద్రజాలమ్ము
నీక్షించి యంబుధి నీఁదినట్లు
కైటభారి తనకుఁ గర్తయై యుండంగ
నజ్ఞానమునఁ గుందు నల్పజీవి ;

ఆ. నిరుపమాంజనమున నిధినిధానమ్ములు
కనులుమూసి పేద గనినయట్లు
గరుడగిరివిభుండు కరుణించ నీడేరు
నెరవులేనిభక్తి నిట్టి ప్రాణి. 112

జనకుని ఒడిలో శయనించి నిద్రించుబాలుడు స్వప్నములో పెద్దపులిని జూచి ఆక్రందించును. అట్లే శ్రీహరి తన కాధారమైయుండినను అది గుర్తింపలేక మాయకులోనై దేహధారి సంసారకష్టములతో పరితపించుచున్నాడు.

రక్షకుడైన ఏలిక చెంతనున్న భృత్యుడు ఇంద్రజాలమునుజూచి, తాను సముద్రములో బడియున్నట్లు భావించి ఈదుచున్నాడు. అట్లే కైటభాంతకుడైన మాధవుడు తనకు కర్తయై యుండుట గుర్తింపలేక అల్పుడైన జీవుడు అజ్ఞానముతో అలమటించుచున్నాడు.

కటికపేద సాటిలేని అంజనప్రభావముతో నిమీలితనేత్రుడై నిధి నిధానములు చూచుచున్నాడు. అట్లే గరుడాద్రినాథుడు దయజూడగా దృఢమైన భక్తిగలప్రాణి కడతేఱుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తెలిసి చూచిన వేళ | 49 | 278 | 15 | 187 |

అవ: ప్రపత్తిని వీడి ఇతరోపాయముల నాశ్రయించినవాఁడు కడతేఱలే దనుచున్నాడు.

సీ. **శిరసుండ మోకాల సేస వెట్టినయట్లు**
**పరమధర్మము మాని వ్యర్థుఁ డయితి;**
**వాలుకత్తిని వీడి కోల చేతంబట్టి**
**బవరమ్ములో పెట్టువడ్డ యట్టు**
**లిటు ప్రపత్తిని మాని యితరకర్మముచేసి**
**పుణ్యపాపమ్ముల బ్రుంగుడైతి;**
**పడవను గాదని పదరుతో సంద్రమ్ము**
**వడినీఁది యీఁది చేడ్పడిన యట్టు**
**లుడిగి దాస్య మ్మితరోపాయముల మాని**
**స్వర్భోగములఁ జిక్కి జడుఁడ నైతి;**

గీ. **కాదనుచు మానికమ్మును, గాజుపూస**
**గట్టుకొని నవ్వులకు గుఱిగాఁగ వలసె;**
**అంజనగిరీంద్రపతి శరణనఁగ లేక**
**మొదలు తుదలేని జన్మాల మునుఁగ వలసె.** 113

తలపై సేస పెట్టుటమాని మోకాటిపై బెట్టినట్లు నేను మహోత్కృష్టధర్మమైన భరన్యాసమును వీడి అప్రయోజకుడ నైతిని. పదనైనకత్తిని వదలి కఱ్ఱను చేబూనినవాడు రణరంగములో దెబ్బలు తినును. అట్లే నేను శరణాగతిని వదలి అన్యకర్మము లాచరించి పుణ్యపాపములకు గుఱియై అందు మునిగిపోయితిని. ఓడను వదలి సొరకాయబుఱ్ఱతో సముద్రము నీదువాడు చివరకు చేటొందును. అట్లే భగవద్దాస్యమును పరిత్యజించి అన్యోపాయము లాశ్రయించి స్వర్గలోక మందలి భోగములచే బద్ధుడనై మందుడ నైతిని.

మాణిక్యమును వదలి గాజుపూస ధరించినవాడు నవ్వులపా లగును. అట్లే అంజనాద్రినాథునకు ప్రపన్నుడనుగాక ఆద్యంతములు లేని జన్మపరంపరలో మునుగవలసివచ్చినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| శిరసుండ మోకాల | 21 | 120 | 15 | 80 |

అవ: ఇంద్రియములను సద్వినియోగము చేసికొని దైవమును చేరవలె ననుచున్నాడు.

సీ. **పనిగొనియెడివారి భాగ్యంబుపరిపాటి**
**తన కెదిరికి గుఱి దైవతమ్మె**
**తిట్లు తిట్టుటకును దీవించుటకు నట్ట**
**నడిమిది తనయొక్క నాల్కయె గుఱి;**
**ఆనందపడుటకు నలిగి యుండుటకును**
**చేవమీఱెడు తన చిత్తమె గుఱి;**
**పాపకర్మమునకు బలు పుణ్యమునకును**
**తెలియ రెంటికి నొక్కదేహమె గుఱి;**
**ఇటు కొండెము వినంగ నటు ధర్మము వినంగ**
**వేడ్క చెందెడు తన వీనులె గుఱి ;**

గీ. **కమ్మని సువాసనలకు దుర్గంధములకు**
**నొక్క నాసికయే గుఱి నిక్కువముగ**
**శ్రీనివాసుని సేవింప జీవకోటిఁ**
**గనఁగ తన కైవసమ్ములు కన్నులె గుఱి.** **114**

తన కందుబాటులోనున్న సాధనములను సత్కర్మలయందు చక్కగా విని యోగించుకొనవలెను. ఆ విధముగా వినియోగించుకొనుకొలది జీవుడు దైవాను గ్రహమునకు పాత్రు డగును. తనకును తక్కినవారికిని దైవ మొక్కడే ప్రాప్యమై యున్నాడు.

ఒకేనాలుక ఇతరులను దూషించుటకును, లేదా శ్లాఘించుటకును సాధనమై యున్నది. అట్లే సంతోషించుట కైనను, కినుక పూనుట కైనను ఒక్కచిత్తమే మూలమై యున్నది.

ఒకేశరీరము పాపము చేయుటకును పుణ్యము సల్పుటకును హేతువై యున్నది. ఒకేవీనుల జంట కొండెములు వినుట కైనను, ధర్మతత్త్వ మాలకించుట కైనను కారణమై యున్నది.

పుణ్యగంధము ఆఘ్రాణించుటకును, చెడుకంపు పీల్చుటకును ఒకేముక్కు మూలమై యున్నది. అట్లే శ్రీవేంకటేశ్వరుని సేవించుటకైనను, తదితరజీవులను దర్శించుటకైనను ఒకేనేత్రద్వయము ఉపకరించుచున్నది. కావున నాలుకమున్నగు ఇంద్రియములను సత్కర్మములయందే వినియోగించి భగవదనుగ్రహమును పొందుట జీవుని కర్తవ్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పనిగొన నేర్చువారి | 49 | 279 | 15 | 186 |

అవ: సుకృతాత్ములే హరిని భజింతు రనుచున్నాడు.

సీ. సర్వజీవులకును చంద్రుండు చల్లన
వెట్టయై తోఁచును విరహులకును;
ఎల్లవారికి నన్న మిలఁ బ్రాణమై యుండు
నల్లన రోగికి నరుచి యగును ;
సంపంగివిరి ఘ్రాణసంతర్పణ మొనర్చు
షట్పదికే విరసముగఁ దోఁచుఁ ;
దలపోయ లోకబాంధవుఁడు మార్తండుండు
కలువల కతఁడన్నఁ గంటగింపు

గీ. శిష్టులకు నెల్ల ప్రియుఁడు శ్రీశ్రీనివాసుఁ
డతఁడు దుష్టుల కెల్ల భయంకరుండు ;
మూర్ఖులకు తోఁచు నెరవయి ; పుణ్యులకును
రమ్యహరినామపఠనంబు రక్తి గూర్చు. **115**

సమస్తప్రాణులకు చందమామ చల్లనై యుండును. కాని వియోగపరితప్తు లకు మాత్రము వేండ్రము గూర్చును. భువిలో అందఱకు అన్నము ప్రియమై యుండును. కాని రోగగ్రస్తునకు మాత్రము అది యరుచి గల్గించును. సంపంగి పుష్పము అందఱకు సురభిళమై యింపు ఘటించును. కాని తుమ్మెద కది వెగటు నిచ్చును. సూర్యుడు లోకమున కంతటికి కావలసినవాఁడే గాని కలువలకు మాత్రము అత దన్నచో గిట్టదు. అట్లే సజ్జనులైనవా రందరికి శ్రీవేంకటేశ్వరుడు ఇష్టుడై యుండును. ఆ దేవుడే దుష్టులకు మాత్రము భీతి గొల్పును. మూర్ఖులకు మనోజ్ఞమైన హరినామసంకీర్తనము అప్రియ మగును. కాని పుణ్యాత్ములకు మాత్ర మది ఎంతో ఆసక్తిని రేకెత్తించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమని తలఁచ వచ్చు | 49 | 277 | 15 | 187 |

అవ: భగవచ్చింతనతో కాలము సద్వినియోగ మొనర్పవలె ననుచున్నాడు.

సీ. కడcగి **జూజములాడc గడచును కాలమ్ము**
**నడుమ వేటలతోడ నడచిపోవు ;**
**జడనిద్రలోపల జరుగును కాలమ్ము**
**నిడివి శ్రీహరిగొల్వ నిండియుండు ;**
**సతులసంగడి నున్న సమయును కాలమ్ము**
**వెతలలోc బొరలిన వెడలిపోవు ;**
**సతము దొంగిలుచున్న చనుచుండు కాలమ్ము**
**వ్రతియయియున్నc గైవసము నగును ;**

ఆ. **ప్రాలుమాలియున్న పతివోవుకాలమ్ము**
**కూళగోష్ఠినున్న కొంచెపడును ;**
**గరుడగిరినివాసు కత లాలకించుచుc**
**దాల్మితోడ నున్న దక్కియుండు.** **116**

జూదములాడువారికిని కాలము గడచిపోవును. అట్లే వేటలాడు వారికిని కాలము సాగిపోవును. నిద్రలో నున్నను కాలము గతించును. సంతతము హరిని సేవించినచో కాలము పూర్ణమై యుండును.

స్త్రీవ్యాసంగముతో నున్నను పొద్దు జరగిపోవును. లేనిపోని కష్టములలో నున్నను కాలము హరించుకొనిపోవును. చౌర్యప్రవృత్తితో నున్నను కాలము చనును. వ్రతధారియై భగవంతుని సేవించినచో కాలము స్వాధీన మగును.

సోమరిగా నున్నచో కాలము వ్యర్థ మగును. దుర్జనగోష్ఠిలో నున్నచో కాలము పొల్లవోవును. కాని గరుడాద్రినివాసుడగు శ్రీవేంకటేశ్వరుని దివ్యకథలు వినుచు ఓర్మితో నున్నచో కాలము కలసివచ్చును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమఱకు జీవుcడా | 48 | 270 | 15 | 182 |

అవ: శ్రీదేవికృపకు పాత్రుడగువాడే భగవంతునిచే రక్షింపబడు ననుచున్నాడు.

**సీ. శ్రీసతికరుణయే జీవకోటికి రక్ష**
**వాసుదేవుఁడు రమావశుఁడు గాన**
**అపరాధియైన కాకాసురు ప్రాణముల్**
**నిలిచె జానకియుండ నికటమందు ;**
**పౌలస్త్యుఁ డిటువంటివాఁడేగదా యొంటిఁ**
**జిక్కి రాఘవునిచే ముక్క లాయె ;**
**కదిసి రుక్మిణియుండఁగా నన్న రుక్మికి**
**పరమవిద్రోహికి బ్రదుకు గలిగె**
**ఎంచంగ శిశుపాలుఁ డిట్టివాఁడేగదా**
**వదరి మురారిచే వ్రక్క లయ్యె ;**

**గీ. క్రూరకర్ములు దైత్యేంద్రగురుతనయులు**
**తొడపయిని లక్ష్మియుండుట ద్రుంగ రైరి ;**
**భర్మకశిపుండు వారలవంటివాఁడె**
**వేంకటనృసింహుచేతిలో డింక వేసె.** **117**

వసుదేవునితనయుడు లక్ష్మికి వశపడినాడు. కాన లక్ష్మీదేవికృపయే ప్రాణికోటికి జీవరక్ష. తొల్లి సీత రామునిచెంతనుండి దయ చూపుటచేతనే అపరాధ మొనర్చిన కాకాసురునిప్రాణములు పొలివోక నిలిచినవి. రావణుడును అట్టివాడే గదా! అతడు జానకికరుణకు పాత్రుడు కానందున శ్రీరామునిచే రణరంగమున నిహతుడాయెను.

రుక్మి భగవంతునిపట్ల మిక్కిలి విద్రోహి. ఐనను రుక్మిణి కృష్ణునిచెంత నుండి అతనిని కరుణించినది. కావుననే అతడు బ్రతికిపోయెను. శిశుపాలుడును రుక్మివంటివాడే. అయినను భగవానుని దూషించి దేవి యనుగ్రహములేనందున ఆ మురాంతకునిచే నిర్మూలింపబడెను.

హిరణ్యకశిపునిగురుపుత్త్రులైన చండామర్కులు క్రూరాత్ము లైనను నృసింహుని ఉత్సంగముపై లక్ష్మియుండి వారిని కటాక్షించుటచేతనే వారు చావు దప్పించుకొనిరి. హిరణ్యకశిపుడును ఆ గురుపుత్త్రులవలె భగవంతునిపై పగగొన్న వాడే. అయినను అతనికి లక్ష్మీకటాక్షము లేనందున నృసింహస్వామి చేతిలో మృతి నొందెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| శ్రీసతి కరుణే | 48 | 269 | 15 | 181 |

అవ: శ్రీరామచంద్రునిబంట్లు సమర్థు లయ్యును రామునిస్వాతంత్ర్యమును ప్రకటించుటకే తాము మిన్నకుండి రనుచున్నాడు.

సీ. తము నేలు రాము స్వాతంత్ర్యమ్ము మన్నించి
తమసత్త్వ మెఱిఁగియు దాచినారు
అసురు లందఱుఁగూడి హనుమంతు తోకకు
కొంచక నిప్పుముట్టించు వేళ
"అనల శీతో భవ" యన్నట్లు సీత "రా
వణ హతో భవ" యని పలుక లేదె ?
శ్రీరామముద్రిక చేతిలో ధరియించి
సాహసమ్మునదాఁటి సాగరమ్ము
లంకాధిదేవత లంకఁ గొట్టిన కపీ
శ్వరుఁడు దశగ్రీవుఁ జంపలేఁడె ?

గీ. అంజనాద్రీశ రాఘవునాజ్ఞ చేత
వహ్నిలో హోమపాత్రల వైచినట్టి
యంగదాదులు పౌలస్త్య నందులోన
నుదుటునం ద్రోసి తిరిగిరా నోపలేరె ? **118**

జానకిమున్నగువారికి రాముడు ప్రభువు. ఆ దేవుడు స్వతంత్రుడు. అతని ననుసరించిన భృత్యులు అన్నివిధముల సమర్థు లయ్యు తమవిభుని స్వాతంత్ర్యము లోకములో ప్రకటింపగోరి తమబలమును చూపక మిన్నకుండిరి. ఆంజనేయుడు లంకలో రావణుని సందర్శింపబోయినప్పుడు ఆ రాక్షసాధీశ్వరుని యానతిచే రక్కసులు అతనితోకకు నిప్పంటించిరి. అగ్నిప్రదాహము గాంచిన అశోకవనమందలిసీత హనుమంతుని విషయమున"ఓ అనలమా! చల్లనగుము" అని పలికెను. ఈ విధముగా పలుకగల్గినసీత త న్నవమానించిన రావణు నుద్దేశించి "రావణా ! నిహతుడవు కమ్ము" అని శపింపజాలదా? శపించ గల్గియు రామునిప్రాభవము ప్రకటించుటకే ఆమె ఊరకుండినది.

హనుమంతుడు శ్రీరాము డొసంగిన ముద్రికను చేబూని సాహసముతో సముద్రమును దాటెను. లంక కధిదేవతయగు లంకిణిని గొట్టెను. అట్లు చేయగల హనుమ రావణునిమాత్రము తెగటార్చలేడా? కాని రామునిమీదిభక్తితో అట్లొనర్ప డయ్యెను. శ్రీవేంకటేశ్వరస్వరూపుడైన రాఘవునిపంపున అంగదుడు మున్నగువారు హోమము నాచరించు రావణునిచెంతకు పోయి హోమపాత్రలను ఆ యగ్నిలో పడవైచిరి. అట్లు కావింపనేర్చిన వానరవీరులు వానినిమాత్రము విక్రమముతో ఆ యగ్నియందే త్రోసిరాలేరా ? కాని రామభక్తిచే వారట్లు చేయరైరి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తమసత్త్వ మెఱిఁగియు | 46 | 263 | 15 | 177 |

అవ: శరణన్న జీవునకు దేవుడు బ్రహ్మానందము ప్రసాదించు ననుచున్నాడు.

సీ. ఆరగించినవెన్క నావులింతలు నిద్ర
సురతాంతముననె చేకురు విరక్తి ;
కర్మాంతముననె దాఁ గానవచ్చు నలవు ;
ధర్మమ్ము వెలయు సత్యంపుఁగొనను ;
పైఁడిని వెచ్చించునాఁడె లోభముపట్టు ;
ముసలితనమ్మున విసుగుపుట్టు ;
సంసార వేళనే జనియించు నాసలు ;
జ్ఞానమ్ము పొంతనే సౌఖ్యముండు ;

గీ. కోపము శమింప శాంతమ్ము కూడవచ్చు ;
భక్తిగల్గిన మోక్షమ్ము పాదుకొనును ;
ఎడయ కేప్రొద్దు శరణన్న వృషగిరీశు
నతికరుణతో పరానంద మతఁడె యిచ్చు. **119**

కడుపునిండ భుజించినపిమ్మటనే ఆవులింతలు నిద్ర ఆవహించును. సురతసుఖము ననుభవించిన పిమ్మటనే దానిపై విరక్తి పుట్టును. ఒకపని పూర్తి చేసినపిమ్మటనే బడలికగల్గును. సత్యానుష్ఠానము ననుసరించియే ధర్మము ప్రకాశించును. ధనము వ్యయించుసందర్భముననందే బేరమాడి అందులో కొంత మిగుల్చుకొనవలె ననెడి లోభము జనించును. వార్ధక్యము పైకొన్నప్పుడే విషయ సుఖాదులపై అనుత్సాహ మేర్పడును. సంసారము నిర్వహించునప్పుడే ఆశలు సంభవించును. జ్ఞానము ననుసరించియే సుఖము అనుభవమునకు వచ్చును. కోపము తీరినప్పుడే శాంతము సమకూడును. భక్తి గలిగినప్పుడే మోక్షము లభించును.

ఎల్లవేళల శ్రీవేంకటేశ్వరుని శరణుజొచ్చినప్పుడే ఆ దేవుడు మిక్కిలికృపతో బ్రహ్మానందము ప్రసాదించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అప్పటప్పటి వేళలు | 41 | 232 | 15 | 155 |

అవ: భగవంతుడు సర్వవ్యాపి ; కాని అయనవిభూతి ప్రస్ఫుటమైన తావే ఆరాధనీయ మనుచున్నాడు.

సీ. నానాత్మలందును నారాయణుండెగా
హీనాధికములు మఱిందు నేవి ?
ఎంచ జ్ఞానాధికు లిందధికులు సుమ్మీ
యీ నిజ మ్మొక్కటి యెఱుఁగ పలయు ;
నన్ని చోటులుగూడ హరిపదమ్ములెగదా
యెన్న విశేష మ్మికిందు నేది ?
అంజనాద్రింగల యర్చావతారమ్మె
యున్నతి ఘనమని యుండవలయు ;
గీ. పద్మజేశు నామములెగా పలుకులెల్ల
నిందు కాదనియెడిది మఱేది గలదు ?
సంతసమ్మున వేంకటేశ్వరుని నుతియె
తలఁపునందున ఘనమని తడవవలయు. **120**

'సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా' అను శ్రుతిచొప్పున భగవంతు డెల్లెడల వ్యాపించియున్నాడు. ఎల్లజీవులలోను అంతర్యామియై వెలుగుచున్నాడు. కావున ఒకడు ఎక్కువ, మఱొకడు తక్కువ అనుట చెల్లదు. అయినను ఎవరు జ్ఞాన సంపన్నులో వారు ఇతరులకంటె శ్రేష్ఠు లగుదురు. ఈ సత్యమును మాత్రము తప్పక గుర్తింపవలెను.

స్థానము లన్నియు హరికి నెలవులే. కావున ఒకస్థానముకంటె మఱొక స్థానములో వైశిష్ట్య మేమియు లేదు. అయినను అంజనాద్రిమీద భగవానుడు అర్చావతారమై వెలసియున్నాడు. కావున ఆ క్షేత్రము ఇతరక్షేత్రములకంటె దొడ్డ దని భావింప వలయును.

వాఙ్మయములోని శబ్దము లన్నియు లక్ష్మీశ్వరుని నామములే. అందు వర్జింప దగిన దేదియు లేదు. అయినను శ్రీవేంకటేశ్వరస్తుతిరూపమైన శబ్దజాతము గొప్పదని చిత్తములో తలంపవలయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మునుకొని పయిఁడికి | 40 | 230 | 15 | 153 |

అవ: దైవమార్గమును ఆశ్రయించినవానికి లౌకికప్రవృత్తి తగ దనుచున్నాడు.

సీ. గుఱుతైన మోక్షము తెరువైన దేహికి
మగుడ లోకముచింత మఱి యింకేల ?
సగము విత్తులకును సగము పాకమునకుఁ
దగదొక్క టెంకాయ దఱిగిపెట్ట ;
నలువంక దైవంబు నమ్మిన వారికి
మలయు మనుజబుద్ధి మఱి యిఁ కేల ?
నొసలు బత్తుండుగా నోరు తోడేలుగా
మెలఁగిన కొండప్ప మెచ్చుకొనునె ?

గీ. ఒండె లౌక్యంబు వైదిక మొండెగాక
రెండుపడవల కాలిడి యుండు టెట్లు ?
వారణమునెక్కి దిడ్డిలో దూరఁబోవ
వెక్కసం బౌటగాక చెప్పెడిది గలదె ? 121

మోక్షమే లక్ష్యముగా పయనించు దేహధారికి మరల లోకమును గూర్చిన చింత యెందులకు ? ఒకటెంకాయలో సగము మొలకెత్తుటకును, మరొకసగము వంటకును తఱిగిపెట్ట వీలుగాదుగదా ? దైవమును పరిపూర్ణముగా విశ్వసించిన వానికి సామాన్యమానవులకున్న ప్రాకృతబుద్ధి ఎందులకు? నొసట పుండ్రము ధరించిన భక్తుడై తోడేలువలె క్రూరముగా చరించినచో ఏడుకొండలవాడు మెచ్చునా? అటు లౌకికపద్ధతినో, యిటు వైదికపద్ధతినో ఆశ్రయింపవలెను. రెండింటిని ఆశ్రయింప బూనుట రెండుఓడలలో కాలుపెట్టి పయనించిన ట్లుండును.

భగవత్పరుడైనవాడు ప్రాకృతమార్గము త్రొక్కరాదు. గజము నధిష్ఠించి సన్ననిక్రంతలో ప్రవేశింపబూనుట వీలుగానిపనిగదా ? మఱి ఈ విషయములో చెప్పుట కేమున్నది ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఒండె లౌకికము | 40 | 225 | 15 | 150 |

అవ: భగవదారాధకునకు ఎట్టిచింతలు లే వనుచున్నాడు.

సీ. మన్మథాతురునకు మతి వివేకము లేదు ;
సుంతకర్మం బలసునకు లేదు ;
పాపపుణ్యమ్ము లాశాపరునకు లేవు ;
మొగమాటమే లేదు మోటుకునకు ;
పరమనాస్తికునకు గురువు దైవము లేఁడు ;
కడులోభి కెట్టి భోగమ్ము లేదు ;
ఇయ్యంగఁ గొన శక్తి యొందు పేదకు లేదు ;
చంచలాత్మునకు నిశ్చయము లేదు ;

గీ. కనికరము వేఁటకానికి, పనులు మత్తుఁ
డైనవానికి, సటలాడువాని కరయ
సత్యమును లేవు ; వేంకటశైలవిభునిఁ
గొలుచువారికిఁ జీకుచింతలును లేవు. 122

కామాతురుడైన వానికి తెలివి శూన్యము. సోమరికి ఇసుమంత పనియు లేదు. ఆశగలవానికి పాపపుణ్యము లేమాత్రము లేవు. మూర్ఖునకు దాక్షిణ్యము లేదు. పరమనాస్తికునకు గురుదైవములు లేరు. అతిలోభగ్రస్తునకు భోగము లేదు. నిఱుపేదకు ఇచ్చుటకు, కొనుటకు శక్తి యుండదు. చపలచిత్తునకు నిశ్చయజ్ఞానము లేదు. వేటకానికి దయ లేదు. మత్తుగొన్నవానికి చేయుటకు పనులు లేవు. మోసపుమాటలాడు వానికి సత్యము లేదు. అట్లే వేంకటాద్రినాథుని సేవించువానికి ఏ విధమైన చింతలును ఉండవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇటువంటిదుర్గుణి | 18 | 103 | 15 | 69 |

అవ: తుచ్ఛభోగములకై హరిభక్తిని వెచ్చించరా దనుచున్నాడు.

సీ. హరికి మ్రొక్కిన మ్రొక్కు లల్పసౌఖ్యమునకై
వెర వెఱుంగక వెచ్చ పెట్టు టెల్లఁ
గొండంతపైఁడిని గొనకొని వెలయిచ్చి
గుప్పెఁడు కలగూర గొనుట గాదె ?
శ్రీహరిమంత్రమ్ము చెనటిభోగములకు
సెలవుగావించుట చింతసేయ
పులిని వేటాడఁగాఁ బోయి పూరేడును
బట్టితెచ్చి ప్రమోదపడుట గాదె ?

గీ. ఫణిగిరీంద్రుని సేవించి పరుల చేతఁ
దనకు నిప్పింపు మని సల్పు వినుతు లెంచఁ
గల్పవృక్షమ్ముఁ గావించి గాడిగుంజ
నవల దుర్మదదేహి తా నజ్ఞుఁ డగుట. 123

శ్రీహరికి కావించిన ప్రణామములు మోక్షము నొసంగజాలినవి. అట్టి మ్రొక్కులను స్వల్పములైన సుఖములకై వ్యయింప తగదు. అట్లొనర్చుట కొండంత బంగారమును అప్పగించి పిడికెడు కలగూర చేకొనుటవంటిదిగదా ? శ్రీహరి మంత్రము అమూల్య మైనది. దానిని తుచ్ఛములగు భోగములకు వినియోగించుట తగదు. అట్లొనర్చుట పులిని వేటాడుటకై వెళ్ళి పూరేడుపిట్టను పట్టుకొని వచ్చి సంతసించుటవంటిదిగదా !

శేషాద్రీశ్వరునిసేవ చాల విలువైనది. ఆ సేవను పరులచేత తనాశ నెఱవేర్చుకొనుటకుగా వినియోగించుచు దైవప్రార్థనలు సల్పుట దుర్మదుడైన దేహికి తగదు. అట్లొనర్చుట సర్వకామప్రదమైన కల్పవృక్షమువిలువ తెలియక నఱికితెచ్చి గాడిగుంజగా నాటి తన్మూలమున పొందవలసిన ఫలమును పొందలేక పోవుటయే అగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అక్కటా లోకోన్నతుండు | 13 | 71 | 15 | 47 |

అవ: హరిదాసులకు ఎట్టిలోటును లే దనుచున్నాడు.

సీ. పటుభగవన్నామపారిజాతము గల్గఁ
గడలేని మా కోరికలు ఫలించె ;
జగదేకపతి రూపచంద్రద్యుతులు గల్గ
నక్షిచకోరముల్ హర్ష మొందె ;
పరమాత్మచింతనాభానూదయముగాఁగ
నుల్లంపుఁదామర లుల్లసిల్లె;
హరికథాశ్రుతి వసంతాగమ మేపార
విజ్ఞానవన మెల్ల విరియఁబూచె;

గీ. సప్తగిరిసార్వభౌముఁడన్ స్పర్శ వేధిఁ
గలుషజన్మంపుటిను మెల్లఁ గనక మాయె;
ఫణినగాధీశుకారుణ్యవనధివలన
ధన్యులమ తేయ భక్త్యమృతంబు వొడమె. 124

సర్వసమర్థమైన భగవంతుని దివ్యనామ మనెడు కల్పవృక్షము లభింపగా మేరమీరిన మాకోరికలు నెఱవేఱినవి. లోకైకనాథుడగు ఆ భగవానుని దివ్యరూప మనెడు చంద్రునియొక్క వెన్నెలలు లభింపగా మా నేత్రము లనెడి చకోరపక్షులు సంతసించినవి. పరమాత్ముని భావన యనెడు సూర్యోదయము కాగా హృదయము లనెడు పద్మములు వికసించినవి. భగవత్కథాశ్రవణము అనెడు మధుమాసము రాగా విజ్ఞాన మనెడు ఉద్యానవన మంతయు కలయబూచినది.

ఏడుకొండలఎకిమీఁదు అను పరుసవేది లభింపగా పాపమయ జన్మమనెడు ఇను మంతయు బంగారుగా మారినది. శేషాద్రీశ్వరుని కృప యనెడు సముద్రమునుండి భక్తియనెడు అమృతము మమ్ము కృతకృత్యులను గావించుటకై ఉద్భవించినది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమిటఁ గడమ | 13 | 70 | 15 | 47 |

అవ: భక్తియే ప్రధానముగాని బాహ్యాచారములు ముఖ్యము గావనుచున్నాడు.

సీ. ఉదకమందలి చేఁప కది స్నానమా ? కొంగ
యొనరించునది ధ్యానయోగ మగునె ?
సిద్ధుఁడా జిబ్బిటీ చెట్ల వ్రేలినమాత్ర ?
ఆకు మేయఁగ మేఁక కది తపమ్మె ?
ఎలువు గడ్డము పెంచ నింతలో యోగ్యుఁడా ?
పులులు గుహలనుండు తలఁప ఋషులె ?
పక్షు లాకసమునఁ బాఱు నమర్త్యులా ?
వనవాసమా క్రోఁతి వనులఁ దిరుగ ?

గీ. నగము మాటాడ దద్ది మౌనవ్రతంబె ?
బట్టకట్టకుండిన దిగంబరులె శిశులు ?
ఫణిగిరీశు నైకాంతిక భక్త లేమి
చేసినను లోకమందెల్ల చెల్లుబడులె ! **125**

చేప నీటియం దుండును. దాని కది స్నానము గాదు. కొంగ కదలక ఒంటి కాలిమీదనే నిలిచియుండును. దాని కది ధ్యానము గాదు. గబ్బిలము తల్ల(క్రిందుగా చెట్లనుండి వ్రేలాడుచుండును. దాని కది సిద్ధిగాదు. మేక ఆకులే మేయును. అది పర్ణభక్షణాత్మకమైన తపస్సుకాదు. ఎలుగుబంటి గడ్డము పెంచును. అంతమాత్రమున నది జడదారి కాదుగదా ? పులులు గుహలందే నివసించును. ఆ మాత్రమున వాటికి ఋషిత్వము కల్గునా ? విహంగములు విహాయసముననే విహరించును. అవి దేవతలు కావుగదా ? కోతి వనమందే సంచరించును. దాని కది వనవాసవ్రతము కాదుగదా ? చెట్లు పలుకనేరవు. అట్టిచో వానిని మౌనవ్రతధారు లనదగదుగదా ? బాలకులు వస్త్రధారులు కారు. అంతమాత్రమున వారు దిగంబరులైన అవధూతలు కారుగదా ? కావున బాహ్యాచారములు యోగ్యతను ప్రసాదింపవు. భగవద్భక్తియే ముఖ్యమైనది. శేషాద్రీశ్వరునిపై అనన్యభక్తిగలవారు ఏమిచేసినను లోకమందు చెలామణి యగును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| హరిభక్తి గలిగితే | 10 | 56 | 15 | 37 |

అవ: ముక్తి విష్ణుభక్తులకే కైవస మగుననుచున్నాడు.

సీ. లేదు మోక్షము నింగి; లేదు పాతాళాన
నీకడ భూమియం దెందు లేదు ;
పైకొనునాసలఁ బోకార్చి వెదకినఁ
గమలాక్షుఁ బొగడు చిత్తమునఁ గలదు ;
సురలచెంగటలేదు సోదించ నమృతమ్ము
జలధిలో లేదు దిక్కులను లేదు ;
అమలినభక్తి శ్రీహరిదాసకోటిఁ బూ
జించువారల యఱచేతఁ గలదు ;

గీ. లేదు సుఖము రాజసమున ; లేదు కర్మ
రాశి ; శ్రీవేంకటేశుముద్రలు ధరించు
పరమవిజ్ఞానిమేనిలోఁ బ్రబలియుండు
తెలిసినట్టివారల కిది తెరువు సుండు. 126

ముక్తి ఆకాశమున లేదు; పాతాళమున లేదు. ఈ భూమియం దెందు వెదకినను లేదు. మఱి యెందున్న దనగా ఎడతెగక క్రమ్ముకొను ఆశలను తెగటార్చి వెదకినచో పద్మాక్షునినుతించు భక్తాగ్రేసరుల హృదయములలో నున్నది.

పరికించి చూడగా అమృతము దేవతలచెంత లేదు. సముద్రమున లేదు. దిక్కులలోగూడ కనిపించదు. మఱి యెందున్న దనగా నిర్మలమైనభక్తితో భగవద్దాసులను అర్చించు వైష్ణవాగ్రేసరుల కరగతమై యున్నది.

రజఃప్రవృత్తిలో సుఖము లేదు; కర్మపరంపరలో కనబడదు. పరమేశ్వరుని ముద్రలగు శంఖచక్రములను భుజముల ధరించిన పరమవిజ్ఞానవంతుడగు భాగవతుని శరీరమున నున్నది. ఈ తత్త్వము తెలిసినవారి కిదే మార్గము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తెలిసినవారికి | 10 | 69 | 15 | 40 |

అవ: విష్ణుదేవుని పారమ్యమును వెలయించుచున్నాడు.

సీ. తప్పుడుచదువుల తార్కికాధములార !
తెత్తురా యింతటిదేవు నింక ?
కోరి సప్తర్షులు కొలుచుదైవ మితండె
ఫణిరాజుమోయు దైవత మితండె ;
మన్నన లక్ష్మిగైకొన్న దైవ మితండె
బ్రహ్మను గన్న దైవత మితండె ;
అభవునకును తాతయైన దైవ మితండె
బడి శ్రుతుల్ వెదకు దైవత మితండె ;

గీ. నారదశుకాదు లెల్లరు నమ్ముకొన్న
దైవ మితఁడె; భూమికిఁ గులదైవత మ్మి
తండె; వేంకటగిరిదైవతమ్ము వంటి
దైవతమ్మును గొనితేరఁ దరమె మీకు ? **127**

దోషభూయిష్ఠములైన విద్యలునేర్చి లేనిపోని తర్కవాదములు చేయు పండితాధములారా ! శ్రీవేంకటేశ్వరునంతటి దేవుని ఇంక మీరు తేగలరా ?

సప్తర్షులు భావించి ఆరాధించు పరదైవత మితడే. ఆదిశేషుడు వహించు ఆదిదైవత మీతడే. మన్ననతో శ్రీమహాలక్ష్మి వరించిన భగవంతు డితడే.

అజునిగన్న దేవు డితడే. రుద్రునకు తాతయైన దైవ మీతడే. వేదము లన్వేషించు భగవాను డితడే. నారదుడు, శుకుడు మొదలగు మునులు విశ్వసించి అర్చించిన దైవ మీతడే.

భూదేవతకు కులదైవతము కూడ నితడే. ఈ శ్రీవేంకటేశ్వరునివంటి దైవమును మీరు అన్వేషించి తేగలరా ? తే లేరని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తప్పుఁజదువులవార | 34 | 190 | 15 | 127 |

అవ: ఆసురసంపదను త్యజించి దైవసంపద నలవఱచుకొని తరింపవలయు ననుచున్నాడు.

సీ. ఘనపుణ్యానఁ జెలఁగి దేవత లైరి
యారీతిఁ బాపాన నసురు లైరి
దాసరితనమునఁ దగ నారదాదులై
రిం దెవ్వ రెక్కుఁడో యెంచికొనుఁడు ;
ఘనరాజసగుణానఁ గలిగెడు నిహలోక
మటులె తామసమున నధమఱగము ;
మొనసి సాత్త్వికమున మోక్షమ్ము సిద్ధించు
నెది యుత్తమపదంబొ యెంచికొనుఁడు ;

గీ. దేహమూలమ్మగును ప్రాకృతికపుమాయ ;
యాత్మ నీడేర్చు మంగాంబ యసమకరుణ ;
యంతరాత్ముండు శ్రీవేంకటాధిపుఁడని
యెఱిఁగి జనులార ! మీరిది యెంచికొనుఁడు. 128

ప్రజలారా ! పుణ్యముచేసి కొందఱు జీవులు దేవత లయిరి. మఱి కొందఱు పాప మొనర్చి రక్కసు లైరి. భగవద్దాస్యముచేసి ఇక కొందరు నారదాది మహర్షులైరి. వీరిలో ఎవరు గొప్పవారో ఆలోచించికొనుడు.

రజోగుణమువలన ఇహలోకము సంప్రాప్తించును. తమోగుణమువలన అధోగతి తప్పదు. సాత్త్వికగుణమువలన ముక్తికరతలామలక మగును. ఇందులో నేది యుత్తమగతియో ఊహించి నిర్ణయించికొనుడు.

ప్రకృతికి సంబంధించినమాయ దేహమునకు కారణమై యున్నది. అలమేల్మంగ సాటిలేనిదయతో జీవాత్మ నుద్ధరించుచున్నది. జీవాత్మన కంతరాత్ముడై యుండువాడు శ్రీవేంకటేశ్వరుడు. ఈ సంగతి గ్రహించి మీ జీవనమార్గమును సరిదిద్దికొనుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| విచారపరులాల | 66 | 379 | 15 | 255 |

అవ: నారదాదులు చనిన తెరువుననే చనుమని చిత్తమును హెచ్చరించు చున్నాడు.

సీ. నానావిధు లవేల ? నారదాదులు చన్న
మార్గమ్ము చాలదా ? మతము లెంతు
వేటివో ! శుకుఁడువోయిన లోకములు నీకుఁ
జాలవా ? వెదకెదు చదువు లేవొ !
ప్రహ్లాదుఁ డొందిన భాగ్యమ్ము చాలదా ?
కర్మముల్ చూచెదు ! గజముబ్రదుకు
చాలదా ? శ్రీపతి శరణాగతత్రాణుఁ
డతనిగొల్చుట చాలదా ? సమస్త

గీ. సృష్టికిని మూలమైన విరించి నితఁడు
నాభిఁ బుట్టించె వేంకటనాథుసేవ
చాలదా ? వికుంఠము ఫణిశైలవరము
చాలదా ? హృదయంబ ! వేసారె దేల ? 129

ఓ చిత్తమా ! వివిధములైన విధానములు నీ కెందుకు ? నారదుడు మున్నగు హరిదాసులు చనిన మార్గ మున్నదిగదా ? ఆ త్రోవనుబట్టిన చాలదా? ఎందుకు లేనిపోని వేవేవొ మతములను పరికింతువు? తొల్లి శుకయోగి గమించిన లోకములు నీకు చాలవా ?

ఎందుకు ఏవేవో విద్యల నన్వేషింతువు ? నాడు ప్రహ్లాదుడు కైవసము చేసికొన్న అదృష్టము నీకు చాలదా ?

ఓ మనస్సా ! ఏల కర్మములను పరిశీలించుచున్నావు ? గజేంద్రుని జీవిత సౌభాగ్యము నీకు చాలదా ? లక్ష్మీపతి శరణుజొచ్చినవారిని కాపాడువాడు. అతనిసేవ నీకు పర్యాప్తము కాదా ? ఈ దేవుడు ఎల్లసృష్టికి కారణమైన బ్రహ్మను తన బొడ్డున పుట్టించినవాడు. అట్టి శ్రీవేంకటేశ్వరుని కైంకర్యము నీకు తనివి నొసగదా? ఈ శేషశైలమే వైకుంఠము. ఇది నీకు చాలక పోయినదా? ఎందులకు వ్యర్థముగా శ్రమ నొందెదవు ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏఁటికి నీ కితరమార్గములు | 12 | 65 | 15 | 44 |

అప: అనంతహర్షప్రదమైన భగవత్సాక్షాత్కారమునకే భక్తితో యత్నింపవలె ననుచున్నాడు.

సీ. పడిపోయిన ధనమ్ము ప్రక్కఁ గన్నప్పుడు
ప్రాయమ్ము మగుడఁ దా వచ్చినపుడు
చెడినకార్య మ్మది చేకూరి నప్పుడు
కలుగు సంతోషమ్ము పలుకఁ దరమె ?
పరదేశగతుఁడైన పట్టి గన్నప్పుడు
తొలఁగెడు ప్రాణమ్ము నిలిచి నపుడు
మఱచిన పద్యమ్ము మదిఁ దోఁచినప్పుడు
పొడమెడు హర్షమ్ము నుడువ వశమె ?

ఆ. అలిగినట్టి విభుఁడె యాదరించినపుడు
దూరమైన చెలియ చేరినపుడు
ఫణిగిరీశ్వరుండు ప్రత్యక్ష మైనప్పు
డొదవు మోదమునకుఁ దుదియుఁ గలదె ? 130

చేజాఱినధనము తన చెంతనే కంటికి కనబడినప్పుడు, ఉడిగిన యౌవనము మరల సంప్రాప్తించినప్పుడు, చెడిపోయినపని ఫలప్రద మైనప్పుడు కలుగు సంతస మింతయని చెప్ప వలనుపడదు. అట్లే దేశాంతరమేగిన కుమారుని చూచినప్పుడు, పోయెడుప్రాణము మేన నిలిచినప్పుడు, విస్మరించినపద్యము స్మృతికి వచ్చినప్పుడు జనించు ఆనందమును వర్ణించుటకు శక్యముగాదు.

ఆగ్రహించిన ప్రభువు మరల ననుగ్రహించినప్పుడు, తనకు దూరమైన తన్విని మరల కలసినప్పుడు, శేషాద్రీశ్వరుడు సాక్షాత్కరించినప్పుడు ఉదయించు హర్షమునకు అవధి లేదుగదా!

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అటువలెనే వుండవలదా | 65 | 373 | 15 | 251 |

అవ: హరిదాసులు మాత్రమే శ్రీవైకుంఠము చేరగల రనుచున్నాడు.

సీ. **బొందితో దివికిని బోవుట యరుదుగా**
**దయిదేడు లందుండె నర్జునుండు;**
**బ్రహ్మపదం బందరాని దనఁగ రాదు**
**రాకపోకలు సల్పె రైవతుండు;**
**జనులు సూర్యకళకు చనలే రనఁగ రాదు**
**కనిరాఁడెఁ విక్రమార్కప్రభుండు;**
**పైలోకములు చూచివచ్చుట దొడ్డయా ?**
**చూచిరాఁడె యయాతి చోద్యముగను**

గీ. **దాఁటి విరజానదిని హరిధామ మందు**
**వారు సురనరు లందు నెవ్వారు లేరు;**
**సులభ మియ్యది విష్ణుదాసులకుఁ గాన**
**కొండలప్పనిఁ గని భక్తిఁ గొలువ వలయు.** **131**

శరీరముతో స్వర్గలోకమునకు బోవుట అరుదైన సంగతికాదు. పూర్వము అర్జునుడు అమరలోకమున కరిగి అందే అయిదేండ్లు గడపివచ్చెను.

బ్రహ్మలోకమున కేగుటయు అసాధ్య మనరాదు. పూర్వము కుశస్థలీ పురాధీశ్వరుడైన రైవతు డనురాజు రేవతియను తనపుత్రికకు బ్రహ్మవలన వరుని నిర్ణయింపగోరి బ్రహ్మలోకమునకు పోయివచ్చెను.

మానవులు సూర్యలోకమునకు చనుట అశక్య మనరాదు. పూర్వము విక్రమార్కు డనురాజు అచటి కేగి తిరిగివచ్చినాడు. అట్లే ఊర్ధ్వలోకములను దర్శించి తిరిగివచ్చుట గొప్పకాదు. యయాతిచక్రవర్తి తన తపోబలముతో బ్రహ్మలోక స్వర్గలోకాదులను సందర్శించి వచ్చినాడు. కాని విరజానదిని దాటి శ్రీవైకుంఠమును జేరువారు దేవతలందును, మానవులందును ఎవ్వరును లేరు. ఒక్క హరిదాసులకే అది చెల్లినది. కావున శ్రీవేంకటేశ్వరుని భక్తితో సేవించి దాసులు కావలయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| సాధించరాని దొక్కటే | 61 | 350 | 15 | 235 |

అవ: ప్రాయము గడచిన వెనుక ముక్తి సాధింతు మని అజ్ఞులు జీవితమును వ్యర్థము గావించుచున్నా రనుచున్నాడు.

సీ. ముదిమిలో సాధింతు మోక్షమం చని మది
మది నుండ ముదిమిలో మదియుఁ దప్పుఁ;
గదలలే కంతటఁ గనులఁబొరల్ గప్పి
యదియెవ్వ రిదియెవ్వ రంచు నడుగు;
జవ్వన మ్ముడివోవ సన్న్యాసి నయ్యెద
ననుచుండ తల పండి వణఁకఁ జొచ్చు;
ఊఁతకోలం బట్టి చేత, నడుము వంగి
తొరలు లాలలయందుఁ దోఁగుచుండు;

గీ. ఇంక మీఁదట సేవింతు వేంకటేశు
ననుచు నుండంగ సత్తువ యణఁగిపోవు;
వీఁడు వీతిడియైన శ్రీవేంకటపతి
మంచిగతిసూపు నీ మంచిమాట నెంచి. 132

మానవులు ముసలితనము పైకొన్నతరువాతనే మోక్షము సాధింతు మని భావించి యౌవనమున దైవధర్మము విస్మరింతురు. చివరకు వార్ధకము వచ్చినపుడు చిత్తము వశముగాక తత్తర మందెదరు. కదలలేక పోవుదురు. కన్నులు కనిపింపవు. అలికిడి విన్నప్పుడెల్ల అదెవ్వరు ? ఇదెవ్వరు ? అని ప్రశ్నించుచుందురు.

యౌవనము కడచన్న వెనుక సన్న్యసింతు మని అనుకొనుచుండగా తలపండిపోవును. శరీరమున వణకు గదురును. చేతికి ఊతకఱ్ఱ వచ్చును. నడుము వంగిపోవును. నోట లాలాజల మూరుచుండును. ఆ జలమందే వారు తేలుచుందురు.

శ్రీవేంకటేశ్వరుని ఇకమీద సేవింతును అని యనుకొనుచుండగనే జవసత్త్వము లుడిగి పోవును. ఇట్లు నరుడు అవివేకియై యున్నను అంతరాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు 'ఎప్పుడో యొకప్పుడు స్వామిని గొలుతును' అన్న ఆ యొకేయొక మంచి మాటను పరిగణనకు తీసికొని అతనికి సద్గతిని ప్రసాదించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| మంచి వయసుకాలము | 36 | 201 | 15 | 136 |

అవ: లౌకికప్రవృత్తు లందరికిని సహజములే. హరిశరణాగతి యొక్కటే యత్నముతో సాధింపదగిన దనుచున్నాడు.

సీ. **తనువులు మోచుట ధనములు దాఁచుట**
**కనఁగ జీవుల కెల్లఁ గలిగినదియ ;**
**మనసుల రోయుట మమతలఁ బాయుట**
**వనజాక్షుఁ గొలుచుట వలయుఁగాక ;**
**కాఁపురాల్ సేయుట కపటాల లాయుట**
**తలఁప జీవులనెల్లఁ దగిలినదియ;**
**కోపముల్ ద్రుంచుట కోర్కులు ద్రెంచుట**
**వైకుంఠుకృపగొంట వలయుఁగాక**

గీ. **అఁకటం బడలుట యన్న మారగించు**
**లేకడను జీవులకు నున్నదే గదయ్య !**
**యేఁకటను వేంకటేశ్వరునే శరణని**
**ప్రాకటసుఖంబు లందుట వలయుఁగాక.** **133**

లోకములో జీవు లందఱకు శరీరములు దాల్చుట, ధనములు దాచి పెట్టుట అనునవి సహజములై యున్నవి. చంచలమైన చిత్తముపై రోతగొనుట, మమకారములను దూరీకరించుట, పద్మాక్షునకు పరిచర్య గావించుట నిక్కముగా సలుప వలసిన పనులు.

జీవు లెల్లరును సంసారములు సాగించుచునే యున్నారు. కపటములు ప్రదర్శించుచునే యున్నారు. ఈ ప్రవృత్తి సర్వజీవసాధారణమై యున్నది. కాని నిజముగా చేయదగినపని యేమన కోపమును తెగటార్చవలయును. కోరికలను పరిమార్చ వలయును. వైకుంఠనాథుని అనుగ్రహము పొందుటకే యత్నింప వలయును.

ఆకలితో అలమటించుట, అన్నము ఆహారించుట సర్వత్ర జీవులకు సహజమే. కాని శ్రీవేంకటేశ్వరుని అపేక్షతో శరణుజొచ్చి నిత్యసుఖములను పొందుటయే నిజమైన కర్తవ్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎంతలేదు లోకము | 26 | 150 | 15 | 100 |

అవ: సముద్రైన భగవంతుడే భక్తిగలవానిని కాపాడునుగాన వేఱె చింతింప పనిలే దనుచున్నాడు.

సీ. పుట్టించిన యతండె పూని రక్షింపఁడా
వట్టిచింతలతోడ వగప నేల ?
పదునాల్గుజగములఁ బాలింపఁగలవాఁడు
గట్టిగా నందఱఁ గావలేఁడ ?
అంతరాత్ముఁడుగదా అన్నియుఁ దెలియఁడా
వేఱె వింతగ విన్నవించనేల ?
సతతమ్ము గుణములు సంధించునాతండు
నేర్పుతో దిద్దఁడా నేరములను ?

గీ. ఏలికై దాసవర్గంబు నేలువాఁడు
సంపద లొసంగి రక్షింపఁజాలఁ డేమి ?
అంజనాద్రిని ప్రత్యక్షమైనవాఁడు
చొక్కముగ నిజమహిమలు చూపలేఁడె ? 134

సర్వభూతములకు బీజప్రదుడైన పిత పరమాత్ముడే. జననకారణమైన ఆ దేవుడే ప్రాణులను రక్షింపగలడు. కావున వ్యర్థమగు చింతలతో జీవుడు సదమదము కా నక్కఱలేదు.

ఆయన చతుర్దశభువనములను పాలింప సమర్థుడు. ఈ భూలోకములోని ప్రాణుల నెల్ల సంరక్షింపలేడా ?

జీవాత్ముల కెల్లరకు నాత దంతరాత్ముడు. అన్నియు చెప్పకయే గ్రహింప గలడు. క్రొత్తగా తా మిపుడు పోయి వెన్నునికడ విన్నవించ నక్కఱలేదు.

సకలకల్యాణగుణనిలయుడై లోకమంతట గుణములనే వ్యాపింపజేయు నా పరమాత్ముడు మనలోనిదోషములను సరిదిద్ద లేడా ?

ఆతడు లోకమున కెల్ల ప్రభువు. తన దాసవర్గమును కృపతో పాలించు చున్నాడు. అట్టివాడు ఆశ్రితులకు అడుగకయే సంపదలిచ్చి కాపాడలేడా? ఆయన అంజనగిరిపై ప్రత్యక్షమై యున్నాడు. అట్టి పరమపురుషుడు తన ప్రభావమును బాగుగ ప్రదర్శింపడా ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తమ వుద్యోగము లేల | 28 | 162 | 15 | 108 |

అవ: పూర్వులు ఏ హరిదాస్యముతో కడతేరిరో ఆ హరి దాస్యమే ఆధునికులకు గూడ ఆశ్రయణీయ మనుచున్నాడు.

సీ. జగములోపల హరి సత్త్వపూర్ణుండని
భృగుమౌని శోధించెఁ బేర్మిఁ దొల్లి;
ముగురు వేల్పులలోన మొఱవెట్టి రితనికే
యఖిలదేవతలు క్షీ రాబ్ధికడను
కాశిలో హరి తారకబ్రహ్మ మని పర
మేశుండె బోధించె నెల్లరకును;
రామనామ మ్మహోరాత్రముల్ హైమవ
తీదేవి భక్తిఁ గీర్తింపఁ దొడఁగె

గీ. ధాత నారాయణుండె పరతత్త్వ మంచుఁ
జాట జనియించెఁ దన్నాభిజలజమందు ;
ఇదిగొ! శేషాద్రిహరిఁ గొల్చి యిందఱము
బ్రదుకుదము రండు జాగేల ప్రాణులార ! **135**

పూర్వము భృగుమహర్షి త్రిమూర్తులను పరిశోధింపబోయి వారిలో జగమునందు శ్రీహరియే సత్త్వగుణసంపన్నుడని ఘనముగా శోధించి చాటెను.

దేవత లెల్లరు తమకు దైత్యులచే ఇక్కట్టులు గలిగినప్పుడు క్షీరసాగరము కడకేగి త్రిమూర్తులలో శ్రీమహావిష్ణువునకే తమబాధలు విన్నవించుకొనిరి.

కాశీక్షేత్రమునందు శ్రీహరియే తారకబ్రహ్మమని అందఱకు పరమేశ్వరుడు బోధించెను. పార్వతీదేవి రేయుంబవలు భక్తితో శ్రీరామనామమునే కీర్తించు చున్నది.

శ్రీమన్నారాయణుండే పరతత్త్వమని లోకమున వెల్లడిగావించుటకే ఆ దేవుని నాభిపద్మమునందు బ్రహ్మదేవు డుదయించెను.

ఇదుగో! ఆ దేవుడే నేడు శేషాద్రీశ్వరుడై వెలుగొందుచున్నాడు అయనను సేవించి అందఱను సుఖముగా జీవింతము. జీవులారా ! ఆలసిం[illegible]డు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వరేమి సాధించేరు | 24 | 139 | 15 | 92 |

అవ: గురుకరుణచే హరికృపకు పాత్రుడైన తనకు మరల కర్మాదిబంధములు కలుగ వనుచున్నాడు.

సీ. తొల్లిటి కర్మముల్ తొలఁగఁజేసె గురుండు
చెల్లబో! మఱి యవి చేయఁగలనె ?
ఉముకఁబొసినమీఁద సుర్విఁనాటిన విత్తు
లెప్పటివలె మొలకెత్తఁ గలవె ?
వెడజాతిధర్మాల సుడినుండి తప్పింప
గురుఁడు క్రమ్మఱ నందుఁ దిరుగఁగలనె ?
తొడిమలూడి పుడమిఁ బడిన ఫలమ్ములు
పదపడి తొడిమల కదుకుకొనునె ?

గీ. చేరఁజూపె గురుండు శ్రీశ్రీనివాసు
దడదడంబని యితరులఁ దడవఁ గలనె ?
అటు పరుసవేదిచే బంగ రైన లోహ
మెంచఁ దొల్లింటిరూపమ్ము నెట్లుగాంచు ? 136

నేను పూర్వ మొనర్చిన కర్మముల నన్నింటిని నాగురుడు నిశ్శేషముగా తొలగించివేసినాడు. మరల నేనాకర్మముల కొడిగట్ట గలనా? పొట్టుపీడిన గింజలు భూమిలో నాటిన తొల్లిటివలె అవి అంకురింపగలవా? అంకురింప వని తాత్పర్యము.

నాగురుడు నన్ను వ్యర్థమగు జాతిధర్మము లనెడు సుడిగుండమునుండి తప్పించెను. మరల నేనందు ప్రవేశించి భ్రమింపగలనా? పండిన పిమ్మట తొడిమ వీడి పడిన పండ్లు మరల ఆ వృంతమునకు అంటుకొనగలవా? అంటుకొన వనుట.

గురుడు నాకు శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయము చూపెను. ఇక నేను వడిగా నేగి ఇతరుల నె ట్లాశ్రయింపగలను? స్పర్శవేధి స్పర్శచేత సువర్ణముగా మాఱిన యినుము మరల పూర్వరూపము నెట్లు పొందగలదు? పొంద దని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పోయినబంధము లటుపోవుదాక | 23 | 129 | 15 | 86 |

అవ: విశ్వసించినవారికి శ్రీవేంకటేశ్వరుడు కరబదరసమాను డనుచున్నాడు.

సీ. పరము వేఱొక చోటఁ బాఁతియున్నది యటే ?
    తిరమైన యీ మాయ దెలియ లేరు;
ఎప్పుడు దేహాత్మ లెరవులుగాఁ జూతు
    రెప్పు డహంకార మెల్ల తొలఁగు
నప్పుడు దైవతం బరచేతిలో నుండు
    కప్పిన కీలును గనరుగాని;
ఎన్నడు సమబుద్ధి నెల్లరఁ జూచెద
    రెన్నఁ డాసలనెల్ల నేవగింతు
రన్ని పున్నెము లప్పు డండనే సమకూడు
    నిన్ని విచారింప రించుకేని;

గీ. ఎచ్చటన్ హరిభక్తి తా నెసక మెసఁగు
నెచ్చటన్ సందియములు లెల్ల నిట్టి వీడు
నచ్చటన్ వేంకటాద్రీశునలఘుకరుణ
వెలయు నని విశ్వసింపరు విశ్వజనులు. 137

పరతత్త్వము ఏదోయొకచోట నాటబడియున్నదా? లే దనుట. మాయ స్థిరముగ తమహృదయములందు క్రమ్ముకొనియుండుటచే జీవు లీ తత్త్వము గ్రహింపజాల కున్నారు.

శరీరమును, శరీరిని ఎప్పుడు వేఱువేఱుగా దర్శింతురో, ఎప్పు డహంకారము విడుతురో అప్పుడే దైవము అఱచేతికి వచ్చును. మాయచేత కప్పబడిన ఈ మర్మమును జీవులు తెలియజాల కున్నారు.

ఎప్పుడు అందఱను సమభావనతో చూతురో, ఆశలను రోయుదురో అప్పుడే పుణ్యము లన్నియు చెంతకువచ్చి చేరును. ఇసుమంతయు జీవు లీ సంగతిని విచారింపరు.

ఎక్కడ హరిభక్తి వృద్ధియై యుండునో, ఎక్కడ హరినిగూర్చి సంశయము లెల్ల విడిపోయినవో అక్కడ శ్రీవేంకటేశ్వరుని అపారకృప ప్రసరించును. ఈ విషయము లోకులు విశ్వసింపజాలకున్నారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పరము వేరొకచోట | 7 | 42 | 15 | 28 |

అవ: శ్రీవైష్ణవలక్షణముల నుగ్గడించుచున్నాడు.

సీ. పాపమ్ము గనుఁగొన్న భయము సెందవలయు
నరుచి పుట్టవలె సంసరణమందు
విరివియౌ భోగాల వెగటునొందఁగ వలె
వీరవైష్ణవునకు విరతి వలయు;
తనకు సుజ్ఞానమ్మె ధన మనవలయును
తన నేరముల నెప్డు తలఁపవలయు;
ఆచార్యుఁడే గతియని యుండవలయును
వాంఛలు వోవలె వైష్ణవునకు;

గీ. మోక్షమార్గమ్మునన్ రుచి పొడమవలయు
భాగవతులందుఁ బ్రేమ దైవాఱవలయు
ఫణిగిరీశ్వరుదాసుఁడై బ్రదుకవలయు
వలయు వినయస్వభావమ్ము వైష్ణవునకు. 138

విష్ణుభక్తులగువారు పాపభీతి గల్గియుండవలయును. సంసారమును రోయ వలెను. భోగములను ఏవగించుకొన వలెను. పరమవైష్ణవునకు వైరాగ్య మత్యావశ్యకము.

వైష్ణవుడు సుజ్ఞానమునే ధనముగా నెంచవలయును. తనదొసగులను పరిశీలించుకొనుచుండవలెను. గురుడే గతియని విశ్వసింపవలెను. కోర్కులను విడనాడవలెను.

ముక్తిమార్గమున శ్రీవైష్ణవునకు ఆసక్తి జనింపవలెను. భగవద్దాసుల యందు ప్రీతి వర్ధిల్లవలయును. అతడు శేషాద్రీశ్వరుని దాసుడై జీవింపవలయును; వినయవంతుడై వెలయవలెను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కన్నవారి కెల్లా | 58 | 328 | 15 | 221 |

అవ: వ్యర్థముగ శ్రమలపా లవుచున్న జీవునకు హరిశరణాగతి యొక్కటే రక్షక మనుచున్నాడు.

సీ. ఊరకే పాట్లఁబడి యొడలు నిత్యంబని
యాఱడిఁ జరియించు నకట ! ప్రాణి
నూతేండ్లకై నను జేరెడు లోకమ్ము
నరకమో స్వర్గమో మఱి యెఱుగఁడు
పొరిఁ దన్నుఁ బొదివిన పుత్రమిత్రకళత్ర
జనము లెన్నటివారొ జూడ గనఁడు
ఇడుమపాటుల నెల్లఁ బడి గడించినసొమ్ము
తనకో యిఁక కొరులకో తాఁ దెలియఁడు
అనుభవింపక తీఱ దన్ని కర్మఫలాలు
వెనుకొ ముందరయు భావించలేఁడు

ఆ. నుదుటివ్రాత చేత నోరఁ జుట్టుకొనుచు
మొదలు తుదయుఁ జూడఁ దదిగొ ! వేంక
టేశ్వరుండు కనులయెదుటనే యున్నాఁడు
గదిసి శరణుఁ జొరఁగఁ గరుణఁ గాచు. **139**

అయ్యో! జీవుడు అనిత్యమైన శరీరమునే నిత్యమని భావించుచున్నాడు. వ్యర్థముగ నెన్నో శ్రమలకు గుఱియై యిటునటు చరించుచున్నాడు. తాను నూఱేండ్లీ లోకమున జీవించినను అవసానదశలో తనకు ప్రాప్తించులోకము నరకమో, స్వర్గమో తెలియజాలడు. త న్నాశ్రయించిన పుత్రులు, మిత్రులు, పత్ని ఈ మున్నగువారు ఏనాటివారో తనకును, వారికిని ఎప్పటి సంబంధమో భావింపలేదు.

పలుపాటులు పడి ఆర్జించినవిత్తము తాననుభవించునో, పరు లను భవింతురో యెఱుగనేరడు. తాను చేయు సమస్తకర్మఫలములు జీవు డనుభవింప వలసినదే. అట్లయినచో అతడు సత్కర్మలే చేయవలసినవాడేగదా! కాని అట్లు చేయడు. వెనుక ముందరలు చూడక సాహసముతో అన్నితెఱగుల కర్మ లాచరించును.

మఱియు జీవుడు తన లలాటలిఖితరేఖను నోర చేత జుట్టుకొని యున్నాడు. అనగా చేతజేసిన కర్మము నొసటివ్రాలై ఫలానుభవదశలో నోటికి వచ్చుచున్నది. ఇంత జరుగుచున్నను తనకర్మలు చివరిగమ్యమైన ముక్తికి దారి జూపునో లేక మొదటికి తెచ్చి మరల తనకు జన్మపరంపరనే గలిగించునో అతడు గ్రహింపడు.

శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షముగనే యున్నాడు. ఆయనను సమీపించి శరణాగతి యొనర్చినచో కృపతో తన్ను ఆ దేవుడు కాపాడును. భగవంతుడు అట్లు దయతో కాచునంతవరకు జీవునకు కర్మబంధము వీడదని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఊరకే పాట్లఁబడి | 12 | 66 | 15 | 41 |

అవ: రక్షకుడైన పరమాత్ముడు తన్ను తలంచుజీవునకు మిక్కిలి సన్నిహితు డనుచున్నాడు.

సీ. సర్వేశ్వరునకును శరణనినం జాలు
పార్థు రక్షింపఁడే పగఱఁ గొట్టి
మ్రొక్కెడువారికి మూరెఁడే దవ్వు రే
పవలు మురారి కాపాడుచోటు;
వీక్షింపఁగా లేరు విశ్వసింపఁగ లేరు
ప్రహ్లాదుఁ బ్రోచెఁ గంబమున వెడలి;
కోరి పిల్వఁగ నేర్వ కూఁతవేటౌ దవ్వు
హరినామముండి త న్నరయు చోటు;
లోతుపాతులలేదు లోని శ్రీపతిపేరు
నాతి మొఱాలించి నాఁడు గాచె

గీ. కనఁగ కనుచూపుదవ్వె వేంకటవిభుండు
నిండుమది నెల్లవారి మన్నించుచోటు;
చెలఁగి యెటనుండి ధ్యానమ్ము చేసికొనిన
తమ్మికన్నులవాఁడు వరమ్ము లిడఁడె ? **140**

సర్వమునకు ప్రభువైన పరమాత్మునకు శరణనినచో చాలును. ఆయన తన భక్తులను కాపాడును. అర్జునుడు హరికి శరణన్నాడు. కురుక్షేత్రమున శత్రువుల నెల్ల హతమార్చి ఆ స్వామియే అతనిని కాపాడెను. అహర్నిశలు దేవుడు జీవుని రక్షించు ప్రదేశము భక్తిగల్గి నమస్కరించువారికి మూరెడుదూరములోనే యున్నది. కాని మూఢులు సన్నిహిత పరమాత్మను సందర్శింప లేరు; విశ్వసింపను లేరు. విశ్వసించిన ప్రహ్లాదుని ఆయన స్తంభమునుండి బయలువెడలి కాపాడినాడుగదా! ఆశతో పిలిచినచో హరినామము కూతపెట్టిన వినపడునంత సమీపమునందే యుండి తన్ను రక్షించును. శ్రీపతినామము చూపులకు ఊహలకు అందనంత అగాధములందు లేదు. ద్రౌపది ఆర్తితో తన్నుబిలువ ఆమెమొఱ నాలకించి కాపాడినాడుగదా ? పూర్ణహృదయముతో జీవులనెల్ల శ్రీవేంకటేశ్వరుడు ఉండి సంరక్షించుచోటు కనుచూపుమేరలోనే యున్నది. ఇక్కడక్క దనక ఎక్కడనుండి ధ్యానించినను ఆ వనజాక్షుడు వరము లిచ్చి కాపాడును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| శరణంటేఁ జాలు | 23 | 134 | 15 | 89 |

అవ: హరికొలువు గోరిన తన్ను తమకొలువునుండి తప్పింపుడని పంచేంద్రి యాదులను ప్రార్థించుచున్నాడు.

**సీ. హరిబంట హరిబంట హరిబంట నామీఁద**
**తరువేల ? మమ్మింకఁ దడవ వలదు;**
**పంచేంద్రియములార ! బడిబడి మీపంపు**
**సలిపితి మి మ్మింకఁ గొలువ నోప**
**అందుకొన్నాఁడ శ్రీహరివారకమ్ముల**
**నించుక గడిచీటి యీయఁ గదరొ !**
**ఆఁబడి యడియాసలార ! మీ కేప్రొద్దు**
**వెట్టిచేసియు చేసి వేసరితిని**
**గుట్టుగా హరిచేతి కొంగుబత్తె మ్మందు**
**కొంటి నుత్తరు విందు కొదలు మాని**

**గీ. అనుఁగుఁబ్రాయంపుమోహమ్ములార ! యిన్ని**
**సమలు మీసరి నుంటిని చనవరినయి;**
**ఘనుఁ డయిన వేంకటేశ్వరుఁ గని కొలిచితి**
**నింక వీడ్కోలువిడెము నా కీయఁగదరొ !** **141**

పంచజ్ఞానేంద్రియములారా ! నేను ముమ్మాటికి హరిదాసుడను. నామీద మీ పెత్తన మెందుకు? నాజోలికి మీరు రావలదు. ఇంతదనుక మీసేవ చేసితిని గదా ! ఇక మిమ్ము సేవింపజాలను.

నేను హరినుండి చేబదులు పుచ్చుకొంటిని. కైంకర్యముతో ఆ ఋణము తీర్చవలసి యున్నాను. కాన ఎందును నాకు నిర్బంధములేని ఉత్తరువు దయ చేయుడు. వ్యర్థమైన పేరాసలారా ! మీ కెల్లకాలము సేవ చేసిచేసి విసిగి వేసారితిని. నే నింక శ్రీహరినుండి కొంగుబత్తె మందుకొంటిని. ఆయనను కొలువవలసి యున్నది. కావున కొఱతలు మనసులో పెట్టుకొనక నాకు సెలవిందు.

ప్రియమైన యౌవనమోహములారా ! ఇన్నిసంవత్సరములు మీతో చనవున మెలగితిని. నేటికి సర్వోత్తముడైన శ్రీవేంకటేశ్వరుని సందర్శించి సేవించితిని. కాన దయచేసి నాకు వీడ్కోలువీడ్యము నొసగుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| హరిబంట హరిబంట | 14 | 78 | 15 | 52 |

అవ: సంసారములో పడి ముక్తికి దూరమైన జీవులను శ్రీనివాసుడే కృపతో రక్షించు ననుచున్నాడు.

సీ. కాయంపుమోహినీగజ మెక్కినారము
ప్రాయంపుమద మిదె పట్టె మమ్ము
తివుట బంధపుఁ దీఁగఁ ద్రెంచివేయఁగఁ జాల
మేయెడ విజ్ఞాన మెఱుఁగఁ గలమె ?
పృథులమౌ సంసారనిధిఁ ద్రొక్కినారము
మదనభూతమ్మది మమ్ముఁ బట్టె;
వడి నహంకారగర్వమ్ము మానఁగ లేము
కలుగునే మాకు మోక్షంపుఁదెరువు ?

గీ. లలిచెలులసంగమనెడు కొల్లాపురమ్ము
సొచ్చినా మెగ్గసిగ్గులఁ జూడకుండ;
నిట్టె యేమతియుండ మ మ్మేలినాఁడు
శ్రీనివాసుఁడు వేంకటశిఖరివిభుఁడు. 142

మేము శరీర మనెడి మోహినీగజము నధిష్ఠించితిమి. దానితో మమ్ము యౌవన మనెడు మదము పట్టుకొన్నది. ఈ వ్యామోహబంధ మనెడు లతను తెగనఱికి వేయజాల కున్నాము. ఇక విజ్ఞానము నెట్లు గ్రహింపగలము ?

విశాలమైన సంసారమనెడి నిధిని త్రొక్కితిమి. అంతట మమ్ము కామ పిశాచము ఆవహించినది. ఈ స్థితిలో అహంకారమనెడి గర్వము వీడలే కున్నాము. ఇక మాకు ముక్తి మార్గ మెట్లు లభించును ? కడకు ఎగ్గుసిగ్గు లెంచక భామామణుల తోడి రతి యనెడు కొల్లాపురము ప్రవేశించితిమి. ఈ విధముగా మేము పరతత్త్వము నేమతియుంటిమి. అయినను వేంకటాద్రిప్రభువైన శ్రీనివాసుడు మమ్ము దయతో గాపాడినాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కతగాదు దృష్టమిది | 21 | 122 | 15 | 81 |

అవ: అంతర్యామియై హరి యున్నాడు గాన చింతలు వల దనుచున్నాడు.

సీ. సర్వాంతరాత్ముండు సకలలోకేశ్వరుం
　　దకలంకుఁ డిదిగొ మాయందుఁ గలఁడు
ప్రకటించి యేలికై బహుభాగ్యరాశియై
　　పోరానిచుట్టమై పొంతగలఁడు
భవరోగవైద్యుండు పరమపూరుషుఁడు మా
　　కిరవైన దేవుఁడై యింటఁ గలఁడు
నిస్సమాభ్యధికుఁడై నిఖిలరక్షకుఁడయి
　　దరిజేర్చికావ మాదండఁ గలఁడు

గీ. శ్రీమహాలక్ష్మితో వృషశిఖరివిభుఁడు
కైవసంపుసుఖమ్మయి కలఁడు మాకు;
వేల సుజ్ఞానములు వింతవేడ్క లగుచు
కలఁడు మా పాలిటికి; నింక కలఁత లేల ? 143

పరమాత్ముడు సర్వమున కంతరాత్ముడు. ఎల్లలోకములకు ప్రభువు. కళంకము లేనివాడు. అడుగో! ఆతడు మాలోపలనే యున్నాడు. మాకు రక్షకుడై, పెన్నిధియై, ఆప్తబాంధవుడై మాసన్నిధిలోనే యున్నాడు. అతడు సంసార మనెడు రోగమునకు వైద్యుడు. ఆ పరమపురుషుడు మాపాలిటికి స్థిరమైన దేవుడై మాయింటనే యున్నాడు.

ఆతనితో సమానులు లేరు. ఆతనికంటె నధికులును లేరు. సమస్తమును కాపాడువా డతడే. మమ్ము ఒడ్డునకుజేర్చి సంరక్షించుటకు మా సమీపముననందే యున్నాడు.

శ్రీదేవితోగూడిన శేషాద్రినాథుడు మాకు చేజిక్కినసుఖమై అలరారు చున్నాడు. మాలోని వేలకొలదిసుజ్ఞానములు, వింతవింతవేడుకలు అన్నియు తానై మాపాలిట ఆ దేవుడు నెలకొనియున్నాడు. ఇక మాకు వ్యర్థమైన విచార మెందులకు ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమిటికి వట్టిచింత | 18 | 101 | 15 | 67 |

అవ: బాహ్యసుఖాపేక్ష నుజ్జగించి అంతర్యామిని గొల్చి ఆత్మసుఖము పడయుమని జీవుని హెచ్చరించుచున్నాడు.

సీ. అందులో నున్న వాఁ డాదికేశవుఁడు నీ
కందరానిపదమ్ము లందియిచ్చు
ఘనులిండ్లవాకిళ్లు గాచెడి జీవుఁడా !
కని ఆత్మవాకిలి గావరాదె ?
పరులరాజ్యము లేల భావించు జీవుఁడా !
యిటు నీ మనోరాజ్య మేల రాదె ?
చెలులరూపము లెల్లఁ జింతించు జీవుఁడా !
తివిరి నీ రూపు చింతింప రాదె ?
కెలన సౌఖ్యములు భోగించు జీవుండ ! మే
లెంచి జ్ఞానమ్ము భోగించ రాదె ?

ఆ. పొలసి కాపురముల బలసిన జీవుఁడా !
భావహర్షమునను బలియ రాదె ?
మేరమీఱు సిరులఁ గోరెడి జీవుఁడా !
కొండలప్ప సేవ గోరరాదె ? **144**

ఓ జీవుడా! నీయాత్మలోనే యంతర్యామిగా పరమాత్ము డున్నాడు. అతనిని సేవించినచో నీ కలభ్యమైనపదవులు ఆతడే ప్రసాదించగలడు. నీవు ధనిక ద్వారముల కడ కావలికాడ వయ్యెద వేల ? తత్త్వ మరసి నీయాత్మవాకిలినే నీవు కాచుకోరాదా? దేవుడు ఆత్మలోనే నెలకొనియున్నాడు గనుక అతనికి పరిచర్య చేయు మనుట.

జీవుడా! ఇతరులరాజ్యములు స్వాధీనపఱచుకొని పరిపాలింప గమకించెదవు. నీమనోరాజ్యమునే నీవు పాలించుకోరాదా? భగవంతుడు ఆ మనోరాజ్యములోనే యున్నా డనుట. పడతులరూపము లనుభవింతువు. నీ రూపునే నీవు భావింపరాదా ? బాహ్యసుఖముల ననుభవింతువు. శ్రేయము గుర్తెఱిగి జ్ఞానానుభవమున సుఖింపరాదా ?

సంసారముతో తెగబలసిపోయితివి. కాని భావానందముతో పెంపొంద రాదా? అంతులేని సంపదలు వాంఛించుచున్నావు. ఏడుకొండలవానిసేవ వాంఛింప రాదా? బాహ్యభోగాపేక్షమాని తనలోనేయున్న పరతత్త్వమును భావించినచో జీవుడు మోక్షసామ్రాజ్యము నధిష్ఠింపగలడని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అందులోనే ఉన్నవాడు | 23 | 133 | 15 | 88 |

అవ: పంచభూతములస్వభావము పరమాత్ముడే యెఱుంగునుగాని జీవు లెఱుంగజాల రనుచున్నాడు.

సీ. అంధకారమువాపు నరుణోదయము గ్రుడ్ల
గూబలకుం గూర్చు గ్రుడ్డితనము;
అదట విజ్ఞాన మందించు హరిభక్తి
కలుషచిత్తుల నెప్డు కాననీదు;
అందఱు రుచిగొను నన్నము రోగికి
జీర్ణమ్ముగా కెంతొ సేగిసేయు;
అందఱికంటె శ్రీహరి యెక్కు డనియెడి
చదువులు జడునకు చప్పనగును;

గీ. కొలిచి యొక ఱేని మూర్ఖులు కొంద ఱతని
సేవకునిదిట్టి భంగమ్ము చెందినట్లు
ఫణినగాధిపు భజియించి వారివారి
విరస మాడుచు పోదురు విఫలు లగుచు. 145

చీకటులు దొలగించు సూర్యోదయము గ్రుడ్లగూబలకు మాత్రము అంధ్యమునే చేకూర్చును. సుకృతాత్ములకు హరిభక్తి విజ్ఞానమును ప్రసాదించును. దుష్కృతాత్ములకు వారి దురితము భక్తి ఫలమైన విజ్ఞానమును దర్శింపనీయదు.

ఆకలి యొదవినప్పుడు అందఱును అన్నము భుజింతురు. కాని అది రోగగ్రస్తునకు మాత్రము జీర్ణముగాక బాధాకర మగును. విష్ణుపారమ్యమును ప్రతిపాదించు విద్యలు జడునకు రుచింపవు. కొందఱు మూఢులు ఒకరాజును సేవించిరి. కాని అతనిసేవకుని దూషించి తుదకు వారు భంగపడిరి. అట్లే శేషాద్రీశ్వరుని సేవించి తదీయులైన వైష్ణవులను నిందించిన మూర్ఖులు తుదకు వైఫల్యమునే చవిచూతురు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తాము దెలియరూ | 24 | 138 | 15 | 20 |

అవ: పంచభూతములస్వభావమును పరమాత్ముడే యెఱుంగునుగాని జీవు లెఱుంగజాల రనుచున్నాడు.

సీ. సాగరమ్ములలోఁతు క్ష్మామండలము వ్రేఁగు
నా పరాత్పరుఁడైన హరి యెఱుంగు;
పొలసిన జ్ఞానమ్ము పుణ్యపాపమ్ములు
హీనజీవుల మేమి యెఱుఁగఁ గలము ?
అనలమ్ము తేజమ్ము నాకసంపువిరివి
ఆదినారాయణుం డాతఁ డెఱుఁగు;
మునుకొన్న కాలమ్ము మొదలిజన్మమ్ములు
మొరటుప్రాణుల మేమి యెఱుఁగఁ గలము ?

గీ. లోలమగుగాలి విశ్వమ్ము లోపలి పస
పరమపురుషుండు వేంకటపతి యెఱుంగు;
నెఱుఁగుదుమె మేము దేహుల? మిందిరేశుఁ
డతని శరణంబు వేఁడుట నమలభక్తి. 146

పరమపురుషుడైన శ్రీహరియే జలనిధులలోతు, భూమండలభారము నెఱింగినవాడు. మేము అల్పప్రాణులము. జ్ఞానము, పుణ్యము, పాపము ఎట్లు తెలియగలము ? అగ్నిప్రకాశము, ఆకాశవైశాల్యము ఆదిదేవుడగు హరియే తెలిసిన వాడు.

మేము మూర్ఖజీవులము. కాలము, పూర్వజన్మములసంగతి నెట్లు గ్రహింపగలము ? చంచలమైన వాయుస్వభావము, విశ్వసృష్టిలోని రహస్యము పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరుడే తెలియగలడు.

మేము ప్రాకృతదేహులము. నిర్మలమైన భక్తితో లక్ష్మీశ్వరుని శరణొందుట ఎట్లు తెలియగలము ?

కావున ఆ భగవానుడే మమ్ము రక్షింపవలె నని భావము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| శ్రీపతియే రక్షించుఁగాక | 24 | 138 | 15 | 92 |

అవ: ఈశ్వరానుగ్రహము లేనిచో సంసారబంధము తొలగ దనుచున్నాడు.

సీ. ఎఱుకచాలనిజీవి యెద్దైతనముగాక
గుఱితప్పఁ బాఱునా కోఁతి కొమ్మ ?
దగ్గఱగలమాయఁ దలపించు మది, కాని
దవ్వులజ్ఞానమ్ముఁ దడవ నీదు;
గుల్లగుల్లయ కాక గుండ్రాయి యవునటే
వసరమ్మునకు నడబాలలేల ?
మక్కువభోగాల మరగించు మేను ర
వ్వంత వైరాగ్యంబు నందనీదు
ఒకవిత్తుపెట్ట వేఱొకచెట్టు మొలచునా ?
కలయంపిరుచి యడుగంగ నేల ?

గీ. ఎంచ కర్మము చిక్కించు నీశ్వరాజ్ఞ
యతనియానతి దాఁటనీఁ డహరహమ్ము ;
కాయ పండౌనె ? పండేల కాయ యగును ?
ముట్టి ముంటికి మఱి వాఁడిపెట్టవలెనె ? 147

జీవునకు విజ్ఞత చాలదు. ఆతనిమూర్ఖత్వము వస్తుస్వరూపమును యథాతథముగ గ్రహింపనీయదు. అంతయు భగవదాయత్త మను యాథార్థ్యము నాతడు గుర్తింపజాల కున్నాడు. వానరము వృక్షశాఖలపై అప్రతిహతముగా సంచరించును, ఎంతవడిగాతిరిగినను గుఱితప్పదు. అట్లేకర్మగతియు, ఈశ్వ రాజ్ఞయు గుఱితప్పవు.

జీవునకు మాయ సన్నిహితమై యున్నది. చిత్తము దానినే తలంచును గాని దూరముననున్న జ్ఞానమును భావింపదు. ఇది భగవల్లీల. కప్పచిప్ప కప్పచిప్పయే గాని కఠినమైన పాషాణము కాజాలదుగదా! గడ్డి మేయు పశువునకు వంటలక్కతో పని యేమున్నది? ప్రవృత్తి మార్గమున నున్న జీవి ప్రవృత్తికి పాత్రుడు గాని నివృత్తి మార్గము నందుకొన లేడనుట. ఐహికభోగములకు అలవాటుపడిన శరీరము కొంచెముగూడ జీవుని విరక్తిమార్గముపొంత పోనీయదు. ఏ విత్తు నాటుదుమో ఆ చెట్టే మొలచునుగాని మఱొకచెట్టు మొలవదుగదా! పేడనీళ్లరుచి యెట్టిదో అడుగ వలసినపని లేదుగదా? అట్లే సంసారబద్ధుడైనవానిస్థితి ఎట్టిదని ప్రశ్నింపపనిలేదనుట.

ఈశ్వరాజ్ఞచే కర్మ జీవుని బంధించినది. అది భగవదాజ్ఞను అతిక్రమింప నీయదు, కాయ పండును, పండు కాయయు కాలేవు గదా! కంటకమునకు వాడిమి సహజమై యున్నది. దానికి మరల వాడి కల్పింపవలసిన పనిలేదు. అట్లే కర్మ సహజముగా గహనమై యున్నది దానిని జీవుడు దాటలేడు.

ఇంతయు భగవదిచ్ఛ ననుసరించి జరుగుచుండునని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎఱుఁగుకోలేని జీవి | 27 | 154 | 15 | 102 |

అవ: లక్ష్మీపతి నారాధింపకున్నచో ఉత్తమగతి లే దనుచున్నాడు.

**సీ. దేహాభిమానముల్ తెగి విడిచినఁగాని**
**యీహల దైవత మ్మేల మెచ్చు ?**
**కడఁగి కోరికలసంగము మాన కున్నచో**
**పరమపద మ్మేల ప్రాప్త మగును ?**
**నిచ్చలు వైరాగ్యనిష్ఠుఁడు గాకున్న**
**నెచ్చిన జన్మాదు లేల కడచు ?**
**తనలోనికోపమ్ము తలఁగకయున్న బ్ర**
**హ్మానంద మేల త న్నలమికొనును ?**

**గీ. కొండలప్పని శ్రీపతిఁ గొల్వకున్న**
**సోమసూర్యేక్షణుం డేల సులభుఁ డగును ?**
**నిండుభక్తిని తనలోన నిలుపకున్న**
**పుడమి తా నేల సంతతపుణ్యుఁ డగును ?** **148**

శరీరమందలి యభిమానమును సంపూర్ణముగా పరిత్యజింప వలయును. అట్లు చేయకున్నచో దేవుడు జీవుని మెచ్చి యనుగ్రహింపడు. కోరికల తోడిపొత్తు వీడ దగును. అట్లొనర్పకున్నచో పరమపదము సిద్ధింపదు. సతతము విరక్తి యందు నిష్ఠగలవాడు కావలయును. అట్లు కాకున్నచో జన్మాదిబంధములు వదలవు.

తనయందలి కోపమును దూరీకరింపవలెను. లేనిచో బ్రహ్మానందము తన్ను వరింపదు.

వేంకటగిరీశ్వరుడగు రమానాథుని సేవింపవలయును. లేనిచో చంద్రసూర్య నేత్రుడగు నా దేవుడు ప్రసన్నుడుకాడు. భగవద్భక్తిని సమగ్రముగ తనలో నాట వలెను. లేనిచో జీవుడు భువిలో పుణ్యాత్ముడు కాజాలడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| వట్టిలంపటము | 27 | 155 | 15 | 103 |

అవ: ఆత్మగుణములతో గూడిన హరిదాస్యరూపమగు తపమే ఫలించును గాని తదితరములు ఫలింప వనుచున్నాడు.

సీ. హరిదాసుఁ డగుటయే యది తపమ్మగుఁగాని
పరమార్గముల నెట్టి ఫలము లేదు;
తిట్టినయప్పుడు దీవించినప్పుడు
సమబుద్ధి నుంటయే సత్తపమ్ము;
వెట్టి నేమమ్ములు వేవేలు చేసిన
బట్టబయలెకాని ఫలము లేదు;
ఇచ్చినయప్పుడు నీయనియప్పుడు
నచ్చుగ నవ్వినయది తపమ్ము;
ఇచ్చలఁ బుణ్యమ్ము లెన్నెన్ని సలిపిన
బచ్చెన లింతయే ఫలము లేదు;

గీ. కూడినప్పుడు నటుగాక గొణఁగినప్పు
డాడికలు వీడినప్పుడె యది తపమ్ము;
ఈడ శ్రీవేంకటేశ్వరుఁడే శరణము
పాడిపంతమ్ములన్ సుంత ఫలము లేదు. **149**

శ్రీహరికి దాసు డగుటయే నిజమైన తపస్సు. ఆ దాస్యమార్గమును వదలి అన్యమార్గముల నాశ్రయించిన ప్రయోజనము లేదు.

ఒకడు తిట్టును; మఱొక్కడు దీవించును. ఈ రెండు సందర్భము లందును సమబుద్ధిగల్గియుండుటయే శ్రేష్ఠమైన తపస్సు. అంతేకాని వేలకొలది వ్యర్థమైన నియమములు పాటించినను ఫలము శూన్యము.

ఒక డిచ్చును; మఱొక్క డీయడు. ఈ రెండింట ఉబ్బుసబ్బులులేక సమదృష్టితో నుండి నవ్వుకొనుటయే తపస్సన జెల్లును. అంతేకాని ఏవేవో పుణ్యకార్యములు చేసినంతమాత్రమున అవి పైమెఱుగు లగునేకాని ఫలప్రదములు కావు.

ఒకడు కలసివచ్చును. మఱొక్కడు కలసిరాక గొణగికొను చుండును. ఎవ్వడెట్లున్నను తా నెవరిని నిందింప కుండుటయే తపమన బరగును.

శ్రీవేంకటేశ్వరుడే సర్వులకు శరణ్యమై యున్నాడు. ఆ దేవుని శరణొందక వట్టిపగ్గెలతో సాధించదగిన ప్రయోజనము సున్న.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| హరిదాసుఁ దగుటే | 25 | 145 | 15 | 96 |

అవ: భగవన్నామమే సర్వఫలప్రద మనుచున్నాడు.

సీ. ఏ నామము జపించి యిలఁ జిత్రకేతుండు
తతశక్తి లోకమంతయును గెలిచె
బ్రహ్మ యే నామమ్ము బడిబడి నుడువుచు
బహుదేవకోటిఁ బ్రాభవము గాంచె ;
ఏ నామము మహేశుఁ డెలమి తారకముగ
నిత్యమ్ము దడవి యెన్నిక వహించె ;
నారదుం డే శుభనామమ్మును దలంచి
సురముని యగుచు సంస్తుతుల మించె ;

గీ. ఏ పవిత్రనామము స్మరియించి ధ్రువుఁడు
ధ్రువపదంబున నెలకొనె ; భువి వృషాద్రి
నాథుదాసు లే నామమ్ము నమ్మి మనిరి
యదియ శ్రీహరినామమ్ము తుదిపదమ్ము. 150

పుడమిలో చిత్రకేతుడు శ్రీహరినామము జపించి విస్తృతబలసంపన్నుడై జగమంతయు జయించెను.

బ్రహ్మదేవు డా నామమునే పలుసారు లుచ్చరించుచు అనేకదేవతలలో ప్రముఖు డయ్యెను.

ఆ నామమునే తారకమంత్రముగా నిత్యము పఠించి మహేశుడు గణనీయుడయ్యెను.

నారదుడు మంగళప్రదమగు ఆ నామమునే భావించి సురముని యని వినుతి కెక్కెను.

ధ్రువుడు ఆ పవిత్రనామమునే స్మరించి ధ్రువపదమున స్థిరపడెను. శ్రీవేంకటేశ్వరునిదాసులు ఆ నామమునే నమ్మి ఖ్యాతిగాంచిరి. అట్టి శ్రీహరినామమే అందఱకు గమ్యమై యలరారుచున్నది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అదియెపో శ్రీహరినామము | 26 | 147 | 15 | 98 |

అవ: కొంచెపుజీవితమునకై జీవుడు కోటికర్మములు తలకెత్తుకొను నను చున్నాడు.

సీ. ఉడుగనిమాయ యీ యొక దేహమునకెగా
వెట్టిసంసారంబు గట్టికొనుట;
వసుధలో నీయొక్కబ్రదుకునకేగదా
సీమలో నేడcజూచిన గృహాలు;
మెసవెడు పట్టెడు మెదుకులకేగదా
వాణిజ్యకృషిధేను పాలనములు;
వర్షశతంబుండు వట్టియాసలకెగా
బ్రహ్మాండగోళంబు పట్టు తలcపు;

గీ. కొంచియపుదేవరకు మతి కొండయంత
పత్రివలె ముంచుకొనియె గర్వమ్ము దేహి;
నన్నిటికిc గీలు శ్రీవేంకటాద్రివిభుని
శరణ మొక్కటె; లంపట సమసిపోవు. **151**

మాయ అనంత మైనది. అది దాటరానిది. ఈ యొక్కశరీరమునకై అది విపులమైన సంసారము నంటగట్టినది. ఒక్క దండుగజీవితమునకై భువిలో ఏ ప్రాంతమున జూచినను లెక్కకు మిక్కుటముగా కొంపలు గట్టుకొనుచున్నాడు.

ఈ జేనెడుపొట్టకు పట్టెడుమెదుకులు చాలును. ఆ మెదుకులకై అనంత ముగా వ్యాపారము, వ్యవసాయము, గోరక్షణము ఇత్యాదులు సాగించుచున్నాడు.

మానవుని ఆయువు వర్షశతపరిమితమే. ఈ పాటిజీవితమునకై లేనిపోని ఆశలు పెంచుకొని బ్రహ్మాండ మంతయు ఆక్రమింప జూచుచున్నాడు.

దేహి అత్యల్పుడు. అతనిగర్వము మాత్రము అపరిమితము. ఇది కొంచెపు దేవుని కొండంత పత్రివలె ముంచివేసినది.

ఈ మాయామోహవ్యథల కన్నింటికి శ్రీనివాసు డొక్కడే తగిన చికిత్స. అతనిని శరణన్నచో ఆయన బాధ లన్నింటిని పటాపంచలు గావించి మన్నించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నాకొఱకే గడించెనో | 40 | 226 | 15 | 151 |

అవ: జీవితము భగవద్భక్తితో కడతేఱవలెగాని కర్మధర్మాదులతో కడతేఱ దనుచున్నాడు.

సీ. కర్మ మనుభవించి కడతేఱ నయితిని
ధర్మముల్ చేసి క్రోధమ్ము చనదు;
అన్ని మేనులు మోచి యలయిక లేదాయె
నెపుడు నిర్మలమౌట యితని బ్రతుకు ?
చొచ్చి లోకము లెల్ల సుంత సిగ్గొదవదు
సద్బుద్ధి గలుగదు చదివికూడ
తనివి లేదాయె నిద్రల రేలు గడపియు
నే ప్రొద్దు నాబ్రదు కెలమి గనుట ?

గీ. తొలఁగ దాయె దర్పము తపమ్ముల బడలిన
ఒప్పు గాదాయె నెందఱ నొగి కొలిచిన
ఫణిసగాధీశ ! నీకు సద్భక్తి మ్రొక్కి
నాదు మనుపటిబ్రదుకు ధన్యత్వ మందె. **152**

నేను వివిధకర్మము లాచరించితిని. వానిఫల మనుభవించితిని. కాని భవబంధములనుండి విడివడ నైతిని. ఎన్నో ధర్మములు చేసితిని. కాని కోపము నన్ను వీడి చన దాయెను. ఎన్నో శరీరములు ధరించితిని. కాని అలసట గలుగ దాయెను. నా జీవిత మీ రీతిగా కొనసాగుచున్నది. ఇదెప్పుడు బాగుపడునో తెలియదు.

లోకములనెల్ల ప్రవేశించితిని. ఒకింతయు లజ్జ కలుగ దాయెను. ఎన్నో గ్రంథములు చదివితిని. మంచిబుద్ధి పొడమ దాయెను. ఎన్నో రాత్రులు నిద్రలతో గడపితిని. కాని ఆ నిద్రలవలన సంతృప్తి జనింప దయ్యెను. ఇక నాబ్రతుకు పూర్ణానంద మనుభవించు టెప్పుడు ? తపము లొనర్చి అలయికలే కంటిని. కాని నాబ్రతుకు గర్వముమాత్రము విడువ దాయెను. ఎందఱనో సేవించితిని. కాని నాబ్రతుకు బాగుపడ దాయెను.

శేషాద్రీశ్వరా ! తుదకు నీకు భక్తితో నమస్కరించితిని. నీవు దయ జూచితివి. చిక్కులకు నెలవైన నాపూర్వజీవితము కృతార్థమైనది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| హరి నీవే దిక్కుగాని | 53 | 303 | 15 | 204 |

అవ: ప్రాయమంతయు భోగములతో వ్యర్థపుచ్చి చివరిగడియలో శ్రీహరి కరుణకు పాత్రమైతి ననుచున్నాడు.

సీ. **ఆయుస్సు నూతేడు: లవలఁ బుణ్య మొనర్తు**
**నంచని వలసిన ట్టనుభవించి**
**ఒకదేవతను గొల్వ కొక ధర్మముం జేయ**
**కింతలో వృద్ధునై యెదుటఁ బడితి;**
**కలదు కాలంబెంతొ కడ ముక్తి వడసెద**
**నం చిహం బెంచి జన్మించుచుండి**
**యాధార మొక్కటి నరయక, మునిదారి**
**చనక దుర్బలత నీ కనులఁ బడితి;**
**శేషగిరీంద్రముఁ జేరి నీ సేవల**
**నెలమి గావింతునం చిన్నినాళ్ల**

గీ. **వేడ్కల మెలంగి యొకయుక్తి వెదకఁబోక**
**నిర్భయత నాశ్రయించితి నేఁడు నిన్ను ;**
**నీదుచిత్తంబు నాభాగ్య మాదిదేవ !**
**హృదయగతుఁ డీ వెఱుంగని దేమి కలదు ?** **153**

"నాకు ఆయువు శతవర్షములుగదా ! పుణ్యకార్యములు తరువాత చేయవచ్చును. ఇప్పుడు భోగము లనుభవింతును" అని నా యిచ్చవచ్చినట్లు సౌఖ్యము లనుభవించితిని. ఒక్క దేవతనుగూడ సేవింపనైతిని. ఒక్కధర్మమును గూడ ఆచరింపనైతిని. ఇంతలో మూడుకాళ్ల ముదుసలి నైతిని. ఇప్పుడు నీయెదుట బడితిని.

"కాల మనంతముగదా ! ముందెంతో కాల మున్నది. ముక్తి కొఱకై తరువాత యత్నింప వచ్చును" అని తలంచుచు అనేకజన్మము లెత్తితిని. మోక్షమున కాధార మగు నుపాయ మొక్కటియు నరయ లేనైతిని. తొల్లింటిమునులు చన్న నివృత్తి మార్గమున కాలిడనైతిని. అన్నివిధముల దుర్బలుడనై తుదకు నీదయా దృష్టికి తగిలితిని.

"శేషగిరికి పిమ్మట పోవుదును. అచట నావల నీసేవ చేయుదును" అని యిన్ని దినములు బులుపులతో కాలము వెళ్ల బుచ్చితిని. నినుజేరు నుపాయ మన్వేషింపనైతిని. అంతిమదశలో భీతిలేక ని న్నాశ్రయించితిని. ఇక నీచిత్తము; నా అదృష్టము. దేవా! నీవు హృదయాంతర్వర్తివి. నీకు తెలియని దేమున్నది ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇదె నీచిత్తం బింక | 56 | 318 | 15 | 214 |

భావ: విశ్వసించి భజించినవారిని వేంకటేశ్వరుడు తప్పక కాపాడు ననుచున్నాడు.

సీ. మద్దైత్తువేళల నడ్డపడెడు వాఁడు
రక్షింపఁడా తన్ను రక్తి గొలువ ?
పాముమంత్రము పంపు పరఁగఁ జేయించువాఁ
డటు సేయఁడా తన్ను నాసఁ దలఁప ?
నాల్కఁ గోసియిడంగ నలి మొలపించువాఁ
డీడేర్చఁడా కొల్వ నేలి కనుచు ?
నటు దారుశిలలయం దావహించెడివాఁడు
తన్ను భావింపఁ జిత్తమున లేఁడ ?

గీ. ఏడ మ్రొక్కిన వరముల నిచ్చువాఁడు
గరుడగంబముకడ నొసగంగ లేఁడ ?
తీర్థయాత్రలకును మెచ్చు దేవుఁ డతఁడు
మెచ్చఁడా శేషగిరిదండ మెలఁగుచున్న ?
కాన నమ్మి భజింపుఁడీ ! కలితభక్తి
శ్రితసముద్ధరణోల్లాసు శ్రీనివాసు. 154

అపరాధపరీక్షకై కాలిన యినుపగుండును దోసిటనెత్తు నిరపరాధికి అడ్డపడి ఆపదలేకుండ చేయువాడు తన్ను ప్రీతితో భజించినవారిని కాపాడడా ? తప్పక కాపాడు నని భావము.

గారుడమంత్రప్రభావముతో విసముసోకినవాని అసువులు కాపాడెడు వాడు కాంక్షతో తన్ను స్మరించు భక్తుని ఆన చెల్లింపడా ? వీరభక్తితో నాలుకకోసి తన కర్పించినభక్తుని యొక్క నాలుకను మరల మొలపింపజేయుదేవుడు తన్నే ప్రభువుగా నమ్మి సేవించినవానిని కడతేర్చడా ?

కొయ్యలయందు, ఱాలయందు ఆవహించి నిలిచిన దేవుడు జీవుడు తనమనస్సులో తన్ను నిలుపుకొని ధ్యానించినచో కలుగకపోవునా ?

ఇక్క దక్క దనక ఎక్కడ తనకు ప్రణమిల్లినను వరముల ననుగ్రహించు స్వామి తనగుడియందలి గరుడగంబమునొద్ద మ్రొక్కినవారికి అభీష్ట వరములను ప్రసాదింపడా? తీర్థయాత్రలు సల్పినందులకు మెచ్చుకొనుదేవుడు శ్రీవేంకటాచలము చెంతనే కదలక నిలిచి తన్ను సేవించు భక్తుని మెచ్చడా ? కావున జనులారా! ఆశ్రితుల నుద్ధరించి విలసిల్లు శ్రీవేంకటేశ్వరుని భక్తి యుక్తులై సంసేవింపుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నమ్మి కొలువఁగదరో | 56 | 319 | 15 | 215 |

అవ: గుణదోషభూయిష్ఠమైన జగతిలో గుణములనే గ్రహింపవలె నను చున్నాడు.

సీ. అంగళ్ల నమ్ముదు రన్నిపదార్థముల్
కొని మంచివే తెచ్చికొన్న యట్లు
బహుళధర్మమ్ములు ప్రాణులకుం గల
వేది మంచిదొ దాని నెంచవలయు
దేశాలమీఁదికిఁ దెరువులు గల వెన్నొ
సరి పుణ్యతీర్థాల కరిగినట్లు
బ్రాహ్మణులందుండు బహుగుణమ్ముల మంచి
దెదియొ దానినె గణియింపవలయు

గీ. వేదములయందు మతములు పెక్కుదోఁచు
నందు వేంకటపతిమత మ్మరసినట్లు
నడతు రెటువలెనైన ని ప్పుడమి ఘనులు
మంచితన మందు నెంచి హర్షించవలయు. 155

విపణివీథులలో సకలపదార్థముల నమ్ముచుందురు. అందులో మంచివానినే విలుచుకొని తెచ్చుకొందుము. అట్లే లోకమున ప్రాణులకు వివిధ ధర్మము లున్నవి. అందు ఏది శ్రేష్ఠమో దానినే గణించవలెను.

వివిధదేశములకు వెళ్ళుమార్గము లెన్నో యున్నవి. అందు పుణ్యతీర్థములకు పోవుమార్గములనే పయనింతుముగదా ! అట్లే విప్రులలో అనేకగుణము లుండును. అందు సద్గుణములనే గ్రహింపవలయును.

వేదములలో అనేకమతములు గలవు. అందు శ్రీవేంకటేశ్వరుమతమునే శ్రీవైష్ణవమునే పరిగణించునట్లు ఈ లోకమున పెద్దలు ఎన్నో పోకడలుపోవు చుండగా అందు మంచి పోకడలు మాత్రమే చూచి సంతోషించవలయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇతరము లేమియును | 56 | 322 | 15 | 217 |

అవ: శ్రీవేంకటేశ్వరుని ధాటికి దుష్కృతములు పంచబంగాళ మగు నను చున్నాడు.

సీ. **కమలలోచనుప్రతాపము సాగునన్నాళ్లు**
**విమతవర్గంబు లే వీథి నుండు ?**
**సమతతో నితనినామములు మెఱయుచుండ**
**దురితమ్ము లెక్కడ శిరము లెత్తు ?**
**ఘను కైదువుల వాఁడిగలయంతకాలమ్ము**
**యమకింకరులకు విహార మెచట ?**
**దండిపొఁజు లగుచు దాసవర్గంబుండ**
**భవముల కిం కేది బ్రదుకు తెరువు ?**

గీ. **అహినగాధీశుమహిమ గలంతదాఁక**
**కర్మబంధాలపాట్లకుఁ గలదె మేర ?**
**యేలెడు మహానుభావుఁడే యెడఁద నుండఁ**
**దూఱఁ జోటేది తుచ్ఛపుదుర్గుణములు ?** **156**

పద్మనేత్రుడైన శ్రీనివాసునిప్రతాపము అప్రతిమము. అది నిరాతంక ముగా సాగినంతకాలము విరోధివర్గములకు నిలువనీడ లేకుండును. ఆ భగవంతుని నామములు ప్రకాశించుచుండగా పాపములు ఎందును తలలెత్త లేవు. ఆ మహానుభావుని చక్రాద్యాయుధములపదను భాసించినంతదనుక యమభటులు విహరింపజాలరు. భగవద్దాసవర్గము సేనానులై పరాక్రమించినంత కాలము భవములు బ్రదుక జాలవు. శేషాద్రీశ్వరుని ప్రభావము ప్రసరించినంత వఱకు కర్మబంధములు పటాపంచలు కాకమానవు. జగత్పరిపాలకుడైన ఆ దేవుడు హృదయములో నుండగా నీచములైన దుర్గుణములు ప్రవేశించుటకు అందు తా వెక్కడిది ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| చూతముగా యిఁక | 57 | 323 | 15 | 217 |

అవ: తన్ను తరుముకొనివచ్చు కామక్రోధాదులబారినుండి తప్పించుకొనుటకు శ్రీవేంకటేశ్వరుఁ డొకడే శరణ్య మనుచున్నాడు.

సీ. **ఈ కామ మీ క్రోధ మేనాటిప్రతిబంధ**
**మో నేను బుట్టంగఁ బుట్టె వెంట;**
**మున్నిటికొల యేదొ మొగి మదమత్స రా**
**లెందు నేఁ జొచ్చిన నందుఁ జొచ్చు ;**
**ఎక్కడి ఋణమొ? నాకీ దేహభోగమ్ము**
**లించుక బడివాయ వెచట నున్న ;**
**ఏ నాటికర్మమో యీ పుణ్యపాపముల్**
**చిక్కులై కలలందుఁ జిమ్మి రేఁగు**

గీ. **ఈ తమోరాజసములు నా కెవరితోడి**
**పగయొ సాధించు చలములు ప్రత్యహమ్ము ;**
**ఏమిచెప్పుదు నింక నా కెవరుదిక్కు?**
**అవ్వలివ్వలకును కొండలప్ప గాక !** **157**

నేను పూర్వ మెట్టిదుష్కృతము లొనర్చితినో? వాటిఫలమైన ప్రతిబంధము కామక్రోధరూపమున నన్ను వెన్నాడుచున్నది. నేను జన్మించగనే అదియు న న్నంటుకొని జన్మించుచునే యున్నది. పూర్వము నేను సల్పిన యపరాధ మెట్టిదో? దానిప్రభావమున నే నెందు ప్రవేశించినను అందు మదమత్సరములుగూడ ప్రవేశించుచునే యున్నవి. నేను ఎక్కడ చేసిన ఋణమో? న న్నది వదలుట లేదు. దేహధారినైన నన్నది భోగానుభవరూపమున విడనాడక అనుసరించుచునే యున్నది. దేహభోగములు ఋణగ్రస్తునికి వాస్తవముగ పీడాకరములే యనుట. నేను ఏనాడు ఎట్టికర్మ చేసితినో ? అది నేడు పుణ్యపాపములరూపమున నన్ను చిక్కులపాలు చేయుచు కలలోగూడ విడువక చెలరేగుచున్నది. నేను పూర్వ మెవరితో వైరము పూనితినో ? ఆ పగ సాధించుటకై తామసరాజసగుణములు నిత్యము నాపై తమ పెత్తనము నెఱపుచున్నవి. ఈ దశలో నే నేమి చెప్పగలను? ఇహమం దైనను పరమం దైనను ఆ శ్రీవేంకటేశ్వరుడు తప్ప నా కింక రక్షకు లెవరు ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎవ్వరు నాకు దిక్కు | 50 | 284 | 15 | 191 |

అవ: శ్రీవేంకటేశ్వరుని విడిచి చేయు ధ్యానాధ్యయనాదులు వ్యర్థము లనుచున్నాడు.

సీ. దైవమ్ము దలఁపక తత్త్వమ్ము నెఱుఁగక
భావించు ధ్యానమ్ము బయలుసుండి !
త్రోవ గ్రహింపక దొడ్డమతమువాఁడు
గాక నిర్వాణమ్ము గలుగదు సుఁడి !
అతిభక్తి నిలుపక హరి గొనియాడక
వెదకెడి చదువులు వృథయె సుండి !
ఇన్నిటిపై రోయ కితరమ్ము లుడుగక
జితకాముఁ డని చెప్పఁజెల్లదుసుఁడి !

ఆ. పాపములు విడువక పరిశుద్ధుఁడును గాక
తనకు దక్కదు సుఁడి జనన ఫలము
ఎల్లప్రొద్దు వేంకటేశుదాసుఁడుగాక
థిరముగాదుసుండి దివ్యసుఖము. **158**

జనులారా ! అన్నింటికి మూలమైన దైవము, తత్త్వము శ్రీవేంకటేశ్వరుడే. ఆ దేవుని భావింపక గ్రహింపక చేయు ధ్యానము రిత్తయేసుమా ! భగవత్ప్రాప్తి కనువైన మార్గము గ్రహింపక ఆ భగవానుని తత్త్వమును వివరించు శ్రేష్ఠమగు రామానుజమతమును స్వీకరింపక మోక్షము చేజిక్కదుసుమా !

దృఢమైనభక్తి దేవునియందు నిలుపక, ఆ దేవుని స్తుతింప అన్వేషించెడి చదువు లన్నియు వ్యర్థములే సుమా !

లౌకికభోగములపై రోతగొనక భగవదితరములైన యన్నింటిని త్యజింపక నేను "జితకాముడను" అని చెప్పుకొనుట తగదుసుమా !

పాపకృత్యములు వీడక పావనచరిత్రుడుగాక ఎవనికిని జన్మఫలము సమకూడదుసుమా !

సతతము శ్రీవేంకటేశ్వరుని దాస్యము వహింపకపోయినచో దివ్యమైన సుఖము స్థిరముగా నిలువదుసుమా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అన్నిటికి మూలము | 52 | 295 | 15 | 199 |

అవ: బ్రహ్మేంద్రాదిదేవతలుకూడ మిథ్యావాదమువంకబోక హరినే పరదైవత ముగా భావించి రనుచున్నాడు.

సీ. ఎక్కుడా ? తాము నింతేసివారలకంటె
మురహరిదాస్యమ్మె మూలధనము
అరయ లేఁడె బ్రహ్మజ్ఞాన మింద్రుండు ?
సకలవేదాంతముల్ చదుప లేఁడె ?
హరిని ప్రార్థనచేసి యాపద గడచె స్వ
తంత్రుఁడై యింత మిథ్య యనినాఁడె ?
అజుఁ డెఱుఁగండె బ్రహ్మజ్ఞాన ? మఖిలశా
స్త్రార్థనిర్ణయము సేయంగ లేఁడె ?
విష్ణుదేవుని గొల్చి వేదముల్ వడయఁడా ?
అతఁడు తా బ్రహ్మమం చాడినాఁడె ?

గీ. ఈశ్వరునకు బ్రహ్మజ్ఞాన మెనఁగ దేమి ?
తవిలి పరతత్త్వ మాతండు తలఁపఁ డేమి ?
పరమభక్తి శ్రీవేంకటేశ్వరు జపించి
కాశి తాఁ జెప్పు మంత్రమ్ము కల్ల యనెనె ? 159

ఇంద్రుడు, బ్రహ్మ, శివుడు మున్నగువారికంటె అహంబ్రహ్మోస్మివాదులు ఎక్కువవారా? పైజెప్పినవా రెల్ల హరికి దాస్యము సలుపలేదా ? కావున శ్రీహరి దాస్యమే అన్నింటికి మూలమైన ధన మగుచున్నది.

దేవతలకు ప్రభువగు నింద్రుడు బ్రహ్మజ్ఞాన మెఱుగడా? అతడు సమస్త వేదాంతములు చదివినవాడేగదా! అట్టివాడు హరిని ప్రార్థించి అపదలు బాపుకొన లేదా? అంతయు మిథ్యయని స్వతంత్రుడై విఱ్ఱవీగినాడా ?

బ్రహ్మ బ్రహ్మజ్ఞానము తెలియనివాడా? సమస్త శాస్త్రములయొక్క అర్థమును అతడు నిశ్చయింపలేనివాడా ? అట్టివాడు వెన్నుని సేవించి వేదములు పొందినాడే కాని తానే పరబ్రహ్మమని పలికినవాడు కాడుగదా!

శివునకు బ్రహ్మజ్ఞానము లేదా? అతడు పరతత్త్వమును భావించినవాడు కాడా ? అట్టివాడుకూడ మిక్కిలిభక్తితో శ్రీవేంకటేశ్వరుని జపించి కాశిలో తారక మంత్రము భక్తులకు ఉపదేశించుచున్నాడే గాని అది కల్లయని నుడువలేదుగదా?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇంతేసివారలకంటె | 52 | 297 | 15 | 200 |

అవ: శ్రీవేంకటేశ్వరుని శరణుఁ గోరనంతవరకు మాయావిజృంభణము నరికట్ట జాలమనుచున్నాడు.

సీ. ... లసిన వెల్లఁ గన్నులముం దున్న
వెన్నింటి నీ జీవుఁ డెయిడుకొనును ?
వెన్నంటి తిరిగిన విశ్వమంతయు మర్త్య
లెన్నఁ జుట్టము లెవ్వరిందుఁ దనకు ?
వింతవింతరుచుల వెలయు పదార్థమ్ము
లెంత భుజించు తా నీ శరీరి ?
మంతనం బున్నచో మనసెల్ల కోర్కులే
యంత పెనంగ నేమాయె నిజము ?

గీ. అంగజవికారములె భువి నాముకొనియె
నెంత భోగించు నీ ప్రాణి ? యెందు మాయ
పాలుపొంగినయటు పొంగు; ఫలము గలదె
పామరతవంక ? గతి రమాపతియె గాక ! **160**

లోకములో జీవులకనులముందే వారు కావలెననుకొన్నపదార్థము లెల్ల కుప్పలుతిప్పలై పడియున్నవి. ఈ యల్పజీవుడు అందులో నెన్నింటిని గైకొన గలడు? ఎన్నింటి ననుభవింపగలడు ?

జగమంతట మానవులే నిండియున్నారు. వారిలో ఈ జీవునకు అయినవా రెవరు ? కానివా రెవరు ?

పలుతెఱగులైన రుచులతో విలసిల్లెడు వస్తుజాలములు విశ్వమంతట నిండి యున్నవి. ఈ దేహధారి అందులో ఎన్ని భుజింపగలడు ?

ఏకాంతముననుండి భావించుచున్నచో చిత్తమంతయు కోరికలపుట్టయే. అందెన్ని తీర్చుకొనుటకై ఈ జీవుడు యత్నింపగలడు? వానిలో ఎన్నికోరికలు నిజముగా నతని యనుభవమునకు రాగలవు?

భువన మంతట కామవికారములే అలము కొన్నవి. ఈ ప్రాణి ఎంతని అనుభవించ గలడు? మాయ పాలుపొంగినట్లు అడ్డమాకలులేక విజృంభించుచున్నది. దాని ననుసరించి పయనించు ఈ పామరత్వమువలన ఫల మేమున్నది ?

కావున మాయను తన యధీనములో నుంచుకొన్న శ్రీపతియే మనకు గతియై యున్నాడు. ఆతనియనుగ్రహముచేతనే ఈ మాయను మనము దాట గలము అని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పట్టరాని యాసోదము | 59 | 336 | 15 | 226 |

అవ: తత్త్వజిజ్ఞాసువైనవాడు ఆత్మపరిశీలనతోడనే పరమార్థము గ్రహింప దగు ననుచున్నాడు.

సీ. కలలోనఁ గన్నవి కల్లనిజమ్ములో
తెలిసిన నది యుపదేశమె కద !
మూల్గినఁ బోనీక మోయించు సంసృతిఁ
దిలకించుటే యుపదేశము కద !
రాత్రియు పవలు నిద్రాప్రబోధము లిచ్చు
దివసమ్ములే యుపదేశముకద !
కనుమూసి తెఱచిన కలిమిలేముల మాయఁ
దిరుగు జగ మ్ముపదేశము కద !

గీ. అడిగినవరమ్ము లిడు వేంకటాద్రిమీఁది
దేవుఁ గనుగొంటయే యుపదేశము కద !
ఏల చదువంగ ? నెవ్వరి నేల యడుగ ?
తాను తనలో విచారింపఁ దగును దేహి. **161**

స్వప్నములో ఎన్నింటినో చూచుచున్నాము. అవి స్వప్నకాలములో నిజముగనే తోచుచున్నవి. నిదుర మేల్కనినంతనే అదృశ్య మగుచున్నవి. ఈ స్వప్న గతిని చక్కగా పరిశీలించినచో ప్రపంచస్థితిని గ్రహించుట కిదే చక్కని యుపదేశ మగుచున్నది. సంసారములో ఎన్నోబాధ లెదురగుచున్నవి. వానితాకిడికి నిత్యము మూల్గుచునే యున్నాము. కాని సంసారమును పరిత్యజించుటలేదు. ఇంకను లేనిపోనివి నెత్తిపై వేసికొని మోయుచునే యున్నాము. ఈ సంసారగతిని గమనించితిమేని ఇదే మన కుపదేశ మగుచున్నది.

నిత్యము రాత్రివేళల నిదురించుచున్నాము. పగటిపూట మేల్కను చున్నాము. ఈ రేపవళ్ళు ఒకదాని నొకటి వెన్నంటి వచ్చుచునే యున్నవి. ఈ నిద్రాప్రబోధముల కంతులే కున్నది. తఱచిచూచినచో లోకగతి నరయుటకు ఇదే యొకఉపదేశముగదా!

కనుమూసినపుడు విశ్వము కనిపించుటలేదు. కనుదెఱచినంతనే సాక్షాత్క రించుచున్నది. ఇట్లు మాయాప్రభావముతో కలిమిలేములకు నిలయమైన జగత్తే ఒక మహోపదేశమై యున్నది. కోరినవరము లిచ్చుటకు సిద్ధమై వేంకటాద్రిమీద దేవుడు వెలసియున్నాడు. అతనిదర్శనమే ఒక సదుపదేశము గదా !

కావున మాయామయమైన జగత్తుయొక్క వాస్తవస్థితిని గ్రహించుటకు స్వప్నము, సంసారము, రేపవళ్లతో గూడినదినములు-వీటి పరిశీలనమే చాలును. ఇంతకన్న వేఱుగా గ్రంథములు చదివి తెలిసికొన నక్కఱలేదు. ఎవరిని కూడ ప్రశ్నించి గ్రహింపవలసిన దేదియు లేదు. దేహధారియైన జీవుడు తనలో తానే ఆత్మపరిశీలన చేసి తత్త్వమును గ్రహింపవచ్చునని తాత్పర్యము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమీఁ జదువ నేల | 59 | 335 | 15 | 225 |

ఉప: శ్రీవేంకటేశ్వరునిసేవచేతనే కర్మక్లేశాదులను గడవవలె ననుచున్నాడు.

సీ. పుట్టినప్పుడె కర్మములు పొదువక పోవు
విధి గడవఁగరాదు వేధకైన ;
హృదయస్థుఁ డగు హరికే శర ణన్నచో
వాఁడె దిక్కగుచుఁ గాపాడఁ గలఁడు ;
సంసరణప్రవేశముతోడఁ దొడు సంటె
సిరులు దింపని తలబరువు లాయె ;
పెట్టని తరువయ్యె కట్టిఁడి పేరాస
గోవింద యన వాఁడె కావఁ గలఁడు ;

గీ. కావలె నటంచుఁ గోరినఁ గప్పు మాయ ;
కేవలం బుపమల దాని గెలువరాదు ;
అవల నేమియుఁ దడవక యంజనాద్రి
పతి భజించిన సుఖముగ బ్రదుక వచ్చు. **162**

జీవుడు పుట్టినవెంటనే అతనిని పూర్వకర్మములు ఆవరించుచున్నవి. బ్రహ్మ దేవుడు కూడ కర్మఫల మతిక్రమింప లేదు. కావున తనహృదయమునందే నెలకొని యున్న శ్రీహరినే శరణొందవలయును. శరణాగతులను ఆ దేవుడు తప్పక రక్షింప గలదు.

సంసారమున అడుగిడినవెంటనే ఐహికప్రపంచముతోడిసంబంధము అంటు కొనుచున్నది. పూర్వకర్మఫలముగ వచ్చినసంపదలు దింపరాని శిరోభారములై బాధించుచున్నవి.

క్రూరమైన దురాశ సహజనిర్బంధమై పీడించుచున్నది. ఈ స్థితిలో గోవిందనామస్మరణమే శరణ్యము. ఆ గోవిందుడే రక్షకుడు.

జీవుడు పదార్థవ్యామోహముతో కోరికలను పెంచుకొన్నప్పుడే మాయ ఆవరించును. దానిని వట్టిఉపాయములతో జయింపజాలము. కాన లేనిపోని అన్వేషణ లెందుకు ? అంజనగిరినాథుని సేవించినచో అతనిదయవలన సుఖముగా జీవింప వచ్చును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఎక్కడి జాలి | 45 | 256 | 15 | 173 |

అవ: భగవద్దాసు లెట్టి విధులలో నున్నను వారికి కొఱత లే దనుచున్నాడు.

సీ. **భయభక్తు లెంతగా పాదుకొన్నను మది**
**కాక ముద్రాధారి గణన లేదు;**
**తా నెంతటిపతివ్రతాతిలకంబైన**
**పుస్తె గట్టనిచో ప్రశస్తి గనదు;**
**ఇరవుగ దైవతం బెదుటనుండినఁ గాని**
**గురునసుమతిలేక వఱలఁ బోఁడు**
**పుట్టుకతో నెంత భూమీసురుండైన**
**నుపవీతిగాక యోగ్యుండు గాఁడు;**

గీ. **ఎంత వైష్ణవుఁ డనుకొన్న నెల్లవేళ**
**దేవతాంతర ముడుగక దీప్తి గనఁడు;**
**వేంకటాచలపతిదాసవిసరమునకు**
**విధులు వేవే లయినఁగాని వెలితి లేదు.** **163**

ఎంత పాపభయ మున్నను, ఎంత దేవతాభక్తి కలిగినను చక్రాంకితుడు కానివానికి విలువ లేదు.

తా నెంతటిపతివ్రతయైనను తన్ను విధిప్రయుక్తముగా పురుషుడు వివాహ మాడకున్నచో ఆమెకు లోకమున గుర్తింపు లేదు.

ఇష్టదేవత తన యెదురుగా నున్నను, ఆచార్యునియనుమతిలేనిచో అతడు పూర్ణముగా దైవానుగ్రహమునకు పాత్రుడు కాజాలడు.

పుట్టుకతో తా నెంత బ్రాహ్మణుడైనను జందెము తాల్పనిచో యోగ్యత కలుగదు.

ఒకడు తానెంత వైష్ణవు డనుకొన్నను సర్వకాలసర్వావస్థలయందు ఇతర దేవతలను పరిత్యజింపనిచో రాణింపడు.

శ్రీవేంకటేశ్వరదాసులైనవారు వివిధవిధులతో ప్రవర్తించినను వారికి ఎందును లోటు వాటిల్లదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ధన మెంత గలిగినా | 37 | 209 | 15 | 140 |

అవ: సంగముచే కలుగు భంగమును తప్పించుకొనుటకు శ్రీవేంకటేశ్వరుని కొలువే మార్గ మనుచున్నాడు.

**సీ. కొసరుచు నేదేని కోరుమనస్సు; రా**
**కుండినచోఁ గోప ముదయ మగును;**
**తలకొను క్రోధమ్మువలన నజ్ఞానమ్ము;**
**నజ్ఞానమున సర్వ మపుడె మఱచు,**
**కనుఁగొను నెదియైన కన్నులజంటతో**
**సుడిఁబెట్టు నాసలు చూచినంత**
**ఆసలవలన నేమైన వేఁడఁగఁ జూచు**
**యాచకత్వము దైన్య మందఁ జేయు;**

**గీ. చేయుఁ జెలరేగి కర్మముల్; చేసినంత**
**కర్మములు జన్మ మెత్తించు; కలిగినట్టి**
**జన్మము భజింపఁగాఁ జేయు సప్తశైల**
**వల్లభుని; జీవు నతఁడె కాపాడ దిక్కు. 164**

మనస్సు సాంగత్యదోషముచే వస్తువుల నభిలషించును. కోరినవస్తువు లభింప కున్నచో క్రోధ ముద్భవించును. క్రోధమువలన సమ్మోహము, సమ్మోహమువలన స్మృతిభ్రంశ మొదవును.

జీవుడు రెండుకన్నులతో పదార్థములను జూచును, చూచినవెంటనే, ఆ పదార్థములపై నతనికి ఆశలు చెలరేగును. ఆశాపీడితుడైనవాడు అర్థముల నర్థించును. ఈ యాచకత్వము దీనత్వము నాపాదించును.

జీవుడు విజృంభించి కర్మము లొనర్చును. కర్మలఫలముగా అతనికి జన్మము సంప్రాప్తించును. అట్లేర్పడిన జన్మము తుదకు ఏడుకొండలయెకిమీనిని సేవింప జేయును. అపు డా దేవుడే ఆ జీవుని జననమరణచక్రమునుండి కాపాడును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఒకటి కొకటి లంకెయి | 48 | 272 | 15 | 183 |

అవ: భగవంతుని శరణొందక కావించు కర్మము లెల్ల నిష్ఫలము లనుచున్నాడు.

సీ. **తెలియఁ డేమియుఁ దన తొలిజన్మగాథలు**
**సలుపుఁబుణ్యము మఱుజన్మమునకు;**
**ఇందేమి గనియెనో నెవరి నమ్మెనొ దేహి**
**సందడిభోగాల సాము చేయు;**
**గరిమభూగోళమ్ము కడపలఁ గానందు**
**పరము గావలె నని పాటు లొందు;**
**ఇరవేదొ తనకుఁ దా నెఱిఁగిన యెఱు కేదొ**
**వట్టియాసలతోడఁ బట్టి పెనఁగు**

గీ. **తనకు నిద్రాస్థితిని స్వతంత్రత హుళక్కి**
**మేకొనును కర్మముల కెల్ల మేలుకాంచి**
**శరణుసొర కంతరాత్ముఁడౌ సప్తశైల**
**విభుని, చదువుల లోపల వెదకఁ జూచు.** **165**

జీవుడు తన పూర్వజన్మవృత్తాంతము నెఱుంగడు. కాని రాబోవుజన్మ మునకై ఈ జన్మములో పుణ్యకార్యము లొనర్చును. ఈ జన్మలో అతడేమి చూచినాడో, ఎవరిని విశ్వసించినాడో అగమ్యముగా నున్నది. మధ్యలో భోగముల కొఱకు అతడు పలుపాట్లు పడుచున్నాడు.

ఈ భూగోళపుపరిధి యెంతయో అత డెఱుంగడు. కాని పరలోకము కాంక్షించి అందుకై శ్రమించుచున్నాడు. తన నిజస్థానమేదో, తాను గ్రహించిన విజ్ఞాన మెట్టిదో తా నెఱుఁగడు. వ్యర్థములైన కాంక్షలకు లోబడి వాటితో సదమద మగుచున్నాడు.

తాను నిద్రించునపుడు తన కెట్టి స్వాతంత్ర్యము లేదు. కాని జాగరూకు డైనంతనే అన్నిపనులకు తానే కర్తనని ఉద్యమించుచున్నాడు. కావున ఈ జీవుని పోకడ లన్నియు నిరుపయోగములే. అంతర్యామియైన శ్రీనివాసుని శరణొందక అతడు చదువులలో తత్త్వము నన్వేషింప వ్యర్థప్రయత్న మొనర్చుచున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కాదు వివేకము | 47 | 264 | 15 | 178 |

అవ: భగవన్నామస్మరణపరుల కెట్టిచింతలు లే వనుచున్నాడు.

సీ. దాహార్దితునకు శీతలనీరముం బోలె
సుదతికి మంగళసూత్ర మట్లు
కటిక పేదకును ముంగిటి దబ్బు కైవడి
నీనామ మొప్పఁ జింతింప నేల ?
విషదగ్ధునకును నిర్విషమహౌషధిరీతి
నినతప్తునకు వటవృక్షమువలె
స్థిరఁ బుట్టుగ్రుడ్డికి సిద్ధాంజనము భాతి
నీనామ మెసఁగుఁ జింతింప నేల ?

గీ. పట్టభద్రునోరికిఁ గప్రపల్కుమాడ్కి
గౌనబుగాఁ దండ్రికిని ముద్దుకొడుకుచాయ
నాలుకకు తీయనైన నీ నామముండె
చింత లేమిటి కిఁక మాకు శ్రీనివాస ! **166**

స్వామీ ! పిపాసాపీడితునకు చల్లనిజలమువలెను, సతికి మంగళ సూత్రము వలెను, నిఱుపేదకు ముంగిటిధనమువలెను నీ నామము విల్లసిల్లు చున్నది. ఇక చింతించు టెందులకు ?

విసముసోకినవానికి నిర్విషలతవలెను, ఎండలో మాడినవానికి మఱ్ఱిమ్రాకు నీడవలెను. పుడమిలో జనుషాంధునకు సిద్ధాంజనము రీతిగాను నీ నామము భాసిలుచున్నది. మఱి చింత యెందులకు ?

పట్టభద్రునినోటికి కర్పూరతాంబూలము వలెను, జనకునకు ప్రియపుత్రుని వలెను శ్రీవేంకటేశ్వరా ! జిహ్వకు మధురమైన నీ నామ మున్నది. ఇక మాకు వేఱుచింత లెందులకు ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తతిగొని యేమఱక | 50 | 281 | 15 | 189 |

అవ: సుఖభ్రాంతితో దుఃఖముల ననుభవించుచు జీవులు అన్నింటికి మూలమైన హరిని గ్రహింపజాల కున్నా రనుచున్నాడు.

సీ. **చెఱcబాపి మోపును శిరమున కెత్తిన**
**పరుగెత్తి సంతోషపడిన యట్లు**
పరమదరిద్రుని ప్రభువు గావించిన
**మురిసిపోవునుగాని ముం దెఱుcగcడు;**
గుండుమోపరిచేత గొప్పయేతాము నె
**త్తించ పాడుచు నుల్లసించినట్లు**
పండనితపసి సల్పంగ సంసారిని
**తలcప కందలిపాట్లు కులుక నెంచు;**

గీ. **పరcగ దుక్కిటెద్దును దెచ్చి బంతిగట్ట**
**గవుక మేయుచు మల్లాడుకరణి పుడమి**
**కష్టుc బుణ్యునిగావింపc గదు నహంక**
**రించునే గాని నెవరిc జీరికిc గొనండు.** **167**

కారాగారబద్ధుని ఆ చెఱనుండి విడిపించి మోయరానిమోపును నెత్తి కెత్తినచో అతడు చెఱతొలగినదన్న సంతోషముతో పరుగెత్తునేకాని మోపువల్ల కలుగ నున్న ముప్పును గ్రహింపకున్నాడు.

నిఱుపేదనొకనిని రాజ్యమునకు పాలకుని గావించినచో రాజైతినని అతడు సంతసించునేగాని ఆ రాచటికమువల్ల ముందురానున్న ఇక్కట్ల నెఱుగజాలడు.

పెద్దపెద్దగుండ్లు మోయువానిచే ఆపని మాన్పించి పెద్దయేత మెత్తుటకు నియమించినచో అత దేలపదములు పాడుచు ఏతముద్రొక్కును. అవతల కాళ్లు పీకగా అందలికష్టమును గ్రహించును.

పరిపక్వతలేని తాపసిని గృహస్థుని గావించినచో అతడు తనరీవి నొలక బోయును. కాని భావిజీవితములో కలుగనున్నబాధ లెఱుగడు. దుక్కిదున్ను వృషభమును దెచ్చి బంతిగట్టి కసవుత్రొక్కించునప్పుడు అది నడుమ నడుమ గుప్పెడు కసవు నోటగ్రుక్కికొనుచు పరిభ్రమించును. పిదపగాని దానికి శ్రమ తెలియదు. అట్లే దుష్కర్ముని దెచ్చి పుణ్యఫలమైన పదవిలో ప్రతిష్ఠించినచో అతడు గర్వించునే గాని ఎంతటివారినికూడ లెక్కింపడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఈ పాటు సుఖమా | 50 | 283 | 15 | 191 |

అవ: హరిశరణాగతునిపాపము పంచబంగాళ మగు ననుచున్నాడు.

**సీ. అన్ని వేడుకలున్న యఖిలప్రపంచ మె**
**క్కడ నుండునోగద! కనులు మూయ;**
**చెన్నుమీఱెడు గృహక్షేత్రాదు లవియెల్ల**
**నెందుండునో? నిద్రఁ జెందువేళ;**
**పొసఁగ భోగించిన భోగోపకరణమ్ము**
**లేమి చేయునొ? కొన కెక్కినపుడు**
**వసమైన సుతహితవర్గంబు లెల్లఁ దా**
**మెట్టులుందురొ? మఱుపుట్టువులను;**

**గీ. తా నొనర్చిన పాపమ్ము శ్రీనివాసు**
**శరణుఁజొచ్చిన యప్పు డే చంద మగునొ ?**
**గురుకటాక్షంబుగల వేళ కొంచి యెందు**
**దాఁగునో తన యజ్ఞానతతి యదెల్ల? 168**

జగత్తులో నెన్నో వేడుక లున్నవి. ఇన్నివేడుకలతో నిండిన ఈ సమస్త ప్రపంచము కనులుమూసినసమయమున ఎందున్నదో తెలియదు. ఇల్లు వాకిలి పొలము పుత్ర మున్నగున వెల్ల తాను నిద్రించువేళ ఎచటనుండునో ఎఱుక కందదు. తాను జీవితకాలములో అనుభవించిన భోగసాధనములెల్ల తన అవసాన దశలో ఎందు కుపయోగపడునో? పుత్రులు మిత్రులు మొదలగువా రెల్ల మఱు జన్మములలో ఏ రూపములో నుందురో గ్రహింపజాలము.

తాను చేసిన దుష్కృతము శ్రీవేంకటేశ్వరుని శరణుపొందినప్పుడు ఏమగునో యేమో ? ఆచార్యునియనుగ్రహము కల్గినప్పుడు తన అజ్ఞానము ఎక్కడ దాగుకొనునో ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తరితీపులఁ బెట్టీని | 46 | 261 | 15 | 176 |

అవ: భక్తి విరక్తులు పరిపూర్ణముగా లేక పై పైని పరమాత్మని భజించుట పద్ధతి కా దనుచున్నాడు.

సీ. **తలఁపులు సరిలేక దైవమ్ము దలఁచుట**
**వెలిదుక్కి దునకుండ విత్తు టగును**
**దాసుఁడు గాక మాధవునిఁ బూజించుట**
**బలిమి బంటాపుట ప్రభువరేణ్యుఁ ;**
**దా విరక్తుఁడు గాక తత్త్వంబు వెదకుట**
**యిసుక పాఁతఱద్రవ్వ టెల్ల భంగి ;**
**పరభక్తి లేక శ్రీహరి గోరి మ్రొక్కుట**
**మొనసి దేవునిసొమ్ము ముచ్చిలింత ;**

ఆ. **గురుఁడు లేక చక్రధరుని సాధించుట**
**అందనట్టిపంటి కఱ్ఱుచాఁపు ;**
**వనజనేత్రుఁ దనదుపనికిగాఁ బొగడుట**
**యింత చెలమ కేత మెత్తు టగును.** 169

భావశుద్ధిలేక దైవమును భావించుట దుక్కిదున్నకయే విత్తుటవంటిది. దాసత్వము నొందకయే హరి నర్చించుట భృత్యుడు రాజును బలిమితో పట్టి నిలుపుట వంటిది. విరక్తి కలుగకయే తత్త్వము నన్వేషించుట ఇసుకనేలలో పాతఱ త్రవ్వుట వంటిది. శ్రేష్ఠమైన భక్తిలేకయే శ్రీహరికి నమస్కరించుట దేవునిసొత్తు దొంగిలించుట వంటిది. ఆచార్యుడులేకయే హరిని సాధింప బూనుట అందనిమ్రాని ఫలమునకై అఱ్ఱుచాచుట వంటిది. తన స్వార్థమునకై పద్మలోచనుని వినుతించుట ఇసుమంతచెలమకు ఏతా మెత్తుట వంటిది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇదిగాదు తెరువు | 19 | 106 | 15 | 71 |

అవ: శ్రీనివాసునిజైత్రయాత్రను వర్ణించుచున్నాడు.

సీ. దిక్కులు సాధింపఁ దేరెక్కగా హరి
యిక్కడ రతికెక్కి రింద్రముఖ్యు
లతఁడు శార్ఙ్గముపట్ట హస్తమ్మునన్ గుండె
పక్కునఁ బట్టిరి పద్మజాదు;
లెడమచేతను శంఖ మితఁ డెత్త గౌతమా
దులు మొద లెత్తిరి తొలిమినుకులు ;
కుడిచేతచక్రమ్ము దొడికి యీతఁడు మెఱ
యింపఁగా మెఱసి రినేందుముఖులు

గీ. లీల వేంకటపతి యలమేలుమంగ
యలరఁగా బెండ్లి నమరాదు లమరినారు;
పరమపురుషుండు విశ్వరూపమ్ము సూప
సొరిది సనకాదు లట పొడసూపినారు. 170

దిగ్విజయము గావించుటకై శ్రీహరి రథ మెక్కినాడు. అంతట ఇంద్రాది దేవతలు రిపుబాధతొలగి రాణ కెక్కిరి. ఆ దేవుడు శార్ఙ్గ మనెడి ధనుస్సును చేతపట్టినాడు. బ్రహ్మాదులు నిబ్బరముగ గుండెపై చేయినిడుకొని సుఖించిరి. శ్రీమన్నారాయణుడు ఎడమచేత జ్ఞానదాయకమగు శంఖమునెత్తి పూరించినాడు. ఆ వెంటనే గౌతముడు మున్నగు ఋషులు వేదపఠనమున కుపక్రమించిరి. ఆ స్వామి తన కుడిచేత దాల్చిన చక్రమును తళుక్కుమని మెఱయించినాడు. అంతట సూర్యచంద్రాదులు ఉజ్జ్వలముగ ప్రకాశించిరి. ఈ విధముగా దిగ్విజయయాత్ర పూర్తిగావించుకొని ఇంద్రాదిదేవతలను శ్రీవేంకటేశ్వరుడు ఆనందింపజేసినాడు. ఆయన అలమేలు మంగను చేపట్టగా దేవతలు మున్నగువా రెల్లరు అమందానంద మందినారు. పురుషోత్తముడు విశ్వరూపప్రదర్శనము గావింపగా సనక సనందన సనత్కుమార సనత్సుజాతులను బ్రహ్మమానసపుత్రులు కనిపించినారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| చేతు లెత్తి మొక్కరో | 28 | 163 | 15 | 108 |

అవ: మానవుడు ప్రౌఢప్రాయమందే మోహవిముక్తుడై పరమాత్ముని సాధింప వలె ననుచున్నాడు.

సీ. సలుప పాపము హీనజంతువై జన్మించు ;
తతపుణ్యమున దేవతాత్వ మొందు ;
సరియైన నివిరెండు నరజన్మముం గాంచు ;
వరముక్తి సాధింపవలయు నిందె ;
లలి బాల్యమందు మిక్కిలి బుద్ధియుండదు,
మతి వార్ధకమ్మున మంద మగును;
ప్రౌఢవయస్సున పరిమళించు వివేక
మిందె జ్ఞానము గడియింప వలయు ;

గీ. మదవతులమీఁది భ్రాంతిచే మత్తుఁ డగును ;
అధికధనకాంక్ష నలసట లందుచుండు ;
ననుపమవిరక్తి నొదవు సర్వార్థసిద్ధి ;
కోరి యిందే ముకుందునిఁ గొల్వవలయు. **171**

పాప మొనర్చినవాడు నీచజంతువై జన్మించును. పుణ్యము గావించిన వాడు దేవతగా ఉదయించును. పాపపుణ్యములు సమస్థితి వహించినపుడు మానవజన్మము సంప్రాప్తించును. అట్టి మానవజన్మమునందే మోక్షమును సాధింప వలెను.

మానవునకు గూడ బాల్యమునం దెక్కువ బుద్ధివికాస ముండదు. ముదిమిలో మది దప్పును. యౌవనమునందే వివేకము గుబాళించును. కాని జవ్వనము నందే విజ్ఞాన మార్జింపవలెను.

ప్రాయమునందు కాంతాభ్రాంతిగలవాడు మదమత్తుడై చెడిపోవును. అధిక మగు అర్థాశగలవాడు ఆయాసమునకు గురియగును. కావున నిరుపమాన మగు వైరాగ్యము కల్గినపుడే మహోత్కృష్టములగు సర్వార్థములు సిద్ధించును. కనుక మనుజుడు యౌవనమున వైరాగ్యవంతుడై మోక్షప్రదాత యగు శ్రీవేంకటేశ్వరుని సేవింపవలయును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇందు సాధించని | 48 | 273 | 15 | 184 |

అవ: మహామహిమాన్వితులైన మహనీయులదొసగులను వరిగణింవదగదనుచున్నాడు.

సీ. అగుఁగాక దుర్వాసుఁడతికోపి, యాతని
పటుతపమ్మున కేమి భంగ మొదవె ?
కలుష మంటెనె మత్స్యగంధిఁ గోరిన పరా
శరమహర్షికి యోగనిరతమతికి ?
జనకుండు రాజ్యంబు సల్పిన సద్గతిఁ
బడయఁ జాలఁడె ? సర్వభక్షకుండు
వైశ్వానరుండు పావనుఁడు గాఁడే ? రవి
హేయ మంటిన దీప్తి కేమి కొదవ ?
ఆవిర్భవించుఁగా కసురకులమ్మున
పాటింపఁ బ్రహ్లాదుభక్తి యసదె ?
నారదు సత్త్వగుణంబు డిందెనె ? కల
హప్రియుం దను నింద యతని కున్న;
క్షత్రజన్ముఁడు హరిశ్చంద్రుఁ దంత్యజుఁ గొల్చె
నతనిసత్యమున కే యంటుగలిగె ?
విషధరుండగుఁ గాక వేయుతలల శేషుఁ
డతని పాండితికి నేమయ్యె లోటు ?

గీ. బ్రహ్మపట్టము వాంఛింపఁ బవనజునకు
లాఘవం బేమి ? శశికి కళంక మున్న
చలువలేఁదు కాఁడా ? వృషశైలవిభుఁడు
దాసుల గృహమ్ములందున్న వాసి గనఁడె ? 172

దుర్వాసమహర్షి మిక్కిలి కోపోద్దీపితహృదయుడు. అయినను ఆతనితపస్సునకు భంగము కలుగలేదు. యోగనిహితచిత్తుడగు పరాశరమునీంద్రుడు మత్స్య గంధిని కామించెను. అయినను అతనిని పాప మంటలేదు గదా! కర్మయోగియగు జనకమహారాజు రాజ్యనిర్వహణమొనర్చియు సద్గతినందజాలెనుగదా ! అగ్నిదేవుడు సమస్తమును భక్షించినను అతని శుచిత్వమునకు లోటు వాటిల్లలేదు గదా! సూర్యుడు హేయవస్తువులను స్పృశించినను అతని ప్రకాశమునకు కొఱత లేదుగదా! భక్తశ్రేష్ఠుడగు ప్రహ్లాదుడు రాక్షసవంశములో జన్మించినను అతనిభక్తికి తఱుగు లేదు గదా! నారదుడు కలహభోజనుడే. అయినను అతనిసత్త్వగుణము కొఱవడ లేదు గదా! సుక్షత్రియుడైన హరిశ్చంద్రుడు కడజాతివానిని సేవించినను అతని సత్యనిరతికి కొదవ యేర్పడలేదు గదా! సహస్రఫణామండితుడగు శేషుడు విషధారియైనను ఆతనివైదుష్యమునకు వెలితి లేదుగదా ! శ్రీరామునిబంటగు అంజనేయుడు

బ్రహ్మపట్టము నభిలషించినను అతనికి చులుకదనము సంప్రాప్తించలేదుగదా ! చంద్రునిలో మచ్చయున్నను అతని శైత్యమునకు లోపము లేదుగదా ! శ్రీవేంకటేశ్వరుడు భక్త గృహములలో నున్నను అతని ప్రశస్తికి లోటు కలుగదుగదా !

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అటుగానా యేమిసేసినా | 46 | 258 | 15 | 174 |

అవ: భగవంతుడు భక్తు నెన్నడు ఎడబాయ దనుచున్నాడు.

సీ. తనుఁగొల్వ కుండిన తారమీఁ దేలిక
తెలిసి దేవుం డిచ్చుఁ గొలువ కున్న ;
పేదవాఁ డైనచో విడుతురు చుట్టాలు
విడువఁడు దేవుండు వెంటనుండు;
నంగము ముదిసిన నంగనల్ రోసెద
రట్లు దేవుఁడు రోయఁ; డాత్మఁ బాయఁ,
దలుగుదు రన్నదమ్ములు విరస మయిన
నలుగఁ డట్టులు దేవుఁ డయ్య గనుక,

ఆ. ఊరివారు మఱతు రొదిగి మూలల నున్న
నెందునున్న మఱవఁ డెపుడు దేవుఁ ;
డెదుటనున్న దేవుఁ డేడుకొండలవాఁడె
యఖిలదుఃఖభయము లణఁచిబ్రోచు. **173**

ప్రభువు తన కొలువునుండి విరమించిన సేవకునకు ఒక్కకాసుకూడ నొసగడు. తన్ను కొలువకున్నను దేవుడు జీవునకు వలసినది ఇచ్చుచున్నాడు. పేదఱికములో నున్నవానిని బంధువులు విడిచిపుత్తురు. దేవు డట్లు విడువడు. వార్ధకమువచ్చి నంతనే వనితలు నరుల నేవగించుకొందురు. అంతరాత్ముడైన భగవంతుడు ఎప్పుడు జీవునిపట్ల అసహ్యతచూపడు. ఒకింత వైరస్య మావహిల్లినచో సోదరులు అగ్రహింతురు. ఈశ్వరుడు జీవులకు జనకుడు గనుక ఆ విధముగ నాగ్రహింపడు.

మారుమూలలో ఒదిగి యున్న వానిని గ్రామస్థులు విస్మరింతురు. ఎందు న్నను దేవుడు మాత్రము జీవుని మఱవడు. ఆ దేవుడు సమక్షమందున్న సప్తగిరీ శ్వరుడైన శ్రీనివాసుడే. అతడు సమస్తపాపములను, భయములను తొలగించి భక్తులను సదా సంరక్షించును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| తెలిసి బదకరో | 9 | 52 | 15 | 35 |

అవ: వీరనరసింహుని విజృంభణమును వర్ణించుచున్నాడు.

సీ. గద్దెపైఁ గూర్చుండి కనకకశిపుఁ జెండి
గద్దతీ ప్రహ్లాదుఁ గరుణఁ గాంచి
యొద్దనె గొబిలందు నువిదయుఁ దానుండి
దిద్దె మీసమ్ములు దివ్యనృహరి ;
భవనాశి దరిఁద్రొక్కి బ్రహ్మాదులను నిక్కి
తివిరి శౌర్యమ్మున దెసల కెక్కి
రహి నారదాదుల రంగు పాటలకునై
చెవులొగ్గి యాలించు శ్రీనరహరి ;

గీ. ఖర నఖర హస్తములతోడ కంబమందు
వెస నహోబిలమందున వేడ్కఁ బుట్టి
పొలుపుగా వేంకటాద్రి చెల్వలను గూడి
వివిధ మహిమలు వెదచల్లు వీరనృహరి. 174

దివ్యుడగు శ్రీనృసింహుడు గద్దెపై కొలువుదీఱినాడు. హిరణ్యకశిపుని చీల్చి చెండాడినాడు. దిట్టతనముగల ప్రహ్లాదుని దయతో వీక్షించుచు సంరక్షించి నాడు. ఆ చెంతనే గుహలలో లక్ష్మీసమేతుడై విజయగర్వముతో మీసములు మెలివేసినాడు. భవనాశితీరమున అధివసించినాడు. బ్రహ్మాదిదేవతలలో అగ్రగణ్యుడై నిలచినాడు. శౌర్యాతిరేకముతో నలుదిక్కుల ప్రశస్తి వహించినాడు. నారదాదులు తన్ను వినుతించు శ్రవణపేయములైన రమణీయగీతములు ఆలకించినాడు.

వాడిగోళ్ళచేతులతో అహోబలక్షేత్రములో స్తంభమునుండి యావిర్భవించి నరకంఠీరవుడు అలరారుచున్నాడు. మఱియు వేంకటగిరిపై శ్రీభూదేవులతో గూడి శ్రీవీరనరసింహస్వామి వివిధమహిమలు చూపుచు విరాజిల్లు చున్నాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| చేరి మొక్కరో నరులు | 23 | 132 | 15 | 88 |

అవ: తాను హరిమాత్రశరణ్యుడనని దేవతాంతరములతో విన్నవించుకొనుచున్నాడు.

సీ. పరమపదాధిపు బంటనై కొల్చెద ;
నన్యులలోకమ్ము లడుగఁ బోవ
శ్రీపతిబంటనై చెలఁగుదు; సిరులకై
వేసరింపను మిమ్ము వేల్పులార !
చక్రికింకరుఁడనై సలుపుదును తపమ్ము ;
కొంచక పరులఁ బీడించఁ బోవ
గరుడవాహను నుతి గావింతు; భీతిలి
యమృతమ్ము దాచకుఁ డమరులార !

గీ. యజ్ఞపతిని బూజింతు నే నజరులార !
యడుగలేదు మీ భాగమ్ము; లఖిలవిశ్వ
హితుఁడ హరిదాసుఁడను వేంకటేశుశరణ
మందితి సుపర్వులార ! న న్నాదుకొనుఁడు. 175

ఓ దేవతలారా ! నేను పరమపదమున కధినాథుడగు శ్రీమన్నారాయణుని సేవకుడను. ఆ దేవునే భజించువాడను. ఇతరదేవతల లోకములనే నర్థించుటలేదు.

నేను శ్రీపతి దాసుడను. అత డనుగ్రహించిన సిరులతో చెలు వొందుదును. మిమ్ము ధనములకై విసిగింపను.

నేను చక్రధరుని భృత్యుడను. ఆయనకై తప మొనరింతును. అంతేగాని జంకుగొంకులేక అన్యులను పీడించను.

నేను యజ్ఞపతినే అర్చింతును. సురలారా ! మీ హవిర్భాగములను నేను కోరుట లేదు.

నేను హరిదాసుడను. సమస్త ప్రపంచమునకు హితుడను. ఓ గీర్వాణులారా ! నా మనఃస్థితిని గమనించి మీరు నన్ను దయతో చూడుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| వెఱవకుఁడీ | 64 | 369 | 15 | 248 |

అవ: శ్రీరంగనాథుని వైభవమును వర్ణించుచున్నాడు.

సీ. [illegible]ుండు విభీషణుని పూజ కిచ్చిన
బ్రహ్మణ్యుఁ డీ రంగపతి గొలువరొ !
కావేరినడుమ రంగక్షేత్ర మల్లదే
శ్రీవిమానం బదే ! శేషతల్ప
మదె ! దేవుఁ డాతఁడే ! యామెయే శ్రీలక్ష్మి !
నాభిబ్రహ్మను గన్న నాథుఁ డతఁడె !
ఎనఁగు పూఁదోఁపులు నేడుగోడలు నవే !
రమణీయపురగోపురమ్ము నదియె !
బలుదొడ్డవేయికంబముల మండప మదే !
స్వర్ణశోభితధ్వజస్తంభ మదియె !

ఆ. అంగరంగవిభవ మదె ! యాళువారలు
వారె ! వైష్ణవంపువాడ లవియె !
వరము లిచ్చు శ్రీనివాసుండు శ్రీరంగ
దైవమున్ గొలువరొ తాల్మితోడ. **176**

సూర్యవంశోద్భవుడైన శ్రీరామచంద్రుడు విభీషణునకు పూజకై యిచ్చిన పరబ్రహ్మస్వరూపుడైన శ్రీరంగనాథు డితడే. ఇతనిని సేవింపుడు.

అదే ! కావేరీనదిమధ్యగల శ్రీ రంగక్షేత్రము. అదిగో ! శ్రీవిమానము. అదే శేషతల్పము. అతడే దేవుడు. ఆమెయే శ్రీమహాలక్ష్మి రంగనాయకి. ఆ స్వామియే నాభిపంకజములో బ్రహ్మను పుట్టించినవాడు. అవే పుష్పోద్యానములు, సప్తప్రాకారములు, రమణీయనగరగోపురము; చూడుడు. అదిగో ! మిక్కిలి పెద్దదైన సహస్రస్తంభమండపము. కనకముచే శోభిల్లు ధ్వజస్తంభ మదిగో ! స్వామివారి అంగరంగవైభవ మదే. వారే పన్నిద్దరాళ్వారులు. అవే శ్రీవైష్ణవుల తిరువీథులు. శ్రీరంగనాథుడు వరము లనుగ్రహించు శ్రీనివాసుడేసుడీ ! ఓర్పుతో ఆ దేవుని సేవించి శ్రేయమును పొందుడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| బ్రహ్మ పూజించే | 22 | 125 | 15 | 83 |

అవ: జగద్వల్లభుడగు వాసుదేవునికి వందనము లొనర్చుచున్నాడు.

సీ. నరహరి మురహరి నారాయణుని జగ
ద్వల్లభు దుర్లభు వాసుదేవు
మందరధరు గురు మాధవు భూధవు
నచ్యుతు శౌరి విహంగవాహు
పురుషోత్తముని హరి పుండరీకేక్షణు
హితదాసవరదు వామను ముకుందు
కరుణాభరణు నందక గదాధరుని నంద
నందను నిందిరానాథు కమల

గీ. నాభు యదుకులు గోవిందు నారదాది
మునివినుతు నిందురవినేత్రు భోగితల్పు
శ్యామలుని కోమలుని గొల్తు శాంతమూర్తి
సవనరక్షకు వృషగిరిసార్వభౌము. 177

నరసింహుడు, మురాంతకుడు, నారాయణుడు, జగత్ప్రియుడు, దుర్లభమైన వాడు, వసుదేవసుతుడు, మందరపర్వతము ధరించినవాడు, ఘనుడు, లక్ష్మీధవుడు, భూభర్త, నాశరహితుడు, శూరునివంశమున జన్మించినవాడు, గరుడగమనుడు, పరమపురుషుడు, శ్రీహరి, పద్మనేత్రుడు, ఇష్టులైన దాసులకు వరము లొసగువాడు, వామనావతారుడు, మోక్షప్రదాత, దయయే అలంకారముగా గలవాడు, నందక మను ఖడ్గమును, కౌమోదకి యనెడు గదను ధరించినవాడు, నందునికి ఆనందము గొల్పువాడు, లక్ష్మీవల్లభుడు, పద్మనాభుడు, యదుకులమున జన్మించినవాడు, గోవిందుడు, నారదాదిమునులచే వినుతింపబడినవాడు, సూర్యచంద్రనేత్రుడు, శేషతల్పుడు, నల్లని వాడు, మృదువైనవాడు, శాంతస్వరూపుడు, యజ్ఞరక్షకుడు అగు వృషాద్రినాథుని సేవింతును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| వందేహం జగద్వల్లభం | 41 | 235 | 15 | 157 |

అవ: భగవదనుజ్ఞచేత జ్ఞానము కలుగువఱకు మాయాబంధము వీడ దను చున్నాడు.

సీ. చూడంగఁ జూడంగ సుడిగొనె మాయలు
వేడుకతో నిన్ను వెదకు టెపుడొ ?
కడపంగఁ గడపంగఁ గాలమ్ము గడచెను
జరగిన వెనుకటి జన్మములను;
నడువంగ నడువంగ నడచెను సంసార
మెడయక హరి నిన్ను నెఱఁగు టెపుడొ ?
కోరంగఁ గోరంగఁ గూడె లంపట మెల్ల
కడఁగి కావించెడు కర్మపటలి;
మేరలు మీఱగా మించెను మమతలు
కూరిమి హరి నిన్నుఁ గొలుచు టెపుడొ ?

ఆ. నిలుపఁగ నిలుపంగ నిండెను జ్ఞానమ్ము
నీయనుజ్ఞచేత నిక్కువముగ;
నీదుమఱుఁగుఁ జొచ్చి నినుఁ గొనియాడితి
మిపుడు శ్రీనివాస ! వృషగిరీశ ! 178

శ్రీహరీ ! చూచుచుండగనే మాయలు అమేయములై సుడిగొని చుట్టుకొను చున్నవి. ఈ మాయావాగురలో చిక్కిన జీవులు ని న్నెప్పు డన్వేషింతురు ?

ఎన్నో జన్మములు కడచన్నవి. ఎంతోకాలము వ్యర్థముగా గడచినది. సంసారము నడచిన కొలది నడచుచునే యున్నది. మఱి నిన్ను తెలిసికొను టెప్పుడు ?

పూనికతో సలిపెడు కర్మకాండమున కోరినకొలది లంపటము లెక్కు వైనవి. అందు కనుబంధముగా మమకారములు హద్దుమీఱినవి. స్వామీ! మఱి ప్రేమతో నిన్ను సేవించు టెన్నడు? వృషాద్రినాథా ! నేటికి నీయనుమతి లభించినది. నిలిపిన కొలది నిక్కముగా జ్ఞానము నాహృదయములో నిండినది. ఆ జ్ఞానపరి పాకమున నిన్ను శరణుజొచ్చి ఇపుడు స్తుతించుచున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| చూడఁగఁ జూడఁగ | 22 | 123 | 15 | 82 |

అవ: శరణాగతిని మించిన పరమోపాయము మఱొక్కటిలే దనుచున్నాడు.

సీ. నిపుణత హరి ! నాకు నిను శరణనుటయే
తపములు జపములు ధర్మములును
నెపమున సకలమ్ము నీవె చేకొనుమయ్య !
ఉపమల పుణ్యమ్ము లొల్ల నింక ;
హరి ! నీకు దాసుఁడ ననుకొంటయే నాకు
పరము నిహమ్మును భాగ్యములును
ధర నీదుమాయలఁ దప్పు మార్గములందు
నొరగి యే సుకృతమ్ము లొల్ల నింక ;

గీ. నీదునామమ్ము దలఁచుట నిఖిలశాస్త్ర
వితతి నాపాలి; కిదియ నా మతము వ్రతము
ఫణిగిరినివాస ! శ్రీవాస ! నినుఁ గొలిచితి
నితరకర్మంబు లింక నే నెవియు నొల్ల. **179**

శ్రీహరీ ! నేర్పుతో నిన్ను శరణుజొచ్చుటయే నాపాలిటికి జపములు, తపములు, సర్వధర్మములు నగుచున్నవి. ఇక నాకు వేఱుపుణ్యములతో పనిలేదు. అవెల్ల నీవే గైకొనుము.

నారాయణా ! నీ దాసుడ ననుకొనుటయే నాకు ఇహము, పరము, సమస్త భాగ్యములును అగుచున్నవి. కావున నీ దాసుడనైన నేను నీమాయకు వశుడను కాను గనుక తప్పు ద్రోవలు త్రొక్కి పాపపరిహారార్థమై పుణ్యము లాచరింపవలసినపని నాకిక లేదు.

గోవిందా ! నీ నామస్మరణమే నాపాలిటికి సమస్తశాస్త్రసంచయము. ఇదే నామతము, వ్రతము, శేషాద్రివాసా ! శ్రీనివాసా ! నిన్ను సేవించితిని. కాన అన్య కర్మవితతితో నా కిక పనిలేదు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇదియె నాకు మతమిది | 28 | 166 | 15 | 110 |

అవ: భగవత్సంబంధములేని దేదియు తన కక్కఱలే దనుచున్నాడు.

సీ. నీదుదాసుల పంచనీడ నుండినఁ జాలు
నదియెపో వ్రతము నా కహినగేశ !
హరి నిన్నుఁ బాసిన యమరలోకం బొల్ల ;
నీవుగూడని కర్మనిచయ మొల్ల ;
పరఁగ నీ నుతిలేని పలుచదువుల నొల్లఁ ;
జొరనొల్ల నీకథ వఱలని సభ ;
నీసేవలేని యనిమిషభాషణము నొల్ల ;
లలి నీకు మ్రొక్కని ఫలము నొల్ల ;
నీ వారగించని పావనామృత మొల్ల ;
నే నొల్ల మఱి నీవు లేని చింత ;

గీ. అంది నీసేవ సేయని యగ్రజన్మ
మైన నొల్ల ; నీ కర్పణగాని భోగ
మొల్ల నిట్టి జీవన్ముక్తి నొందినాఁడ
నీవు దయ నేలితివి ; మఱియేమి యొల్ల. 180

శేషాద్రీశ్వరా ! నీ కింకరుల వాకిటిపంచనీడయం దుండినను చాలును. నా కదియే వ్రతము. దేవా! నీవులేని స్వర్గము నా కక్కఱ లేదు. నీ సంబంధము లేని కర్మసంచయము నే నంగీకరింపను. నీ స్తుతిలేని వివిధవిద్యలు నా కభిమతములు గావు. నీ కథనములేని సభలలో నేను ప్రవేశింపను. నీ సేవకు దూరమైన పలుదేవతలను గూర్చిన ముచ్చటలు వినుట కొప్పుకొనను. నీ నమస్క రణము లేని ప్రయోజనము ఎట్టిదైనను నేను వాంఛింపను. నీకు నివేదంపని పవిత్రమైన యమృతమును గూడ నేను కాంక్షించను. నిన్ను వర్ణించని తలంపులు నా కవసరములేదు. నీ సేవ యొనర్పని విప్రజన్మముగూడ నాకు అభిలషితము గాదు. నీ కర్పింపని భోగము నాకు మనస్కరింపదు. నీవు న న్ననుగ్రహించితివి గాన జీవన్ముక్తుడ నైతిని. ఇక నా కెట్టికోరికలు లేవు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నీదాసులపంచ | 40 | 229 | 15 | 153 |

అవ: అన్నిట నజ్ఞుడగు తాను ఆచార్యప్రబోధముచే శరణాగతిమార్గము త్రొక్కితి ననుచున్నాడు.

సీ. విన్నపమ్ము లొనర్ప వేళయేదొ యెఱుంగ
మన్నించుపాటి నీ మనసెఱుంగ;
చక్కనిమాటల సన్నుతింప నెఱుంగ
న న్నెట్లు గాతువో నమ్మినాఁడ;
సేవల నిన్ను మెచ్చింప భక్తి నెఱుంగ
నీవాఁడనై కొల్వ నేమ మెఱుఁగ;
పూలఁ బూజింపంగ పొసఁగుమంత్ర మెఱుంగ;
నీముద్ర లూనితి నీవె దిక్కు ;

గీ. మతి దలంపంగ నిజముగా మర్మ మెఱుఁగ
జ్ఞానహీనుఁడ - మావారు నాకుఁ జెప్పు
చాయపాటిబుద్ధులకె నీ శరణ మంటి;
నెట్లు కృప నేలెదవొ స్వామి! యేమి యెఱుఁగ. 181

స్వామీ ! నీకు విన్నపములు చేయుటకు తగుసమయ మేదో తెలిసిన వాడను గాను. క్షమాశీలమైన నీ మనఃస్థితి యెట్టిదో యెఱుంగను. హృద్యమైన వచనములతో నిన్ను కీర్తించుట తెలియను. కాని నిన్ను నమ్మియున్నాను. న న్నెట్లు కాపాడెదవో ?

నీకు సేవ లొనర్చి నిన్ను మెప్పించెడు భక్తిపద్ధతి నెఱుంగను. నిన్ను గొల్చుటకు తగిన నియమము లేవో తెలియను. కుసుమములతో నర్చింత మన్నను అందుకు తగిన మంత్రమేదో గ్రహింప నైతిని. కాని నీ ముద్రలు (భుజములపై శంఖచక్రచిహ్నములు) మాత్రము ధరించితిని. నీవే నాకు దిక్కు. నేను జ్ఞానహీనుడను. నీ తత్త్వము తెలియజాలిన వాడను గాను.

మాగురువులు దిఙ్మాత్రముగ ఉపదేశించిన ప్రకారము నిన్ను శరణు జొచ్చితిని. దేవా ! ఎట్లు నను దయజూతువో ! నే నేమియు నెఱుగను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నాయంత జ్ఞానము లేదు | 53 | 299 | 15 | 201 |

అవ: ఎట్టిసుద్దులు తెలియని తనకు ఏడుకొండలరాయుడే దిక్కనుచున్నాడు.

**సీ. పాపమ్ము వీడిన ఫలియించు పుణ్యమ్ము;**
**కోపమ్ము మానిన కూడు శాంతి,**
**చాపల మ్ముడుగ నిశ్చలబుద్ధి నెక్కొను;**
**నేమిసేయుదు వశ మ్మింతకావు;**
**విరతి యేర్పడ దాశ విడువక; సుజ్ఞాన**
**రుచిపుట్టు విషయముల్ రోసినపుదె;**
**తెలివి మెచ్చరు వేసములు దొలఁగింపక;**
**యీ సుద్దు లెఱుఁగ నే నేమిసేతు ?**

**ఆ. కల్లలాడకున్నఁగాని సత్యము నిల్వ**
**దొల్లననిన సుఖము వెల్లివిరియు;**
**దేవదేవ ! నాకు దిక్కు నీవే తండ్రి !**
**యే వివరము దెలియ నేమిసేతు ?** **182**

దేవాధిదేవా ! దుష్కృతము త్యజించినపుడే సుకృతము ఫలించును. కోపము వీడినప్పుడే శాంతి కుదురుకొనును. చాపల్య ముజ్జగించినపుడే నిశ్చలమైన బుద్ధి యేర్పడును. ఇం దేవియు నా యధీనములో లేవు. నే నేమి సేయగలను?

తృష్ణను పరిత్యజించనిచో వైరాగ్యము నెలకొనదు. విషయవాంఛలను ఏవగించుకొన్నప్పుడే సుజ్ఞానముపై రుచి గల్గును. పై పైవేషములు తొలగింపనిచో వివేకమును ప్రశంసింపరు. ఇట్టిసుద్దు లేవియు నాకు తెలియవు. మఱి నే నేమి సేతును ?

అసత్యవచనములను పరిహరించినప్పుడే సత్యము నిలద్రొక్కుకొనును. వలదని వైముఖ్యము చూపినపుడే సుఖము వరించును. నా కే వివరము తెలియదు. తండ్రీ ! నీవే నాకు దిక్కు. ఇక నే నేమిసేయ గలను ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| దేవదేవోత్తమ నాకు | 57 | 326 | 15 | 219 |

అవ: తానెంత హీనుడైనను దాసుడుగనుక తన్ను దైవము తప్పక కాపాడవలె ననుచున్నాడు.

సీ. ఇతనితో నాకేమి ? యీపాటిసేవకు
 లెందఱు లేరు ? వీఁడెంత ? యనక
నేనెంత హీనుండ నైన రక్షింపుము
 చెప్పుల నెవరు రక్షించుకొనరు ?
నాతప్పు లెంచక నాతోడ విసువక
 కారణ మేమి న న్గావ ననక
నీవాఁడ నైతినిఁ గావునఁ బ్రోవుము
 తన సొరె జూదరి దాఁచుకొనఁడె ?

గీ. నన్ను నగుబాట్లుసేయక నాదునేర
ముల విచారింప కెపుడు ని న్గొలువ కున్న
దయను మన్నింపు మంగేశ ! దైవతమ్ము
మ్రొక్కుపూజారి తప్పులు లెక్క గొనునె ? **183**

మంగేశ్వరా ! వీ డెవడు ? వీనితో నాకేమిపని ? ఇట్టి భృత్యులు నాకెందరు లేరు ? ఇత డేపాటివాడు ? అని భావింపక నేను హీనుడనైనను నన్ను కాపాడుము. తామెంత గొప్పవా రైనను తమపాదుకలను తామే రక్షించు కొందురుగదా !

నాలో దొసగు లెన్నో కలవు. వాటిని పరిగణింపకుము, నాపై విసువు చూపకుము. వీని నెందుకు నేను కాపాడవలె నని తలపోయకుము. నేను నీవాడ నైతిని. కావున నన్ను దయజూడుము. ఎంత మేటిజూదగా డైనను తనపాచిక తాను భద్రపఱచుకొనడా ? కావున నన్ను నవ్వులపాలు సేయకుము. నాతప్పు లెన్నకుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పరాకు సేయక | 60 | 344 | 15 | 231 |

అవ: సర్వవ్యాపియైన పరమాత్ముని తనసేవ లందుకొని యనుగ్రహింపు మని ప్రార్థించుచున్నాడు.

సీ. శ్రీనాథ ! నిన్నుఁ బిల్చితిఁ బలుకంగదే
పొందుగ నన్నింట నుందు వంట!
మానితమ్ముగ నాదుమాట వినంగదే
వీనుల సర్వమ్ము విందు వంట !
పరమాత్మ ! నాకు తప్పక పొడసూపవే
తరుణుఁ డౌ మన్మథుతండ్రి వంట !
పరఁగ మ్రొక్కెద నీదుపాదమ్ము సాఁచవే
యజుఁడు పూజించినయట్టి దంట !

గీ. నీదుగుఱు తెఱిఁగించవే నీరజాక్ష !
వెలయు వేవేలమహిమల విభుఁడ వంట !
వెదక నేటికి నిందందు వేంకటేశ !
కరుణ మామది నెలకొని కాతు వంట ! **184**

లక్ష్మీనాథా! నీవు సర్వవ్యాపివట కదా! నేను నిన్ను ఆర్తితో ఆహ్వానించుచున్నాను. నా పిలుపునకు మారుపలుకుము.

నీవు నీ చెవులతో సర్వ మాలకింతువట కదా! నేను నిన్ను గూర్చి చేయు విన్నపము నాలించి న న్ననుగ్రహింపుము.

పరమాత్మా! నీవు కోడెకాడైన మదనునిజనకుడ వటకదా! కాదనక నాకు దర్శన మనుగ్రహింపుము. నీ పాదమును తొల్లి పద్మజుడు పూజించినాడటకదా! నేనును నీ చరణమునకు మోకరిల్లుదును. నీ పాదము నిటు చాపుము.

పద్మాక్షా ! నీవు వేలకొలది ప్రభావములతో విలసిల్లు ప్రభుడ వటకదా! నిన్ను గుర్తింప శక్తిలేని మాకు ఏదో యొక గుర్తుచూపి కరుణింపుము.

శ్రీవేంకటేశ్వరా ! దయతో నీవు మాహృదయమునందే స్థిరపడి రక్షింతువటకదా! మఱి నిన్ను అట నిట నన్వేషింపనేల ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| వెదకెద నిను | 60 | 343 | 15 | 231 |

అవ: భగవద్భజనపరునకు సర్వదురితములు సమసిపోవు ననుచున్నాడు.

సీ. నిన్నొక జన్మాన నేను భజింపఁగా
తొల్లిటిజన్మాల దుఃఖ ముడిగె ;
నీముద్ర మోవఁగా నీమేన నెన్నెన్నొ
తనువులు మోచిన వనటవాసె
ఇల నిన్నొక నిమేష మిటు ధ్యాన మొనరింప
నలి చన్నకాలంపు నష్టి దీఱె ;
సరి నీదుదాసుల సావాస మొదవఁగా
మాయనీఁదిన శ్రమ మాయ మయ్యె ;

గీ. మది ముదమునీఱ నీకన్ను లెదుటఁ బడఁగ
నాకు నరకమ్ము లందిన కాఁక మానె ;
నిన్నుఁ దలపంగ వేంకటనిత్యవాస !
కడచె వెనుకటియజ్ఞానగాఢతమము. **185**

స్వామీ! ఈ యొక్కజన్మమునందే నేను నిన్ను సేవించితిని. దానితో నా పూర్వజన్మపరంపరయందలి దుఃఖము లెల్ల అంతరించినవి.

ఈ శరీరమునందు నీ శంఖ చక్రచిహ్నములను దాల్చితిని. అంతట మునుపు నే ననేకశరీరములు దాల్చి యనుభవించిన దుఃఖము లెల్ల దూరమైనవి.

ఒక్కనిమేషమే నేను నిన్ను ధ్యానించితిని. వెంటనే గతకాలపు కష్టనష్టము లెల్ల హతమైనవి. నీ కింకరులతోడిపొత్తు సాధించితిని. తత్ఫలముగా మాయలో బడి యీదులాడిన అలసట యంతయు తొలగిపోయినది. ఆనందముతో నీకంటియెదుట బడితిని.

అంతట పూర్వము నే నొందిన నరకయాతన లన్నియు హరించుకొని పోయినవి.

వేంకటగిరినివాసా ! నిన్ను స్మరింపగా తొల్లిటి యజ్ఞానమనెడు గాఢాంధ కారము పటాపంచ లైనది.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నే నిఁక వెఱవను | 53 | 301 | 15 | 203 |

అవ: అకించనుడై శరణుజొచ్చిన తన్ను కాపాడుమని హరిని ప్రార్థించు చున్నాడు.

సీ. వఱుత మునుఁగువాని దరినున్న యాతండు
వెఱవక చేయిచ్చి వెడలఁ దీయు ;
నజ్ఞానమునఁ బడి యడలెడు ననుఁజూచి
కారుణ్యమున నెత్తి కావుమయ్య !
రోగపీడితునకు రుజవోవ వైద్యుండు
బలువైన మందిచ్చి బ్రదుకఁజేయు
ఘోరపాపమ్ములఁ గ్రుంగుచుండెడి నన్ను
నామామృతం బిచ్చి యోమ వయ్య !

గీ. అర్థవంతుండు నిఱుపేద యైనవాని
నరసి లేములు మానిపి యాదరించు
ధర ననాథుండనై నిన్ను శరణుఁ జొచ్చి
నాఁడ శ్రీవేంకటేశ ! కాపాడు మయ్య ! 186

శ్రీవేంకటేశ్వరా ! ప్రవాహములో పడి మునిగిపోవువానిని గట్టుననున్న వాడు భయపడక చేయూత నిచ్చి ఒడ్డునకు జేర్చును. నేను అజ్ఞానములో పడి అలమటించుచున్నాను. నా స్థితినిజూచి దయతో నన్నుద్ధరించి రక్షింపుము. వ్యాధిగ్రస్తునకు రోగము పోవునట్లుగా వైద్యుడు మంచి మందిచ్చి వాని నుజ్జీవింప జేయును. అట్లే భీకరదురితములపాలై అధోగతి కేగుచున్న నన్ను నీ నామసుధ నొసంగి కడ తేర్చుము. ధనవంతుడు నిర్ధనుని పరికించి అతని దారిద్ర్యమును తొలగించి కాపాడునుగదా ! అట్లే దిక్కులేనివాడనై నిన్ను శరణుజొచ్చిన నన్ను సంరక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అట్టి నీ సుకృతము | 51 | 287 | 15 | 193 |

అవ: భగవత్ప్రాప్తికై తహతహపడు జీవుని అనుగ్రహించుట దేవుని కర్తవ్య మనుచున్నాడు.

సీ. ఎపుడు ప్రసన్నుండ వీ వౌదువో యని
యెదురుచూచెద; నీదు మృదులసూక్తు
లాలింప వాంఛింతు; నన్నియుపాయాల
నిను వశ్యు నొనరించుకొనఁగ నెంతు;
నెఱుఁగ నీభావమ్ము - పరికింతు చదువులఁ;
దమకింతు పాదతీర్థము గొనంగ
ననుఁ గల్పుకొనఁ గోరెదను దాసమండలి
తహతహపడెద నిన్ స్తవ మొనర్ప

గీ. ప్రార్థన మొనర్తు నీభక్తి పరిఢవిల్ల
వేడ్క నీ సేవ గావింప వేళగాతు;
ఈవు ప్రత్యక్షమైన నీడేరు కోర్కు
లంచు సంతోషపడుచుందు నహినగేశ ! **187**

శేషాద్రీశ్వరా ! నీ వెప్పుడు నాకు ప్రసన్నుడ వౌదువో యని ప్రతీక్షించు చున్నాను. నీ కోమలములైన వచనములు వినగోరుచున్నాను. సకలవిధములైన ఉపాయములతో నిన్ను నావానిగా జేసికొనుటకు ప్రయత్నించుచున్నాను. నీ యభిప్రాయ మెట్టిదో గ్రహించుటకై వివిధవిద్యలలో అన్వేషణ సాగించుచున్నాను. నీ చరణతీర్థము సేవించుటకై ఉత్కంఠితుడనై యున్నాను. నీ దాస శ్రేణిలో న న్నొకనిగా స్వీకరించుటకై యభిలషించుచున్నాను. నిన్ను స్తుతించుటకై వేగిరపడు చున్నాను. నీ యందలిభక్తి దృఢము గావలెనని ప్రార్థన మొనర్చుచున్నాను. నీ సేవ గావించుటకై సమయము కాచియున్నాను. నీవు ప్రత్యక్ష మైనచో నా వాంఛ లన్నియు సఫలము లగునని యెప్పుడు నేను హర్షించుచుందును.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పురాణపురుషా | 73 | 417 | 15 | 280 |

అప: దేవుడు జీవునికి సర్వకాలసర్వావస్థలందును సంరక్షకుడై యున్నా డనుచున్నాడు.

సీ. కనులకు రెప్పలకైవడి నంతట
నాకు దాపగుచు నున్నాఁడ వీవు;
ముంజేయి నిజదేహమునకు ప్రాపైనట్లు
వడి నాకు సాయమై వత్తు వీవు;
వినికి లంకె యగుచు వీనుల కున్నట్లు
పోషింప చుట్టమై పొలుతు వీవు;
మనసు తోడై యున్నమాడ్కి జీవునికి నా
కెప్పుడు తగులయి యొప్పుచుందు;

గీ. నీదుమంత్రంబు జిహ్వకు నిగమవృక్ష
ఫల మగుచు నున్న యట్టులు తలఁప మాకు
దాతవై బిడ్డలకు తల్లి దండ్రి మాడ్కి
పరమ సులభుఁడవై యుంటి; భక్తి నిన్నుఁ
దలఁపని దురంతమగు దురితమ్ము నాది
కరుణతో నోర్చుకొనవయ్య ! తిరుమలేశ ! 188

శేషగిరీశ్వరా ! కంటికి రెప్పవలె నీవు నాకు దరిదాపై రక్షణ చేకూర్చుచున్నావు. శరీరమునకు ముంజేయి అండగా నుండినట్లు నాకు నీవు సాయముగా నిలుచుచున్నావు. వీనులు వినికిడితో అతికియున్నట్లు నీవు నన్ను పోషించు బాంధవుడవై భాసిల్లుచున్నావు. జీవునికి చిత్తము తోడైయున్నట్లు నీవు నాకు సదా సంబంధ పడియున్నావు. నీ మంత్రము మా నాలుకకు వేదవృక్షఫలమైనట్లు నీవు మాకు నిఖిల ప్రదాతవై యున్నావు. శిశువులకు తల్లిదండ్రులవలె నీవు మా కత్యంతసులభుడవై యలరారుచున్నావు. కాని నిన్ను భక్తితో తలంపని అంతము లేని పాప మంతయు మాలోననే యున్నది. స్వామీ ! దయతో సహింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నేనే తలఁచ నిన్ను | 73 | 422 | 15 | 284 |

అవ: భగవత్ప్రభావములు దాచినను దాగ వనుచున్నారు.

సీ. నీవె దాచుకొనుచు నీ రూపు మెలఁగంగ
గరుడధ్వజమె గుర్తు కనఁగఁ జేసె;
శ్రుతు లెల్ల బిరుదసంస్తుతులచే కుతి రేఁప
పటుశౌర్యమే బయల్పఱచె నిన్ను;
ఈ వసాధ్యుండవై యేకతమ్మున నుండ
నిను రచ్చ కెక్కించె నీదు మహిమ;
వరదహస్తమె చొప్పు వాలాయముగఁ జూప
నిను ముంగిటం బెట్టె నీదుకరుణ;
గీ. శేషిగిరి గుట్టుగా నీవు చెలఁగుచుండ
పట్టియిచ్చె భవత్ప్రభావమ్ము, సిరులు;
నిను శరణుఁజొచ్చితిమి విని నీ గుణమ్ము
లివల నావల మీచిన్నె లింతసేసె. **189**

శ్రీనివాసా ! నీవు నీరూపమును ప్రకటముగానీక దాచుకొనియుంటివి. కాని నీ గరుడధ్వజమే నిన్ను గుర్తించునట్లు చేసినది. వేదములు నిన్ను స్తుతించి మాలో ఔత్సుక్యమును రేపినవి. తదుపరి నీ ప్రబలపరాక్రమము నిన్ను వ్యక్తము గావించినది. నీవు సాధింపరానివాడవై ఏ కాంతమున నుంటివి. కాని నీ మహిమ నిన్ను బయల్పఱచినది. నీ వరదహస్తము నీ పాదములే శరణ్యమని మాకు శరణాగతిమార్గము చూపినది. నీ దయయే నిన్ను మా ప్రాంగణమున నిల్పినది. నీవు శేషాచలముపై రహస్యముగ నుంటివి. కాని నీ మహిమయు, సంపదలును నిన్ను మాకు పట్టియిచ్చినవి. ఈ విధముగ నిన్ను గుర్తించిన మేము నీప్రభావములు విని నీకు శరణాగతుల మైతిమి. మీ చిహ్నములే ఉభయ తారకములై మ మ్మిట్లను గ్రహించినవి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నాయంతనే వుద్దండంబున | 74 | 423 | 15 | 284 |

అవ: ఈషదవకాశము దొరకినచో కామాదిదోషములు జీవుని లోగొను నను చున్నాడు.

సీ. **తలcపకుండcగవలెc దలcపc గామాదులు**
**పొలుచు నిప్పుల నేయి వోసినట్లు;**
**కలcగ కుండcగవలెc గలcగిన హృదయమ్ము**
**చీమలపుట్టగా చిమ్మి రేcగు;**
**ఈయకుండcగ వలె నెడ, మిచ్చినను కిన్క**
**వెఱ్ఱియెత్తిన కోcతివిధము నొందు;**
**ఒడిగట్టకుండుట యుక్తంబ, యొడిగట్ట**
**నాసలు హోరెత్తు నబ్ధికరణి;**

గీ. **తగుల కుండcగ వలె భోగతతి దగిలిన**
**జిగురుcగండె ఖగమ్ములు చిక్కినట్లె;**
**అమృతరస మది చేతికి నబ్బినట్లు**
**ఫణినగాధిపుదాసులే భ్రమ మునుcగరు.** 190

భగవదనుగ్రహము నభిలషించుభక్తుడు కామాదిదోషములను భావన లోనికి రానీయరాదు. అట్లు రానిచ్చినచో నవి అగ్నిలో వేసిన ఆజ్యమువలె చెలరేగును. చిత్తములో ఏ మాత్రము కలత కలుగకుండునట్లు జాగరూకుడై యుండ వలయును. కలతచెందిన హృదయము చీమలపుట్టవలె పిగిలి చీకాకు గలిగించును. కోపమున కేమాత్రము అవకాశ మొసంగరాదు. అ ట్లొసంగినచో ఆ కోపము పిచ్చిపట్టినకోతి చందము నొందును. ఆశలకు తా వీయకుండుట తగును. అట్లు తావిచ్చినచో అవి కల్లోలితసాగరమువలె నగును. భోగముల నంటరాదు. అట్లంటినచో జిగురుపూసిన దారములయుచ్చులో పక్షులు చిక్కు కొన్నట్లు జీవులు చిక్కుకొందురు. కావున శేషాద్రీశ్వరుని దాస్యమే కర్తవ్యము. అది చేతికి లభించిన అమృతరసమువలె అమందానందసంధాయక మగును. ఆ యమృతము చవిచూచిన భగవద్దాసులు మరల నెట్టిభ్రమలకు వశముగారు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అట్టె పెంచితే | 73 | 420 | 15 | 282 |

అవ: దివ్యమహిమాన్వితు డగు శ్రీనివాసుని ప్రభావము కొనియాడ నశక్య మనుచున్నాడు.

సీ. అనిశమ్ము సురలకు నటు రక్షకుఁడ వసు
రానీకమునకు లయాంతకుఁడవు;
దినముఁ బితాళ్లకు తృప్తికరుండవు
జనులకు సంసారసౌఖ్య మీవు;
మునులకు సంతతమోక్షప్రదుండవు
కాల మీవే ఘనగ్రహములకును;
అనయమ్ము సిద్ధుల కక్షయఘుటికవు
నినుఁ గనువారికి నిధివి నీవె;

గీ. అఖిల వేదమ్ములకుఁ బరమార్థ మీవె;
జగములకును శరీరివి; మగఁడ వీవె
మంగ; కిట వరదాతవు; మాకుఁ దరమె
నీదుమహిమలు పొగడంగ నీరజాక్ష ! 191

పద్మాక్షా ! నీ వెల్లవేళల దేవతలను సంరక్షించువాడవు. రాక్షస సమూహమునకు నీవు లయకారుడవు. నిత్యము పితృదేవతలకు తనివి కలిగించువాడవు. ప్రజానీక మనుభవించు భవసౌఖ్యముగూడ నీవే. నీవు అనవరతము మునులకు ముక్తి నొసంగువాడవు. పెద్దగ్రహములను నడపించు కాలస్వరూపుడవు నీవే. అనవరతము సిద్ధులపాలిటికి అక్షయమైన దివ్యౌషధము నీవే. నిన్ను సందర్శించు భక్తులపాలింటి పెన్నిధివి నీవే. సమస్త వేదములయొక్క సారార్థము నీవే. జగదంతరాత్ముడవు నీవే. పద్మావతీదేవికి ప్రాణవల్లభుడవు నీవే. నీ విక్కడ సమస్తవరప్రదాతవు. ఇట్టి నీ మహిమలు వినుతింపగ మాకు శక్యమా ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| దేవదేవ నీ దివ్యమహిమ | 68 | 390 | 15 | 262 |

అవ: శ్రీనివాసు డండగ నుండగా భక్తుడు భయపడవలసిన పనిలే దను చున్నాడు.

సీ. గెలిచితి భవములు గెలిచితి కామాదు
లేలిక నీ వైతి వేద వెఱపు ?
తలఁప నొక్కచనవు దాసుండ నన్నది
యూనుట నీ యచ్చు లొక్కచనవు;
ఒక్కచనవు ప్రసాదోపజీవినె యన్న
దింక నా కన్నిట నేడ వెఱపు ?
ఒక్కబలిమి లోన నున్నాఁడ వన్నది
యొగి నిన్నుఁ బాడుట యొక్క బలిమి ?
ఒక్కబలిమి నీ మహోజ్జ్వల కారుణ్య
మే నేమి చేసిన నేడ వెఱపు ?

గీ. ఒక్కదా పీవె గతియని యుండు నేమ;
ముప్పతిల్లెడు నీభక్తి యొక్క దాపు;
మొక్కవోవని నీ సేవ లొక్క దాపు;
వృషగిరీశ్వర ! నీవుండ నేడ వెఱపు ? 192

వృషాద్రినాథా ! నాకు నీవు దొరవైతివి. నేను భవపరంపరను జయించితిని. కామాదులపై గెలుపుగొంటిని. ఇక నాకు భయ మెక్కడిది ?

నేను నీకు దాసుడనైతి నన్న చనవొక్కటి, నీముద్రలు భుజములపై దాల్చితి నన్న చనవొక్కటి, నీ ప్రసాదముపై బ్రదుకుచున్నానన్న చనవొక్కటి నాకు లభించినవి. ఇక నా కెందైనను భయ మెందుకు ?

నీవు నాలో నున్నాడ వన్నది నా కొకబలము. నిన్ను కీర్తించుచున్నాడ నన్నది మఱొకబలము. నీప్రకాశమానమైన దయ నాపై ప్రసరించుచున్నది యనునది వేఱొక బలము. ఇక నే నేమిచేసినను భీతిచెంద నవసరములేదు. నీవే శరణ్యమని నిన్ను నమ్మియుండు నియమము నా కొకతోడు. నీపై జనించుచున్న అనన్యభక్తి మఱొక తోడు. అమోఘములైన నీ సేవలు ఇంకొకతోడు. ఈ విధముగ నీవు నా కన్నిట అండదండయై యుండగా నాకు వెఱ పెక్కడిది ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| గెలిచితి భవముల | 72 | 415 | 15 | 279 |

అవ: భగవదనుగ్రహముచేతనే తనకు భగవంతునిపై దృఢవిశ్వాస మేర్పడిన దనుచున్నాడు.

సీ. నానోటి కిచ్చితి గాన సంకీర్తన
నను( బ్రోతువని నెఱనమ్మినాఁడ;
పిన్ననాఁడే నీవు పేరుకొంటివి గాన
నీడేర్తు వంచు నే నియ్యకొంటి;
నా మదిలో నిల్చి నీమనోహరమూర్తి
నా కీవు గలవంచు నమ్మినాఁడ;
అవనిలో నీదాసుఁ డనిపించ నీకద
నేలితి వంచు నే నెఱిఁగినాఁడ;

గీ. ఆనతీయంగఁ గలలోనఁ గానిపించి;
నమ్మితిని నీవు చెంత నున్నాఁడ వంచు;
నెదుట నీవుండ శ్రీవేంకటేశ! యెపుడు
పావనుఁడ నౌచు నన్నిటఁ బ్రబలినాఁడ. 193

స్వామీ! నిన్ను సంకీర్తనము గావించుసామర్థ్యము నానోటికి ప్రసాదించితివి గాన నన్ను తప్పక రక్షింతు వని పూర్ణవిశ్వాసముతో నున్నాను. నా చిన్న తనముననే దయతో నన్ను పేర్కొంటివిగాన తప్పక యీ సంసారబంధము నుండి కడతేర్తువని సమాధానపడితిని. నీ రమణీయాకారమును నాచిత్తములో నిల్పితివి గాన నీవు కలవన్న నమ్మకముతో నుంటిని. లోకములో నన్ను నీదాసు డనిపించితివి గాన తప్పక నన్ను కాపాడుదువని గుర్తించితిని. నీవు నాకు స్వప్నములో సాక్షాత్కరించి ఆదేశము నొసంగితివిగాన నీవు నాతోడనే యున్నావని విశ్వసించితిని. శ్రీవేంకటేశ్వరా! నీవు సదా నాసమక్షముననే యున్నాడవుగనుక నేను పవిత్రుడనైతిని. అన్నిటికి చాలినవాడ నయితిని.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| సందేహ మెక్కడా లేదు | 72 | 414 | 15 | 273 |

భావ: ఎట్టిస్థితియందును వికృతినొందని ధీరుడే ముక్తి కర్హు డనుచున్నాడు.

సీ. నేనెంతవాఁడను నిన్నడుగ ముకుంద !
వీనుల నీ కథల్ వినుటగాక
అలిగిన నలుగక, యన్యులు నిందలు
వలికిన మఱి మారుపలుకఁ బోక
కలఁచినఁ గలఁగక కసరి కొట్టిన మూల్గ
నట్టిఁడు ముక్తికి నర్హుఁ డగును;
నవ్విన నవ్వక నాతు లెవ్వరుగాని
తగిలి పెనంగిన దగులఁబోక
వగచిన వగవక వ్రతము చెఱతు మన్న
మొగమోడనట్టిఁడు ముక్తి కర్హుఁ;

గీ. దుర్వి వితిచిన విఱుగక యుజ్జ్వలంపు
విష్ణుభక్తి యెడాటాన; వెఱపుగూర్ప
వెఱవఁబోక నీ పాదముల్ విశ్వసించి
మొఱఁగ నట్టిఁడె యర్హుండు మోక్షమునకు. 194

శ్రీహరీ! ముక్తిప్రసాదింపుమని ని న్నడుగుటకు నే నెంతవాడను ? నీ కథలు వీనులవిందుగా వినుటయే నా కర్తవ్యము.

తనపై నన్యులు కోపించినను తాను కోపింపక, త న్నొకరు తిట్టినను తాను మారుతిట్టక, త న్నొకడు క్షోభపెట్టినను క్షోభపడక, త న్నితరుడు కసరికొట్టినను తాను గొణగక పూర్ణస్థితప్రజ్ఞునిస్థితిలో నున్నవాడే ముక్తికి పాత్రుడు.

ఒకడు తన్ను పరిహాసించినను తిరిగి తాను పరిహాసముచేయక, వనిత లెవరైన తన్ను వలచి బలాత్కరించినను వారివలలో చిక్కక, ఒకడు తనకు వగపు కల్గింపజూచినను తాను వగపుగొనక, నీవ్రతము చెఱచెద మని పైనెత్తి వచ్చినను మోమోటపడక తన కర్తవ్యము నిరుపహతముగా కొనసాగించువాడే మోక్షమునకు తగినవాడు. తన్ను చెడగొట్టుటకు పరులు యత్నించినను తాను చెడక, విష్ణుభక్తి విషయమై అన్యులు తన్ను భయపెట్టినను భయపడక, నీచరణములే శరణమని నమ్మి నిష్కపటవర్తనుడై యున్నవాడే ముక్తికి తగినవాడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| నే నెంతవాఁడను | 71 | 408 | 15 | 274 |

అవ: జీవునకు పరమలక్ష్యము భగవంతుడే యనుచున్నాడు.

సీ. తిత్తికాఁపురముండు దేహిని నేను మ
చ్చిత్తస్థితుండు లక్ష్మీవిభుండు
పూర్వకర్మమ్ము దాఁపురము గుత్తిగ విత్తి
మొలపించు సుఖదుఃఖములు వినుండు
పంచభూతమ్ములపట్న మేలుదు నేను
న న్నేలువాఁడు నందకధరుండు
ఇమ్మైన మైసొమ్ము లింద్రియమ్ములు నాకు
గుదిగొని మించెడు నిదిగో ! కనుఁడు

గీ. కొలఁదిజన్మమునకు గుఱి నేను; గుఱి నాకు
శాశ్వతుండు వేంకటేశ్వరుండు
సులభమైనగుణము సుజ్ఞాన మే మింక
మీకుఁ దెల్పుదును ? వివేకులార ! 195

నేను దేహమనెడు తిత్తిలో సంసారము సాగించు జీవుడను. నా మనస్సులో లక్ష్మీనాథుడు నెలకొనియున్నాడు. నేను పూర్వజన్మములం దొనర్చిన కర్మము దాచినధనమై యున్నది. అది నాకు అదనులో బీజావాప మొనర్చి సుఖదుఃఖములనెడి ద్వంద్వములను అంకురింపజేసి నాచే అనుభవింపజేయు చున్నది. పృథివ్యప్తేజో వాయ్వాకాశము లనెడు ఐదుభూతములతో నిర్మింపబడిన శరీరమనెడు పట్టణమును నేను పరిపాలించుచున్నాను. నందక మనుఖడ్గము ధరించిన నారాయణుడు నన్ను పాలించుచున్నాడు. ఇంద్రియములే నే నలంకరించు కొన్న ఆభరణములై యున్నవి. ఇవిగో చూడుడు ! అవి ప్రదీప్తములై యున్నవి. నేను ఈ కొద్దిపాటి జన్మమునకు లక్ష్యమనై యున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| వేదాంతవిదులాల | 58 | 333 | 15 | 224 |

అవ: కర్తృత్వాహంకారము విడిచి హరిదాసులు తాము చేసిన కర్మములను హరిసమర్పణము గావింతు రనుచున్నాడు.

సీ. ఊరిపసులమేపి యొప్పించి యిండ్లకుఁ
జీవర జంగిలికాఁడు చింత వదలు;
మోచితెచ్చినమోపు మును నగరికిఁ జేర్చి
వెట్టీఁడు నెమ్మది విశ్రమించు;
బూరెలువండిన పొలఁతి చేతులు సూపి
యింటివారల కిచ్చి యెలమి నేగు;
నాగవల్లి గడచినన్ పేరఁటా లొంటి
నొకచోట నెలవున నూరకుండు;

గీ. గుంపుగలసినయాతఁ డా గుంపు లెల్ల
విచ్చిపో నేటివాఁడుగా కిచ్చనుండు;
నిట్టె శ్రీవేంకటేశుబం టేలికపని
గాఢభక్తి గావించుఁ దా కర్తగాఁడు. **196**

గొడ్లకాపరి గ్రామములోని పశువు లన్నింటినిమేపి సాయంసమయమున వాటిని యజమానుల కొప్పగించి నిశ్చింతగా నుండును. వెట్టివాడు అడవినుండి కట్టెలమోపును తలపై పెట్టుకొని మోసితెచ్చి దివాణములో నొప్పగించి నెమ్మదిగా అలపు దీర్చుకొనును. పాకశాలలో బూరెలువండినవనిత ఆ భక్ష్యములను ఇంటివారి కిచ్చి చేతులు దులుపుకొని హాయిగా తనయిల్లు చేరును. పేరంటపునెలత నాగవల్లి అను శుభకర్మ తీరినపిమ్మట నొంటిగా నొకచోట తనస్థానమున తా నుండును. జనులగుంపుతో చేరి పయనించినవాడు ఆ జనసమూహములు ఎక్కడి వక్కడ విడిపోగా తా నెవరికిని చెందినవాడుగాక తన యిచ్చచొప్పున మెలఁగును. అట్లే శ్రీవేంకటేశ్వరునిభృత్యుడు ఆ దేవునకే చెందినకర్మముల నన్నింటిని దృఢభక్తితో నిర్వహించును. కర్తృత్వము తనపై వేసికొనడు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| అటువలె సుజ్ఞాని | 74 | 424 | 15 | 285 |

అవ: దేవుడే జీవునకు జ్ఞానమార్గ మెఱిగింపవలె ననుచున్నాడు.

సీ. సకలలోకములకు సాక్షివి గాన నా
కెఱిఁగింపు మే నేమి యెఱుఁగకున్న
నేలువాఁడవుగాన నింద్రియమ్ముల, బుద్ధి
చెపుమ యే నెంత లోలుపుఁడ నైన
బంధమోచనుఁడవై భాసిల్లుదువుగాన
విడిపింపు మమత నే విడువకున్న
తలఁప నీవే సూత్రధారివిగాన నే
దారిదప్పిన నీవు తప్పనీకు ;

గీ. విశ్వలోచనుఁడవు గాన వెదకి కనని
యర్థములు నాకుఁ గాన్పింపు మహినగేశ !
ఘనతర జగత్కుటుంబివి గాన నన్ను
మించు కృప నేలి యెపుడు పోషించఁ గదవె 197

దేవా! నీవు సర్వలోకములకు సాక్షివై యున్నావు. నేను తత్త్వజ్ఞానము లేనివాడను. అందువలన నా యెఱుగని రహస్యములను దయతో నా కెఱిగింపుము. నీవు ఇంద్రియములకు నియామకుడవు. నేను ఇంద్రియచాపలమునకు గుఱియైన వాడను. కావున నాకు బుద్ధి గఱపుము. నీవు బంధమును విడిపించువాడవు. నేను మమకారమునకు లోనైనవాడను. నాయంతట నేను బంధవిముక్తుడను కాజాలను. కావున నన్ను బంధవిముక్తుని గావింపుము. నీవు సూత్రధారివి. నేను కేవలము తోలుబొమ్మను. దారిదప్పి చరించుచున్న నన్ను దారిలో పెట్టుము. నీవు విశ్వనేత్రుడవు. నీకు తెలియని యర్థము నాకు తెలిసినయర్థము ఒక్కటియు లేదు. కాన ఆ యర్థములను నాకు సాక్షాత్కరింప జేయుము.

శేషాద్రీశ్వరా ! నీవుగొప్ప జగత్కుటుంబివి. నేనును ఆనీకుటుంబమునకు చెందినవాడనే. కావున నాపై కారుణ్యము వహించి నన్ను సతతము సంరక్షింపుము.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| పరమాత్ముఁడవు నీవు | 74 | 427 | 15 | 287 |

అవ: జీవులకై దేవు డేర్పఱచిన తరణోపాయములను వివరించుచున్నాడు.

**సీ. జీవు లీడేఱంగ శ్రీరంగ శేషాచ**
**లాదుల నీ విగ్రహములc జూపి**
**వేదశాస్త్రమ్ముల వేవేలు నీగుణ**
**మ్ములు దెల్పెదవు- మెచ్చc గలమె నిన్ను ?**
**భవదంఘ్రితీర్థముల్ పావనగంగాది**
**నదులపొంతను పుణ్యనరుల నిల్పి**
**ఏకాదశీప్రముఖేద్ధవ్రతాచార**
**ములు చాటెదవు- నుతి సలుపc గలమె ?**

**గీ. ధ్యాన యజ్ఞార్చనములు మంత్రములు నామ**
**జపము కల్పించి వేంకటశైలనాథ !**
**యీ నెపమ్మున బ్రదుకుcడం చిచ్చు కాను**
**కలు గ్రహించుచు నొసcగెదు ఘనవరాలు.** **198**

స్వామీ ! నీ వీలోకమునగల జీవు లెల్లరు కడతేరుట కుపాయములుగా శ్రీరంగము, శ్రీవేంకటాద్రి మున్నగు దివ్యస్థలములలో నీ అర్చావతారములను ప్రదర్శించితివి. వేదములలో, శాస్త్రములలో గణనాతీతములైన నీగుణములను ప్రకటించితివి. ఇట్టి ని న్నేమని నుతింపగలము ?

నీ పాదతీర్థములైన గంగ, యమున, నర్మద, సింధువు, కావేరి, సరస్వతి, తుంగభద్ర, కృష్ణ, గోదావరి, పినాకిని, సువర్ణముఖరి మొదలైన నదులచెంత ఆత్మ ప్రబోధము సల్పుటకై పుణ్యపురుషులను నియమించితిని.

ఏకాదశి మున్నగు ప్రసిద్ధములైన వ్రతములను, ఆచారములను కల్పించితివి. ఇట్టి నిన్ను మేము కొనియాడగలమా ?

ధ్యానము, యజ్ఞము, పూజ, మంత్రములు నామజపము కల్పించి- ఈ వ్యాజముతో జీవించి తరించు డని మే మిచ్చుకానుకలు స్వీకరించుచు మాకు గొప్ప వరములు ప్రసాదించున్నావు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| కావకుంటే నేదీ గతి | 75 | 433 | 15 | 291 |

అవ: సంగమువల్ల కలుగు దోషముల నుగ్గడించి హరిని భజించి కడతేఱు డనుచున్నాడు.

సీ. కరcగదె వెన్న యింగలము చెంగటనున్న ?
తొడి పేరదే చల్లతోడిపాలు ?
కంచెదగ్గతి తీవ కంచెకుc బ్రాcకదా ?
యువిదపొత్తునc జిత్త మూరకున్నె ?
ఇనుముcగూడిన యగ్ని తినcడె సమ్మెటపెట్లు ?
విరితేనెగని తేcటి విడువc గలదె ?
ఉల్లిc జేరిన కప్ర ముగ్రగంధము, సిరి
గలవాcడు చింత లే కరణి మాను ?

గీ. ఊషరజలమ్ము లుడుగునే యుప్పcదనము ?
ఊరుcగాయకడవ బేcట్ల నురలకున్నె ?
సంగరహితుcడు గాకున్న శాంతి గలదె ?
హరిc గొలువనట్టివారి నే మనcగ వచ్చు ? **199**

అగ్నిచెంతనున్న వెన్న కరగక మానదు. చల్ల గలపినపాలు పేరక పోవు. కంచెయొద్దనున్న తీగ కంచె కెగబ్రాకును. అట్లే మగువలు దాపున నున్నచో మనస్సు చలింపకమానదు. ఇనుముతోగూడిన యగ్ని సమ్మెటవ్రేటులకు గుఱికాక తప్పదు. కుసుమములలోని మకరందమును చూచినచో భ్రమరము దానిని విడువ జాలదు. ఉల్లితోగూడిన కర్పూరము ఉగ్రగంధమును, సంపదగల వాడు చింతలను మాన నయితిగాదు. చవిటినేలయందలినీరు ఉప్పదనమును విడువదు. ఊరుగాయలు నింపిన బాన పేట్లెత్తి విరిసిపోకుండునా ? కావున సంగము వదలినవానికి గాని శాంతి గలుగదు. మఱి లౌకికసంగము వదలక హరిని గొలుపక వ్యర్థముగా జీవించువారిని గూర్చి ఏమి చెప్ప గలము ?

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| సంగరహితుడైన | 76 | 438 | 15 | 294 |

అవ: జన్మ జాత్యాదు లెట్లున్నా భగవద్దాస్యానికి తాను దూరం కారాదు అంటున్నాడు.

సీ. ఎట్టి పుట్టుగులకు నించుక వెఱవ నే
నట్టి నీ దాసుండ నైనఁ జాలు
వెట్టి జాతికినైన వెఱవ నీ నామమ్ము
లొప్పుగ నా నాల్క నున్నఁజాలు
వెఱవ పాపములకు వేవేలకైన నీ
యఱలేని కైంకర్య మబ్బఁజాలు
వెఱవ నింద్రియముల వెతలకు నీ వాత్మ
నురక బోధనుఁడవై యున్నఁజాలు

గీ. వెఱవ నే లోకమైనను వేంకటేశ !
పరఁగ నీ కృప నామీఁద పాఱఁజాలు
కాలకర్మము లెట్లైనఁగాని వెఱవ
నీడు దాసులు నన్ను మన్నింపఁజాలు. 200

దేవా! నాకు ఎట్టి పుట్టుక వచ్చినా భయపడను. నీకు సేవకుడనైతే చాలు. నేను ఏ జాతికి చెందిన వెట్టి చాకిరికైనా భయపడను. నా నాల్కపై నీ నామం నటిస్తే చాలు. వేలకొలది పాపాలకైనా నేను వెరవను. నీ కైంకర్యము నాకు లభిస్తే చాలు. ఇంద్రియాల వల్ల కలిగే సంకటాలకు నే నేమాత్రం భయపడను. నా చిత్తంలో నీవు జాగరూకుడవై ఉంటే చాలు. ఏ లోకంలో ఉండటానికైనా నేను వెనుదీయను. నీ దయ నా మీద ప్రసరిస్తే చాలు. కాలం కర్మం విపరీతమైనా నేను కలత చెందను. నీ దాసులు నన్ను స్వీకరిస్తే చాలు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమీ నడుగ నొల్ల | 4 | 24 | 15 | 16 |

అవ: భగవంతుని చర్యలలో చిత్ర విచిత్రములైన వైరుధ్యము లున్నవను చున్నాడు.

సీ. అప్పు డాగమహర్త యదటణంచిన వాఁడ
విపుడు వెన్నల దొంగ వెట్టు లైతి ?
బ్రహ్మాదులకు పితృపాదుండ వీ వెట్లు
గుట్టుగ వసుదేవు కొడుక వైతి ?
జితకాములకు చేతఁజిక్కిన నీ వెట్లు
వ్రేపల్లె విటుఁడవై వెలసినావు ?
అటు జగద్గురుఁడవై యతిశయిల్లెడు నీవు
సాందీపనికి నెట్లు ఛాత్రుఁడైతి ?

గీ. కుక్షి నిడుకొని బ్రహ్మాండ కోటు లీవు
దైత్యు యాచించి తెట్లు పదత్రయమ్ము ?
వరము లందఱ కిచ్చుచు పరుస లొసఁగు
కాన్క లెట్లు గైకొంటివి? కమలనేత్ర !
లోక రక్షణ కొఱకి ట్లలోలబుద్ధి
నీవు వర్తింతు వంచు నేనెంచు వాఁడ. **201**

కమలముల వంటి కన్నులు గల స్వామీ! ఆనాడు వేదాలు దొంగిలించిన రక్కసుని ఉక్కడగించిన నీవు నేడు వ్రేపల్లెలో వెన్నలెట్లు దొంగిలించావు? బ్రహ్మ మొదలైన దేవతలకు జనకుడవైన నీవు వసుదేవునకు కుమారుడ వెట్లైనావు? కామాన్ని జయించిన వారికి మాత్రమే స్వాధీనమయ్యే నీవు వ్రేపల్లెలో జారుడ వెట్లైనావు? సమస్త లోకాలకు గురుడవైన నీవు సాందీపనికి శిష్యుడ వెట్లైనావు? పదునాల్గు భువనాలు కుదురుగా కుక్షిలో నిల్పుకొన్న నీవు రాక్షసుడైన బలిచక్రవర్తిని మూడడుగుల తావు నిమ్మని ఎట్లా యాచించావు? అందరికి వరములిచ్చే నీవు యాత్రికులిచ్చే కాసుల నెలా స్వీకరించావు? లోక రక్షణ దీక్షతో నిశ్చలమతివైన నీవు ఇలా ప్రవర్తిస్తుంటావని నేను భావిస్తున్నాను.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమి చెప్పేది | 54 | 305 | 15 | 205 |

అవ: చిత్తం భగవదాయత్తం కావడమనేది కేవలం భగవత్కృప వల్లనే సాధ్యమను చున్నాడు.

సీ. జరిగె స్వామి ద్రోహ మఱమర లేకుండ
నేమి సేయుదును నే నేమిసేతు ?
నీయధీనంబయి నెగడిన యాత్మకు
నీ యందె నిజబుద్ధి నిలువఁబోదు
కలితేంద్రియానీక కల్పిత దేహమ్ము
కాయపు విషయముల్ కాంక్షసేయు
నీదు సంకల్పాన నెగడిన జగమిది
నీదు సేవారతి నేర దింత
ఆసల నీ మాయ నంటిన మనసిది
ఆస లాసలఁబాటి యలసి పోవు

ఆ. ఆత్మలోన నీవ యణఁచిన జ్ఞానమ్ము
నీవ చూపకున్న నిగుడఁబోదు;
సిరిమగండవైన శేషగిరీశ్వరా !
కరుణతోడ నన్నుఁగావఁగదవె ! 202

లక్ష్మీ వల్లభుడవైన శేషాద్రీశ్వరా! స్వామి ద్రోహం జరిగి పోయింది. నేను అకించనుడను. ఏమి చేయగలను? నా ఆత్మ నీకు అధీనమైనదే. అయినప్పటికినీ నా బుద్ధి నీయందు లగ్నం కావడం లేదు. ఇంద్రియాలతో గూడిన నా శరీరం ఇంద్రియార్థములైన శబ్ద స్పర్శాదులను అపేక్షిస్తున్నది. ఈ జగత్తు నీ సంకల్ప ఫలమే. కాని నిన్ను సేవించడానికి కొంచెమైనా దానికి ఆసక్తి లేదు. నా మనస్సు నీ మాయకు లోబడింది. ఆశాపాశ బద్ధమై అలసి పోతున్నది. నా ఆత్మలో నీవు నిగూఢంగా అణచి యుంచిన జ్ఞానం నీ వల్లనే వ్యక్తం కావలె; మరో మార్గం లేదు. స్వామీ! నన్ను దయతో సంరక్షించు.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఏమి సేయుదును నేనేమి | 26 | 152 | 15 | 101 |

అవ: శాంతియన నేమో వివరించుచు అదెట్లు చేజిక్కునో తెలుపుచున్నాడు.

సీ. సకలయత్నమ్ములు చాలించుటే శాంతి
సుఖదుఃఖములు విడుచుటయ శాంతి
ఒక రేమి యొసఁగిన నొల్లకుండుట శాంతి
యటు రచ్చలకును బాయుటయ శాంతి
మహిమీఁది పను లెల్ల మానుటయే శాంతి
సహజబాంధవములు చనుట శాంతి
బహు కుతర్కములకు పాఱకుండుట శాంతి
వడివిషయముల వీడ్పాటు శాంతి

గీ. తాను నిశ్చింతుఁడై యుంట తలఁప శాంతి
కోరకుండని సాత్త్వికగుణము శాంతి
భారమిడియుంట మంగేశుపయిని శాంతి
హరి భజించి గుణాతీతుఁ డగుట శాంతి. **203**

జతనములెల్ల వదలిపెట్టుటయే శాంతి. సుఖదుఃఖము లనెడు ద్వంద్వములను త్యజించుటయే శాంతి. ఎవరైన ఏమైన ఈబోయిన అంగీకరింప కుండుటయే శాంతి. లోకవ్యవహారములకు దూరముగా నుండుటయే శాంతి. ఇలపైగల పనులెల్ల వర్జించి యుండుటయే శాంతి. సహజముగా నేర్పడిన బంధుభావములు తొలగుటయే శాంతి. వివిధములైన కుతర్కములలో ప్రవేశింప కుండుటయే శాంతి. విషయసుఖములను విడిచి పెట్టుటయే శాంతి. తాను చింతల కతీతుడై మెలగుటయే శాంతి. కోరికలు కోరని సత్త్వగుణమే శాంతి. భారము పద్మావతీప్రాణవల్లభు డగు శ్రీవేంకటేశ్వరునిపై నిడి బ్రతుకుటయే శాంతి. హరిని సేవించి గీతాదులలో ప్రవచించబడిన గుణాతీతస్థితిని పొందుటయే శాంతి.

| సంకీర్తన | రేకు | సంఖ్య | సంపుటం | పుట |
|---|---|---|---|---|
| ఇవియే తొల్లిటివారు | 74 | 428 | 15 | 288 |

# సంకీర్తనల అకారాదిసూచిక.


| సంకీర్తనమొదలు | పద్యసంఖ్య |
|---|---|
| **అ** | |
| అందుకే నాపై | 74 |
| అందుకే వెఱఁగయ్యీని | 56 |
| అందులోనే వున్నవాఁడు | 144 |
| అక్కటా లోకోన్నతుఁడు | 123 |
| అచ్చముగ శ్రీహరింక | 21 |
| అటమీఁద మరియేమి | 104 |
| అటుగానా యేమిసేసినా | 172 |
| అటువలెనే వుండవలదా | 130 |
| అటువలెనె సుజ్ఞాని | 196 |
| అట్టె నీ సుకృతము | 186 |
| అట్టే పెంచితే | 190 |
| అతిసులభుఁడవు నీవని | 18 |
| అదియెపో శ్రీహరినామము | 150 |
| అనంత మద్భుత మాశ్చర్యం బిది | 62 |
| అనాథులఁ గాచుట | 67 |
| అనాథుల రక్షించేది | 66 |
| అన్నిటికి మూలము | 158 |
| అప్పటప్పటి వేళలు | 119 |
| అప్పుడుగాని తలఁపు | 100 |
| అప్పుడే కృతార్థుఁడు | 90 |
| అయ్యో యేమరినే | 8 |
| **ఆ** | |
| ఆతనిఁ బాడెదను | 7 |

| సంకీర్తనమొదలు | పద్యసంఖ్య |
|---|---|
| **ఇ** | |
| ఇంతకంటె మఱి నీవు | 68 |
| ఇంతసేసినవాఁడవు | 75 |
| ఇంతేసి వారలకంటె | 159 |
| ఇందులో నే నెవ్వఁడనో | 25 |
| ఇందు సాధించని | 171 |
| ఇందే కలిగె నీకు | 86 |
| ఇచ్చితివి తొల్లె నాకు | 40 |
| ఇటువంటి దుర్గుణి | 122 |
| ఇట్టివాని నన్ను | 89 |
| ఇట్టే నాసేవలును | 85 |
| ఇతరము లేమియును | 155 |
| ఇదిగాదు తెరువు | 169 |
| ఇది నీకు నుపకార | 78 |
| ఇది నీ చిత్తంబింక | 153 |
| ఇదియే నాకు మతమిది | 179 |
| ఇదియె కామనిధాన | 87 |
| ఇది యొక్కటి వివేకులకు | 79 |
| ఇదివో మా యజ్ఞాన | 16 |
| ఇన్నాళ్ళు నా యహంకార | 27 |
| ఇన్ని యుపాయము లింక | 39 |
| ఇప్పుడు నమ్మినవారి | 94 |
| ఇవియే తొల్లిఁటివారు | 203 |
| **ఈ** | |
| ఈపాటు సుఖమా | 167 |

| సంకీర్తనమొదలు | పద్యసంఖ్య |
|---|---|
| ఈయీ యీాయీ | 36 |
| ఈశ్వరా నాభావ మిది | 73 |
| **ఊ** | |
| ఊరకే పాట్లఁబడి | 139 |
| **ఎ** | |
| ఎంత గాలమైనా | 84 |
| ఎంతపరమబంధుఁడవు | 77 |
| ఎంతబలిమి సేసినా | 101 |
| ఎంతలేదు లోకము | 133 |
| ఎక్కడి జాలి | 162 |
| ఎక్కడి మాటలు | 96 |
| ఎక్కడిమానుషజన్మం | 15 |
| ఎట్టు రక్షించేవో కాని | 31 |
| ఎన్నఁడు దేవుని | 103 |
| ఎఱుఁగుకోలేని జీవి | 147 |
| ఎవ్వరు న న్నుద్ధరించే | 88 |
| ఎవ్వరు నాకు దిక్కు | 157 |
| ఎవ్వరేమి సాధించేరు | 135 |
| **ఏ** | |
| ఏఁటికి నీ కితరమార్గములు | 129 |
| ఏటి వివేకము | 102 |
| ఏపాటి వారికి | 69 |
| ఏమని తలఁచవచ్చు | 115 |
| ఏమఱకు జీవుఁడా | 116 |
| ఏమి చెప్పేది | 201 |
| ఏమిటఁ గడమ | 124 |
| ఏమిటాఁ బోరాదు | 95 |
| ఏమిటికి వట్టిచింత | 143 |
| ఏమి నడుగ నొల్ల | 200 |
| ఏమిసేయుదును | 33 |
| ఏమి సేయుదును నేనేమి | 202 |
| ఏమీఁ జదువనేల | 161 |
| ఏ యాజ్ఞ అయినఁబెట్టు | 52 |
| ఏల చెప్పని సుద్దు | 80 |
| ఏలినవారికిఁ బోదు | 13 |
| ఏ వుపాయము నెఱుఁగ | 70 |
| **ఐ** | |
| ఐనాఁగాని నే నోపినంత | 65 |
| **ఒ** | |
| ఒండె లౌకికమూ | 121 |
| ఒకటి కొకటి లంకెయి | 164 |
| **ఓ** | |
| ఓడలు బండ్లవచ్చు | 99 |
| **క** | |
| కతగాదు దృష్టమిది | 142 |
| కన్నవారి కెల్లా | 138 |
| కర్మమంటా మాకు | 10 |
| కరుణించి నీవు గాఁగా | 38 |
| కలకాల మెవ్వరికిగా | 105 |

| సంకీర్తనమొదలు | పద్యసంఖ్య |
|---|---|
| కాదని వేరే | 97 |
| కాదు వివేకము | 165 |
| కానని యజ్ఞానులాల | 107 |
| కావకుంటే నేదిగతి | 198 |
| కొత్తబంట పాఁతబంటు | 54 |
| కొసరి నీతోఁ బెనఁగి | 37 |
| కోరి నీ యీవికి | 44 |
| **గ** | |
| గెలిచితి భవముల | 192 |
| **చ** | |
| చాలుఁజాలుఁ దొలఁగవో | 93 |
| చూచేవారికి | 26 |
| చూడఁగ జూడఁగ | 178 |
| చూతముగా యిఁక | 156 |
| చెల్లఁబో యేమి చెప్పేది | 29 |
| చేతులెత్తి మొక్కరో | 170 |
| చేరి మొక్కరో నరులు | 174 |
| **త** | |
| తతిగొని యేమఱక | 166 |
| తనపా టెంచుకోఁడు | 30 |
| తప్పఁజదువులవార | 127 |
| తమ వుద్యోగము లేల | 134 |
| తమసత్త్వ మెఱిఁగియు | 118 |
| తరితీపులఁ బెట్టీని | 168 |
| తలఁచిచూడ | 2 |
| తలమేల కులమేల | 108 |
| తాము దెలియరూ | 145 |
| తెలిసి చూచినవేళ | 112 |
| తెలిసి బదకరో | 173 |
| తెలిసినవారికి | 126 |
| **ద** | |
| దృష్టాంత మిది దప్పదు | 98 |
| దేవదేవోత్తమ నాకు | 182 |
| దేవదేవ నీ దివ్యమహిమ | 191 |
| దేవుఁ డొక్కఁడే | 110 |
| **ధ** | |
| ధనమెంత గలిగినా | 163 |
| **న** | |
| నన్ను నెంచుకొననయ్యా | 23 |
| నమ్మికొలువఁ గదరో | 154 |
| నాకా వుపాయములు | 43 |
| నాకొఱకే గడించెనో | 151 |
| నాయంత జ్ఞానము లేదు | 181 |
| నాయంతనే వుద్దండంబున | 189 |
| నారాయణుని దివ్యనామము | 106 |
| నినుఁ గొలిచితేఁ జాలు | 46 |
| నిన్ను వేసరించనేల | 76 |
| నీకు సరిలేరే నిఖిల | 24 |
| నీ కేమిటికే గడమ | 50 |
| నీకే సెలవని | 64 |

| సంకీర్తనమొదలు | పద్యసంఖ్య |
|---|---|
| నీదాసులపంచ | 180 |
| నీయంతవాఁడనా | 34 |
| నీ వున్నచోటే వైకుంఠము | 72 |
| నీవు లక్ష్మీపతివి | 48 |
| నీవే ఘనుఁడవు | 11 |
| నీవే ననుఁ గరుణింతువు | 22 |
| నెమ్మది నిన్నే గొలిచి | 51 |
| నే నింక వెఱవను | 185 |
| నే నెంతనీఁచుడనైనా | 45 |
| నే నెంతవాఁడను | 194 |
| నేనే తలఁచ నిన్ను | 188 |
| నే నై తే నీడేరుదు | 58 |
| నేము నీ కన్యులమా | 12 |
| నే విన్నవించే దేమి | 28 |
| **ప** | |
| పట్టరాని యాసోదము | 160 |
| పట్టినవారల భాగ్యమిదే | 81 |
| పనిగొని నేర్చువారి | 114 |
| పనిలేదు పాటలేదు | 3 |
| పరతంత్రులు జీవులు | 61 |
| పరమాత్ముండవు నీవు | 197 |
| పరము వేరొకచోట | 137 |
| పరమనుజ్ఞానులకు | 109 |
| పరాకు సేయక | 183 |
| పరిపూర్ణుఁడవు నీకు | 83 |
| పాపము చేరువ | 53 |
| పురాణపురుషా | 187 |
| పురుషోత్తమ నీవే బుద్ధిచ్చి | 55 |
| పోయినబంధము లటు | 136 |
| **బ** | |
| బళిబళి దేవుఁడా | 20 |
| బ్రహ్మ పూజించే | 176 |
| **భ** | |
| భక్తవత్సలుఁడవుగా | 35 |
| భారము నీపై వేసి | 42 |
| **మ** | |
| మంచి వయసుకాలము | 132 |
| మచ్చ కూర్మ వరాహ | 82 |
| మఱి నేనేమిసేయఁగలను | 57 |
| మానరాదు నేఁ దప్పులు | 71 |
| మిన్ను నేల మోచెనదె | 4 |
| మీరు సేసే పనులకు | 14 |
| ముందరి కేది తెరువు | 19 |
| మునుకొని పయిఁడికి | 120 |
| మేలుకో శృంగారరాయ | 63 |
| మోపు మోయనే కాని | 60 |
| **ర** | |
| రామరామ రామకృష్ణ | 9 |
| **ల** | |
| లేరా దేవతలూ | 5 |

| సంకీర్తనమొదలు | పద్యసంఖ్య |
|---|---|
| లేరా దేవతలూ | 6 |
| **వ** | |
| వందేహం జగద్వల్లభం | 177 |
| వట్టిలంపటము | 148 |
| విచారపరులాల | 128 |
| విచారించుకొనేవారి | 111 |
| వెదకెద నిను | 184 |
| వెఱవకుఁడీ | 175 |
| వేదాంతవిదులాల | 195 |
| వేరొక్కరూ లేరు | 49 |
| వేవేలు తప్పులు | 32 |
| **శ** | |
| శరణంటేఁ జాలు | 140 |
| శరణాగతినే యెంచఁగ | 17 |
| శిరసుండ మోకాల | 113 |
| శ్రీపతియె రక్షించుఁగాక | 146 |
| శ్రీసతికరుణే | 117 |
| శునకసూకరాదులు | 92 |
| **స** | |
| సంగరహితుఁడైన | 199 |
| సందేహ మెక్కడా లేదు | 193 |
| సర్వశబ్దవాచ్యుఁడవు | 47 |
| సర్వేశ్వరుఁడవు స్వతంత్రుఁడవు | 41 |
| సాధించరాని దొక్కటే | 131 |
| సులభమున నున్నది | 59 |
| సేవించుఁడీ మ్రొక్కుఁడీ | 1 |
| **హ** | |
| హరిదాసుఁ డగుటే | 149 |
| హరి నీ దాస్యమునకు | 91 |
| హరి నీవే దిక్కుగాని | 152 |
| హరిబంట హరిబంట | 141 |
| హరిభక్తి గలిగితే | 125 |